అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 10-09-2024 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 252 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

కేసు పురోగతిపై నివేదికివ్వండి



17లోగా కోల్‌కతా అభయ హత్యాచారం వివరాలు సమర్పించాలి : సీబీఐకి సుప్రీం ఆదేశం

వివరాలు 13లో



వరద సహాయం తక్షణమే విడుదల చేయాలి

బాధిత ప్రజలకు నష్టపరిహారం చెల్లించాలి

కేంద్ర ప్రభుత్వానికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గం డిమాండ్

సాయుధ పోరాట పక్షోత్సవాలను జయప్రదం చేయండి

బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ వక్రీకరణలను తిప్పికొట్టండి

పార్టీ శ్రేణులు, ప్రజలకు పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వరద ప్రమాదం గతంలో ఎప్పుడూ లేనంత తీవ్రంగా వచ్చిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గం తెలిపింది. వరద సహాయాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గం సమావేశమైంది. అనంతరం ఒక ప్రకటన విడుదల చేసింది. వర్షం, భారీ వరదలతో ఖమ్మం మళ్లీ వణికిందని గుర్తు చేసింది. వరద నష్టం తీవ్రంగా ఉన్నదని తెలిపింది. ఇంత జరిగినా కేంద్ర ప్రభుత్వం నుంచి బాధ్యతాయుతమైన స్పందన కరువైందని విమర్శించింది. ఇద్దరు కేంద్రమంత్రులు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నా వరద నష్టం పట్ల బాధ్యతగా వ్యవహరించడం లేదని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం స్పందించి వరద సహాయం విడుదల చేయాలని డిమాండ్ చేసింది. సర్వం కోల్పోయిన ప్రజలకు నష్టపరిహారం చెల్లించాలని కోరింది. రాష్ట్ర ప్రభుత్వం వరద నష్టం రూ.ఐదు వేల కోట్లకుపైగా కావాలని ప్రాథమిక అంచనా వేసిందని తెలిపింది. లోతుగా పరిశీలించిన తర్వాత ఆస్తి, ప్రాణ నష్టంతోపాటు పంట నష్టం వంటి వాటి గురించి తెలుస్తుందనీ, అప్పుడు వరద నష్టం అంచనా పెరిగే అవకాశమున్నదని వివరించింది. రాష్ట్రంలో పరిస్థితి ఇంత తీవ్రంగా ఉంటే కేంద్రం ఇప్పటి వరకు నష్టపరిహారం ప్రకటించలేదని విమర్శించింది. వరదలొచ్చిన తర్వాత ఎప్పుడో సహాయం గురించి ప్రకటిస్తే ఉపయోగం ఏం ఉంటుందని ప్రశ్నించారు. తక్షణం సహాయం అందితేనే ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని సూచించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు అవసరమైన నిధులను కేంద్ర ...13లో

నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోండి

పార్టీ ఫిరాయింపులపై విచారణ షెడ్యూల్ వెల్లడించాలి

అసెంబ్లీ కార్యదర్శికి హైకోర్టు ఆదేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటుకు సంబంధించిన పిటిషన్లపై హైకోర్టు చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. బీఆర్ఎస్ తరపున గెలుపొందిన కొద్దిరోజులకే కాంగ్రెస్ పార్టీలో చేరిన ముగ్గురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేలా అసెంబ్లీ కార్యదర్శికి ఉత్తర్వులు జారీ చేయాలన్న పిటిషన్లను హైకోర్టు అనుమతించింది. అనర్హత వేటు వేయాలనే పిటిషన్లను స్పీకర్‌కు నివేదించాలని అసెంబ్లీ కార్యదర్శికి ఉత్తర్వులు జారీ చేసింది. ఆ పత్రాలు అందిన తర్వాత నాలుగు వారాలకు ఆ పిటిషన్లపై స్పీకర్ తగిన నిర్ణయం తీసుకోవాలని తీర్పు వెలువరించింది. స్పీకర్ ఏ నిర్ణయం తీసుకున్నదీ అసెంబ్లీ కార్యదర్శి స్థాయీ నివేదికను హైకోర్టు రిజిస్ట్రీకి సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆ స్టేటస్ రిపోర్టును పరిశీలించాక అవసరమైతే తాము సుమోటోగా తిరిగి విచారణ చేపడతామని ప్రకటించింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో స్పీకర్‌కు కోర్టులు ఉత్తర్వులు జారీ చేయరాదంటూ న్యాయ శాఖ, ఫిరాయింపుదారులు వాదనలు ...6లో

రాజ్యాంగస్ఫూర్తిని నిలబెట్టేలా తీర్పు : హరీశ్

వివరాలు 13లో..

నేతన్నలకు రూ. 30 కోట్ల రుణమాఫీ

రూ. 280 కోట్ల బకాయిలు విడుదల

- చేతివృత్తులు, కులవృత్తులకు చేయూత
- చేనేత సహకార సంఘాలకు త్వరలో ఎన్నికలు
- సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్ మహిళలకు కోటీ 30 లక్షల చీరలు
- ఐఐహెచ్‌టీ ఇనిస్టిట్యూట్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు: ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"నేతన్నలకు చెందిన రూ. 30 కోట్ల రుణాలను మాఫీ చేస్తున్నాం. వారి కండ్లల్లో ఆనందం చూడాలని రూ.290 కోట్ల బకాయిలు విడుదల చేశాం. గతంలో ఆర్భాటం, సినీ తారల తళుకు బెళుకులు తప్ప.. నేతన్న ఆత్మగౌరవంతో బతికే పరిస్థితి లేదు. బీఆర్ఎస్ సర్కార్ బతుకమ్మ చీరల బకాయిలను చెల్లించకుండా ఆలస్యం చేసింది. కానీ మేం వాటిని చెల్లించి రాజకీయాలకతీతంగా సిరిసిల్ల కార్మికులను ఆదుకున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. చేనేత రంగంలో ఆధునిక శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)ని సోమవారం హైదరాబాద్‌లోని లలిత కళాతోరణంలో వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 63 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఏడాదికి రెండు చొప్పున కోటి 30 లక్షల చీరలను బతుకమ్మ చీరల స్థానంలో ఆర్డర్ ఇవ్వనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలకు త్వరలో ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు. రైతన్న ఎంత ముఖ్యమో కాంగ్రెస్ ప్రభుత్వానికి నేతన్న కూడా అంతే ముఖ్యమని వ్యాఖ్యానించారు. "గత సర్కార్ పదేండ్ల కాలంలో ఈ సంస్థ ఏర్పాటుపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఫలితంగా తెలంగాణకు చెందిన విద్యార్థులు ఐఐహెచ్‌టీలో చేరాలంటే ఒడిశా, ఏపీకి వెళ్లాల్సిన పరిస్థితి. కాంగ్రెస్ సర్కార్ అధికారం చేపట్టిన వెంటనే దీనిపై దృష్టి సారించి యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేశాం" అని సీఎం అన్నారు. ఐఐహెచ్‌టీలో ...13లో

గ్రీన్ ఫార్మాసిటీ పనులు వేగవంతం చేయండి

కాలుష్యం లేకుండా జాగ్రత్తలు తీసుకోండి : సీఎం రేవంత్‌రెడ్డి

వివరాలు 5లో..

కాళోజీ సేవలు మరవలేనివి : సీఎం రేవంత్‌రెడ్డి



ప్రజా కవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు సేవలు మరవలేనివని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కాళోజి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కాళోజి జయంతి సందర్భంగా తెలంగాణ భాషా సాహిత్యానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

ఉదారంగా నిధులిచ్చి ఆదుకోండి

కేంద్రంతో సంబంధం లేకుండా నేరుగా మాకే డబ్బులివ్వండి

- 16వ ఆర్థిక సంఘానికి స్థానిక సంస్థల ప్రతినిధుల మొర
- సూచనలు, సలహాలనిచ్చిన వివిధ రాజకీయ పార్టీలు
- కేంద్ర పన్నుల వాటాలో 50 శాతానికి తగ్గకుండా రాష్ట్రాలకు ఇవ్వాలి : సీపీఐ (ఎం) విజ్ఞప్తి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్థికంగా అత్యంత సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో ఉదారంగా నిధులిచ్చి ఆదుకోవాలని రాష్ట్రంలోని స్థానిక సంస్థల ప్రతినిధులు... 16వ ఆర్థిక సంఘాన్ని వేడుకున్నారు. రాష్ట్రాలతోపాటు స్థానిక సంస్థలకు ఇచ్చే నిధుల విషయంలో కేంద్రం అనేక కొర్రీలేస్తున్న నేపథ్యంలో దాంతో (కేంద్రం) సంబంధం లేకుండా నేరుగా తమకే నిధులివ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం 16వ ఆర్థిక సంఘం చైర్మెన్ డాక్టర్ అరవింద్ పనగారియా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల బృందం సోమవారం హైదరాబాద్‌కు విచ్చేసింది. ఈ సందర్భంగా బేగంపేటలోగల ప్రజా భవన్‌లో పలు రాజకీయ పార్టీలు, సంస్థలు, వ్యాపార, వాణిజ్య ప్రతినిధులతో ఆ బృందం విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించింది. పనగారియాతో పాటు ఆర్థిక సంఘం సభ్యులు అజయ్ నారాయణ్ ఝా, అన్నీ జార్జ్, డాక్టర్ మనోజ్ పాండా, సౌమ్యా కాంతిఘోష్, కార్యదర్శి రిత్విక్ పాండే కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ మున్సిపల్ ...6లో

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మెన్‌గా గాంధీ

అసెంబ్లీ కమిటీలకు చైర్మెన్ల నియామకం



ఎస్టిమేట్స్ కమిటీకి నలమాద పద్మావతి

ప్రజాపద్దుల సంఘానికి వీర్లపల్లి శంకరయ్య

అసెంబ్లీ కార్యదర్శి ఉత్తర్వులు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

శాసనసభలోని పలు కమిటీలకు చైర్మెన్లు, సభ్యులను నియమిస్తూ అసెంబ్లీ కార్యదర్శి నరసింహచార్యులు ఉత్తర్వులు జారీ చేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ(పీఏసీ) చైర్మెన్‌గా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఎస్టిమేట్స్ కమిటీ చైర్మెన్‌గా కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి, ప్రజా పద్దుల సంఘం చైర్మెన్‌గా షాద్‌నగర్ ఎమ్మెల్యే కె. శంకరయ్య నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం బులెటిన్ విడుదలైంది.

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ

చైర్మెన్: అరికెపూడి గాంధీ

సభ్యులుగా ఎమ్మెల్యేలు: వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, రేవూరి ప్రకాష్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, యెన్నం శ్రీనివాసరెడ్డి, రామారావు పవార్, అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, కూనంనేని ...13లో

మౌనం వీడే సమయం ఆసన్నమైంది

మాధబి బచ్‌ను ప్రశ్నించనున్న పీఏసీ

ఆరోపణలపై నేటికీ పెదవి విప్పని సెబీ చీఫ్

వత్తాసు పలుకుతున్న మోడీ ప్రభుత్వం



వివరాలు 3 లో..

రాజకీయాల్లో గౌరవం, మానవత్వం ఏది?

నైపుణ్యం అపారం.. గుర్తింపే లేదు : రాహుల్ ఆవేదన

మోడీ అంటే ప్రజలకు భయం పోయిందని వ్యాఖ్య



టెక్సాస్: భారత రాజకీయాలలో ప్రేమ, గౌరవం, మానవత్వం కనుమరుగవు తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజుల అనధికారిక పర్యటన నిమిత్తం అమెరికా వచ్చిన రాహుల్ ఆదివారం డల్లాస్‌లో ఇండో-అమెరికన్ సంతతి వారితో మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్‌పై విమర్శలు సంధించారు. 'భారత్' అనేది ఒక ఆలోచన మాత్రమేనని ఆర్‌ఎస్‌ఎస్ చెబుతోంది. మాది వివిధ ఆలోచనల సమ్మేళనం అని మేం నమ్ము తున్నాం' అని అన్నారు. కులం, మతం, భాష, సంప్రదాయం, చరిత్రతో నిమిత్తం లేకుండా అమెరికాలో మాదిరిగా ప్రతి ఒక్కరికీ భాగస్వామ్యం కల్పించాలని తాము కోరుకుంటున్నామని చెప్పారు. ప్రధాని మోడీ భారత రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని దేశంలోని లక్షలాది మంది ప్రజలు అర్థం చేసుకున్నారని రాహుల్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా మెజారిటీ సాధించలేకపోవడాన్ని ఆయన పరోక్షంగా ప్రస్తావిస్తూ 'మన సంప్రదాయం, భాషపై బీజేపీ దాడి చేస్తోందని ప్రజలు చెబుతున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన నిమిషాలలోనే దేశంలో ఏ ఒక్కరూ బీజేపీని, ప్రధానిని చూసి భయపడలేదు. ఇది ప్రజలు సాధించిన గొప్ప విజయం' అని అన్నారు. డల్లాస్‌లోని టెక్సాస్ యూనివర్సిటీ విద్యార్థులతో కూడా రాహుల్ ముచ్చటించారు. దేశంలో నిపుణులైన లక్షలాది ...13లో

తేలని బీమా ప్రీమియంల తగ్గింపు

జీఎస్టీ నిర్ణయం వాయిదా

- నవంబర్‌లో మళ్లీ భేటీ
- జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



ఢిల్లీ : జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీ తగ్గింపు నిర్ణయం వాయిదా పడింది. నవంబర్‌లో జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో దీనిపై నిర్ణయం వెలువడనుంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతత్వంలో భేటీ అయిన 54వ జీఎస్టీ మండలి.. ఈ అంశంపై మంత్రుల బందాన్ని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇదే భేటీలో క్యాన్సర్ ఔషధాలు, స్నాక్స్‌పై జీఎస్టీ తగ్గిస్తూ నిర్ణయం వెలువడింది. కౌన్సిల్ సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి ఈ వివరాలను వెల్లడించారు. జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీని రద్దు చేయాలన్న డిమాండ్లపై జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలోనే నిర్ణయం వెలువడుతుందని అందరూ ఆశించారు. దీనిపై సుదీర్ఘంగా చర్చించిన మండలి.. మంత్రుల బందానికి ఆ బాధ్యతను అప్పగించింది. బీహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి నేతత్వంలో జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణపై ఏర్పాటైన మంత్రుల బందానికే ఈ బాధ్యతను కట్టబెట్టింది. కొంతమంది కొత్త సభ్యులు ఈ బందంలో చేరతారని, అక్టోబర్ చివరి నాటికి నివేదిక సమర్పిస్తారని నిర్మలా సీతారామన్ తెలిపారు. దీనిపై నవంబర్‌లో జరిగే భేటీలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. క్యాన్సర్ ఔషధాలపై ప్రస్తుతం 12 శాతంగా ఉన్న జీఎస్టీ రేటును 5 శాతానికి తగ్గిస్తూ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. స్నాక్స్‌పై 18 శాతం నుంచి 12 శాతానికి జీఎస్టీని తగ్గిస్తున్నట్లు మంత్రి తెలిపారు. 2026 మార్చి తర్వాత జీఎస్టీ పరిహార సెస్సు కొనసాగించాలా? వద్దా? అనే అంశంపైనా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ, ఆన్‌లైన్ గేమింగ్‌పై జీఎస్టీ అంశాలపైనా చర్చించినట్లు పేర్కొన్నారు.

జీఎస్టీ సెస్ పరిహారమివ్వాలి

రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క



13లో..

ఇజ్రాయిల్ దుశ్చర్యలను ఎండగట్టండి

గాజాలో దాడులను ఆపండి : దేశాలకు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల చీఫ్ విజ్ఞప్తి



జెనీవా : దాదాపు ఏడాది కాలంగా గాజాలో సాగుతున్న దాడులకు అంతం పలకడమే ప్రస్తుతం ప్రాధాన్యత గల అంశమని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ సోమవారం వ్యాఖ్యానించారు. ఆక్రమిత పాలస్తీనా ప్రాంతాల్లో అంతర్జాతీయ చట్టాలను దారుణంగా ఉల్లంఘించి ఇజ్రాయిల్ వ్యవహరిస్తున్న తీరుపై సత్వరమే అన్ని దేశాలు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు గాజాలో దాదాపు 41వేల మంది పాలస్తీనియన్లు మరణించారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో కూడా గత మూడు వారాల నుండి ఉధృతంగా దాడులు కొనసాగుతున్నాయి. ఈ మారణహోమానికి స్వస్తి చెప్పి, పూర్తి స్థాయి ప్రాంతీయ ఘర్షణగా ఇది పెచ్చరిల్లకుండా నివారించడమే ప్రస్తుతం మన ముందున ప్రాధాన్యత అని మానవహక్కుల హై కమిషనర్ వోల్కర్ టర్క్ స్పష్టం చేశారు. జెనీవాలో ఐదు వారాల పాటు సాగే మానవ హక్కుల మండలి సమావేశాల ప్రారంభం సందర్భంగా ఆయన ప్రసంగించారు. భద్రతా మండలి నిర్ణయాలు, తీర్మానాలతో సహా అంతర్జాతీయ చట్టాలు, అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించడాన్ని దేశాలు ఎంత మాత్రమూ ఆమోదించరాదని అన్నారు. బ్రిటన్, జర్మనీ, అమెరికా వంటి పశ్చిమ దేశాల్లో శరణార్థులను, మైనారిటీలను బలి ...6లో

నేడు, రేపు వర్షాలు

పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో మంగళ, బుధవారాల్లో వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. ఆ జాబితాలో ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలున్నాయి. వర్షాలు పడే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముంది.

చరిత్రకు మతం రంగు పులిమితే ఖబర్దార్

భూములు పంచింది, త్యాగాలు చేసింది కమ్యూనిస్టులే : ప్రజానాట్యమండలి శౌర్యయాత్రలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్



వివరాలు 3లో

'ప్రజాపాలన'కు జవాబుదారీ కల్పించాలి

పౌరసంఘాల బహిరంగ విచారణలో దరఖాస్తుదారుల డిమాండ్

- మరింత పటిష్టం చేస్తాం-సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ హామీ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన, ప్రజావాణి కార్యక్రమాల అమలుకు జవాబుదారీ కల్పించాలని వివిధ సమస్యలపై వాటికి అప్లికేషన్లు పెట్టుకున్న దరఖాస్తుదారులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో దరఖాస్తులు తీసుకుంటున్నారనీ, కానీ వాటి పరిష్కారాల కోసం ఏ ఒక్క అధికారి బాధ్యత తీసుకోకపోవడం వల్లే వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోతున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ వ్యవస్థను తప్పనిసరిగా సంస్కరించాల్సిందేననీ, ఏకగవాక్షం ద్వారా ఫిర్యాదులు స్వీకరించి, అది ఏ శాఖకు చెందినదైతే ఆ శాఖకు పంపి, అక్కడి నుంచి పరిష్కారం లేదా తిరస్కారానికి సంబంధించిన సమాచారాన్ని దరఖాస్తుదారుడికి తెలియచేయాలని కోరారు. రైతు స్వరాజ్య వేదిక (ఆర్‌ఎస్వీ), తెలంగాణ పట్టణ పోరాటాల వేదిక (శ్రమ్-ఎన్‌ఏపీఎం), పీపుల్స్ మానిటరింగ్ కమిటీ (పీఎంసీ), ఏఎస్ఈఎం, దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్), తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీ-జేఏసీ), లిబ్టెక్, సోషల్ అకౌంటబిలిటీ ఫోరం ఫర్ యాక్షన్ అండ్ రీసెర్చ్ (సఫార్) సంస్థల సంయుక్తాధ్వర్యంలో 'తెలంగాణలో సమాచారం, హక్కులు, ఫిర్యాదుల పరిష్కార విధానాలు' అంశంపై బహిరంగ విచారణ నిర్వహించారు. సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి సమాచార హక్కు (ఆర్టీఐ) ఉద్యమ నాయకుడు, మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ (ఎంకేఎస్‌ఎస్) వ్యవస్థాపకులు నిఖిల్ డే, గ్రామ్య రిసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ రుక్మిణీరావు, శాతవాహన విశ్వవిద్యాలయం డీన్ ప్రొఫెసర్ సుజాత సూరేపల్లి, నేషనల్ అలయన్స్ ఆఫ్ పీపుల్స్ మూవ్‌మెంట్స్ (ఎన్‌ఏపీఎం) జాతీయ కన్వీనర్ మీరా సంఘమిత్ర, పీపుల్స్ జ్యూరీగా వ్యవహరించారు. ప్రజల దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారంలో రాజస్థాన్, కర్నాటక రాష్ట్రాల్లో పటిష్టమైన వ్యవస్థ ఉన్నదని జ్యూరీ సభ్యులు తెలిపారు. తమ దరఖాస్తుల్ని అధికారులు ఎందుకు తిరస్కరించారో ఇప్పటికీ అర్థంకాలేదని విచారణకు హాజరైన దరఖాస్తుదారులు చెప్పారు. దానికి సంబంధించిన ఆధారాలను జ్యూరీకి సమర్పించారు. కోవిడ్-19 సంబంధిత మరణాలకు పరిహారం ఆలస్యం కావడం, వితంతు పింఛన్లు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ క్లెయిమ్‌లు, ఇండ్ల పంపిణీ, అటవీ హక్కుల చట్టం (ఎఫ్‌ఆర్‌ఏ) సక్రమంగా అమలు చేయకపోవడం వంటి వాటిపై బహిరంగ విచారణలో అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. ప్రభుత్వం తరపున చివర్లో ఈ కార్యక్రమానికి హాజరైన ప్రజావాణి నోడల్ అధికారి, తెలంగాణ సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ కమిషనర్ టీ రవికిరణ్‌లు మాట్లాడుతూ రాజస్థాన్‌లోని జన్ సూచన పోర్టల్ తరహాలో సమాచార పోర్టల్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. ప్రజలు ఎక్కడి నుంచి ఏ శాఖకు సంబంధించిన సమస్యనైనా రాతపూర్వకంగా ఎక్కడ ఇచ్చినా, దాన్ని సంబంధిత శాఖలకు పంపి, అది ఏ దశలో ఉందో, ఎప్పటిలోపు పరిష్కారమవుతుందనే ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీనివల్ల సామాన్యులకు అర్థంకాని అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని కార్యక్రమ నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. సమావేశ నిర్వాహకులు బీ కొండలరెడ్డి, అడ్వకేట్ ఎస్క్యూ మసూద్, సౌమ్య కిదాంబి, కన్నెగంటి రవి, పీ శంకర్, నిర్మలా తమ్మినేని, ఆర్ వెంకటరెడ్డి, విస్సా కిరణ్‌కుమార్, ఉషా సీతాలక్ష్మి, షేక్ సలావుద్దీన్, పీ కల్పన, ఎస్ శృతి, మహ్మద్ తాజుద్దీన్, కే బాలరాజు, ఎస్ ఆశాలత, శ్రీనివాస్ కొడాలి, జాన్ మైఖేల్ తదితరులు పాల్గొన్నారు. శ్రీహర్ష తన్నీరు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

టీజేఎస్ రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ పలువురు నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ జన సమితి బీసీ విభాగం అధ్యక్షులు జశ్వంత్ కుమార్ అధ్యక్షతన సోమవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో రిజర్వేషన్లను పెంచాలంటూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ అందరికి సమాన అవకాశాలు వస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కులగణనకు ఆర్ఎస్ఎస్ అడ్డుపడుతున్నదని తెలిపారు. కులగణన డిమాండ్‌ను కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్‌గాంధీ బలంగా వినిపిస్తున్నారని కొనియాడారు. రాహుల్ గాంధీయే చొరవ తీసుకుని పార్లమెంటులో కులగణన కోసం ప్రయివేటు బిల్లు పెట్టాలని కోరారు. తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ మాట్లాడుతూ ముస్లింలను బీసీల నుంచి తొలగించి ఆర్థికంగా వెనుకబడిన వారికి ఇచ్చినట్టుగా ప్రత్యేకంగా ఇచ్చుకోవాలని డిమాండ్ చేశారు.

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కులగణన పట్ల ఆర్ఎస్ఎస్ తీరు పెండ్లి చేయండి. కానీ సంసారం చేయనీయొద్దన్నట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. కులగణన చేయమంటూనే ఆ వివరాలు బహిర్గతం చేయొద్దనడం సరికాదని హితవు పలికారు. రాహుల్ గాంధీ కులగణనకు ఆదేశించినా సీఎం రేవంత్ రెడ్డి చుట్టూ శిఖండిలు చేరి పడనివ్వడం లేదని విమర్శించారు. రాహుల్ గాంధీ మాటలు రేవంత్ రెడ్డికి నిజంగా శిలాశాసనమే అయితే వెంటనే కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీజేఎస్ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ పీ.ఎల్.విశ్వేశ్వర్ రావు, టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల పార్టీ

- వారి కృషి వల్లే టీపీసీసీ చీఫ్ పదవి: టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్



నవతెలంగాణ- దుండిగల్

కాంగ్రెస్ కార్యకర్తల పార్టీ అని, వారి కృషి వల్లే తనకు టీపీసీసీ చీఫ్ పదవి అవకాశం వచ్చిందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆహ్వానం మేరకు సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దూలపల్లిలోని ఆయన నివాసానికి మహేష్ కుమార్ గౌడ్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు మైనంపల్లి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పార్టీ అని, అన్ని వర్గాలు రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో కార్యకర్తల కృషి, త్యాగాల వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. కార్యకర్తల అభీష్టం మేరకు ప్రభుత్వాన్ని, పార్టీని సమన్వయం చేసుకుంటూ పని చేస్తానని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులకు లబ్ది చేకూర్చడమే తమ లక్ష్యం అని అన్నారు. ఈ తొమ్మిది నెలల పరిపాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తామని చెప్పారు. అంతకు ముందు వరద బాధితుల సహాయార్థం ఖమ్మం జిల్లాకు పంపిస్తున్న నిత్యావసర సరుకుల వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభిచారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, కూన శ్రీశైలంగౌడ్, సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహేష్ కుమార్ గౌడ్‌కు అభినందనలు

నూతన పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కు పలువురు అభినందనలు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని హైదర్‌గూడ క్వార్టర్స్‌లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి కలిశారు. ఈ సందర్భంగా కార్యకర్తలు బాణాసంచా కాల్చుతూ, స్వీట్స్ పంచుతూ సంబరాలు చేసుకున్నారు. తనపై అభిమానంతో తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపిన అందరికీ మహేష్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

అంబేద్కర్ ఆశయాలు, ఆలోచనలు

తుంగలో తొక్కేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ కుట్ర

- ఢిల్లీ ధర్నాలో ఏఐఎడబ్ల్యూయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మనువాద భావజాలాన్ని నెత్తికెత్తుకొని, అంబేద్కర్ ఆశయాలను, ఆలోచనలను తుంగలో తొక్కాలని ఆర్ఎస్ఎస్, బీజేపీ కుట్రలు, కుతంత్రాలు చేస్తోన్నదని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ విమర్శించారు. డీఎస్ఎంఎం ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన ధర్నాలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ భవనంలో అంబేద్కర్ విగ్రహం ఉన్న స్థలం నుంచి తొలగించి అప్రదాన స్థానానికి మార్చారని, ఇది కేవలం విగ్రహ స్థలం మార్పు మాత్రమే కాదని, అంబేద్కర్ ఆశయాలను, రాజ్యాంగ మౌలిక లక్ష్యాలను రూపుమాపేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ చేస్తున్న కుట్రలో భాగమేనని అన్నారు. రాజ్యాంగాన్ని అంబేద్కర్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన నాడే ఆర్ఎస్ఎస్ దాన్ని పూర్తిగా వ్యతిరేకించిందని, మనువాదాన్ని మాత్రమే వారు రాజ్యాంగంగా గుర్తిస్తామని ప్రకటించారని వెంకట్ అన్నారు. ఆర్ఎస్ఎస్ అండతో గద్దెనెక్కిన బీజేపీ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగానికి అనేక పరిమితులున్నా అది సెక్యులరిజానికి కట్టుబడి ఉందని తెలిపారు. అందులోని 16 నుంచి 18 వరకు ఉన్న ఆర్టికల్స్‌లో భారత ప్రజలకు అనేక హక్కులు కల్పిస్తున్నదని, సామాజిక న్యాయం, రిజర్వేషన్లు, అంటరానితనం నిర్మూలన, సమానత్వం లాంటి అనేక అంశాలు ఉన్నాయని అన్నారు. సంపద కేంద్రీకరణను నివారించాలని, సోషలిస్టు తరహా ప్రభుత్వాన్ని స్థాపించాలని ఆదేశిక సూత్రాల్లో తెలిపిన అనేక అంశాలు ఆర్ఎస్ఎస్, బీజేపీ జీర్ణించుకోలేకపోతున్నాయని అన్నారు. అంబేద్కర్ భావజాలం, ఆలోచనా విధానం భవిష్యత్ తరాలకు అందించాలని, నాటి రాజ్యాంగ నేతలు, పాలకులు పార్లమెంట్లోనూ, వివిధ రాష్ట్రాల శాసనసభల ప్రాంగణంలోనూ అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేశారని తెలిపారు. నేడు ఆ విగ్రహాలను తొలగించడంతో పాటు ఆయన ఆలోచన విధానాన్ని కూడా రూపుమాపాలని ఆర్ఎస్ఎస్, బీజేపీ భావిస్తో న్నదని అన్నారు.

హిందుత్వ మనువాద శక్తులను ఓడించడం ద్వారానే అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లగలమని ఆయన అన్నారు. ఈ ధర్నాలో డీఎస్ఎంఎం నాయకులు నీతూప్రసాద్, దళిత హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు నిర్మల్, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు విక్రమ్ సింగ్, ఎఐకెఎస్ నాయకులు మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మౌనం వీడే సమయం ఆసన్నమైంది

మాధబి బచ్‌ను ప్రశ్నించనున్న పీఏసీ
ఆరోపణలపై నేటికీ పెదవి విప్పని సెబీ చీఫ్
వత్తాసు పలుకుతున్న మోడీ ప్రభుత్వం

న్యూఢిల్లీ : బ్యాంకులు, మ్యూచువల్ ఫండ్ల ట్రెజరీ విభాగాలలో పనిచేసే అధికారులకు సెబీ కఠినమైన నిబంధనలు నిర్దేశించింది. ఈ విభాగాలు ప్రతి రోజూ మార్కెట్‌లో షేర్లను కొనుగోలు చేసి విక్రయిస్తుంటాయి. నిబంధనల ప్రకారం అధికారులు తమ పేరిట కానీ లేదా కుటుంబ సభ్యుల పేరిట కానీ వాటాలు కొనుగోలు చేయడం నిషిద్ధం. మార్కెట్‌లో ఇతర అధికారుల కోసం ఇలాంటి నిబంధనలు విధిస్తున్న దర్యాప్తు సంస్థ వాటిని తాను ఎందుకు పాటించడం లేదు? దర్యాప్తు సంస్థల పనితీరుపై విచారణ జరుపుతున్న పార్లమెంటరీ కమిటీ ఎదుట సెబీ చీఫ్ మాధబి పురి బచ్ హాజరయినప్పుడు ఎదుర్కొనబోయే అతి పెద్ద ప్రశ్న ఇదే.

సెబీ పనితీరుపై సమీక్ష జరిపే అంశాన్ని ప్రతిపక్ష ఎంపీ నేతృత్వంలోని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) ఇప్పటికే తన అజెండాలో చేర్చిందని వార్తలు వస్తున్నాయి. కమిటీ సంధించే ప్రశ్నలకు సెబీ చీఫ్ ఎప్పుడో ఒకప్పుడు స్పందించక తప్పదు. మౌనాన్ని ఆశ్రయించడం ఇంకెంత మాత్రం మార్గం కాబోదు.

విరుద్ధ ప్రయోజనాల ఆరోపణలే అధికం

సెబీ అధిపతిగా మాధబి బచ్ పనితీరుపై అమెరికాకు చెందిన పరిశోధనా సంస్థ హిండెన్‌బర్గ్ ప్రతి రోజూ అసంఖ్యాకమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది. అయినప్పటికీ వాటికి సమాధానమిచ్చేందుకు బచ్ ససేమిరా అంటున్నారు. తన కంపెనీల వాటాల విలువను పెంచి చూపించేందుకు అదానీ గ్రూప్ ఓ విదేశీ (ఆఫ్‌షోర్) సంస్థను వాడుకున్నదని, అందులో ఆమెకు వాటాలు ఉన్నాయని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. ఆ తర్వాత కూడా మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో దర్యాప్తు సంస్థ అధిపతిగా బచ్ ఎలా కొనసాగుతారంటూ పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. బచ్‌పై వచ్చిన ఆరోపణల్లో అనేకం పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించినవే.

ప్రశ్నార్థకమైన విచారణ

గౌతమ్ అదానీ సోదరుడైన వినోద్ అదానీకి సంబంధం ఉన్న ఆఫ్‌షోర్ సంస్థలో మాధబి బచ్‌కు వాటాలు ఉన్న విషయం ఇప్పటికే దర్యాప్తులో తేలిపోయింది. గత సంవత్సరం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అదానీ వ్యవహారాలపై జరిగిన దర్యాప్తు నుండి బచ్ తనంతట తానుగా వైదొలగలేదని పేరు చెప్పడానికి ఇష్టపడని సెబీ బోర్డు సభ్యుడు గత వారం వెల్లడించారు. కోర్టు పర్యవేక్షణలో అదానీపై జరుగుతున్న మొత్తం విచారణను ఈ ప్రకటన ప్రశ్నార్థకం చేసింది. గతంలో తాను ఆర్థిక ప్రయోజనాలు పొందిన ఆఫ్‌షోర్ సంస్థపైనే తాను దర్యాప్తు జరుపుతున్నానా అనే విషయం బచ్‌కు తెలియదా అని పీఏసీ ప్రశ్నించవచ్చు.



సంప్రదాయానికి స్వస్తి

సెబీలో చేరకముందు బచ్‌కు ఐసీఐసీఐలో వాటాలు ఉన్నాయని రూఢీ అయింది. ప్రయివేటు కంపెనీ అయిన ఐసీఐసీఐ నుండి పదవీ విరమణ చేసిన తర్వాత ఆమెకు లభించిన ప్రయోజనాలలో భాగంగానే ఈ వాటాలు వచ్చాయని చెబుతున్నారు. ఐసీఐసీలో అధిక వాటాలు కలిగి ఉన్నప్పుడు సెబీ చీఫ్‌గా ఆమె ఎలా నిర్ణయాలు తీసుకున్నారన్నదే ఇక్కడ ప్రశ్న. ఎందుకంటే సెబీ అధిపతిగా బచ్ తీసుకున్న నిర్ణయాల కారణంగా ఆమె వాటాల విలువపై ప్రభావం పడే అవకాశం ఉంది. అంటే ఈ వ్యవహారంలో పరస్పర విరుద్ధ ప్రయోజనం ఉన్నదన్న మాట. గతంలో దర్యాప్తు సంస్థ అధిపతులుగా పనిచేసిన వారు బాధ్యతలు స్వీకరించక ముందే తమ పేరిట ఉన్న వాటాలన్నింటినీ విక్రయించారు. ఇది ఓ సంప్రదాయంగా వస్తోంది. కానీ మాధబి బచ్ ఈ సంప్రదాయాన్ని ఎందుకు అనుసరించలేదన్నది తెలియడం లేదు.

నేతలు భరోసా ఇచ్చారా?

సెబీ చీఫ్‌గా బచ్‌ని నియమించడానికి ముందు ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని క్యాబినెట్ నియామకాల కమిటీ ఈ అంశాన్ని ఎందుకు లేవనెత్తలేదన్నది ఇక్కడ ప్రధాన ప్రశ్న. పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించిన వ్యవహారాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని లేదా ఎవరైనా వాటిని ప్రస్తావిస్తే తాము చూసుకుంటామని రాజకీయ నేతల నుండి బచ్‌కు హామీ వచ్చి ఉండవచ్చు. వాస్తవానికి బచ్ వంటి మేధావి, విజయవంతమైన ఫైనాన్స్ మార్కెట్ నిపుణురాలికి తీవ్రమైన ఈ విరుద్ధ ప్రయోజనాల గురించి కచ్చితంగా తెలిసి ఉంటుంది. ఎందుకంటే తొలుత సెబీ బోర్డు సభ్యురాలిగా, ఆ తర్వాత ఛైర్‌పర్సన్‌గా వ్యవస్థలోకి ఆమే ఆ అంశాలను లాగారు.

భర్త సంస్థలో వాటాలు

మరో అడ్వైజరీ సర్వీస్ అరోగా లిమిటెడ్‌లో కూడా బచ్ వాటాదారుగా కొనసాగారు. బచ్ సెబీ బోర్డు సభ్యురాలిగా, ఛైర్‌పర్సన్‌గా కొనసాగిన సమయంలో అరోగా లిమిటెడ్‌ను నిర్వహించింది ఆమె భర్తే. సెబీలో బచ్ పనిచేసినప్పుడు ఈ అడ్వైజరీ సర్వీస్ చాలా ఆదాయాన్ని పొందింది. కార్పొరేట్ సంస్థలకు అరోగా సలహాలు ఇచ్చిందా లేదా అనేది తెలియడం లేదు. అలాగే అరోగా నుండి సలహాలు పొందిన కొన్ని కార్పొరేట్ సంస్థలు సెబీ విచారణ లేదా దర్యాప్తును ఎదుర్కొన్నదీ లేనిదీ కూడా తెలియదు.

బ్లాక్‌స్టోన్ పెట్టుబడులపై అనుమానాలు

ఇదిలావుండగా బచ్ భర్త బ్లాక్‌స్టోన్ అనే బహుళజాతి ప్రైవేట్ సంస్థకు కూడా సలహాదారుగా వ్యవహరించారు. ఈ సంస్థ మన దేశంలో కార్యకలాపాలు సాగిస్తోంది. మాధబి బచ్ భర్తకు ప్రమేయం ఉన్న డజన్ల కొద్దీ కంపెనీలలో బ్లాక్‌స్టోన్ పెట్టుబడులు పెట్టింది. ఆ కంపెనీలు ఏ ఒక్క సెబీ నిర్ణయం కారణంగా అయినా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితం అయి ఉంటే అది పరస్పర విరుద్ధ ప్రయోజనానికి దారితీసినట్లే. భవిష్యత్తులో మాధబి బచ్ పార్లమెంటరీ కమిటీ ఎదుట హాజరైతే ఈ ప్రశ్నలన్నింటినీ ఆమె ఎదుర్కోవాల్సి ఉంటుంది.



వెనకేసుకొస్తున్న మోడీ ప్రభుత్వం

ఈ ఆరోపణల పర్వం ఇలా కొనసాగుతున్న సమయంలోనే బచ్‌కు మరిన్ని కష్టాలు వచ్చి పడ్డాయి. 'పని ప్రదేశంలో విష సంస్కృతి'పై కొందరు సెబీ అధికారులు బోర్డు ఎదుట గళం విప్పి నిరసన తెలిపారు. బచ్ రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. దర్యాప్తు సంస్థలోనే ఆమెకు పెద్దగా మద్దతు లేదన్న విషయం ఈ ఉదంతంతో స్పష్టమై పోయింది. అయితే ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయమేమంటే మాధబి బచ్‌కు మోడీ ప్రభుత్వం వత్తాసు పలుకుతోంది. ఇప్పటివరకూ ఎన్ని వివాదాలు వచ్చినప్పటికీ ఆర్థిక మంత్రిత్వ శాఖ, ప్రధాని కార్యాలయం మౌనాన్ని వీడడం లేదు. అసలు ఏమీ జరగనట్లుగానే ప్రభుత్వం వ్యవహరిస్తోంది. సెబీలో బచ్ తన పని తాను చేసుకుపోయేలా అనుమతిస్తోంది. అయితే ఇది ఎంతో కాలం కొనసాగబోదు. త్వరలోనే అన్ని ప్రశ్నలకూ బచ్ సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఆ రోజు ఎంతో దూరం లేదు.



జనగామా జిల్లా, కామారెడ్డి గూడెంలో షేక్ బందగీ స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు వేముల ఆనంద్,సీపీఐ(ఎం) జిల్లా నాయకులు సింగారపు రమేష్, శౌర్యయాత్ర బృందం

చరిత్రకు మతం రంగు పులిమితే ఖబర్దార్..

- భూములు పంచింది, త్యాగాలు చేసింది కమ్యూనిస్టులే..
- ప్రజానాట్యమండలి శౌర్యయాత్రలో.. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్

బందగీకి వందనాలు



నవతెలంగాణ-జనగామ

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రకు మతం రంగు పూయాలని చూస్తే ఖబర్దార్ అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ హెచ్చరించారు. సెప్టెంబర్ 1 నుండి 30 వరకు ప్రజానాట్యమండలి చేపట్టిన శౌర్యయాత్ర సోమవారం జనగామ జిల్లాకు చేరింది. ఈ సందర్భంగా పట్టణంలోని నెహ్రూ పార్క్ వద్ద పార్టీ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షతన జరిగిన 'అమరుల యాదిలో శౌర్య యాత్ర' సభలో అబ్బాస్ మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4000 మంది అమరులు బలిదానం చేశారన్నారు. ఫలితంగా తెలంగాణ ప్రాంతంలో జాగిర్దారులు, భూస్వాముల వద్ద ఉన్న లక్షల ఎకరాల భూములు గుంజి పేదలకు పంచినట్టు చెప్పారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వెట్టిచాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటమని అన్నారు. నాటి రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడి ప్రజల పక్షాన నిలిచింది కమ్యూనిస్టులేనని చెప్పారు. ఈ పోరాటంలో జనగామ గడ్డ నుంచి అనేకమంది ప్రాణాలర్పించారని గుర్తు చేశారు. ఈ పోరాటానికి ఎలాంటి సంబంధమూ లేని బీజేపీ.. ఈ ఉద్యమాన్ని వక్రీకరించి చెప్పేందుకు కుట్రలు పన్నుతున్నదన్నారు. అత్యంత కిరాతకంగా ప్రజల మానం, ప్రాణం, హక్కులను హరించిన రజాకారులపై అన్ని విధాల దోపిడీకి గురైన పేద బడుగు, బలహీన వర్గాల ప్రజలు కమ్యూనిస్టుల సారథ్యంలో చేసిన పోరాటం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమని స్పష్టంచేశారు. కానీ, బీజేపీ.. సాయుధ పోరాటం హిందూ ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తూ చరిత్రను వక్రీకరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయుధ పోరాటంలో అనేకమంది ముస్లింలు కూడా నైజాంకు వ్యతిరేకంగా పోరాడి అమరులయ్యారని అన్నారు. సాయుధపోరాట ఫలితంగానే దేశంలో భూ సంస్కరణల చట్టం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎం. కనకారెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, ఈ. అహల్య, బి. శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలను ఆకట్టుకున్న పీఎన్ఎం కళారూపాలు..

శౌర్య యాత్రలో భాగంగా జనగామ జిల్లా కేంద్రంలో ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కళారూపాలు ప్రజలను ఉర్రూతలూగించాయి. నైజాం రజాకారులు పేద ప్రజలను ఎలా హింసించారో, దానికి ప్రతిఘటనగా ప్రజలు ఎలా పోరాటాలు నిర్వహించారో.. కండ్లకు కట్టేలా చూపించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన వీరుల చిత్రపటాలను చేత పట్టుకొని వివిధ కళారూపాలను ప్రదర్శించారు. రక్తపు మడుగుల్లో విప్లవకారులు నేలకొరిగిన రూపాన్ని ప్రతిబింబించేలా కళా రూపాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్, నాయకులు వెంకన్న, ఎం.జీ వినోద్, ఎం.టి గౌసియా, జయ రజిత, రాజయ్య, నాగమణి, సుధాకర్, అంజమ్మ, రజిత, సౌందర్య, లింకన్, తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో మందుల కొరత

సౌకర్యాల్లేక తగ్గుతోన్న ఔట్ పేషెంట్ల సంఖ్య

సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్

ఈఎస్ఐ స్టేట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనితకు సీపీఐ(ఎం) నేతల మెమోరాండం



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణలోని ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీలలో మందుల కొరత తీవ్రంగా ఉందని, వైద్య పరీక్షలు సైతం చేయడం లేదని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ ఈఎస్ఐ ఆస్పత్రుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి కొనసాగుతోందన్నారు. అవసరమైన చర్యలు తీసుకోవాలంటూ సోమవారం ఈఎస్ఐ రాష్ట్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనితకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావుతో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో మెరుగైన సౌకర్యాలతోపాటు వైద్యపరీక్షలు నిర్వహించాలని, మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల పరిస్థితి అత్యంత దారుణంగా మారుతోందన్నారు. దాంతో ఔట్ పేషెంట్ల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తగిన సదుపాయాలు లేకపోవడంతో కార్మికులు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డిస్పెన్సరీలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, అద్దెలు సక్రమంగా చెల్లించక పోవడంతో పలు ప్రాంతాల్లో భవనాలకు యజమానులు తాళాలు వేశారని గుర్తు చేశారు. కొన్ని నెలలుగా మందులు అందుబాటులో లేవని, వైద్య పరీక్షలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసరమైన రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలకు కిట్లు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణ వ్యాధులకు అవసరమైన మందులు సైతం అందుబాటులో లేవన్నారు. రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు, జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని, నగర వాసులు జాగ్రత్తలు తీసుకోవాలంటూ వైద్యులే అవగాహన కల్పిస్తున్నారని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో డిస్పెన్సరీల్లో మందులు, కిట్లు లేకపోవడం ఆందోళనకరమన్నారు. మందులు సరఫరా చేసే ఏజెన్సీలకు బిల్లులు చెల్లించడం లేదని, దాంతో వారు మందులు, కిట్ల సరఫరాలను నిలిపివేశారన్నారు. గత 7, 8 నెలల నుంచి ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదన్నారు. కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల వైద్య సౌకర్యాలను మెరుగుపర్చాలని, మందులను అందుబాటులో ఉంచాలని కోరారు.





వరద బాధితుల సహాయార్థం సీపీఐ(ఎం), సీఐటీయూ విరాళాల సేకరణ

నవతెలంగాణ-విలేకరులు

ఖమ్మంలో ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలతో వరదల్లో చిక్కుకొని సర్వం కోల్పోయిన బాధితుల సహాయం కోసం సీపీఐ(ఎం), సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం విరాళాలు సేకరించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణ కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయం కోసం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా కోశాధికారి జి.భాస్కర్ మాట్లాడుతూ.. భారీ వర్షాలతో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన ఖమ్మం వరద బాధితులకు అండగా నిలుద్దామన్నారు. ఖమ్మం జిల్లా మధిర పట్టణంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆర్థిక, వస్తు సేకరణ విరాళాలు చేపట్టారు.

టీఎమ్ఎస్ఆర్‌యూ
రూ.50 వేల సహాయం

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్‌కు చెక్కు అందజేత



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, అకాల వరదలతో తీవ్రంగా నష్టపోయిన బాధితులకు తెలంగాణ మెడికల్, సేల్స్ రిప్రజెంటేటీవ్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. సోమవారం హైదరాబాద్‌లో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్‌కు దానికి సంబంధించిన చెక్కును ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ భానుకిరణ్, సంయుక్త ప్రధాన కార్యదర్శి ఎ.నాగేశ్వర్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా భాను కిరణ్ మాట్లాడుతూ.. వర్షాలతో సర్వం కోల్పోయి కష్టకాలంలో ఉన్న కార్మికులను ఆదుకోవడం తమ కర్తవ్యంగా భావించి ఈ సహాయం చేశామని తెలిపారు. టీఎమ్ఎస్ఆర్‌యూ రాష్ట్ర కమిటీని పాలడుగు భాస్కర్ అభినందించారు.

ఖమ్మం నగరంలో సీపీఐ(ఎం) సాయం



నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం నగరంలో అకాల వర్షాల వల్ల ముంపునకు గురైన ఆర్టీసీ కార్మికులకు సీపీఐ(ఎం) జిల్లా కమిటీ నుంచి 100 మందికి నిత్యావసర కిట్లను అందించారు. సోమవారం ఖమ్మం జిల్లా కార్యాలయం సుందరయ్య భవనంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కార్మికులకు వరద సహాయక కిట్లు అందజేశారు. అలాగే, మున్నేరు వరద ముంపునకు గురైన సుందరయ్య నగర్ ఏరియా ప్రజలకు మిత్ర స్నేహ గ్రూప్ సంస్థ సౌజన్యంతో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 100 వాటర్ క్యాన్లను పంపిణీ చేశారు. ఖమ్మంరూరల్ మండలం పెద్దతండా పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. వరంగల్ క్రాస్ రోడ్ వద్ద గల తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నున్నా మాట్లాడుతూ.. ఖమ్మం నగరంలో భారీ వర్షాలు వచ్చి వారం రోజులు దాటిపోతున్నా ఇంకా కాలనీలు వరదమయంలో ఉన్నాయని, ఇండ్లలో బురద, నీళ్లతో వస్తువులు ఉన్నాయని అన్నారు. ప్రజలు అనేక అవస్థలు పడుతూ జీవనం సాగిస్తున్నారని, వారికి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ.. అనేక ప్రాంతాల్లో పార్టీ ఆధ్వర్యంలో నిత్యావసర ఆహార వస్తువుల కిట్స్, దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేసినట్టు, పార్టీ శక్తి మేరకు సహాయ సహకారాలు అందిస్తున్నట్టు తెలిపారు.

బస్‌భవన్ వద్ద ఎస్‌డబ్ల్యూఎఫ్ విరాళాల సేకరణ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీజీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారంనాడిక్కడి బస్‌భవన్ వద్ద వరద బాధితుల సహాయ నిధికి విరాళాలు సేకరించారు.

ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ జోన్ అధ్యక్షులు, సోమన్న, కార్యదర్శి ప్రకాష్, జీఆర్ రెడ్డి, గౌడ్ తదితరులు బస్‌భవన్ ప్రవేశద్వారం వద్ద డబ్బాలు పట్టుకొని ఉద్యోగులను విరాళాలు కోరారు. నగదు రూపంలో రూ.4,170 వసూలుకాగా, ఫోన్ పే ద్వారా రూ.900 వచ్చాయి. మొత్తం రూ.5,070 విరాళం వసూలైనట్టు నాయకులు తెలిపారు. సహకరించిన వారందరికీ రాష్ట్ర కమిటీ తరఫున ధన్యవాదాలు తెలిపారు.

సామాజిక రుగ్మతల నివారణకు
మరో ఉద్యమం అవసరం

సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కాళోజీ జయంతి సందర్భంగా రవీంద్రభారతిలో కవి సమ్మేళనం



నవతెలంగాణ-కల్చరల్

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా వాటి ఫలాలు ఇంకా ప్రజలకు అందలేదని, సామాజిక రుగ్మతలను తొలగించేందుకు మరో ఉద్యమం రావాలని పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అందుకు కవులు కళాకారులు బాధ్యత తీసుకోవాలని కోరారు. కాళోజీ నారాయణరావు 110వ జయంతి సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో సోమవారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహాకవికి పాండిత్యం తెలిసి ఉంటే చాలని, అదే ప్రజా కవి కావాలంటే ప్రజల బాధలు, కష్టాలు తెలిసి ఉండాలని అన్నారు. శ్రీశ్రీ ప్రజల గొడవను తన గొడవగా భావించారని.. కాళోజీ 'నా గొడవలో తెలంగాణ ప్రజ గొడవ' అని చెప్పారని అన్నారు. సాంస్కృతిక శాఖ ఆట.. పాటకు మాత్రమే కాదని, సంస్కృతీ.. జీవన విధానానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కాళోజీ కవితల స్ఫూర్తిని గ్రహిస్తే సమాజంలో పలు సంస్కరణలు అమలు చేయొచ్చని.. కవులు, కళాకారుల సహకారం అవసరమని తెలిపారు. త్వరలో వీరితో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం ఉంటుందని అన్నారు. అధ్యక్షత వహించిన సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. కాళోజీ అంటేనే సామాన్య జనుల గొంతుక.. ధిక్కార స్వరం అన్నారు. నాడు పద్మ విభూషణ్ అవార్డును కాళోజీకి బహుకరించే ముందు ఆయన అంగీకరిస్తారో లేదోనని అప్పటి ప్రధాని పివి సంకోచించారని గుర్తు చేశారు. రాష్ట్ర గీత కర్త అందెశ్రీ మాట్లాడుతూ.. కవులు, రచయితలు, కళాకారులు నిజాన్ని నిర్భయంగా స్వేచ్ఛగా చెప్పాలని, పాలకులకు ఒత్తాసు పలకడం వల్లే తెలంగాణ ఆశయాలు సాకారం కాలేదని చెప్పారు. ఈ సభకు సాహిత్య అకాడెమీ కార్యదర్శి బాలా చారి స్వాగతం పలకగా.. పర్యాటక సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణీ ప్రసాద్, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ యాదగిరిరావు, నేటి నిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు పాల్గొన్నారు.

సంపాదకీయం

వారు చీకట్లను బద్దలు కొట్టారు



'సూర్య గ్రహణం వేళ నేను పుట్టడంతో అంతా నన్ను కోతి అని, పిచ్చిదని రకరకాల పేర్లతో పిలిచేవారు. అనాథ శరణాలయంలో నన్ను వదలాల్సిందిగా నా తల్లిదండ్రులపై చాలామంది ఒత్తిడి తెచ్చారు. కానీ, ఇవ్వాళ నేను దేశం గర్వపడేలా భారతావనికి పతకం సాధించాను.' పారీస్ పారాలింపిక్స్‌లో 400 మీ.ల పరుగులో కాంస్యంతో మెరిసిన మన వరంగల్ అథ్లెట్ జీవాంజి దీప్తి ఆవేదన ఇది. ఆమెదే కాదు ఒక్కొక్కరిది ఒక్కోగాథ. అడుగడుగునా ఎన్నో అనుమానాలు, అవమానాలు, మరెన్నో ప్రశ్నలు.. ఆ ప్రశ్నలన్నిటికి నేడు చేతలతోనే సమా ధానాలు చెప్పారు. 'పారీస్ పారాలింపిక్స్‌లో 25 పతకాలు సాధిస్తాం'.. ఇది క్రీడల ఆరంభానికి ముందు మన పారా అథ్లెట్ల బృందం ధీమా! దానిని కూడా హేళన చేసిన వారి నోళ్లు మరల తెరవకుండా 12 క్రీడాంశాల్లో తలపడిన 84 మంది భారతీయ పారాఅథ్లెట్లు అంచనాలకు మించి అద్వితీయ ప్రదర్శనతో ఏడు స్వర్ణాలు సహా మొత్తం 29 పతకాలు ఒడిసిపట్టారు.

> ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ తదితర దేశాలు సరికొత్త విధానాలతో వారికి ఆలంభనగా నిలుస్తుంటే.. మాట్లాడితే ఆయా దేశాలతో పోల్చుకుంటూ దేశ, రాష్ట్రాల రూపురేఖలే మార్చేస్తాం అని చెప్పుకునే మన నేతలకు.. దుర్భర స్థితిలో ఉన్న వికలాంగుల హక్కులు హరించబడ్డ విషయాలు కనబడవు. విద్య, ఉపాధుల్లో వారికి అవరోధంగా ఉన్న వ్యవస్థలకు చరమగీతం పాడాలి. పారాలింపిక్స్ వంటి ప్రతిష్టాత్మక క్రీడల్లో పోటీపడటానికి అవరోధాలుగా ఉన్న మౌలిక సదుపాయాలు, నిధులు కొరతను అధిగమించే ఏర్పాట్లు చేసి తమ కమిట్‌మెంట్‌ను చూపించాలి.

వారి వైకల్యాన్ని మనస్సు కంటన్వీక ఒంటికే పరిమితం చేసి చక్రాల కుర్చీలతో.. కృత్రిమ కాళ్లతో.. పని చేయని చేతులతో.. పారాలింపిక్స్‌లో సరికొత్త చరిత్ర సృష్టిస్తూ ఆ అనుమానాలను పటాపంచలు చేశారు. ఆత్మవిశ్వాసం అండగా.. పోరాటమే శ్వాసగా.. ఆట మీదే ధ్యాసతో..అద్భుత ప్రదర్శనతో దేశానికి పతక వెలుగులు పంచారు. 'అవిటితనం కన్న ఆత్మవిశ్వాసం మిన్నా / అదికాస్త లేకున్నా అంగము లున్నా సున్నా' అన్న కవి శేషగిరి వాక్కులను నిజం చేస్తూ మన పారా అథ్లెట్లు ఆత్మవిశ్వాసం, పట్టుదలతో విశ్వక్రీడా యవనికపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారు. అన్ని అవయవాలు సక్రమంగా ఉండి.. అన్ని వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ.. తామేమీ సాధించలేమనే నిరాశలో కుంగిపోతూ చాలా మంది తమ జీవితాలను మధ్యలోనే ముగిస్తారు. కానీ, వీళ్లది కష్టాల కడలిలాంటి జీవితం.. ఆ జీవన ప్రయాణంలో అడుగడుగునా అడ్డంకులే అయినా, వెన్నుచూపలేదు. భయపడి చీకటిలోనే ఉండిపోలేదు. అన్నింటిని అధిగమించి ఆటల్లో సత్తాచాటి దేశ ఖ్యాతిని చాటారు. టోక్యో పారాలింపిక్స్‌లో 19 పతకాలు సాధిస్తే.. పారిస్‌లో 29 పతకాలతో మరో చరిత్రకు నాంది పలికారు.

వెన్నునొప్పితో అల్లాడుతున్నా వెనకడుగు వేయని సుమిత్ అంటిల్ జావెలిన్ త్రోలో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఏడాదిగా అనారోగ్యం కుంగదీస్తున్నా అవని లేఖరా తుపాకీ గురి తప్పలేదు. క్లబ్‌త్రో, హైజంప్, బ్యాడ్మింటన్, ఆర్చరీల్లోనూ మన క్రీడాకారులు స్వర్ణాలు కొల్లగొట్టారు. ఆత్మవిశ్వాసంతో ప్రతికూలతలను అధిగమించి విజేతలుగా నిలిచిన పారా అథ్లెట్లకు యావద్దేశం జేజేలు పలుకుతోంది! పుట్టుకతోనే చేతుల్లేని జమ్మూకశ్మీర్‌కు చెందిన పదిహేడేండ్ల శీతల్ దేవి కాలితో విల్లు పట్టుకుని, భుజంతో నారి లాగి శరం సంధించి రాకేశ్ కుమార్‌తో కలిసి కాంస్యం సాధించింది. కరెంట్ షాక్‌తో తొమ్మిదేండ్లకే చూపు కోల్పోయిన కపిల్ పర్మార్ అంధుల జూడోలో మూడోస్థానంలో నిలిచి, ఈ విభాగంలో దేశానికి తొలి మెడల్ అందించాడు. అవమానాల కొలిమిలో రాటుదేలిన ప్రీతి పాల్ పరుగుల పోటీలో రెండు కాంస్య పతకాలను దేశానికి అందించింది. తెలంగాణ కీర్తిని ప్రపంచానికి చాటిన అథ్లెట్ జీవాంజి దీప్తి సైతం కాంస్యంతో మెరిసింది. పారాఅథ్లెట్లలో ఒక్కొక్కరిదీ ఒక్కో కన్నీటిగాథ... కానీ, వారెవరూ విధికి తలవంచలేదు. జీవితంలో గెలిచేందుకు కావాల్సినవి లక్ష్యంపై గురి, సాధన, మొక్కవోని స్థైర్యం అని తమ చేతలతో చాటిచెప్పారు. చిన్నతనంలోనే పోలియో కోరల్లో చిక్కినా, ఎదిగిన వయసులో తీవ్ర ప్రమాదాలకు గురై వైకల్యం పాలైనా చెక్కుచెదరని ఆత్మస్థైర్యంతో త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన విజేతల అపూర్వగాథలన్నీ భావితరాలకు అద్వితీయ పాఠాలు.

'వికలాంగుల కోసం అమలు చేస్తున్న పథకాలు కాగితాలకే పరిమితమయ్యాయి. తనిఖీ చేస్తే భయంకర వాస్తవాలు నిగ్గుతేలతాయి' అని తెలంగాణ హైకోర్టు వ్యాఖ్యానించి ఏండ్లు గడుస్తున్నా... పరిస్థితి అంతే సంక్లిష్టంగా కొనసాగుతూనే ఉంది. సంఘటిత, అసంఘటిత రంగాల్లో వారికి ప్రోత్సాహం అంతంతమాత్రమే, స్వయంఉపాధికి ప్రభుత్వ పథకాలు సైతం వారికి అక్కరకురావడం లేదన్నది వాస్తవం. రాజ్యాంగం వికలాంగులకు అనేక హక్కులు కల్పించింది. కానీ క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడంలేదు. ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ తదితర దేశాలు సరికొత్త విధానాలతో వారికి ఆలంభనగా నిలుస్తుంటే.. మాట్లాడితే ఆయా దేశాలతో పోల్చుకుంటూ దేశ, రాష్ట్రాల రూపురేఖలే మార్చేస్తాం అని చెప్పుకునే మన నేతలకు.. దుర్భర స్థితిలో ఉన్న వికలాంగుల హక్కులు హరించబడ్డ విషయాలు కనబడవు. విద్య, ఉపాధుల్లో వారికి అవరోధంగా ఉన్న వ్యవస్థలకు చరమగీతం పాడాలి. పారాలింపిక్స్ వంటి ప్రతిష్టాత్మక క్రీడల్లో పోటీపడటానికి అవరోధాలుగా ఉన్న మౌలిక సదుపాయాలు, నిధులు కొరతను అధిగమించే ఏర్పాట్లు చేసి తమ కమిట్‌మెంట్‌ను చూపించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా అంతర్జాతీయ యవనికపై భారతీయ క్రీడా స్ఫూర్తిని చాటే దిశగా అడుగులేస్తాయని ఆశిద్దాం.

సంఘ చైతన్య స్ఫూర్తి - వీరనారి ఐలమ్మ కీర్తి



అనంగారి భాస్కర్
9010502255

ఆత్మ గౌరవం
ధిక్కార స్వరం
తిరుగుబాటు పతాకం...

ధీశాలి చిట్యాల ఐలమ్మ గురించి మూడు ముక్కల్లో చెప్పాలంటే సరిగ్గా సరిపోయే మాటలు.

సంఘ చేతనం...
ఐక్య సమరం..
సుస్పష్ట లక్ష్యం... పాలకుర్తి గురించి ప్రస్తావించాలంటే మదిపలికే పదాలివి.

ఇలా... ఐలమ్మ సాహసాన్ని - పాలకుర్తి ప్రస్థానాన్ని విడివిడిగా చూడటం సాధ్యం కాదు.

తెలంగాణ పేరును చరిత్రపుటల్లో శిలాక్షరాలుగా మార్చిన వీరతెలంగాణ సాయుధ సమరానికి సంఘ రూపం ఇచ్చిన... తొలి అడుగు జాడలు పాలకుర్తిలోనే పడ్డాయంటే ఆశ్చర్యం లేదు. అలాంటి పోరాటంలో ఒక మహిళ ధృవతారగా వెలిగిందనేది అతిశయోక్తి కాదు.

చింతల చెరువు జాడలు.. నల్ల తుమ్మల నీడలు.. ఎతైన గడి గోడలు. విస్నూరులో నేడు కనిపించె దృశ్యాలు ఇవే. కానీ... అక్కడి జాగీర్దారు అరచకాలు, నాటి భుస్వామ్య పెత్తందారుల అకృత్యాలన్నిటికి ప్రత్యక్ష సాక్షి. అక్కడికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాలకుర్తికి కేవలం ఈ ప్రత్యేకత మాత్రమే ఉంటే దొరగీసిన గీతల్లోనే ఉండేదేమో ఈ గ్రామం. కానీ పదిహేనవ శతాబ్దంలోనే ప్రజాకవిగా పేరెళ్లిన పోతన ఊరు "బమ్మెర" సైతం ఇక్కడికి కేవలం 3కిలోమీటర్ల దూరంలోనే ఉండటం, కాకతీయుల యుగంలోనే గొప్ప విప్లవకవిగా వర్ధిల్లిన పాలకురికి సోమనాధుని జన్మస్థలం కావడంవల్ల కాబోలు... ఇక్కడి ప్రజల్లో సహజంగానే అన్యాయంపై తిరుగుబాటుతత్వం ఉండేదేమో. కాకుంటే... అరవై ఊర్లను శాశించే దొరకు కూత పెట్టు దూరంలో ఉండి, ఆచారాలు, కట్టుబాట్ల చట్రంలో కుమిలే సమయాన ఓ మహిళగా ఉండి, అర్థాకలికి చిరునామాగా తోచే చాకలి కులంలో, పేదతనంలో ఉన్న వ్యక్తి ఐలమ్మ.... అగ్ని కణంలా లేచి, సంఘమై నిలవడం సాధారణ విషయం అసలేకాదు.

> విస్నూరు దొర ఏలుబడిలోనే ఉన్న మల్లపల్లి ముఖ్తేదారు కొండల్‌రావుకు చెందిన, ఊరి చెరువుకింది భూమినే ఐలమ్మ కుటుంబం కౌలు చేసుకుంటూ జీవిస్తోంది.వెట్టిచాకిరి, దొరలు, నిజాం అరాచకాలకు వ్యతిరేకంగా ఆంధ్రమహాసభ కార్యక్రమాలు విస్తరిస్తున్న కాలమది. 1944లో భువనగిరిలో జరిగిన సంఘం మహాసభల పిలుపుతోఉత్సహం పొందిన పల్లెలు సంఘం నీడన సంఘటితమవుతున్నాయి. ఈ క్రమంలోనే పాలకుర్తిలోను ప్రజలు ఒక్కటి కాసాగారు. జీడి సోమయ్య నేతృత్వంలో ఆంధ్రమహాసభ శాఖ ఏర్పడింది. భువనగిరిలో జరిగిన ఆంధ్రమహాసభకు సైతం అయన హాజరయ్యారు. సంఘం అండతో నిరక్షరాస్యులు చైతన్యవంతుయ్యారు. ఐలమ్మ తన ఇంటినే సంఘ కార్యక్రమాల కోసం ఇచ్చింది.

విస్నూరు దొర ఏలుబడిలోనే ఉన్న మల్లపల్లి ముఖ్తేదారు కొండల్‌రావుకు చెందిన, ఊరి చెరువుకింది భూమినే ఐలమ్మ కుటుంబం కౌలు చేసుకుంటూ జీవిస్తోంది.వెట్టిచాకిరి, దొరలు, నిజాం అరాచకాలకు వ్యతిరేకంగా ఆంధ్రమహాసభ కార్యక్రమాలు విస్తరిస్తున్న కాలమది. 1944లో భువనగిరిలో జరిగిన సంఘం మహాసభల పిలుపుతోఉత్సహం పొందిన పల్లెలు సంఘం నీడన సంఘటితమవుతున్నాయి. ఈ క్రమంలోనే పాలకుర్తిలోను ప్రజలు ఒక్కటి కాసాగారు. జీడి సోమయ్య నేతృత్వంలో ఆంధ్రమహాసభ శాఖ ఏర్పడింది. భువనగిరిలో జరిగిన ఆంధ్రమహాసభకు సైతం అయన హాజరయ్యారు. సంఘం అండతో నిరక్షరాస్యులు చైతన్యవంతుయ్యారు. ఐలమ్మ తన ఇంటినే సంఘ కార్యక్రమాల కోసం ఇచ్చింది.

ఈ జన చైతన్యాన్ని దెబ్బకొట్టకపోతె... ముప్పని భావించిన దొరలు... కొత్త ఎత్తులు వేయసాగారు. చాకలివృత్తి వద్దనుకుని ఆత్మగౌరవంతో బతకాలని భావించే చిట్యాల ఐలమ్మ, నర్సయ్య దంపతులతో పాటు, కొందరు దళితులు, దూదేకుల ఖాసీంలు ఏండ్లుగా సాగుచేసుకున్న భూమిని స్థానిక పూజారి వెంకట రమణకు ఇనంగా రాసిచ్చే కుట్ర చేశారు దొరలు. వెంటనే విషయం తెలుసుకున్న జనం... ఇది సరైన పద్ధతి కాదని పూజారిని హెచ్చరించగా... భూస్వాముల అండతో... స్థానిక పోలీస్ పటేల్ శేషగిరిరావు గుండాలను దింపి సంఘం కార్యలయంపై దాడికి యత్నించారు. ప్రతివ్యూహంతో సిద్ధమైన సంఘం సభ్యులు.... వడిసెలు, రాళ్లతో సమరానికి సై అనగా... గుండెలు జారిన గుండాలు పారిపోయారు. ఈ జనచైతన్యం సెగ విస్నూరు గడిని తాకింది. అణుచరులపై గుర్రుమన్న... దేశ్‌ముఖ్ రామచెంద్రారెడ్డి... స్వయంగా రంగంలోకి దిగాడు. ఐలమ్మ, ఇతర పేదలు సాగు చేసుకునే భూమిలో కోతకొచ్చిన పంటను కోసుకురమ్మని తన మనుషులను పంపాడు. ఈ కుట్రలన్నిటిని ఎదుర్కొనేందుకు సిద్ధమై ఉన్న సంఘం నేతలు... ప్రజాదండును కూడగట్టారు. ఈ కార్యక్రమంలో ఆ ప్రాంతంలో పోరాటానికి నేతృత్వం వహించిన యోధుడు ఒభీరెడ్డి నర్సింహ్మారెడ్డి, చకిలం యాదగిరిరావు వంటి నేతలు స్వయంగా పాల్గొని ప్రజలకు ధైర్యాన్నిచ్చారు. దొర మనుషులను తన్ని తరిమారు. పంటను కాపాడి పేదల ఇళ్లకే చేర్చారు. మరో ఓటమితో కక్కలేని, మింగలేని పరిస్థితిలో పడ్డ విస్నూర్ దేశ్‌ముఖ్... నైజాం సాయంకోరి పోలీసుల్ని రంగంలోకి దింపారు. సంఘ నాయకుల్ని అడ్డుకున్న పోలీసులు కొంత ధాన్యాన్ని జప్తుచేయగా... అది తనశ్రమ ఫలితమేనని ధైర్యంగా ముందుకొచ్చింది ఐలమ్మ. ఈ ఘటనను సాకుగా చూపి సంఘనేతలపై దొమ్మీ సహా అనేక కేసులు పెట్టి.. సంఘం నేతలు భీంరెడ్డి, శ్రీనివాసరావు, ఐలమ్మ భర్త, కొడుకుతో సహా పలువురిని జైలుకు పంపి చిత్రహింసలకు గురిచేశారు.



ఇలా.... పాలకుర్తి పోరాటకేంద్రంగా మారిన నేపథ్యంలో... అనేకసార్లు భూస్వాములు చేయించిన దాడుల్లో... కుమ్మరి లక్ష్మీనర్సు, కన్నెబోయిన సోమయ్య, కొత్త శ్రీహరి వంటి వారు అమరులు కాగా... జీవం సోమయ్య వంటి సంఘ సభ్యుల్ని గడ్డివాములో వేసి సజీవంగా కాల్చి చంపిన దుర్మార్గాలు చోటు చేసుకున్నాయి.

దాడులు, హత్యలు.... కేసులు..... దొరలెన్ని వేషాలేసిన.... జన చైతన్యం పెరిగిందే తప్ప ఏమాత్రం తగ్గలేదు. ఎర్రజెండ అండ ఉండటంతో... దొరల కుట్రలకూ తలొగ్గలేదు. సంఘమై, రణరంగానికి ఎప్పుడైనా సిద్ధమే అని నిలిచిన పాలకుర్తి ... పలు గ్రామాలకు వెలుగు దారిచూపిన కేంద్రమైంది. స్వాతంత్ర్యానంతరమూ ఆ చైతన్యం కొనసాగింది. ఎన్నికల సమయంలోనూ సత్తా చాటిన సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో... రెండు దశాబ్దాలపాటు అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచింది పాలకుర్తి. ప్రభుత్వంచే ఏడెనిమిదిసార్లు ఉత్తమ గ్రామ పంచాయతీగా గుర్తించబడటమే....అందుకు ఉదాహరణ. ప్రస్తుత రాజకీయ సమీకరణాలు మారినా.... పోరు జెండానింపిన చైతన్యం ఆ గ్రామంలో నేటికి సజీవంగానే ఉంది.

చెమట మాది....
చేను మాది....
పంట మాది...
ఫలం మాది...
మా బతుకులపై మీ పెత్తనమేందీ!

అని దోపిడీ దొరలకు ఎదురు తిరిగి వీరవనితగా నిలిచిన మన ఐలమ్మ

మన పాలకుర్తి గడ్డ వీర తెలంగాణ పోరులో రాలని మోదుగుపూల కొమ్మ.వీరనారి ఐలమ్మ కీర్తి

(నేడు ఐలమ్మ 39వ వర్ధంతి)

> ఈ జనచైతన్యం సెగ విస్నూరు గడిని తాకింది. అణుచరులపై గుర్రుమన్న... దేశ్‌ముఖ్ రామచెంద్రారెడ్డి... స్వయంగా రంగంలోకి దిగాడు. ఐలమ్మ, ఇతర పేదలు సాగు చేసుకునే భూమిలో కోతకొచ్చిన పంటను కోసుకురమ్మని తన మనుషులను పంపాడు. ఈ కుట్రలన్నిటిని ఎదుర్కొనేందుకు సిద్ధమై ఉన్న సంఘం నేతలు... ప్రజాదండును కూడగట్టారు. ఈ కార్యక్రమంలో ఆ ప్రాంతంలో పోరాటానికి నేతృత్వం వహించిన యోధుడు ఒభీరెడ్డి నర్సింహ్మారెడ్డి, చకిలం యాదగిరిరావు వంటి నేతలు స్వయంగా పాల్గొని ప్రజలకు ధైర్యాన్నిచ్చారు. దొర మనుషులను తన్ని తరిమారు. పంటను కాపాడి పేదల ఇళ్లకే చేర్చారు.

సోషలిజం వైపు.. అస్ట్రేలియా యువత చూపు..



అక్కడేమీ ప్రభావితం చేసే విధంగా కమ్యూనిస్టు పార్టీ లేదు, పురోగామి ఉద్యమాలూ లేవు. వాటి పట్ల వ్యతిరేకత ఉన్న పాలకవర్గం, మీడియాదే ఆధిపత్యం. కమ్యూనిస్టులు కూడా కొన్ని పత్రికలు, వెబ్‌సైట్లు నడుపుతున్నప్పటికీ వాటి ప్రభావం పరిమితమే. అయినా ఆస్ట్రేలియాలో యువత సోషలిజం పట్ల సానుకూలత చూపుతున్నట్లు తాజా సర్వే వెల్లడించింది. అభివఅద్ధి చెందినట్లు చెబుతున్న దేశాలన్నింటా జనం ప్రత్యేకించి యువత పెట్టుబడిదారీ వ్యవస్థ పట్ల విముఖత చూపుతున్నారు. 2024 జూన్ 24న 'యుగవ్' అనే సంస్థ ఆస్ట్రేలియాలో జరిపిన సర్వేలో 18-24 ఏళ్ల మధ్య యువతలో 53 శాతం మంది సోషలిజం పట్ల సానుకూలత చూపగా తటస్తంగా 25 శాతం, పెట్టుబడిదారీ వ్యవస్థకు అనుకూలత వెల్లడించిన వారు 22 శాతం ఉన్నట్లు తేలింది. అదే మొత్తం అన్ని వయసుల వారిలో అలాంటి అభిప్రాయాలు వెల్లడించినవారు 27-42-31 శాతాల చొప్పున ఉన్నారు. 2019 అక్టోబరులో 'యుగవ్' ప్రశ్నలకు 28 శాతం మంది ఆస్ట్రేలియన్లు తమకు సోషలిజం అంటే ఏమిటో తెలియదని చెప్పగా 13 శాతం మంది ఆ వ్యవస్థ కలుపుగోలుతనంతో ఉంటుందని చెప్పారు. సోషలిజాన్ని నిర్వచించమని అడిగిన ప్రశ్నకు అమెరికా యువత 60 శాతం మంది సరైన సమాధానం చెప్పగా ఆస్ట్రేలియన్లు 30 శాతమే ఉన్నారు. అలాంటి యువత 2024లో 53 శాతం మంది సానుకూలత చూపటాన్ని గమనించాలి. దీని అర్ధం వారందరికీ సోషలిజం అంటే పూర్తిగా తెలిసిందని కాదు. సోషలిజం అంటేనే అణచివేత అని భావించిన స్థితి నుంచి బయటపడి "సోషలిజం" తాము జీవిస్తున్న పెట్టుబడిదారీ వ్యవస్థకంటే మెరుగ్గా ఉంటుందనే అభిప్రాయం ఏర్పరుచుకోవటాన్ని ఇక్కడ గమనించాల్సిన, ఆహ్వానించాల్సిన అంశంగా చూడాలి. వీరి శాతం ఏటేటా పెరుగుతున్నది. 'యుగవ్' 2019 అక్టోబరులో "కమ్యూనిజం బాధితులు" పేరుతో ఏర్పడిన ఒక సంస్థ తరఫున అమెరికా, ఆస్ట్రేలియాల్లో సర్వే చేసింది. యువతలో సోషలిజం అంటే సమ్మతి లేదా ఆదరణ పెరుగు తున్నదని ఆ సర్వేలో తేలినట్లు ప్రకటించింది.ఇదంతా ఎప్పుడు? సోషలిజంలో అణచి వేస్తారు, భావ ప్రకటన స్వేచ్ఛ ఉండదు, భవిష్యత్ లేదు, అది విఫలమైంది అని ప్రచారం పెద్ద ఎత్తున జరుపుతున్న తరుణంలోనే అన్నది గమనించాలి. ప్రచ్ఛన్న యుద్ధం పేరుతో కమ్యూనిస్టు వ్యతిరేకతను పెద్ద ఎత్తున రెచ్చగొట్టిన పరిణామాలను చూసిన పాత తరం వారిలో ఉన్న వ్యతిరేకభావం యువతరంలో లేదని ఆ సర్వేలో తేలింది.ఇప్పుడు కమ్యూనిజానికి వ్యతిరేకంగా తక్కువ ప్రచారం జరుగు తోందా? కానే కాదు, ఏ మాత్రం తగ్గలేదు.

తాజా సర్వే జరిగిన నేపథ్యాన్ని చూస్తే అనేక దేశాల్లో యువత సోషలిజం గురించి అధ్యయనం చేయటంతో పాటు నయా ఫాసిస్టు, మితవాద శక్తులు తమ సమస్యలకు పరిష్కారం చూపగలవేమో అన్న భ్రమలతో అటువైపు కూడా మొగ్గుతున్నారు. ఫ్రాన్సులో, తాజాగా జర్మనీలోని తూర్పు ప్రాంతంలో జరిగిన ఒక రాష్ట్ర ఎన్నికల్లో పచ్చి మితవాదులు పెద్ద పార్టీగా అవతరించారు. జీవన ఖర్చు పెరగటం, గఅహ సంక్షోభం ఆస్ట్రేలియన్ యువతను సోషలిజం గురించి ఆలోచింప చేస్తున్నదని తేలింది. జనాభాలో 18-34 ఏళ్ల వయస్సు వారిలో 41 శాతం మంది సోషలిజాన్ని సమర్థించగా, 35కు పైబడిన వారిలో 21 శాతం మంది ఉన్నారు. అదే వయసులో ఉన్నవారు పెట్టుబడిదారీ విధానాన్ని 34 శాతమే సమర్థించినట్లు విశ్లేషణలో తేలింది. యువత సోషలిజం వైపు ఎందుకు మొగ్గుతున్నారన్న ప్రశ్నకు యుగవ్ డైరెక్టర్ పాల్ స్మిత్ మాట్లాడుతూ యువతరం ఎంతో భిన్నమైన ఆర్థిక పరిస్థితిని చవిచూస్తున్నారని, 2008 ద్రవ్య సంక్షోభం తరువాత శ్రామికశక్తిలో చేరిన యువత అసంతృప్తికి లోనై సోషలిజం వైపు మొగ్గుతున్నట్లు చెప్పాడు. పెద్ద తరాలు మంచివేతనాలతో కూడిన జీవితాలను గడపగా యువతకు అలాంటి హామీ లేదని, విద్య, గృహాలకు ఎక్కువగా చెల్లిస్తున్నారని అన్నాడు. ఒక స్థిరమైన ఉపాధి లేకపోవటం, తాత్కాలిక పనివారిని తీసుకొనే వాతావరణం ఎక్కువగా ఉండటంతో వారసత్వంగా వచ్చినవి ఉంటే తప్ప అద్దె ఇళ్లలో నివసించలేని స్థితి ఏర్పడింది. ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. గాజా వంటి చోట్ల జరుగుతున్న దారుణాలను సామాజిక మాధ్యమాల్లో చూస్తున్న వారు పెట్టుబడిదారీ విధానం యుద్ధాలను ప్రోత్సహిం చటం ఎందుకని ప్రశ్నలు సంధించటం పెరిగింది. ఆస్ట్రేలియాలో పర్యా వరణాన్ని పరిరక్షించాలని కోరుకొనే వారు 64 శాతం మంది సోషలిజాన్ని అభిమానించగా, లేబర్ పార్టీ 31, సంకీర్ణ కూటమి మద్దతుదార్లలో కేవలం 12 శాతమే ఉన్నారు. కార్పొరేట్ల లాభాలకంటే జనం ప్రయోజనాలు, భూగోళాన్ని పరిరక్షిం చాలని కోరుకొనే వారు పెరుగు తున్నారు.

> ఒకవైపు అమెరికాలో కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం ఇప్పటికీ పెద్ద ఎత్తున కొనసాగుతూనే ఉంది. అయితే అక్కడ దిగజారుతున్న ఆర్థిక పరిస్థితులు యువతను ఆలోచింపచేస్తున్నాయి. కమ్యూనిజం, సోషలిజం గురించి వక్రీకరణలు కొనసాగుతున్నప్పటికీ టీచర్లు బోధిస్తున్న అంశాలలో డెన్మార్క్, నార్వే వంటి చోట్ల స్కాండినేవియన్ సోషలిజం గురించి చెబుతున్న అంశాలు వారిని ఆకర్షిస్తున్నట్లు కొందరు చెబుతున్నారు. అమెరికా కంటే అక్కడి పరిస్థితి మెరుగ్గా ఉన్నందున అలాంటి సోషలిజాన్ని ఎందుకు అమలు చేయకూడదనే ప్రశ్నకు సరైన సమాధానం వారికి దొరకటం లేదు.

యువతలో ఎందుకీ మార్పు?

కమ్యూనిజం విఫలమైందని ప్రచారం జరిగిన చోటే పెట్టుబడిదారీ విఫలమైందని ఆ విధాన గట్టి సమర్థకుడైన థామస్ పికెట్టి వంటి వారు సాధికారికంగా స్పష్టం చేసిన తరువాత యువత ఆలోచించకుండా ఎలా ఉంటుంది? సోషలిస్టు చైనా, వియత్నాం నుంచి దిగుమతి చేసుకున్న వస్తువులనే నిత్యం వాడుతున్నపుడు ఆ వస్తువులను మన దేశంలో ఎందుకు తయారు చేసుకోలేకపోతున్నాం అని ఎక్కడికక్కడ యువత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పేవారు లేరు. 1995-2010 మధ్య జన్మించిన వారిని జడ్ తరం అని పిలుస్తు న్నారు. వీరిని సోషలిజం (ఆకర్షిస్తున్నదని) కవ్విస్తున్నదని కొందరు వర్ణించారు. ముఖ్యంగా అమెరికాలో ఈ ధోరణి కనిపిస్తోంది. అనేక మంది 'మేం సోషలిస్టులం' అంటూ గర్వంగా చెప్పుకుంటున్నారు. ఒకవైపు అమెరికాలో కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం ఇప్పటికీ పెద్ద ఎత్తున కొనసాగుతూనే ఉంది. అయితే అక్కడ దిగజారుతున్న ఆర్థిక పరిస్థితులు యువతను ఆలోచింపచేస్తున్నాయి. కమ్యూనిజం, సోషలిజం గురించి వక్రీకరణలు కొనసాగుతున్నప్పటికీ టీచర్లు బోధిస్తున్న అంశాలలో డెన్మార్క్, నార్వే వంటి చోట్ల స్కాండినేవియన్ సోషలిజం గురించి చెబుతున్న అంశాలు వారిని ఆకర్షిస్తున్నట్లు కొందరు చెబుతున్నారు. అమెరికా కంటే అక్కడి పరిస్థితి మెరుగ్గా ఉన్నందున అలాంటి సోషలిజాన్ని ఎందుకు అమలు చేయకూడదనే ప్రశ్నకు సరైన సమాధానం వారికి దొరకటం లేదు. అయితే ఆ దేశాల్లో ఉన్న జనాభా మొత్తం కూడా అమె రికాలో ఒక రాష్ట్రంలో ఉన్నవారికి సమానమని. 30 కోట్ల మందికి సోషలిజాన్ని అమలు చేయటం, దీర్ఘకాలం కొనసాగించటం సాధ్యం కాదని మాత్రమే చెప్పటం వారికి సంతృప్తిని కలిగించటం లేదు. ఆయా దేశాల జీడీపీతో పోలిస్తే అమెరికా జీడీపీ ఎక్కువగా ఉన్నపుడు ఎందుకు సాధ్యం కాదు?

మొత్తం మీద చెప్పాలంటే సోషలిజం గురించి ఆసక్తి కనపరుస్తున్న యువతను దారి మళ్లించేందుకు అక్కడి కమ్యూనిస్టు వ్యతిరేకులు నానా పాట్లు పడుతున్నారు. వారి జీవితానుభవం నుంచే అలాంటి ఆసక్తి కలుగుతున్నదని సామాజిక మాధ్యమం, మీడియా తప్పుదారి పట్టిస్తున్నదని, వ్యక్తిగత స్వార్ధం యువతలో పెరిగిందని, దేశం ఏమైనా ఫర్వాలేదన్నట్లుగా తయారవుతున్నారని పెడబబ్బలు పెడుతున్నారు. దీనికి తమను తామే నిందించుకోవాలంటున్నారు.

అందరికీ ఆరోగ్య రక్షణ కావాలన్న డిమాండ్‌కు యువత మద్దతు ఇవ్వటానికి మేధావుల సైద్ధాంతిక బోధన కారణం కాదని, పెరుగుతున్న ఖర్చు, బీమా సౌకర్యం లేకపోవటమే అంటున్నారు.


అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేనట్లుగానే వాస్తవాలు, జీవిత అనుభవాల నుంచి పక్కదారి పట్టించాలంటే కుదరదు.అనేక దేశాల్లో ఇప్పుడు సోషలిజాన్ని యువత కోరుకోవటానికి పెట్టుబడిదారీ వ్యవస్థలలో వారి కలలు కల్లలు కావటమే కారణం. కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారంతో జనాల బుర్రలు నిండటం తప్ప కడుపు నిండదని తేలిపోయింది.

- సత్య

అస్సాంలో పరిస్థితి ఎప్పటికప్పుడు దిగజారిపోతున్నది. కొన్ని వర్గాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలూ, ప్రజలను మత ప్రాతిపదికన దురభిమాన తరహాలో విభజించేందుకు కొన్ని ధోరణులూ ఇందుకు కారణమవుతున్నాయి. ప్రస్తుత ఈ పరిస్థితులకు ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, బీజేపీ నాయకత్వంలోని ప్రభుత్వం మాత్రమే పూర్తి బాధ్యత వహించవలసి వుంటుంది. ముస్లింలపై విద్వేషం పెంచే తన తన ప్రచారకాండలో హిమంత బిశ్వశర్మ అన్ని హద్దులూ దాటేశారు. దేశీయకు వ్యతిరేకంగా బయటివారు అనే తన విభజన రాగం లోనూ ఆయన హద్దు మీరారు. మతపరమైన మైనార్టీలను బయటివారు అంటూ ముద్ర వేస్తూ వారిపైన ఏదో ఒక విశఅంఖల ఆరోపణ చేయకుండా ఒక్క రోజు కూడా గడవడం లేదు. ఆయన పనిగట్టుకుని చేస్తున్న విభజన రాజకీయ ప్రసం గాల చిచ్చు ప్రజల్లో కొన్ని తరగతుల ప్రజలను రెచ్చగొడుతున్నది. మైనారిటీలకు వ్యతిరేకంగా హింసాత్మక వాతావర ణానికి దారి తీస్తున్నది. లైంగిక పరమైన దాడులకు సంబంధించిన రెండు కేసులలో వ్యవహరించిన తీరు ఇందుకు నిదర్శనం గా వుంది.

శివసాగర్ పట్టణంలో మార్వారీ వర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పదిహేడేళ్ల అమ్మాయిపై చేసిన దాడి ప్రజ్వలనకు దారితీసింది. బయటివారిపై కొన్ని సంస్థలు బెదిరింపులకు పాల్పడ్డాయి. నేరస్తులపై చర్య తీసుకోవాలని కోరడానికి బదులు మొత్తం మార్వారీ వర్గాన్ని ఈ నేరానికి బాధ్యులైనట్టు నిందాప్రచారం సాగింది. ఎగువ అస్సాంలో అస్సామీ యేతర వ్యాపార వర్గం మొత్తానికి వ్యతిరేకంగా పెద్ద నిసనగా మారింది. చివరకు శివనగర్‌లో ఆ వర్గం ప్రతినిధులు రాష్ట్ర కేబినెట్ మంత్రి, పోలీసు సూపరిండెంటు సమక్షంలో మోకాళ్లపై వంగి క్షమాపణలు చెప్పాలని ఒత్తిడి చేసి చెప్పించే పరిస్థితికిది దారి తీసింది. నాగాన్ జిల్లాలో ముగ్గురు ముస్లిం యువకులు పద్నాలుగేళ్ల మైనర్ బాలికపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన ఘటన ఇంతకన్నా తీవ్రమైన పరిస్థితికి దారితీసింది. దీనిపై నిరసనను తూర్పు బెంగాల్ కు చెందిన ముస్లింలు అందరిపైకి మళ్లించి వారిని మియాలు అంటూ అవమానించారు. ఆరెస్సెస్, బీజేపీలకు చెందిన కొన్ని సంస్థలు మియాలకు బెదిరింపులు జారీ చేస్తూ అస్సాం వదిలి పొమ్మని భయపెడుతున్నాయి. మియా వర్గానికి చెందిన నిర్మాణ కార్మికులను విచక్షణ రహితంగా కొట్టిన ఘటన తర్వాత బెంగాలీ మాట్లాడే ముస్లింలు వేలాదిమంది ఎగువ అస్సాం నుంచి పారిపోయే పరిస్థితి ఏర్పడింది.

అస్సాం ముఖ్యమంత్రిని తొలగించాలి



ఒకవైపునే ముఖ్యమంత్రి

ఈ విషయంలో తాను ఒక వైపునే వుంటాననీ, మియాలు అస్సాంను స్వాధీనం చేసుకోవడాన్ని అనుమతించబోననీ ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ శాసనసభలో ప్రకటించారు. అన్ని రంగాల్లో విఫలమైన తన ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడం కోసం ఆయన పూర్తి స్థాయిలో ముస్లిం వ్యతిరేక ప్రచారానికి దిగారు. మహిళల రక్షణలో ఘోరంగా విఫలమవడంతో ఘోరమైన లైంగికదాడులు, హింసాత్మక ఘటనలు పెరుగుతున్నాయి. ఆరు వెనకబడిన తరతులకు ఎస్టీ ప్రతిపత్తి కల్పించాలనే కోర్కె అపరిష్కృతంగానే వుండిపోయింది. భూమిని కాపాడాలనీ, 1971 నుంచి దశాబ్దాలుగా అస్సాంలో వుంటున్న భూమి లేని ప్రజలకు భూ పంపిణీ చేయాలనే డిమాండు కూడా పూర్తిగా ఉపేక్షించబడింది. వరదలు, భూమి కోత సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చిటికెన వేలు కదిల్చింది లేదు. నిరుద్యోగం ఎప్పటికప్పుడు పెరుగుతూ పోతున్నది. శర్మ, ఆయన సర్కారు పచ్చి మతతత్వ ప్రచారం ప్రారంభించడానికి ఇదే నేపథ్యం. సరిగ్గా ఇదే. మహిళలపై లైంగికదాడులతో సహా ఈ నేరాల విజృంభణకు అన్ని మతాల వారున్నప్పటికీ ముస్లింలపై మాత్రమే నేరస్తులుగా ముద్ర వేసి నిందించడం జరుగుతున్నది. రాజధాని గౌహతిలో కఅత్రిమమైన వరదల సమస్యను కప్పిపుచ్చడం కోసం వరద జిహాద్ నినాదాన్ని కనిపెట్టింది కూడా హిమంత శర్మనే.

18 ప్రతిపక్షాల విజ్ఞప్తి

ముఖ్యమంత్రి పదవి నిర్వహించడానికి సంబంధించిన రాజ్యాంగ ప్రమాణాలన్నిటినీ హిమంత శర్మ ఉల్లంఘించారు. "ఎలాంటి భయం, పక్షపాతం, ప్రేమ, వ్యతిరేకత లేకుండా రాజ్యాంగం, చట్ట నిబంధనల మేరకు ప్రజలకు అన్ని విధాల న్యాయం చేస్తాన"ని ముఖ్యమంత్రిగా ఆయన చేసిన ప్రమాణాన్ని బాహాటంగా ఉల్లంఘించారు. శాసనసభ లోపలా వెలుపలా ముఖ్యమంత్రి ఉవాచలు ఈ అధికార ప్రమాణాన్ని వమ్ము చేసేలా వున్నాయి. రాజకీయ రాజ్యాంగ నైతికతను ఆయన అవమానకరమైన రీతిలో తొక్కిపారేశారు.అందువల్లనే ముఖ్యమంత్రి హిమం త బిశ్వశర్మను పదవి నుంచి తొలగించవలసిందిగా కోరుతూ 18 ప్రతిపక్ష పార్టీలు ఆగష్టు 29న అస్సాం గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి ఒక మెమోరాండం సమర్పించాయి. మత విద్వేషాన్ని వ్యాపింప చేస్తున్నందుకు, రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తున్నందుకు ఆయనను డిస్మిస్ చేయాలని ఆమెను కోరాయి. పదవీ ప్రమాణాన్ని రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఒక ముఖ్యమంత్రిపై చర్య తీసుకోదగిన సందర్భమంటూ ఏదైనా వుందంటే ఇంతకన్నా మరొకటి వుండబోదు.

(సెప్టెంబరు 4 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

గ్రీన్ ఫార్మాసిటీ పనులు వేగవంతం చేయండి

- కాలుష్యం లేకుండా జాగ్రత్తలు తీసుకోండి : సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ శివార్లలో ఏర్పాటు చేస్తున్న గ్రీన్ ఫార్మాసిటీ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోని కాలుష్య రహితంగా ఉండేలా గ్రీన్ ఫార్మాసిటీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ముచ్చర్ల పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రయినేజీలు తదితర మౌలిక సదుపాయాల నిర్మాణాలను వీలైనంత తొందరగా చేపట్టాలని ఆదేశించారు. భవిష్యత్ అవసరాలకనుగుణంగా మౌలిక సదుపాయాలు ఉండాలని అధికారులను అప్రమత్తం చేశారు. పెట్టు బడులు పెట్టేందుకు ఇప్పటికే పేరొందిన ఫార్మా కంపెనీలు ముందుకొస్తున్నాయనీ, త్వరలోనే వాటితో సంప్రదింపులు జరుపుతామని సీఎం తెలిపారు. ఔషధాల తయారీ, బయోటెక్, లైఫ్ సైన్సెస్ కంపెనీలకు గ్రీన్ ఫార్మాసిటీ సింగిల్ స్టాప్‌గా ఉండాలని అభిప్రాయపడ్డారు. యాంటీ బయాటిక్స్, సింథటిక్ డ్రగ్స్, రసాయనాలు, విటమిన్లు, వ్యాక్సిన్లు, డ్రగ్ ఫార్ములేషన్స్, హెర్బల్ తదితర ఉత్పత్తులకు ఫార్మాసిటీలో ప్రాధాన్యముంటుందని చెప్పారు. పరిశోధన, శిక్షణ, నైపుణ్యాలకు అవసరమైన ప్రత్యేక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. హెల్త్‌కేర్, ఫార్మా రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా అందులో కోర్సులు నిర్వహించాలని సూచించారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, టీజీఐఐసీ ఎమ్‌డీ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



కాంట్రాక్ట్ ఉద్యోగులను తిరిగి తీసుకోవాలి

- వైద్యారోగ్యశాఖ కమిషనర్‌కు టీయూఎంహెచ్‌ఇయూ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వికారాబాద్ జిల్లాలో తొలగించిన ల్యాబ్ టెక్నీషియన్స్ గ్రేడ్ 2, ఫార్మాసిస్ట్ గ్రేడ్ 2లను వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్‌ఇయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర కార్యదర్శులు బి. విజయవర్ధన్ రాజు, ఎస్.నవీన్ కుమార్, సుభాష్ చంద్ర తదితరులు సోమవారం హైదరాబాద్‌లో ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు వినతిపత్రం సమర్పించారు. టర్మినేషన్ ఆర్డర్స్ రద్దు చేసి యధావిధిగా కొనసాగించాలని కోరారు. 104 ఎఫ్ డీహెచ్‌ఎస్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో 2009 నుంచి ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2లు పని చేస్తున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 డిసెంబర్ 20న ఈ సర్వీసులను రద్దు చేసిందని తెలిపారు. 1,098 మంది సిబ్బందిని వివిధ శాఖల్లో సర్దుబాటు చేసి కొనసాగిస్తున్నారని చెప్పారు. 2024-2025 సంవత్సరానికి గానూ కొనసాగింపు ఉత్తర్వులు రావాల్సి ఉన్నదని గుర్తుచేశారు. ఈ పరిస్థితిలో ఏడుగురు ఫార్మాసిస్ట్ గ్రేడ్ 2లను, ఆరుగురు ల్యాబ్ టెక్నీషియన్లకు ఈ నెల 4న వికారాబాద్ జిల్లా అధికారి తొలగించడం పట్ల విచారం వ్యక్తం చేశారు. 104 ఉద్యోగులందరినీ యధా విధిగా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించి జిల్లాల్లో సర్దుబాటు చేసి వేతనాలు చెల్లిస్తుందనీ, వీరి కొనసాగింపు ఉత్తర్వుల ఫైల్ ఆర్థిక శాఖలో ఉందని చెప్పారు. ఈ పరిస్థితిలో జిల్లా అధికారులు తొలగించడంతో వారి కుటుంబాలు రోడ్డున పడి అన్యాయానికి గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఆదేశాలిచ్చి యధావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో వికారాబాద్ జిల్లాలోని ఫార్మసిస్టులు ల్యాబ్ టెక్నీషియన్లు తొలగించబడ్డ వారున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గాల్లోనే కాంట్రాక్ట్ ఉద్యోగులకు భద్రత లేకుండా పోయిందని వాపోయారు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో ఇద్దరినీ, స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్‌లో 14 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను జిల్లా అధికారులు తొలగించారని తెలిపారు. వారిని వెంటనే విధులోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సీనియార్టీ మేరకు పదోన్నతులివ్వాలి -వీవీపీ కమిషనర్‌కు వినతి

తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో ల్యాబ్ టెక్నీషియన్ల పదోన్నతులను సీనియార్టీ ప్రకారం ఇవ్వాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్‌ఇయూ) డిమాండ్ చేసింది. 30 ఏండ్లుగా పని చేస్తున్న సీనియర్లను కాదని జూనియర్లకు పదోన్నతులు కల్పించారని యూనియన్ అభ్యంతరం తెలిపింది. యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర నాయకులు వి.భూలక్ష్మి ఆధ్వర్యంలో టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సంబంధిత ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించినట్టు కమిషనర్ నాయకుల తో చెప్పారు.

డీఎస్సీ తుది కీలో తప్పులు!

- విద్యాశాఖకు అభ్యర్థుల ఫిర్యాదు
- ఫలితాల విడుదల ఆలస్యమయ్యే అవకాశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) రాతపరీక్షలకు సంబంధించి విద్యాశాఖ విడుదల చేసిన తుది కీలో తప్పులు ఉన్నాయంటూ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం పెద్దఎత్తున అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖకు తరలివచ్చారు. తుది కీలో కొన్ని ప్రశ్నలకు జవాబులు తప్పుగా ఉన్నాయంటూ అందుకు సంబంధించిన ఆధారాలతో సహా పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకులు లింగయ్యను కలిసి ఫిర్యాదు చేశారు. వాటిని సరి చేయాలని కోరారు. సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) ప్రశ్నాపత్రంలోనే తప్పులు వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. అభ్యర్థులు ఇచ్చిన ఫిర్యాదులను రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ)కి అధికారులు పంపిస్తారు. అక్కడ ప్రశ్నాపత్రం తయారు చేసిన సబ్జెక్టు నిపుణులు వాటిని పరిశీలిస్తారు. ఆ తర్వాత తప్పుల ను గుర్తిస్తే సవరణ తుది కీని విడుదల చేస్తారు. ఈ ప్రక్రియ వల్ల డీఎస్సీ ఫలితాల విడుదల ఆలస్యమయ్యే అవకాశమున్నది. జులై 18 నుంచి ఆగస్టు ఐదో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో డీఎస్సీ రాతపరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 2,79,957 మంది దరఖాస్తు చేయగా, 2,45,263 (87.61 శాతం) మంది అభ్యర్థులు రాతపరీక్షలకు హాజరయ్యారు. 34,694 (12.39 శాతం) మంది గైర్హాజరయ్యారు. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.

ఇజ్రాయిల్ దుశ్చర్యలను ఎండగట్టండి

(మొదటిపేజీ తరువాయి)

పశువులుగా చేయడం ద్వారా రాజకీయనేతలు హింసను రెచ్చగొడుతున్నారని ఆయన విమర్శించారు. గాజాలో 22లక్షల మంది పాలస్తీనియన్లు అత్యవసర సహాయం కోసం ఎదురుచూస్తున్నారని ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యుఎఫ్‌పి) పేర్కొంది. గాజాలో ఇజ్రాయిల్ మారణకాండను ప్రారంభించి 11మాసాలు పూర్తయింది. దీంతో అక్కడి ప్రజల పరిస్థితులు దుర్భరంగా మారాయి.

గాజాలో స్కూళ్ళకు దూరంగా ఆరున్నర లక్షలమంది విద్యార్థులు

సోమవారం నుండి గాజాలో అధికారికంగా కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైంది. అయినా ఇజ్రాయిల్ దాడులు, కాల్పుల విరమణ ఒప్పందం కనుచూపు మేరలో లేకపోవడంతో 6,30,000మందికి పైగా విద్యార్థులు పాఠశాలలకు వెళ్ళే పరిస్థితులు లేవు. దీంతో గాజాలో ఇజ్రాయిల్ దాడులతో విద్యార్థులకు రెండో విద్యా సంవత్సరం కూడా అంతరాయం కలిగింది. దాదాపుగా 90శాతానికి పైగా స్కూళ్ళన్నీ మూతబడడమో, విధ్వంసం కావడమో జరిగింది. మిగిలిన స్కూళ్ళను పునరావాస కేంద్రాలుగా మార్చారు. పిల్లలను ఇలా పాఠశాలలకు దూరంగా వుంచడం వల్ల ఒక తరాన్ని మొత్తంగా కోల్పోయే ప్రమాదం పొంచి వుందని యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ జూలియట్ టామా వ్యాఖ్యానించారు. నేర్చుకున్నది మర్చిపోయే ప్రమాదముందని, పైగా బాల్య వివాహాలు, బాల కార్మికులు, సాయుధ గ్రూపుల్లోకి రిక్రూట్‌మెంట్‌లు వంటి సమస్యల్లోకి కూరుకుపోతారని, హెచ్చరించారు. ఈ నేపథ్యంలో కాల్పుల విరమణ ఒప్పందానికి తాము కొత్తగా షరతులు విధించామంటూ అమెరికా మీడియాలో వస్తున్న వార్తలను హమాస్ అధికారులు తిరస్కరించారు. ఇజ్రాయిల్ పైకి రాకెట్లు ప్రయోగించిన నేపథ్యంలో ఉత్తర గాజా నుండి ప్రజలు తక్షణమే ఖాళీ చేయాలని ఇజ్రాయిల్ తాజాగా ఆదేశాలు జారీ చేసింది.

పొన్నం సత్తయ్య గౌడ్ 3వ మెమోరియల్ అవార్డుకు పలువురి ఎంపిక

- ప్రముఖ సినీగేయ రచయిత చంద్రబోస్, బలగం ఫేం కొమురమ్మ, మొగిలయ్యకు అవార్డులు
- 13న రవీంద్ర భారతి వేదికగా ప్రదానం



నవతెలంగాణ-హైదరాబాద్

పొన్నం సత్తయ్య గౌడ్ మెమోరియల్ అవార్డుకు పలువురు ఎంపికయ్యారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య గౌడ్ జ్ఞాపకార్థం వారి సోదరులు, కుటుంబ సభ్యులు ప్రతి సంవత్సరం రచయితలకు, కళాకారులకు అందించే పొన్నం సత్తయ్య గౌడ్ 3వ మెమోరియల్ అవార్డు -2024 సంవత్సరానికి గాను ప్రముఖ రచయిత కళాకారుల ఎంపికకు జ్యూరి కమిటీ సమావేశమైంది. ప్రతి సంవత్సరం పొన్నం సత్తయ్య గౌడ్ మెమోరియల్ అవార్డు ఇస్తున్న మాదిరిగానే ఈసారీ కమిటీ పలువురు రచయితలు, కళాకారుల పేర్లను పరిశీలించింది. ఫైనల్‌గా రచయితల విభాగంలో ప్రముఖ సినీగేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్, కళాకారుల విభాగంలో బలగం ఫేం కొమురమ్మ మొగిలయ్యలను అవార్డు గ్రహీతలుగా ఎంపిక చేశారు. ఎంపిక చేసిన పేర్లతో కూడిన పత్రాన్ని కమిటీ సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అందజేశారు. అవార్డు గ్రహీతలకు ఒక్కొక్కరికి రూ.51 వేల నగదు, మెమోంటోతో సత్కరించనున్నట్టు కమిటీ కన్వీనర్ పొన్నం రవిచంద్ర తెలిపారు. ఇందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు.గతంలో పొన్నం సత్తయ్య మెమోరియల్ అవార్డులో ప్రథమ సంవత్సరంలో రచయిత విభాగంలో నాళేశ్వరం శంకర్, కళాకారుల విభాగంలో ఒగ్గు కథ ధర్మయ్యలు ,ద్వితీయ సంవత్సరం రచయిత విభాగంలో నెలిమాల భాస్కర్ ,కళాకారుల విభాగంలో ప్రముఖ గాయని విమలక్క ఈ అవార్డులను అందుకున్నారు. ఈనెల 13 న పొన్నం సత్తయ్య గౌడ్ 13వ వర్ధంతి సందర్భంగా రవీంద్ర భారతిలో సాయంత్రం 6 గంటలకు అవార్డు గ్రహీతలకు అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, విశిష్ట అతిథులుగా ఎక్సైజ్ అండ్ సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నారు. కార్యక్రమంలో రచయితలు కళాకారులు ,మేధావులు పాల్గొననున్నారు. జ్యూరి కమిటీ కన్వీనర్ పొన్నం రవిచంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీ సభ్యులు సీనియర్ పాత్రికేయులు, మాజీ కేంద్ర సమాచార శాఖ కమిషనర్ మాడ భూషి శ్రీధర్, ప్రముఖ సీనియర్ జర్నలిస్టు దిలీప్ రెడ్డి , తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ , రచయిత్రి ఐనంపూడి శ్రీ లక్ష్మీ పాల్గొన్నారు.

సీఎంకు, ప్రభుత్వానికి ధన్యవాదాలు

- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీ కమిషన్ చైర్మెన్‌కు, సభ్యులకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అభినందనలు తెలిపారు. మంగళవారం బీసీ కమీషన్ కార్యాలయంలో పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. భువనగిరి నుంచి ఇద్దరు సభ్యులను నియమించడం పట్ల ఆయన సీఎం రేవంత్ రెడ్డికి, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోండి

(మొదటిపేజీ తరువాయి)

వినిపించిన నేపథ్యంలో హైకోర్టు, పైవిధమైన తీర్పును వెలువరించింది. హైకోర్టు కూడా నేరుగా స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేయకుండానే పిటిషనర్ల అభ్యర్థనను ఆమోదించింది. అసెంబ్లీ కార్యదర్శికి ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం తీర్పు వెలువరించారు. స్పీకర్ నిర్ణయం తీసుకోకుండా కాలం వెళ్లబుచ్చుతుంటే, కోర్టులు చూస్తూ కూర్చోబోవనీ, ఐదేండ్ల పదవీ కాలం ముగిసే వరకు స్పీకర్ నిర్ణయం తీసుకోని పక్షంలో ప్రజాస్వామ్యానికి విలువ ఏముంటుందనే సందేహాన్ని న్యాయమూర్తి లేవనెత్తారు. కేశమ్ మెఘాచంద్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఇలాంటి విషయంలో కాలయాపనకు ఆస్కారం ఇవ్వకూడదని చెప్పారు. అందుకే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై విచారణకు స్పీకర్ కార్యదర్శి షెడ్యూల్‌ను ప్రకటించాలని ఆదేశించారు. శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరపున ఎన్నికై కాంగ్రెస్ పార్టీలో చేరిన కడియం శ్రీహరి (స్టేషన్‌ఘన్‌పూర్), దానం నాగేందర్ (ఖైరతాబాద్), తెల్లం వెంకట్రావు (భద్రాచలం)లపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కెపి వివేకానంద ఏప్రిల్ 24న పిటిషన్లు దాఖలు చేశారు. దానంపై అనర్హత వేటు వేయాలంటూ బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి మరొకరు వేర్వేరుగా రెండు వ్యాజ్యాలను దాఖలు చేశారు. వీటిపై హైకోర్టు సుదీర్ఘంగా లోతుగా విచారణ జరిపింది. గత నెల 10న తీర్పును రిజర్వు చేసి ఇప్పుడు కీలకమైన తుది ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వ్యవహారాన్ని ఇంతటితో ముగించకుండా స్పీకర్ కార్యాలయం తగిన విచారణ షెడ్యూల్ ప్రకటించని పక్షంలో తిరిగి విచారణ చేస్తామని చెప్పింది. పిటిషన్లపై విచారణను మూసేస్తున్నట్టుగా ప్రకటించింది.





మూడు నెలల్లో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి : పిటిషనర్లు

'పదో షెడ్యూల్‌ను ఉల్లంఘించిన వ్యక్తులను అనర్హులుగా ప్రకటించాలనే రాజ్యాంగ లక్ష్యానికి కట్టుబడి ఉండాలంటే, ఫిర్యాదు చేసిన తేదీ నుంచి మూడు నెలల వ్యవధిలో స్పీకర్ ముందు దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై తుది నిర్ణయాన్ని వెలువరించాలి. లోక్‌సభ, అసెంబ్లీల కాల పరిమితి ఐదేండ్లు మాత్రమే. కాలపరిమితి అయ్యే వరకు పార్టీ ఫిరాయింపుల పిటిషన్లపై నిర్ణయం తీసుకోకుండా పెండింగ్‌లో ఉంచడం రాజ్యాంగ స్ఫూర్తిని నీరుగార్చమే. కాలయాపన చేయకుండా తగిన సమయంలో తుది నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు గతంలో తీర్పు వెలువరించింది. మెజారిటీ ఉన్న పార్టీ తరపు వ్యక్తి స్పీకర్ అవుతారు. అధికార పార్టీకి వ్యతిరేకంగా స్పీకర్ నిర్ణయం తీసుకోకుండా పదవీ కాలం ముగిసే ఐదేండ్ల వరకు పెండింగ్‌లో ఉంచడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. కైశమ్ మేఘచంద్ర సింగ్ వర్సెస్ స్పీకర్ ఆఫ్ మణిపూర్ కేసులో స్పీకర్ రాజకీయ విధేయత కారణంగా పక్షపాత వైఖరిని సుప్రీంకోర్టు ఎత్తిచూపింది. ఆ విధంగా చేయడం ప్రజాస్వామ్యానికి ముప్పుఅని ఆందోళన వ్యక్తం చేసింది. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని ఒక పార్టీ నుంచి ఎన్నికవుతున్న స్పీకర్ వద్ద ఉంచాలా.. వద్దా.. అనేది పార్లమెంట్ పునరాలోచన చేయాల్సిన అవసరం కూడా ఉంది. ఈ మేరకు సుప్రీంకోర్టు సూచన చేసింది. అసెంబ్లీ కార్యదర్శి కూడా పబ్లిక్ సర్వెంటే. స్పీకర్‌పై అందరికీ గౌరవం ఉంది. కానీ, రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే ఆయన నిర్ణయం తీసుకోవడం లేదని భావిస్తున్నాం. రాజ్యాంగ బద్ధ పదవిలో కూర్చొని రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గడం సబబు కాదు. జిల్లా కోర్టులకు కూడా విచారణ ఇన్ని రోజుల్లో పూర్తి చేయాలని గడువు పెడుతున్నారు. స్పీకర్ హోదాలో పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై నిర్ణయం తీసుకోరు. ట్రిబునల్ చైర్మెన్ హోదాలో స్పీకర్ తీర్పు చెబుతారు. కాబట్టి స్పీకర్ హోదాలోని వ్యవహారంగా పరిగణించడకుండా ట్రిబ్యునల్ చైర్మెన్ హోదాలో స్పీకర్ కార్యదర్శికి ఉత్తర్వులు ఇవ్వాలి. ఇలా చేసే అధికారం రాజ్యాంగ ధర్మాసనాలైన సుప్రీంకోర్టు/హైకోర్టులకు ఉంది. ఉంటుంది.'అని పిటిషనర్ల తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఆర్యామ సుందరం, సీనియర్ న్యాయవాదులు గండ్ర మోహన్‌రావు, జె.రామచందర్‌రావు వాదించారు.

స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వడానికి వీల్లేదు : ప్రభుత్వం

సుప్రీంకోర్టు వేర్వేరు తీర్పుల ప్రకారం స్పీకర్‌కు కోర్టులు ఉత్తర్వులు జారీ చేసే అధికారం లేదని అడ్వకేట్ జనరల్ ఎ సుదర్శన్‌రెడ్డి వాదించారు. స్పీకర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన పది రోజులకే హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారన్నారు. స్పీకర్‌కు కనీస గడువు కూడా ఇవ్వకుండానే న్యాయ సమీక్ష కోరడం చెల్లదన్నారు. తన వద్దకు వచ్చిన ఫిర్యాదులపై నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ రాజ్యాంగం స్పీకర్‌కు ఇచ్చిందన్నారు. రిట్ పిటిషన్లు దాఖలు చేయడంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలది తొందరపాటు చర్యగా పేర్కొన్నారు బీఆర్‌ఎస్ హయాంలో వేసిన అనేక అనర్హత పిటిషన్లను అప్పటి స్పీకర్ పరిష్కరించలేదని గుర్తు చేశారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు కేసులో పిటిషన్ చెల్లదని ఇదే కోర్టు గతంలో చెప్పిందని తెలిపారు. బీఆర్‌ఎస్ పిటిషన్లను కొట్టేయాలని కోరారు. ఇదే తరహా వాదనలను దానం, కడియం తరపున సీనియర్ న్యాయవాదులు శ్రీరఘురాం, మయూర్‌రెడ్డి చేశారు. న్యాయ శాఖ తరపున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌కు కోర్టులు నోటీసులు జారీ చేయడానికి వీల్లేదని, స్పీకర్ నిర్ణయం తీసుకున్నాక దానిపై న్యాయ సమీక్షకు వీలుందని వాదించారు. దానం, కడియం తరపున సీనియర్ న్యాయవాదులు శ్రీరఘురాం, మయూర్‌రెడ్డి, శ్రీరఘురాం, జంధ్యాల రవిశంకర్ వాదించారు. పార్టీ ఫిరాయింపుల కేసులో హైకోర్టు తీర్పుపై రాజకీయ పార్టీల్లో ఉత్కంఠ నెలకొంది.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల మార్గదర్శకాలు ఎందుకు ఇవ్వలేదు?

ఎంబీబీఎస్, బీడీఎస్ డిగ్రీ, మెడికల్ పీజీ కోర్సుల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కల్పనకు మార్గదర్శకాల జారీ ఎందుకు చేయలేదో చెప్పాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు వివరణ కోరింది. 2024-25 విద్యా సంవత్సరానికి మెడికల్ డిగ్రీ, పీజీ కోర్సుల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కల్పనకు మార్గదర్శకాలను జారీ చేయాలని కాళోజీ వర్సిటీ రాసిన లేఖలకు స్పందన లేకపోవడంతో బీజేపీ ఎమ్మెల్యే కెవి రమణారెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీనిని చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే బెంచ్ సోమవారం విచారించి ప్రతివాదులైన కేంద్ర, రాష్ట్ర వైద్య ఆరోగ్య, విద్యా శాఖలకు ఇతరులకు నోటీసులు ఇచ్చింది. విచారణను ఈనెల 18కి వాయిదా వేసింది. వర్సిటీ రాసిన లేఖలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివరణ లేదనీ, అడ్మిషన్లు జరిగిపోతున్నాయని పిటిషనర్ వాదన.

'దిశ' కేసుల వివరాలివ్వండి

దిశ నిందితుల ఎన్‌కౌంటర్ ఘటన తర్వాత కేంద్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ సిర్పూర్కర్ కమిషన్ ఇచ్చిన నివేదికను సవాలు చేసిన కేసుల వివరాలను అందజేయాలని పోలీసులకు హైకోర్టు ఆదేశించింది. దిశ ఎన్‌కౌంటర్ కేసు విచారణను సీబీఐకి ఇవ్వాలంటూ పిల్, ఇతర పిటిషన్లను చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే బెంచ్ సోమవారం విచారించింది. దిశకు చెందిన ఇతర కేసుల వివరాలన్నీ పరిశీలించి విచారణ చేస్తామని ప్రకటించింది. విచారణను ఈనెల 30కి వాయిదా వేసింది.

రాంకీతో జీహెచ్‌ఎంసీ ఒప్పందాన్ని రద్దు చేయాలి

బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్ డంప్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ
- జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా



నవతెలంగాణ-హిమాయత్ నగర్

గ్రేటర్ హైదరాబాద్‌లో బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్ (మట్టి) సేకరించి డంప్ చేస్తున్న వాహనాల నుంచి సెప్టెంబర్ 1వ తేదీ నుంచి రాంకీ వసూలు చేస్తున్న అదనపు చార్జీలను ఉపసంహరించుకోవాలి.. రాంకీతో జీహెచ్‌ఎంసీ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ డిమాండ్ చేసింది. ఆ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షులు జె.కుమారస్వామి మాట్లాడుతూ.. నగరంలో బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్ (మట్టి) సేకరించి తరలిస్తున్న టిప్పర్లు, ట్రాక్టర్లు సుమారు 200 ఉన్నాయని చెప్పారు. ఆ వాహన కార్మికులు జీహెచ్‌ఎంసీ చూపించిన డంపింగ్ స్థలాల్లోనే వేస్ట్ మెటీరియల్‌ను డంప్ చేస్తారని తెలిపారు. డంప్ చేసినందుకు మొదట్లో వాహనం నుంచి జీహెచ్‌ఎంసీ రూ.100 వసూలు చేశారని, జీహెచ్‌ఎంసీకి రాంకీతో ఒప్పందం జరిగిన తర్వాత దాన్ని రూ.350కు పెంచారని, 2024 ఆగస్టు 31వ తేదీ వరకు ఇది కొనసాగిందని చెప్పారు. అయితే, రాంకీ సంస్థ అకస్మాతుగా 2024 సెప్టెంబర్ నుంచి వాహనం లెక్క కాకుండా టన్నుకు రూ.409 నిర్ణయం చేసిందన్నారు. ఒక వాహనంలో 3 టన్నుల మట్టి పడుతుందని, రాంకీ చేసిన నిర్ణయం వల్ల ఒక ట్రిప్పుకు రూ.1,227 కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వాహనాల యజమానులు, డ్రైవర్లు వినియోగదారుల నుంచి ఒక ట్రిప్పునకు కేవలం రూ.1,200 నుంచి రూ.1,400 వరకు వసూలు చేస్తున్నారని, వచ్చిన డబ్బులన్నీ రాంకీ సంస్థకు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. మొత్తం రాంకీ సంస్థకు కడితే కార్మికుల కుటుంబాలు ఎలా బతకాలని ప్రశ్నించారు.

సహాయ కార్యదర్శి జి.రాములు మాట్లాడుతూ.. ఒక వాహనంపై ఓనర్ కం, డ్రైవర్, క్లీనర్ ముగ్గురు కార్మికులు జీవనోపాధి పొందుతున్నారని, రాంకీ నిర్ణయం వల్ల వీరి భవిష్యత్ అంధకారంలో పడిందని అన్నారు. ఇప్పటికే డీజిల్ చార్జీలు, వాహనం మెయింటెనెన్స్, నిత్యావసర సరుకుల ధరలతో కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. నగర అభివృద్ధికి తోడ్పడుతున్న ఈ కార్మికులకు ప్రభుత్వం తోడ్పాటు అందించాల్సింది పోయి, అదనపు చార్జీలు వసూలు చేయడం అన్యాయమన్నారు. రాంకీ సంస్థ వసూలు చేస్తున్న అదనపు చార్జీలను వెంటనే రద్దు చేయాలని, గతంలో జీహెచ్‌ఎంసీ వసూలు చేసిన విధంగా ఒక ట్రిప్పునకు రూ.100 మాత్రమే వసూలు చేయాలని కోరారు. రాంకీతో జీహెచ్‌ఎంసీ కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని, కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం డంప్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆమె సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర నాయకులు ఎం.దశరథ్, ఎం.మహేందర్, టిప్పర్, లారీ, ట్రాక్టర్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.సోమయ్య, నాయకులు బాలయ్య, లక్ష్మణ్, రమేష్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- కేంద్రం రూ.10 వేల కోట్ల సహాయం విడుదల చేయాలి
- సెప్టెంబర్ 17ను అధికారికంగా జరపాలి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. రాష్ట్రానికి వరద సహాయం రూ.10 వేల కోట్లు విడుదల చేయాలని కోరారు. వరద బాధితులకు సహాయం అందించడంలో ఆంధ్రప్రదేశ్‌ను ఒక రకంగా, తెలంగాణను ఇంకో రకంగా చూడటం సరైంది కాదన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ, జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస్, ఎన్ బాలమల్లేష్, కార్యదర్శివర్గ సభ్యులు ఎం బాలనర్సింహా, హేమంత్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. వరద బాధితులకు నష్ట పరిహారాన్ని పాత పద్ధతిలో కాకుండా శాస్త్రీయంగా లెక్కించాలని కోరారు. రాష్ట్రంలోని పలు జిల్లాల ప్రజలు భారీ వర్షాలు, వరదలతో సర్వం కోల్పోయి తీవ్ర ఆవేదనలో ఉన్నారని చెప్పారు. విపత్తుకు సంబంధించి గతంలో యుటిలైజేషన్ సర్టిఫికెట్ (యూసీ) సమర్పిస్తేనే కొత్తగా నిధులను విడుదల చేస్తామని మాట్లాడ్డం సరైంది కాదన్నారు. ఈ సమయంలో రాజకీయం చేస్తారా? మానవత్వంతో సహాయం చేస్తారా?అని ప్రశ్నించారు. తన ఒక నెల వేతనం రూ.2.50 లక్షలను ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేయనున్నట్టు ప్రకటించారు.

అణచివేస్తే బంగ్లాదేశ్, శ్రీలంక పరిణామాలే

ఎన్‌కౌంటర్ల పేరుతో మావోయిస్టులను రాక్షసంగా కాల్చి చంపుతూ కేంద్ర ప్రభుత్వం ఆటవిక యుద్ధానికి తెర లేపిందని కూనంనేని సాంబశివరావు విమర్శించారు. 2026 నాటికి మావోయిస్టుల్లేకుండా చేస్తామంటూ హోంమంత్రి అమిత్ షా ప్రకటించారని గుర్తు చేశారు. హింసను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటు చేసిన న్యాయ చట్టాలు ఉన్నాయనీ, ఎవరు తప్పుచేసినా వారిని పట్టుకుని ఈ చట్టాల ప్రకారం శిక్షించాలే తప్ప చంపే అధికారం ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. వారిని చంపుతారు తప్ప వారి భావజాలాన్ని చంపలేరని చెప్పారు. మావోయిస్టులు తప్పులు చేసినా తాము సమర్థించబోమని అన్నారు. కోవర్టు పేరుతో ఇటీవల రాధ అనే అమ్మాయిని మావోయిస్టులు చంపడం సరైంది కాదన్నారు. అణచివేత, రాజ్యహింస కొనసాగితే తిరుగుబాటు తప్పదనీ, శ్రీలంక, బంగ్లాదేశ్ పరిణామాలే ఇక్కడ ఉత్పన్నమవుతాయని హెచ్చరించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తరహాలో సీఎం రేవంత్‌రెడ్డి మావోయిస్టులతో చర్చలు జరపాలని కోరారు.

తెలంగాణ విలీనమే...

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. మహారాష్ట్ర, కర్నాటకలో ఈ ఉత్సవాలను అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహిస్తున్నాయని గుర్తు చేశారు. నిరంకుశ నిజాం రాజుకు వ్యతిరేకంగా హిందువులు, ముస్లిములు వీరోచితంగా పోరాడారని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ విలీనమైన సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ చారిత్రాత్మక పోరాటంలో కమ్యూనిస్టుల త్యాగాలు, అమరులకు సంబంధించిన చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని సూచించారు. ముస్లిం రాజుకు వ్యతిరేకంగా హిందువులు పోరాటం చేశారంటూ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు చరిత్రను వక్రీకరించొద్దని కోరారు. ఈనెల 11 నుంచి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఈనెల 21న ముగింపు ఉత్సవాలను హైదరాబాద్‌లో నిర్వహిస్తామనీ, హరగోపాల్ హాజరవుతారని అన్నారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్ విగ్రహాలను నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు.

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. అనర్హతపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలంటూ స్పీకర్ కార్యాలయాన్ని హైకోర్టు ఆదేశించడాన్ని స్వాగతించారు. ఇటీవల వియత్నాం పర్యటనకు వెళ్లి వచ్చిన చాడ వెంకట్‌రెడ్డి అక్కడి నుంచి హోచిమిన్ మోమెంటోను కూనంనేనికి అందజేశారు.

జితేంద్ర చౌదరిపై దాడి అమానుషం

- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ్ మంచ్ (ఆరం) జాతీయ చైర్మెన్, త్రిపుర ప్రతి పక్ష నేత జితేంద్ర చౌదరి ఇంటిపై ఆ రాష్ట్ర బీజేపీ, విశ్వ హిందూ పరిషత్ నాయకులు దాడి చేయటం అమానుషమని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మిడియం బాబురావు(మాజీ ఎంపీ), ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ గిరిజన వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నదని విమర్శించారు.

ఉదారంగా నిధులిచ్చి ఆదుకోండి

(మొదటిపేజీ తరువాయి)

కార్పొరేషన్ల మేయర్లు, మున్సిపాల్టీల చైర్మెన్‌లతో ముందుగా భేటీ అయిన ఈ బృందం, అనంతరం గ్రామ పంచాయతీల మాజీ సర్పంచులు, జడ్పీటీసీలు, ఎంపీపీలతో సమావేశమైంది. రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మెన్ సిరిసిల్ల రాజయ్యతోపాటు ఆ సంఘం సభ్యులు కడూఆ పరగారియా బృందంలో సమాలోచనలు జరిపింది. వ్యాపార, వాణిజ్య సంస్థలైన అలీఫ్, ఫిక్కీ, సీఐఐ ప్రతినిధులు కూడా 16వ ఆర్థిక సంఘంతో సమావేశమయ్యారు. రాజకీయ పార్టీల తరపున కాంగ్రెస్ నుంచి సిరిసిల్ల రాజయ్య టి.రామ్మోహన్‌రెడ్డి, సీపీఐ (ఎం) నుంచి సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, బీజేపీ నుంచి ఈటల రాజేందర్, కాసం వెంకటేశ్వర్లు, ప్రకాశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కేపీ వివేకానంద, ఎంఐఎం నుంచి ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఓవైసీ, సయ్యద్ అమీన్ జాఫ్రీ, బలాల, సామా భూపాల్ రెడ్డి, ఎస్ దుర్గాప్రసాద్ (టీడీపీ), జనత్ కుమార్, ఈశ్వర్ (బీఎస్పీ), డి.సుధాకర్ (ఆప్) తదితరులు హాజరయ్యారు.

జీఎస్టీ లోటును భర్తీ చేయాలి : సీపీఐ (ఎం)

పదహారో ఆర్థిక సంఘానికి సీపీఐ (ఎం) పలు సూచనలు చేసింది. కేంద్ర పన్నుల రాబడిలో రాష్ట్రాలకు తక్కువ శాతం కేటాయింపులు చేస్తున్నారరనీ, దీనివల్ల రాష్ట్రాలు ఎఫ్‌ఆర్‌బీఎమ్ పరిధి దాటి అప్పులు చేయాల్సి వస్తోందని పేర్కొంది. దీంతో అవి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని తెలిపింది. పదహారో ఆర్థిక సంఘం కేంద్ర పన్నుల వాటాలో రాష్ట్రాలకు 50 శాతం కంటే తగ్గకుండా నిధులివ్వాలని విజ్ఞప్తి చేసింది. తెలంగాణకు కేంద్ర పన్నుల రాబడిలో 3.5 శాతాన్ని కేటాయించాలని కోరింది. విద్యా సెస్, రోడ్ సెస్ అంటూ కేంద్రం రాష్ట్రాలపై అదనపు పన్నులు విధిస్తోంది.. వీటిని రద్దు చేయాలని



సూచించింది. ఒకవేళ తప్పనిసరిగా విధించాలనుకుంటే అందులో విధిగా రాష్ట్రాలకు 50 శాతం వాటానివ్వాలంటూ కోరింది. కేంద్ర పన్నుల విధానంలో తారతమ్యాల కారణంగా ధనికులు, పేదల మధ్య అంతరం గత పదేండ్లలో భారీగా పెరిగిందని తెలిపింది. ప్రత్యక్ష పన్నుల వాటా పెరిగేలా ఆర్థిక సంఘం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. 'జీఎస్టీ విధానాన్ని ప్రవేశపెట్టిన తర్వాత రాష్ట్రాలకు ఆదాయం గణనీయంగా తగ్గుతోంది. ఆలోటును భర్తీ చేస్తామన్న వాగ్దానాన్ని కేంద్రం నిలబెట్టుకోవటం లేదు. సమాంతర పంపకం ఆధారంగా ప్రస్తుతం రాష్ట్రాలకు 15 శాతాన్ని పంపిణీ చేస్తున్నారు. భూమి, అడవులు, పర్యావరణం, తలసరి ఆదాయం, భౌగోళిక పరిస్థితుల ఆధారంగా ఈ పంపిణీ జరుగుతోంది. ఇదే కొనసాగితే రాష్ట్రాల మధ్య తీవ్ర అసమానతలు పెరుగు తాయి. అందుకే దీన్ని 50 శాతానికి పెంచాలి. తలసరి ఆదాయం కంటే రాష్ట్రాల్లోని బీపీఎల్ కుటుంబాలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఆధారపడి ఈ పంపిణీ జరగాలి. రాష్ట్ర బడ్జెట్లలో ఆదాయం, వ్యయాల మధ్య వ్యత్యాసాన్ని సరి చేసేందుకు కేంద్రం తీసుకొచ్చిన పాలసీ విఫలమైంది. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం తెలంగాణ పట్ల వివక్షను చూపింది. స్థానిక సంస్థలకు ప్రస్తుతం కేంద్రం ఇస్తున్న కేటాయింపులు సరిపోవు. రాజ్యాంగంలో 73, 74 సవరణల ప్రకారం స్థానిక సంస్థలకు కేటాయింపులు పెంచాలి. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రాష్ట్రాలకు తక్కువ నిధులు ఇస్తున్న కేంద్రం, ఎక్కువగా చూపిస్తోంది. రాజకీయ కోణంలో రాష్ట్రాలకు కేటాయింపులు ఉండకూడదు. విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేలా కేంద్రం రాష్ట్రాలకు వెన్నుదన్నుగా నిలవాలి. రాష్ట్రాలకు ఇచ్చే గ్రాంట్ల విషయంలో కేంద్రం వివక్ష చూపుతోంది. నిటి అయోగ్ సిఫారసులను అమలు చేయాలి. తెలంగాణలో మిషన్ భగీరథకు నిధులివ్వాలంటూ నిటి అయోగ్ చెప్పినా కేంద్రం పట్టించుకోలేదు. ఇది వివక్షా పూరితమే. కాబట్టి... దేశంలో సామాన్యుల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు వీలుగా మా సూచనలు, సలహాలను స్వీకరించి నిటి అయోగ్ తన పాత్రను పోషించాలని కోరుతున్నాం...' అని సీపీఐ (ఎం) పేర్కొంది.

సెస్‌లు, సర్‌ఛార్జ్‌లు డివిజిబుల్ పూల్‌లో ఉండాలి : ఆప్

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకముందు సెస్సులు, సర్‌ఛార్జ్‌లు తక్కువగా ఉండేవని ఆప్ తెలిపింది. వాటిని అవిభాజ్య పూల్‌లో చేర్చారని పేర్కొంది. బీజేపీ అధికారంలోకి వచ్చాక సెస్‌లు, సర్‌చార్జీలను అసాధారంగా పెంచారని విమర్శించింది. ఇది వెనుక తలుపు నుండి రాష్ట్రాల డబ్బు తీసుకోవడం తప్ప మరొకటి కాదని తెలిపింది. అందువల్ల సెస్‌లు, సర్‌ఛార్జ్‌లను డివిజిబుల్ పూల్‌లో చేర్చాలని కోరింది.

జనాభా ప్రాతిపదికన అంటే తెలంగాణకు అన్యాయమే : సిరిసిల్ల రాజయ్య

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా తెలంగాణ (ఉమ్మడి రాష్ట్రం నుంచే) జనాభాను నియంత్రించిందని రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య తెలిపారు. ఈ క్రమంలో జనాభాను నియంత్రించినందుకుగాను అదనపు నిధులివ్వాల్సిం దిపోయి... 'జనాభా ప్రాతిపదికన' అంటూ తెలంగాణకు అన్యాయం చేయటం తగదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో చెప్పిన దాని ప్రకారం తెలంగాణకు నిధులివ్వాలని కోరారు. ఇక్కడి ప్రాజెక్టులకు కేంద్రం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉత్తమ ప్రతిభను కన బరిచిన రాష్ట్రాలకు ఫెర్ఫార్మెన్స్ ఆధారంగా నిధులివ్వాలని కోరారు.

రాష్ట్రాలకు ఇచ్చే వాటాను 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలి : బీఆర్‌ఎస్

కేంద్రం చెప్పేదొకటి, చేసేదొకటని బీఆర్‌ఎస్ విమర్శించింది. పన్నుల వాటాను 41 శాతానికి పెంచుతున్నామని చెప్పి, 31 శాతం నిధులనే విదుల్చుతున్నారని ఆ పార్టీ వాపోయింది. 'కేంద్రానికి వచ్చే ఆదాయంలో 20 శాతాన్ని సర్ ఛార్జీలు, సెస్సుల రూపంలో సమకూర్చుకుంటున్నారు. ఈ డబ్బును వాటాల ప్రకారం రాష్ట్రాలకు ఇవ్వడం లేదు. ఆ శాతాన్ని 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలి. గతంలో నాన్ ట్యాక్స్ రెవెన్యూ కేంద్రానికి చాలా తక్కువగా ఉండేది. 1961లో అది 171 కోట్లుగా ఉంటే, 2024-25 నాటికి రూ.5.46 లక్షల కోట్లకు పెరిగింది. అందువల్ల నాన్ టాక్ రెవెన్యూలో రాష్ట్రాలకు వాటాలివ్వాలి. బాగా పని చేస్తున్న రాష్ట్రాలకు శిక్ష వేస్తున్నారు. దేశంలోనే తలసరి ఆదాయం అత్యధికంగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. ఈ విషయంలో బాగున్నాం కాబట్టి, వాటా తక్కువ ఇస్తామనటం అన్యాయం. పదమూడో ఆర్థిక సంఘంలో రాష్ట్ర వాటాను 2.437 శాతంగా చూపారు. 14వ ఆర్థిక సంఘం నాటికి 2.133 శాతానికి తగ్గించారు. 15వ ఆర్థిక సంఘం నాటికి 2.102 శాతానికి తగ్గించి చూపారు. ఈ నేపథ్యంలో కనీసం పదహారో ఆర్థిక సంఘమైనా రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరుతున్నాం...' అని బీఆర్‌ఎస్ పేర్కొంది.

ప్రజావాణిని సద్వినియోగించుకోవాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న సూచించారు. జోనల్ కమిషనర్ వెంకన్న పర్యవేక్షణలో సోమవారం చాంద్రాయణగుట్ట నర్కిపూల్ బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో తమకు అందిన ఫిర్యాదులను సంబంధిత విభాగాలచే పరిష్కరిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శైలజ, డిప్యూటీ డైరెక్టర్ (యూ బిడి) అమీనా టీ, డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ రాజారావు, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాట్య ఉత్సవాలు



నవతెలంగాణ-ముషీరాబాద్

కళానృత్య నికేతన్ కూచిపూడి డాన్స్ అకాడమీ నాట్య ఉత్సవాలు ఉల్లాసంగా సాగాయి. ప్రతియేటా వినాయక చవితి పండుగ నేపథ్యంలో నిర్వహించే ఈ సంబరాలు లలితా నగర్ కాలనీలోని శ్రీ విజయ గణపతి ఆలయ మండపంలో రెండు రోజుల పాటు ఆద్యంతం కన్నులపండువగా జరిగిన ఉత్సవాలు సోమవారం ముగిశాయి. తొలిరోజు సీనియర్స్, రెండవ రోజు జూనియర్స్ విభాగాల్లో వివిధ రకాల నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. తాండవ నృత్యకరి, జతిస్వరం, భజమానసం, పరమాపురుషుడు, అదివో అల్లదివో సహ శ్రీరాముని సంపూర్ణ కథాసారాన్ని వివరిస్తూ సాగిన రామాయణం వంటి మొత్తం పది హేనుకు పైగా నృత్య రూపకాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కళా నృత్య నికేతన్ కూచిపూడి అకాడమీ డైరెక్టర్ బిందు అభినయ్, నాట్య గురువు కీర్తనల నేతృత్వంలో సాగిన రెండు రోజుల ప్రదర్శనల అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు, విజయ గణపతి ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రదానం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం మనం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చక్రవర్తి, నిజాం కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. భవాని శంకర్, తెలుగు తమిళ కథ నాయకుడు డాక్టర్ ఏ. కిరణ్ కుమార్ ఇతర సాహితీ వేతల చేతుల మీదుగా కేశవ్ మెమోరియల్ హైస్కూల్ హిమాయత్ నగర్ హైదరాబాద్‌కు చెందిన ఉపాధ్యాయుడు సందీప్ ఉత్తమ ఉపాధ్యాయుడు పురస్కారం, హేమలత ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి ఎం. సంజయ్ సింగ్ నాయక్ తన కవితను చదివి వినిపించారు. అనంతరం అతిథుల చేతుల మీదగా ధ్రువపత్రం మెమొంటోతో సత్కరించారు.

దేవాలయాల అభ్యున్నతికి అభిషేక్ సక్సేన కృషి అభినందనీయం..

- కార్పొరేటర్ సున్నం రాజమోహన్



నవతెలంగాణ-ధూల్‌పేట్

దేవాలయాల అభ్యున్నతికి అభిషేక్ సక్సేన కృషి అభినందనీయమని పురానపూల్ కార్పొరేటర్ సున్నం రాజమోహన్ అన్నారు. పురానపూల్ గజ్జల పాపమ్మ దేవాలయ మాజీ చైర్మెన్ అభిషేక్ రాజ్ సక్సేనా జన్మదిన వేడుకలు సోమవారం పురానపూల్‌లో ఘనంగా నిర్వహించారు. పురానపూల్ మజ్లిస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మజ్లీస్ పార్టీ సీనియర్ నాయకులు బోటి రాజు కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలుతో కలిసి పాల్గొని కేక్ కట్ చేసి, ఘనంగా సన్మానించి పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతబస్తీలోని పురానపూల్ డివిజన్‌లో పలు దేవాలయాల అభ్యున్నతికి అభిషేక్ సక్సేన ఎంతగానో కృషి చేశారని ఆయన కొనియాడారు. బోనాలు గణేష్ ఉత్సవాలు విజయవంతంగా జరిగేందుకు అభిషేక్ రాజ్ సక్సేన చేసిన సేవలు వెలకట్టలేని ముందు ముందు మరిన్ని కార్యక్రమాలు ఆయన చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మజ్లీస్ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులతో పాటు వివిధ వినాయక మండపాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాసర ట్రిబుల్ ఐటీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షులు మాసంపల్లి అరుణ్ కుమార్



నవతెలంగాణ-అంబర్‌పేట

బాసర ట్రిబుల్ ఐటీ విద్యార్థుల సమస్యలపై పరిష్కరించాలని తెలంగాణ కౌన్సిల్ హైయర్ ఎడ్యుకేషన్ చైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రికి సోమవారం వినతి పత్రాన్ని తెలంగాణ విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షులు మాసంపల్లి అరుణ్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే శాశ్వత వైస్ ఛాన్సలర్ డైరెక్టర్స్‌ని నియమించాలని ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే చెల్లించాలని పర్మినెంట్ స్టాఫ్ అపాయింమెంట్స్ (టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని విద్యార్థుల ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని లైబ్రరీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఒక కమిటీ వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలోతు రవి కుమార్, రాష్ట్ర నాయకులు డప్పు గోపి, జగిత్యాల జిల్లా అధ్యక్షులు దిలీప్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎటేలి శేఖర్ యాదవ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కమిషన్ చైర్మెన్, కార్యవర్గానికి శుభాకాంక్షలు

- తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ



నవతెలంగాణ-ముషీరాబాద్

బీసీ కమిషన్ చైర్మెన్ కార్యవర్గానికి తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ నాయకులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా బీసీ కమిషన్ చైర్మెన్‌గా నిరంజన్, సభ్యులు బాల లక్ష్మి గౌడ్, రాయపోలు జయప్రకాష్, సురేందర్‌లను ఇటీవల నియమించడం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మెన్ బాలగోని బాలరాజు గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ యెలికట్టె విజయ్ కుమార్ గౌడ్, మణి మంజరి బీసీ కమిషన్ అధికార కార్యాలయంలో పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కమిషన్ చట్ట బద్ధత కలిగి తెలంగాణలో 2 కోట్ల బీసీ జనాభా కలిగి 56 శాతం ఉన్నటువంటి ప్రజల విద్య, ఉద్యోగ, రాజకీయ, సాంఘిక రంగాలలో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ ఉండాల్సిన అవసరం ఉంది దాని ప్రకారం నివేదికలు ప్రభుత్వానికి నివేదించి రేపు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్‌తో ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఇప్పుడు ఉన్న ప్రభుత్వం తమ ఎన్నికల సందర్భంగా వాగ్దానం చేసి పార్టీ మేనిఫెస్టోలో కూడా పెట్టిందని కమిషన్ కి విన్నవించారు.

వైద్య రంగంలో ఇతర రాష్ట్రాలకు

తెలంగాణ ఆదర్శం

కాళోజీ జయంతి వేడుకల్లో నిమ్స్ డైరెక్టర్ నగరి భీరప్ప



నవతెలంగాణ-సిటీబ్యూరో

స్వయం పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెంది, వైద్య రంగంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని పంజాగుట్ట నిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ నగరి భీరప్ప అన్నారు. కాళోజీ జయంతిని హాస్పిటల్ మొదటి అంతస్తులోని లర్నింగ్ సెంటర్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భీరప్ప కాళోజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పేదలందరికీ ఆరోగ్య శ్రీలో మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ రిజిస్టర్ డాక్టర్ శాంతివీర్, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యగౌడ్, తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజ్ కుమార్, శ్రీనివాస్ రావు, లైజనింగ్ ఆఫీసర్ మార్త రమేష్, రాధికా, తదితరులు పాల్గొన్నారు.

'కాళోజీని యువత ఆదర్శంగా తీసుకోవాలి'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

తెలంగాణలో భాష సాహిత్య రంగంలో ఎనలేని కృషి చేసిన ప్రత్యేకించి తెలుగు భాషాభివృద్ధి కోసం పాటు పడిన ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, ప్రజాకవి, తెలుగు రచయిత, పద్మ విభూషణ్ డాక్టర్ కాళోజీ నారాయణరావును నేటి యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని తెలుగు భాషాభివృద్ధికి పాటు పడాలని తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ అన్నారు. తెలంగాణ భాషా దినోత్సవం పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగు భాష సీనియర్ ఉపాధ్యాయురాలు ఠాకూర్ అనితా దేవికి 'తెలుగు భాషా శిరోమణి' అవార్డు-2024, జ్ఞాపికను అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనితా దేవి మాతృభాష హిందీ అయినా తెలుగు భాష పట్ల ఎనలేని కృషి చేసి ఉపాధ్యాయురాలిగా సేవలందిస్తున్నందుకు ఉర్దూ మీడియం పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా ఉండి తెలుగు భాష పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించినందుకు ఈ అవార్డు ప్రకటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్ అలాం బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మమ్మద్ ముజీముద్దీన్, సంఘ సేవకులు డాక్టర్ గణేష్ సింగ్, ఉపాధ్యాయులు సాహెరా అంజుమ్, షమీం సుల్తానా, ఎం.అమీనా, సయ్యద్ అస్రా తదితరులు పాల్గొన్నారు.

నగరంలో డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తాం

- హైదరాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు కృషి చేస్తానని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. రెండోసారి సీపీగా బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. సీపీ కార్యాలయంలో ప్రస్తుత సీపీ శ్రీనివాస రెడ్డి నుంచి ఛార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరా బాద్‌లో లా అండ్ ఆర్డర్‌ను మరింత మెరుగుపరుస్తామన్నారు. ఫ్రెండ్లీ పోలీసిం గ్ అనేది పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఒక భాగం అని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉంటుందని, నేరస్తులతో స్ట్రాంగ్ పోలీసింగ్ ఉంటుందని సీపీ హెచ్చరించారు. వినాయక నిమజ్జనం చాలా కీలక మైన అంశం అని, నిమజ్జన ఘట్టం ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుం టామని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసు ఫైల్‌ను తాను ఇంకా చూడ లేదన్నారు. ఒకసారి సమీక్ష నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య ను కూడా పరిష్కరిస్తామన్నారు. హత్యలు, అత్యాచారాలు, లా అండ్ ఆర్డర్‌పై కఠినంగా వ్యవహరిస్తామని సీపీ స్పష్టం చేశారు.



రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించిన గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోష్ గుప్తా తదితరులు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు పటిష్టమైన చర్యలు

- ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు. సోమవారం గాంధీనగర్ డివిజన్‌లోని కృపారావు లేన్ నుండి గౌతమి స్కూల్ మీదుగా రూ.21 లక్షల వ్యయంతో నూతన సేవరేజి పైప్ లైన్ పనులను కార్పొరేటర్ పావని వినయ్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల్లో పాల్గొనడం సంతోషకరంగా ఉందన్నారు. గాంధీ నగర్‌లో స్థానికులు చాలా ఏండ్లుగా ఎదుర్కొంటున్న డ్రయినేజీ సమస్యను శాశ్వత పరిష్కారానికి ప్రతిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ మాట్లాడుతూ డ్రయినేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి గతంలో జలమండలి ఎండి సుదర్శన్ రెడ్డికి పలుమార్లు కలిసి వినతి పత్రాలు అందజేశామని ఇటీవల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, గాంధీ నగర్ డివిజన్ ప్రెసిడెంట్ రాకేష్ కుమార్, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, వాటర్ వర్క్స్ డిజిఎం కార్తీక్ రెడ్డి, మేనేజర్లు శ్రీధర్, కృష్ణమోహన్, బీజేపీ సీనియర్ నాయకులు శ్రీకాంత్, వీఎస్‌టీ రాజు, ఉమేష్, రాజయ్య ప్రకాష్ యాదవ్, నర్సింహ, సాయి కుమార్, ఆనంద్ రావు, సత్యం ధోనేటి, జ్ఞానేశ్వర్, లక్ష్మి నారాయణ, నీరజ్, సంధ్యా రాణి, సంయుక్త రాణి తదితరులు పాల్గొన్నారు.

'ఆత్మవిశ్వాసమే విజయానికి తొలిమెట్టు'

ఆల్ఫా సర్కిల్ లోగోను ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఏ రంగంలోనైనా విజయాన్ని అందిపుచ్చు కోవాలంటే, ఆత్మ విశ్వాసమే తొలిమెట్టు అని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. నారాయణగూడ ప్రాంతానికి చెందిన మడి పడిగె రాజు నేతృత్వంలో ఏర్పడిన ఆల్ఫా సర్కిల్ సంస్థ లోగోను సోమవారం మంత్రి చాంబర్ లో శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాజిటివ్ థింకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్ షిప్ స్కిల్స్ ను మెరుగుపరుచుకుంటూ, ఆత్మ విశ్వాసంతో ఏ రంగంలో అడుగులు వేసిన విజయాలు వరి స్తాయన్నారు. ఆల్ఫా సర్కిల్ ఆధ్వర్యంలో వ్యాపా రులను ప్రోత్సహించేలా మడిపడిగె రాజు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక టెక్నాలజీని వినియోగించుకుని, మెరుగైన సేవలు అందించినప్పుడే వ్యాపార రంగంలో రాణించగలుగుతారని ఆయన సూచించారు. ఫలక్ నూమా ప్యాలెస్‌లో ఈ నెల 27న శుక్రవారం సాయం త్రం 6 గంటలకు ఆల్ఫా సర్కిల్ సంస్థ ఆవిర్భా వ దినోత్స వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు మడిపడిగె రాజు తెలి పారు. తమ సంస్థలో రూ.200 కోట్లకు పైగా టర్నోవర్ చేస్తున్న వ్యాపారులు మాత్రమే సభ్యు లుగా ఉంటారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో ఫలబట్ల ఆనంద్, పుల్లూరు శ్రీకాంత్, విఫిన్ నాయర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు 12శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



- సేవాలాల్ సేన తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవ్ నాయక్

నవతెలంగాణ-ముషీరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వ గిరిజనులకు ఇచ్చిన హామీ మేరకు గిరిజనులకు 12శాతం రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలని సేవాలాల్ సేన తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవ్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సేవాలాల్ సేన రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో సేవాలాల్ సేన 10 ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంజీవ్ నాయక్ సేవాలాల్ సేన జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. సేవాలాల్ సేన గత 10 సం.గా లంబాడి సంక్షేమ లక్ష్యంగా ముందుకుసాగుతుందన్నారు. గత 10 సంవత్సరాల్లో తండాలను ప్రత్యేక పంచాయతీలుగా సాధించడం జరిగిందన్నారు. ఇంక అనేక సమస్యలు పరిష్కరించుకున్నామమని తెలిపారు. ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని, గిరిజన ఔత్సహిక పారిశ్రామ వేత్తలకు పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు బానోత్ హుస్సేన్ నాయక్, రాజేశ్ నాయ క్, కొర్ర శ్రీను నాయక్, భాస్కర్ నాయక్, గ్రేటర్ అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్, హెూభ నాయక్, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ కవి కాళోజీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని జల మండలిలో ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్ర మానికి ఎండీ అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాళోజి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం గర్వించదగ్గ కవుల్లో కాళోజీ ఒకరని అన్నారు. సాహితీ రంగంలో ఆయన చేసిన కృషి మరువలేనిదని చెప్పారు. తన రచనలతో సమా జాన్ని చైతన్యపరిచారని కొనియాడారు. తాను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా ఉన్నప్పుడు కాళోజీ 90వ దశకంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు గురించి విద్యార్థుల కు అవగాహన కల్పించేవారని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఈడీ మయాంక్ మిట్టల్, ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, పర్సనల్ డైరెక్టర్ సుదర్శన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం జలమండలి ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో ఉద్యోగులు ప్రతిష్ఠించిన గణపతికి ఎండీ అశోక్ రెడ్డి పూజలు నిర్వహించారు.

'ఎమర్జెన్సీ' సినిమాను నిషేధించాలి'

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం ఫ్రంట్ డిమాండ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

సిక్కుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్న 'ఎమర్జెన్సీ' సినిమాను వెంటనే నిషేధించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం ఫ్రంట్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫ్రంట్ చైర్మెన్ సనావుల్లాఖాన్, డా.ఎస్.సజ్జన్ సింగ్ తదితరులు మాట్లాడుతూ బాలీవుడ్ హీరోయిన్, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ నటించి, నిర్మించిన 'ఎమర్జెన్సీ' సినిమా సిక్కుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉందని, కావున వెంటనే ఆ సినిమాను విడుదల చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించాలని, ఆమెపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నేటి సినిమాల్లో కొన్ని వర్గాలను కావాలనే టార్గెట్ చేసుకుని సినిమాలు నిర్మించడం జరుగుతుందని, దీంతో యువత, విద్యార్థులు హత్యలకు పాల్పడుతూ హంతకులుగా మారి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి మతోన్మాద శక్తులపై ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృత్తం కాకుండా చూడాలని వారు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఫ్రంట్ నాయకులు ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, ఎస్.ఎస్.తన్వీర్, ఎంఏ.అజీజ్, నర్సింగ్ రావు, సలీం ఆలా హిందీ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాన్ని కాపాడవచ్చు

కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శృతి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రక్తదానం చేయడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడవచ్చు నని కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శృతి అన్నారు. సోమవారం ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో రక్తదానం చేయాలని సూచించారు. రక్తదానం వలన ఎటువంటి ఇబ్బందులు ఉండవని ధైర్యంగా ముందుకు వచ్చి యువత రక్తదానాలు చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం వల్ల మొత్తం హృదయం ఆరోగ్యాన్ని పెంచుతుందని తెలిపారు. రక్తంలో ఇనుము స్థాయి పెరగడం వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా రక్తంలో ఇనుము మొత్తాన్ని తగ్గించడంలో సహాయ పడుతుందన్నారు. 18 ఏండ్ల నుండి 55ఏండ్ల వయసు గలవారు రక్తదానం చేయొచ్చునన్నారు. రక్తదానం చేసిన దాతకు సర్టిఫికెట్ అందజే స్తామన్నారు. ప్రతి ఒక్కరు ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చునని తెలిపారు. రక్తదానం చేయడానికి ప్రజలందరూ ముందుకు రావాలని కోరారు.

వరద బాధితులకు రాష్ట్ర కురుమ సంఘం రూ.10 లక్షలు విరాళం



నవతెలంగాణ-ధూల్‌పేట్

అకాల వర్షాలతో తెలంగాణలో వరదలతో సర్వస్వం కోల్పోయి తీవ్రంగా నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర కురుమ సంఘం చేయూత అందిస్తుందని రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ అన్నారు. వర్షాలతో నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు ఆయన ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి పార్లమెంటు సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి బండారు నారాయణ, కోశాధికారి కట్ట మల్లేశం కురుమ, రాష్ట్ర కురుమ విద్యార్థి హాస్టల్ చైర్మెన్, కార్యదర్శి కొలుపుల నర్సింహా కురుమ, ప్రధాన కార్యదర్శి చిగుమళ్ల రాఘవేందర్, సంగారెడ్డి జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు పుష్ప నగేష్, ట్రస్ట్ బోర్డు సభ్యులు కెంద్యాల శ్రీనివాస్, రాజ్ కుమార్ తదితరుల బృందం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి పది లక్షల చెక్కును అందజేశారు. ఆయన రాష్ట్ర నేతలను అభినందించారు. వరద బాధితులకు ఆదుకోవడానికి ముందుకు రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

మావో చూపిన మార్గమే విప్లవకారులకు శిరోధార్యం

- సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రధాన కార్యదర్శి సాదినేని వెంకటేశ్వర్ రావు



నవతెలంగాణ-ముషీరాబాద్

మావో చూపిన మార్గమే విప్లవకారులకు శిరోధార్యం అని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాదినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం మార్క్సిస్టు మహోపాధ్యాయులు కామ్రేడ్ మావో 48వ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో విద్యానగర్ లోని చంద్ర పుల్లారెడ్డి భవన్‌లో మావో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాదినేని వెంకటేశ్వరరావు హాజరై మాట్లాడుతూ భారత దేశంతో సహా మూడవ ప్రపంచ దేశాల్లో పని చేస్తున్న కమ్యూనిస్ట్ విప్లవ కారులకు కామ్రేడ్ మావో చూపిన మార్గమే ఈ నాటికి సరైన మార్గమని స్పష్టం చేశారు. ఆయన మరణించి 48 సంవత్సరాలు గడుస్తున్నా, ఆయన రూపొందిన విప్లవ సిధాంతం నేటికీ కమ్యూనిస్ట్ విప్లవ కారులకు శిరోధా ర్యమని గుర్తించాలన్నారు. భూమి, భుక్తి, విముక్తి విప్లవ పోరాటాల్లో, ప్రతిఘటనా పోరాటాల్లో పురోగమించడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. పార్టీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ కె.గోవర్ధన్ మాట్లాడుతూ దేశంలోని విప్లవ కమ్యూనిస్ట్ సంస్థలు ఇప్పటికైనా ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరముందన్నారు. వీర తెలంగాణ, నక్సల్బరి, శ్రీకాకుళం, గోదావరి లోయ పోరాటాల వారసత్వంలో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సంధ్యక్క, పీఓడబ్ల్యు జాతీయ కన్వీనర్, ఎం.శ్రీనివాస్, ఐఎఫ్‌టీయు రాష్ట్ర కార్యదర్శి, అనురాధ, జాతీయ నాయకులు శివ బాబు, పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఎం.పరశురాం, నాయకులు రియాజ్, నాగరాజు, నవీన్, మధుకర్ ,వేణు ,కొండల్ శ్యామ్, ఝాన్సీ ,తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
మంగళవారం | సెప్టెంబర్ 10, 2024 | www.navatelangana.com

మహిళా క్యాంటీన్‌ను ప్రారంభించిన కార్పొరేటర్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్
మల్కాజిగిరి మున్సిపల్ కార్యాలయంలోని గీతానగర్‌లో మహిళా స్వశక్తి పథకంలో రుణం ద్వారా ఏర్పాటు చేసిన మహిళా క్యాంటీన్‌ను సోమవారం మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్, డీసీ రాజు, ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లికార్జున్, కమిటీ ఆఫీసర్ లక్ష్మిలతో కలిసి ప్రారంభించారు.

గణనాథుడికి కార్పొరేటర్ ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్
మౌలాలి డివిజన్ ఈస్ట్ మారుతీ నగర్‌లో అధ్యక్షులు కుమా నర్సింగరావు కేఎస్ఆర్ ఫ్లవర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించి, వారు నిర్వహించిన గణనాథుడికి మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శివ గౌడ్, వెంకటేష్, శ్రీనివాస్ యాదవ్, రాము, శివ, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ ఆశయాలు భవిష్యత్ తరాలకు ఆదర్శం

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో
కాళోజీ ఆశయాలు భవిష్యత్ తరాలకు ఆదర్శమని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాళోజీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పుట్టుక నీది, చావు నీది బతుకంతా దేశానిది అన్న కాళోజీ మాటలు అందరికీ ఆదర్శమన్నారు. తెలంగాణ ప్రజల కోసం తన కలం ద్వారా తెలంగాణ భాష, యాస ఎంత మంచి గుంటుందో రాసి మరీ చూపించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో హరిప్రియ, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజాకవి

- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ



నవతెలంగాణ-సిటీబ్యూరో
కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజాకవి అని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ అన్నారు. ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను సోమవారం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ కాళోజీ చిత్ర పటానికి నివాళులర్పించి మాట్లాడారు. కాళోజీ తమ కవిత్వంతో తెలంగాణ యాసలో తనదైన శైలిలో కవిత్వాలు రాస్తూ, తెలంగాణ భాషలోని మాదుర్యాన్ని ప్రపంచానికి చాటిన మహనీయులు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్లు కె.నందకుమార్, కె.సుధామాధురి, చీఫ్ ఇంజినీర్ యు.బాలస్వామి, జాయింట్ సెక్రెటరీ మాజిదుల్లాఖాన్, ఎస్ఈ (సివిల్) శ్రీనివాస్, జీఎం నాయక్, సీఎస్ అనిల్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్.. కాళోజీ జయంతి



నవతెలంగాణ-కాప్రా
తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో ప్రజాకవి కాళోజీ నారాయణరావు 110వ జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించగా ట్రేడ్ యూనియన్ నాయకులు ఎన్. శ్రీనివాస్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రముఖ విజ్ఞాన వేత్త జయప్రకాష్ మాట్లాడుతూ.. కాళోజీ నారాయణరావు తెలుగువాడు కానప్పటికీ తెలుగును అధ్యయనం చేసి తెలుగు భాష, తెలంగాణ యాసలో పట్టు సాధించి అనేక గ్రంథాలను రాశారని అన్నారు. ఆయన అన్ని హింసలకు వ్యతిరేకంగా పోరాడారని చెప్పారు. మద్రాసు నుండి తెలుగు రాష్ట్రం ఏర్పడినప్పుడు, పెద్దమనుషుల ఒప్పందం సరిగా అమలు చేయక తెలంగాణ వెనుకబడి నప్పుడు తెలంగాణ సాధనకు తన వంతు కర్తవ్యాన్ని నిర్వహించారని చెప్పారు. స్ఫూర్తి గ్రూప్ నాయకులు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ.. 'పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిది' అని గొప్ప భావాన్ని కలిగి ఉండి అనేక పోరాటాలకు వెన్నుదన్నుగా నిలిచారని పేర్కొన్నారు. పాలకుల నిర్బంధాలకు వ్యతిరేకంగా గట్టిగా నిలబడ్డారని తెలిపారు. తెలంగాణ యాస ప్రాముఖ్యతను ప్రజలకు అందించడంలో తెలుగు భాష గొప్పతనాన్ని, దాని ప్రభావాన్ని ప్రభావితం చేయటంలో కాళోజీ నారాయణరావు ముందు ఉన్నారని చెప్పారు. జయరాజు, అధ్యక్షులు యాదగిరిరావు పలు అంశాలపై ప్రసంగించారు. అనంతరం సభికులందరూ కాళోజీకి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, శ్రీనివాస్, ఉన్నికృష్ణన్, వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ, జయరాజ్, యాదగిరిరావు, గౌసియా, శోభ తదితరులున్నారు.

ఎమ్మెల్యే బండారి ప్రత్యేక పూజ



నవతెలంగాణ-కాప్రా
మీర్‌పేట్ హెచ్ బీకాలనీ డివిజన్ లక్ష్మీనగర్, ఇంద్రానగర్ ఫేజ్-2 కాలనీల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుల మండపాలను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కంటెస్టెడ్ ఎంపీ రాగిడి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్‌లతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని సంక్షేమ సంఘం ప్రతినిధులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, సంక్షేమ సంఘం ప్రతినిధులు రామోహన్ రావు, కోటిరెడ్డి, రాజారెడ్డి, సదానందం, సతీష్, భూక్యా కాళే, శోభ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ అభివృద్ధికి నిధులు కేటాయించండి

- 16వ ఆర్థిక సంఘ ప్రతినిధులను అభ్యర్థించిన పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్



నవతెలంగాణ-బోడుప్పల్
పీర్జాదిగూడ కార్పొరేషన్ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్ 16వ ప్రణాళిక సంఘం ప్రతినిధులను అభ్యర్థించారు. సోమవారం 16వ ఆర్థిక సంఘం చైర్మెన్ డాక్టర్ పణగారియా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్ పాల్గొని కార్పొరేషన్ అభివృద్ధికి కావాల్సిన నిధులు, ఇతర అంశాలను వారికి తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో ఉన్న యానిమల్ బర్త్ కంట్రోల్ కోసం పట్టణ స్థానిక సంస్థ(యూఎల్‌బీ) నుంచి ఒక్కో దానికి దాదాపు రూ.1,600 ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. దీనికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. 2011 జనాభా లెక్కల ప్రకారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ జనాభా 55,000 ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం జనాభా దాదాపు 1,25,000 పెరిగినట్టు అంచనా ఉందని తెలిపారు. జనాభాకు అనుగుణంగా మున్సిపల్ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. యూఎల్‌బీ బడ్జెట్ నుంచి ప్రతి ఏడాది 10 శాతాన్ని గ్రీన్ బడ్జెట్‌గా కేటాయిస్తున్నామని చెప్పారు. దీనికి సైతం కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహక నిధులు కేటాయించాలని కోరినట్టు తెలిపారు. ప్రభుత్వ స్థలాలు, పార్కులు అన్యాక్రాంతం కాకుండా జియోఫెన్సింగ్ చేయాలని కోరారు. ఇందుకు అవసరమైన సాంకేతికతను యూఎల్‌బీకి కేంద్రం అందించాలని, జియోఫెన్సింగ్ కోసం అయ్యే ఖర్చులో కొంత భాగాన్ని కేంద్ర ప్రభుత్వం భరించాలని విజ్ఞప్తి చేశారు. స్ట్రాటజిక్ నాలా డెవెలంమెంట్ ప్రోగ్రామ్(ఎస్ఎన్‌డీపీ)లో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రత్యేక నిధులు విడుదల చేయాలని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఇంటి పన్నులతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారని, ఇంటి పన్నులను పునఃపరిశీలించి, తగ్గించాలని సీడీఎంఏ డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో పాటు రాష్ట్రంలో వివిధ మున్సిపల్ కార్పొరేషన్ల నుంచి మేయర్లు, మున్సిపల్ చైర్మెన్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



- కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్
వినాయక నగర్ డివిజన్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అన్నారు. వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని చంద్రగిరి కాలనీ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద గత కొన్నిరోజులుగా చెత్త, మట్టి పేరుకపోయి ఉందని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ స్థలానికి చేరుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి జేసీబీతో చెత్తను క్లియర్ చేయించారు. అక్కడే ఉన్న (జీవీపీ పాయింట్) చెత్త వేసే పాయింట్‌ను అక్కడ నుండి తీసివేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాంకీ దయానంద్, సాయి, జవాన్ భాస్కర్, డివిజన్ కార్యదర్శి గోపాల్, బాలు, తదితరులు పాల్గొన్నారు.



కైలాసగిరి యూత్ ఆహ్వాన మేరకు మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి, రామ్ ప్రదీప్ మేడ్చల్ జిల్లా ఎస్సీ మోర్చా వైస్ ప్రెసిడెంట్ జంగా బాలరాజు, యూత్ సభ్యులతో కలిసి గణపతి పూజలో పాల్గొన్నారు.
-నవతెలంగాణ, కాప్రా

ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిని అరెస్టు చేయాలి : సీపీఐ



నవతెలంగాణ-కాప్రా
మేడ్చల్ జిల్లాలోని వివిధ మండలాల్లో చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులను ఆక్రమించి బహుళ అంతస్తులను నిర్మించిన అక్రమార్కులను తక్షణమే అరెస్టు చేసి ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్ డిమాండ్ చేశారు. సోమవారం సీహెచ్ దశరధ్ అధ్యక్షతన ఈసీఐఎల్ నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో జరిగిన మేడ్చల్ మల్కాజ్ జిల్లా సీపీఐ కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ జిల్లాలో అనేక ప్రాంతాల్లో చెరువుల, కుంటల బఫర్ జోన్, ఎఫ్.టి.ఎల్‌లను భూ బకాసురులు ఆక్రమించి, మాజీ మంత్రులు, రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు బహుళ అంతస్తులను చేపట్టారని విమర్శించారు. అక్రమార్కుల కబ్జాలకు గురైన చెరువులను విడిపించే పనిని హైడ్రా ఉధృతంగా కొనసాగించడాన్ని సీపీఐ ఆహ్వానిస్తోందన్నారు. మేడ్చల్ జిల్లా పరిధిలోని కాప్రా చెరువు, యాప్రాల్ పరిధిలోని నాగిరెడ్డి చెరువు, బండబాయి కుంట, అల్వాల్ చిన్న రాయుడు చెరువు, కుత్బుల్లాపూర్ పరిధిలోని ఫాక్ సాగర్, శామీర్ మండలంలోని మెడ్ సిటీ ఆసుపత్రి, బొమ్మరాసిపేట తదితర చెరువులను ఆక్రమించి చెరబట్టారన్నారు. ఈ చెరువులను, కుంటలను హైడ్రా కమిషనర్ తక్షణమే పరిశీలించి అక్రమాలను తొలగించాలన్నారు. జిల్లా కార్యదర్శి డిజి సాయిలు గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలను పరిరక్షించాలని ఇందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు జి.దామోదర్ రెడ్డి, యూ.ఉమా మహేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్.ధశరద్, రొయ్యల కృష్ణమూర్తి, కె.ధర్మేంద్ర రచ్చ కిషన్, శంకర్ రావు, టి.శంకర్ తో పాటు వివిధ మండలాల సీపీఐ కార్యదర్శులు, పాల్గొన్నారు.

నాగారం మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



- మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర
నాగారం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి గ్రామం, వార్డు నెం.03లోని గోకుల్ కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులు రూ. 10 లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాగారం మున్సిపాలిటీలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ బండారి మల్లేశ్ యాదవ్, కౌన్సిలర్ గోక కళావతి యాదగిరి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



నవతెలంగాణ-నేరేడ్‌మెట్
అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. అంగన్వాడీ టీచర్లకు ప్రతినెలా సమావేశం కోసం శాశ్వత భవన సముదాయాన్ని నిర్మించాలని కోరుతూ అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లు, చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్(సి.డి.పి.ఓ) స్వాతి ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్వాడీ సమావేశాల సమయంలో సరైన సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. అంగన్వాడీ సెంటర్లలో టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ.. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పక్కా భవనం నిర్మాణం చేసే వరకు ప్రయివేటు ఫంక్షన్ హాల్లో సమావేశం ఏర్పాటు చేసుకుంటే దాని ఖర్చు తానే భరిస్తానన్నారు. నియోజకవర్గంలోని 77 అంగన్వాడీ కేంద్రాలను తానే స్వయంగా పరిశీలించి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు జయశీల, వింధ్యావాహిని, అంగన్వాడీ టీచర్లు మీనాక్షి, రాణి, మమత, రాజ్యలక్ష్మి, శోభారాణి, రమాదేవి, విజయలక్ష్మి, సంధ్యా, భాగ్యరేఖ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కీసర
మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మల్లారెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ వేడుకలకు కీసర మండల బీఆర్ఎస్ నేతలు పాల్గొని మల్లారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట కీసర మండల మాజీ జెడ్పీటీసీ బెస్త వెంకటేష్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జలాల్ సుధాకర్ రెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్ పర్సన్ వసూపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పేదల అభివృద్ధికి పని చేస్తుంది

- కాంగ్రెస్ పార్టీ జవహర్ నగర్ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్



నవతెలంగాణ - జవహర్‌నగర్
కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభివృద్ధికి పని చేస్తుందని జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ అన్నారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ నగర్, కార్మిక నగర్ ప్రాంతాలలో హైడ్రా పేరిట పేదప్రజల ఇండ్లను కూల్చి నిరాశ్రయులను చేస్తుందని కొంతమంది పేదప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అలాంటి వదంతులను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఎల్లప్పుడూ పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా ఆలోచనలు రూపొందిస్తున్నారని అన్నారు. పేద ప్రజలు ఎవరూ భయపడకూడదని, ఇల్లు అనే పేరుతో పేద ప్రజలను ఆసరాగా చేసుకుని కొంతమంది ఆర్థిక రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని, అలాంటి వారి ఆటలు సాగబోవని హెచ్చరించారు. ప్రజలను మభ్యపెట్టే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అలాంటి వారికి తగిన బుద్ధి చెప్తామని అన్నారు.

ముస్లింలకు ఎల్లప్పుడూ తోడ్పాటు అందిస్తాం

- బోడుప్పల్ మేయర్ అజయ్ యాదవ్
- కబ్రస్థాన్ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ-బోడుప్పల్
ముస్లింలకు ఎల్లప్పుడూ తోడ్పాటు అందిస్తామని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్‌లో ముస్లింలకు కబ్రస్థాన్ ప్రహరీగోడ నిర్మాణ అభివృద్ధి పనులకు రాష్ట్ర హజ్ కమిటీ మెంబర్ ముజీహిద్దీన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ.. అన్ని వర్గాలకు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పనిచేస్తుందని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం వలన కార్పొరేషన్‌లో అనేక అభివృద్ధి పనులు మరుగున పడేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ నగర డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు సీసా వెంకటేష్ గౌడ్, కార్పొరేటర్ చీరాల నర్సింహా, నాయకులు గుర్రాల వెంకటేష్ యాదవ్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన మోహన్ రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌డెస్క్
మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా తిరుపతి వేంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకొని సోమవారం తిరిగి హైదరాబాద్ విమానాశ్రయం చేరుకోగా వారికి షామీర్‌పేట్ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సరసం మోహన్ రెడ్డి శ్రేణులతో కలిసి ఘన స్వాగతం పలికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహంకాళి లాలి వంగ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ తుడుం గణేష్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ



నవతెలంగాణ- మేడ్చల్
ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు, ఎల్లంపేటలోని అనాథ ఆశ్రమంలో కౌన్సిలర్ తుడుం గణేష్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ తుడుం గణేష్ మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి భవిష్యత్తులో మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ అభివృద్ధికి విశ్రాంతి లేకుండా కృషి చేస్తున్న మల్లారెడ్డి ఎంపీగా, మంత్రిగా, ఎమ్మెల్యేగా ఎన్నో అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సందీప్ గౌడ్,నాగార్జున్ రెడ్డి, పవన్, నవీన్, జీవరత్నం, నరసింహా, యువజన విభాగం అధ్యక్షులు రఘు, విద్యార్థి విభాగం అధ్యక్షులు శ్రీనాద్ ముదిరాజ్ తదితరులున్నారు.

అత్వెల్లి రేకులబావి భారత్ పెట్రోల్ బంక్ డీజిల్‌లో నీటి కలకలం



నవతెలంగాణ-మేడ్చల్
కారులో డీజిల్ కొట్టించుకుంటే దాంట్లో నీళ్లు వచ్చిన ఘటన మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని అత్వెల్లి రేకులబావి భారత్ పెట్రోల్ బంక్‌లో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలం లోని డబీల్‌పూర్ గ్రామానికి చెందిన ఎల్లారెడ్డి ఈనెల 6వ తేదీన రూ.1020తో 10లీటర్ల డీజిల్ తన కారులో పోయించుకున్నాడు. డీజిల్ పోయించుకుని కొద్ది దూరం వెళ్లాక కారు బ్రేక్ డౌన్ అయింది. దీంతో మెకానిక్ ను తీసుకొచ్చి పరిశీలించగా డీజిల్ ట్యాంకులో నీళ్లు వచ్చినట్లుగా గుర్తించారు. వెంటనే పెట్రోల్ బంక్ నిర్వాహకులకు సమాచారం అందించి తన మనుమరాలి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళ్లిపోయాడు. తిరిగి సోమవారం వచ్చి పెట్రోల్ బంక్ నిర్వాహకులను ఇదేంటని ప్రశ్నించగా తమకేం సంబంధం లేదని మాట్లాడుతున్నారని ఆవేదన వెల్లబుచ్చారు. సంబంధిత అధికారులు రేకులబావి భారత్ పెట్రోల్ బంక్‌పై తగిన చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరారు.

వరద బాధితులకు విరాళ సేకరణ కోసం సహాయ నిధి ఏర్పాటు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్
వరదల వల్ల ఖమ్మం జిల్లాలో సర్వం కోల్పోయిన బాధితులకు సహాయం చేయాలనే భావనతో మల్కాజిగిరికి చెందిన మానవసేవే మాధవసేవ గ్రూప్ సభ్యులు మల్కాజిగిరి సర్కిల్ గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ చౌరస్తాలో రెండు రోజులపాటు ఆదివారం సోమవారం, వరద బాధితుల నిమిత్తం సహాయ నిధి శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రూపు సభ్యులు కుమ్మరి రాజు, మహమ్మద్ రషీద్ సదరు విషయాన్ని మల్కాజిగిరి నియోజకవర్గంలోని అన్ని వాట్సప్ గ్రూప్‌ల్లో సహాయనిధి విషయాన్ని తెలుపుతూ పోస్టింగ్‌లో పెట్టారు. మానవతా దృక్పథంతో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు శిరిగిరి రాజు, మిర్జాలగూడ అసోసియేషన్ సభ్యులు జంగాల శ్రీరామ్ యాదవ్, ఎడ్ల శ్రీనివాసరావు, మోర సుధాకర్, స్వీటీ తో పాటు మరికొందరు బియ్యం, పిండితో పాటు, నిత్యవసరాల సరుకులు వరద బాధితుల సహాయనిధికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రూప్ అడ్మిన్ కుమ్మరి రాజు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో సహాయం చేయడానికి ముందుకొచ్చిన వ్యక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, ప్రజలు మానవతా దృక్పథంతో వరద బాధితులకు సహాయాన్ని అందివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ అడ్మిన్ కుమ్మరి రాజు, మహమ్మద్ రషీద్ , మొహమ్మద్ సమీ, వెంకటరమణ, పాల్గొన్నారు.

ఉత్తమ న్యాయవాది అవార్డు అందుకున్న రాకేష్



నవతెలంగాణ- మేడ్చల్
మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ 136వ జయంతి ఉత్సవాలలో భాగంగా వల్లూరి ఫౌండేషన్ వారు రవీంద్రభారతిలో సోమవారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మేడ్చల్ కోర్టుకు చెందిన యువ న్యాయవాది రాకేశ్‌కు ఉత్తమ న్యాయవాది అవార్డు లభించింది. ఈ కార్యక్రమానికి దైవజ్ఞ శర్మ, సినీ హీరో సుమన్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై అవార్డులు అందజేశారు. ఉత్తమ న్యాయవాది అవార్డు అందుకున్న రాకేశ్ మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి అవార్డుతో సత్కరించడం ఆనందంగా అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవ చేస్తానన్నారు.

11న ప్రజాభవన్‌లో ప్రజావాణి



● మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో హైదరాబాద్‌లోని మహాత్మ జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ప్రతి మంగళవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం నేడు వాయిదా వేసినట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ నెల 11వ తేదీన యధావిధిగా ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఏమైనా అర్జీలు ఇచ్చే జిల్లా ప్రజలు ఈ మార్పును గమనించి మంగళవారానికి బదులుగా బుధవారం వెళ్లాలని సూచించారు.

ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి



● మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను జాప్యం లేకుండా పరిష్కరించాలని తెలిపారు. ప్రజావాణికి 89 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



● ఎమ్మెల్యే కేపీ.వివేకానంద

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యే కేపీ.వివేకానందని కలిశారు. అనంతరం విఘ్నేశ్వరుడి పూజకు ఆహ్వానిస్తూ పలు ఆహ్వాన పత్రికలు, వినతులు అందజేశారు. సమస్యలపై ఎమ్మెల్యే కేపీ వివేకానంద సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి నూతన పనులను త్వరలోనే చేపడతామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుకు కృషిచేస్తాం : ఎమ్మెల్యే



సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని రాంరెడ్డి నగర్‌లో 'గ్లాండ్ ఫార్మా లిమిటెడ్' ఎండి శ్రీనివాస్ సాదు, మేనేజింగ్ ట్రస్ట్ కె.రఘురామన్‌ల సహాయ సహకారాలతో సుమారు రూ. 2 కోట్ల రూపాయల నిధులతో నిర్మించిన 'మండల ప్రాథమిక పాఠశాల' ను ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ సోమవారం స్థానిక మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ మాట్లాడుతూ... చదువుతోనే మనలోని అజ్ఞానం తొలగినపుడే విజ్ఞానాన్ని పెంపొందించు కోవచ్చున్నారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, పుప్పాల భాస్కర్, ఎంఈవో హరిశ్చంద్ర, హెడ్ మాస్టర్ కృపాకర్, ఎంఆర్పి రమేష్, నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, దుర్గా రావు, రామ్ రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వామన్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భాష, యాస అభివృద్ధికై కృషి చేసిన మహనేత కాళోజి నారాయణ రావు : ఎమ్మెల్యే

తెలంగాణ భాష, యాస అభివృద్ధికై అనునిత్యం తపించిన మహనేత, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావుని కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. సోమవారం కాళోజీ జయంతిని పురస్కరించుకొని నగరంలోని బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన "తెలంగాణ భాష దినోత్సవ" కార్యక్రమంలో సిద్దిపేట ఎమ్మె ల్యే హరీష్ రావుతో కలిసి ఎమ్మెల్యేలు, పల్లా రాజేశ్వర్ రెడ్డిలు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



విద్యార్థుల అభివృద్ధి, లక్ష్యసాధనలో గురువులతో పాటు తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకం : ఎమ్మెల్యే

129 సూరారం డివిజన్‌లోని 'నార్త్ సిటీ హై స్కూల్' నందు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను ప్రధానం చేసే కార్యక్రమా నికి సోమవారం ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై... ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపబడిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒక విద్యార్థి అభి వృద్ధి, లక్ష్యసాధనలో గురువులతోపాటు తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులు మంచి నడవడికతో ఉన్నత లక్ష్యాలను సాధిస్తే అదే మనము గురువులకు ఇచ్చే గురుదక్షిణ అవుతుందన్నారు. అనంతరం హ్యాట్రిక్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్‌ని నిర్వాహకులు శాలువా, మెమొంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, నార్త్ సిటీ స్కూల్ కరస్పాండెంట్ వెంకటేష్, ప్రిన్సిపల్ రమాదేవి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



ఆశా వర్కర్లను పర్మినెంట్ చేయాలి

● కనీస వేతనం రూ.26వేలు, పెన్షన్ రూ.10వేలు చెల్లించాలి
● ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలి
● తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రేవతి కల్యాణి, ఎ.హేమలత



నవతెలంగాణ-సిటీబ్యూరో

కేంద్ర ప్రభుత్వం ఆశాల సమస్యలను వెంటనే పరిష్కరించాలనీ, దేశవ్యాప్తంగా ఉన్న ఆశా వర్కర్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రేవతి కల్యాణి, ఎ.హేమలత డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ టి.రఘునాథస్వామికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 10 లక్షల మంది ఆశాలు పని చేస్తున్నారని తెలిపారు. వీరు 30 ఏండ్ల నుంచి కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్, 20 ఏండ్ల నుంచి ఎన్‌హెచ్‌ఎం స్కీంలో భాగంగా పని చేస్తున్నారని తెలిపారు. ఇక మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 1,273 మంది పని చేస్తున్నారనీ, వీరంతా బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే అని తెలిపారు. వీరు నిరంతరం పేద ప్రజలకు ఆరోగ్య సేవలిందిస్తున్నారని తెలిపారు. కరోనా లాంటి కాలంలో కూడా ముందు వరుసలో ఉండి ప్రజలకు సేవలందించారని తెలిపారు. డబ్ల్యుహెచ్‌ఓ అంతర్జాతీయ సంస్థ ఆశా వర్కర్లకు గ్లోబెల్ హెల్త్ లీడర్స్ అవార్డును కూడా అందించిందని తెలిపారు. సీజనల్ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి అరికట్టడంలో, ఆస్పత్రుల్లో డెలివరీల సంఖ్యను పెంచడంలో ఆశాలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఇన్ని పనులు నిర్వహిస్తున్న ఆశాలను కేంద్ర ప్రభుత్వం నేటికీ గుర్తించడం లేదన్నారు. 45, 46వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసుల ప్రకారం ఆశాలను కార్మికులుగా గుర్తించాలనీ, కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, సామాజిక భద్రత, తదితర సౌకర్యాలు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడం దేశానికే అవమానకరం అన్నారు. గతంతో పోలిస్తే ఈ మధ్య కాలంలో ఆశాలకు రోజు రోజుకూ పనిభారం మరింత పెరుగుతుందన్నారు. రోజుకు 12-16 గంటలు పని చేయాల్సి వస్తుందని తెలిపారు. ఆదివారం, పండుగలు, అనారోగ్యానికి గురైనప్పుడు కూడా సెలవులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులు ఆశాల ఆరోగ్యంపైన తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. చివరికి ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య కూడా ఈ మధ్య కాలంలో పెరుగుతున్నదన్నారు. దేశంలోని ప్రజారోగ్య సౌకర్యాల విషయంలో ఆందోళనకరమైన పరిస్థితి ఉందన్నారు. ఆశాల సమస్యలతో పాటు ప్రజలకు ఆరోగ్య సేవలందించడానికి సరిపడా బడ్జెట్ కేయింపులు కేంద్ర ప్రభుత్వం పెంచకపోవడం అత్యంత బాధాకరం అన్నారు. ఆరోగ్య కార్యకర్తల భద్రత ప్రమాదంలో ఉందన్నారు. డాక్టర్లు, నర్సులే కాదు, ఆశా వర్కర్లు కూడా తరచూ లైంగిక వేధింపులు, దాడులకు గురవుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో తక్షణమే జోక్యం చేసుకుని తమ అత్యవసర డిమాండ్లను వీలైనంత త్వరగా నేరవేర్చేలా చూడాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ జిల్లా నాయకులు రాధ, వాసంతి, రాజకుమారి, మంజు, మంగ, జిల్లా కమిటీ సభ్యులు ఉన్నారు.

ఉపాధ్యాయులను సత్కరించిన బండి రమేష్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కూకట్‌పల్లి మండల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు, శ్రీకాంత్ పటేల్ ఆధ్వర్యంలో.. కూకట్‌పల్లిలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, గొట్టుముక్కల వెంకటేశ్వర రావు పాల్గొని ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ హరీష్ చంద్ర, లక్ష్మయ్య, పుష్పరెడ్డి, మేకల రమేష్, మధు గౌడ్, గూడెపు నాగరాజు, సునిల్ యాదవ్, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు నూతన భవనం ప్రారంభోత్సవం

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన భవనాన్ని మంగళవారం ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు 130 డివిజన్ కార్పొరేట్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, స్థానిక కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి డివిజన్ ప్రజలు, నాయకులు, సంక్షేమ సంఘం సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొనవలసిందిగా కోరారు.

ప్రజా సంక్షేమం, అభివృద్దే లక్ష్యం



● ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజాసంక్షేమం, అభివృద్దే లక్ష్యంగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, కాలనీ వాసులు, సంక్షేమం సంఘం సభ్యులు, నాయకులు కార్యకర్తలు ఆయన కార్యాలయంలో కలిశారు. తమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరగా.. పలువురు గణేష్ నవరాత్రి ఉత్సవాలకు రావలసిందిగా ఆహ్వాన పత్రికలను అందజేశారు. సమస్యలపై ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు స్థానికులంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడే సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రజా సమస్యలు పరిష్కరించాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని అధికారులకు సూచించారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండపంలో మట్టి గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన గణపతి ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు.

ఎల్‌ఓసీ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్‌ఓసీ చెక్కును ఎమ్మెల్యే కృష్ణారావు అందజేశారు. బాలాజీనగర్ డివిజన్, రాఘవేంద్ర నగర్‌కు చెందిన జి.ప్రమీల అభ్యర్థన మేరకు.. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు అయిన, రూపాయలు రెండు లక్షల విలువ గల ఎల్‌ఓసీ చెక్కును, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందజేశారు.

కూకట్‌పల్లి డివిజన్ అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే..

అభివృద్ధి పనులన్నీ త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులను ఎమ్మెల్యే కృష్ణారావు ఆదేశించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం, కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రకాష్ నగర్ డబుల్ రోడ్డు, హెచ్‌ఎల్ కాలనీ, వైష్ణవి నగర్, అమూల్య చౌరస్తా, సాయిబాబా నగర్‌లలో, కొత్త రోడ్లు, డ్రయినేజీ, మంచినీటి పైపులైన్ల పనులను, ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీలైనంత తొందరగా ఈ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చి ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్, ప్రభాకర్, ఇంజినీరింగ్ అధికారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



నూతన టీపీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు



● మాజీ కౌన్సిలర్ బొంబ్బ రంగారావు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

టీపీసీసీ నూతన అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నియమితులైన సందర్భంగా.. మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొంబ్బ రంగారావు, మేడ్చల్ మల్కాజిగిరి ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు నివాసంలో బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ని కలిశారు. అనంతరం పుష్పగుచ్చం అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

బాలానగర్ : తెలంగాణ రాష్ట్ర నూతన టీపీసీసీ అధ్యక్షులుగా నియమితులైన ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను వారి నివాసంలో టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ఎన్ఎస్‌యూఐ యూత్ కాంగ్రెస్, పీసీసీలో అనేక హోదాలలో పనిచేసి సుదీర్ఘ కాలంగా పార్టీకి విశేష సేవలు అందిస్తున్న యంగ్ డైనమిక్ లీడర్, ఎమ్మెల్సీ, బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అని అన్నారు. పార్టీ పట్ల అంకిత భావం, అచంచలమైన విశ్వాసంతో నిజమైన కార్యకర్తలకు అండగా ఉంటూ.. పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధతతో వ్యవహరిస్తూ, కాంగ్రెస్ పార్టీ పునరుజ్జీవంలో తనవంతు పాత్ర పోషించిన నాయకుడుగా ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర 4వ టీపీసీసీ అధ్యక్షులుగా నియమితులైనందుకు అభినందనలు తెలిపారు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



కమ్యూనికేషన్ సిస్టంను ప్రారంభించిన ఎంఎల్ఆర్ఐటీఎం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మునిసిపల్ పరిధిలోలోని మార్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (ఎమ్ఎల్ఆర్ ఐటీఎం) ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం, వారు నిర్వహించిన ఈ కార్యక్రమంకు ముఖ్య అతిదులు గా డైరెక్టట్ పి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మురళి ప్రసాద్, కో ఆర్డీ నెటర్లు డాక్టర్ శ్రీనివాస్ నల్లగొండ, డాక్టర్ ఐ. ఆడుంబాబౌ, డాక్టర్ జి.అమర్‌నాథ్‌లు పాల్గొని ప్రారంభిచారు. వైరలెస్ కాగ్నిటివ్ రేడియో సెన్సార్ నెట్‌వర్క్స్ ఫర్ నెక్స్ జెన్ కమ్యూనికేషన్ సిస్టమ్స్" పై ఆరు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపీ) ను ఈ కార్యక్రమం 2024 సెప్టెంబర్ 9 నుండి 2024 సెప్టెంబర్ 14 వరకు జరుగుతుందని వారు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని భారత ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఏఐసిటిఈ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ (ఏటీఏఎల్) అకాడమీ ప్రాయోజిస్తోంది. ఈ ఎఫ్‌డీపీలో కాగ్నిటివ్ రేడియో సెన్సర్ నెట్ వర్క్ వర్క్ పరిజ్ఞానాల్లో అనూహ్యమైన అభివృద్ధులను చర్చించనున్నారన్నారు. తద్వారా ఆగామి భవిష్యత్ కమ్యూనికేషన్ సాంకేతికతపై లోతైన అవగాహన కల్పించబడుతుంది. విశిష్ట సిబ్బంది, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు ఈ షేషన్‌లను నిర్వహిస్తారు, తద్వారా నెక్స్ జెన్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ కోసం అవసరమైన కీలక అంశాలను కవర్ చేస్తారు. దేశం నలుమూలల నుండి వివిధ రాష్ట్రాలకు చెందిన ఫ్యాకల్టీ ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నారు. ఇది జాతీయ స్థాయిలో జరిగిన చర్చలకు దారితీస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నిట్స్, వంటి ప్రతిష్టాత్మక సంస్థలతో పాటు పరిశ్రమ నుంచి విశేష నిపుణులు ప్రసంగించనున్నారని తెలిపారు.

వినాయక నిమజ్జనానికి.. బేబీ పాండ్‌ను ఉపయోగించుకోండి



● కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

వినాయక చవితి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా.. వినాయక విగ్రహాలని నిమజ్జనము చేయడానికి వివేకానంద నగర్ డివిజన్‌లోని, చిత్తారమ్మ గుడి ప్రాంగణంలో, జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన, బేబీ పాండ్‌ను అధికారులతో కలిసి కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ బేబీ పాండ్ 11 రోజులపాటు అక్కడ అందుబాటులో ఉంటుందని, మూడు ఫీట్ల వినాయక విగ్రహాల వరకు ఈ బేబీ పాండ్లో నిమజ్జనం చేయవచ్చు అన్నారు. అక్కడికి వచ్చే భక్తులకి హైద్రాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ సివరేజి బోర్డు ద్వారా, త్రాగడానికి మంచినీరు సదుపాయం కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. కావున భక్తులందరూ విగ్రహాల నిమజ్జనానికి బేబీ పాండ్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఆశ, వర్క్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ హక్కుల కోసం కృషి చేస్తాం

● టీపీసీసీ లేబర్ సెల్ ప్రెసిడెంట్ సప్పిడి భాస్కర్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

వెనుకబడిన కులాల హక్కుల సాధన కోసం తమ వంతు కృషి చేస్తామని సప్పిడి భాస్కర్ అన్నారు. బీసీల సంక్షేమం కోసం ముందుండి పోరాటం చేస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు (ఎంపీ) ఆర్.కృష్ణయ్యని, కూకట్‌పల్లి టీపీసీసీ లేబర్ సెల్ ప్రెసిడెంట్ సప్పిడి భాస్కర్ కలిశారు. భారతదేశంలోని (బి.సి) వెనుకబడిన తరగతుల వారి సామాజిక, రాజకీయ డిమాండ్లు, రాజకీయాలలో రిజర్వేషన్లు, విద్య, ఉపాధి కోటా, బి.సి రుణాలు, సబ్సిడీలు, ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ, ఇతర సంస్థలలో ప్రాతినిధ్యం ఇవ్వాలన్నారు. ఇప్పటికే ఉన్న విధానాలు, పథకాలు, సమర్థవంతంగా వెనుకబడిన తరగతుల సంక్షేమం ద్వారా అమలు చేయడం వంటివని పేర్కొన్నారు. బీసీ జనాభా అంచనా వేయడానికి కుల ఆధారిత జన గణనను నిర్వహించడం..




చట్ట పరమైన హక్కులని సాధించు కోవడానికి అన్ని బి.సి. కుల సంఘాలు,అన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీ నాయకులు అందరు ఐక్యంగా పోరాటం చేసి హక్కులను సాధించాలని సప్పిడి భాస్కర్ కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు శ్రీధర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు సప్పిడి వినీత్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో తూము శ్రావణ్ కుమార్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

మూసాపేట్ మారుతి నగర్‌లో నెలకొల్పిన గణనాథుని వద్ద, మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ప్రజావాణికి 172 దరఖాస్తులు : అదనపు కలెక్టర్ కదిరివన్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కదిరవన్ పి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 172 మంది దరఖాస్తు చేసుకు న్నారని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. 172 అర్జీలు రాగా.. గృహ నిర్మాణ శాఖవి 129, పింఛన్లు 15, భూ సమస్యలు 07, ఇతరములు 21 వచ్చాయని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు ఆర్జీలపై ప్రత్యేక దృష్టిసారించి త్వరగా పరిష్కారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ వీర బ్రహ్మ చారి జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణల తొలగింపు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

రహమత్ నగర్ డివిజన్‌లోని కార్మిక నగర్ అంబేద్కర్ విగ్రహం నుంచి రెండు బొమ్మల సెంటర్ వరకు, కార్మిక నగర్ ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను అధికారులు సోమవారం తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించి చిరు వ్యాపారాలు చేస్తూ డబ్బాలు ఏర్పాటు చేసుకున్న ఆక్రమణదారులపై ఫిర్యాదు రావడంతో జీహెచ్ఎంసీ సర్కిల్ 19 అధికారులు, బోరబండ పోలీసుల సహకారంతో జేసీబీ సాయంతో డబ్బాలను పూర్తిగా తొలగించారు. రోడ్డు స్థలాలు, ఫుట్‌పాత్ పై ఎలాంటి వ్యాపారాలు చేయవద్దని, బాటసారులకు ఇబ్బంది కలిగించవద్దని చిరు వ్యాపారస్తులను హెచ్చరించారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కంటోన్మెంట్

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షులుగా నియమితులైన మహేష్ కుమార్ గౌడ్‌ను సోమవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. మహేష్ గౌడ్‌కు పూల బొక్కే ఇచ్చి శాలువతో సత్కరించారు.



ఓయూలో ఎంఎస్ఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్

నవతెలంగాణ-ఓయూ

నూతన పీజీ ప్రవేశాలు జరుగుతున్న సందర్భంగా విద్యార్థులకు ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో "హెల్ప్ డెస్క్" ఏర్పాటు చేశారు. విద్యార్థులలో ఉన్న సందేహాన్ని అడ్మిషన్ కోసం పాటించవలసిన ప్రక్రియ, సర్టిఫికేట్ వారి శాఖల గురుంచి సమాచారం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సంది కార్తీక్ మాదిగ పాల్గొని సూచనలు చేశారు.ఓయూ ఆర్ట్స్ కాలేజీ లో నూతనంగా ప్రవేశిస్తున్న విద్యార్థులకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి వారికి ఎంఎస్ఎఫ్ విద్యార్థి నాయకుల ఆధ్వర్యంలో సహాయ పడి అడ్మిషన్ ప్రక్రియ విధివిధానాలు వివరించారు. ఎంఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు మంద రాజు మాదిగ, చెరుకుపల్లి శ్రీకాంత్ మాదిగ, గుండాల రవితేజ మాదిగ, సూర్య మాదిగ , తిరుపతి మాదిగ, గజానంద్, ప్రకాష్ మాదిగ, అంజన్ మాదిగ, రవీందర్ మాదిగ పాల్గొన్నారు.

మురళీ ముకుంద్ సభ్యత్వం పునరుద్ధరణ



నవతెలంగాణ-బంజారా హిల్స్

ది జూబ్లిహిల్స్ హిల్స్ కో-అపరెటివ్ హౌజింగ్ బిల్డింగ్ సోసైటీ లిమిటెడ్ లో మాజీ కార్యదర్శి ఏ. మురళీ ముకుంద్ ప్రాథమిక సభ్యత్వం కోర్టు తీర్పుమేరకు పునరుద్ధరించారు. ట్రిబ్యునల్ కేసు నెంబర్ 10 ఆఫ్ 2023లో 20.06.2024న స్పష్టమైన అదేశాలు జారీ అయ్యాయి. ఆ మేరకు మురళీముకుంద్ ప్రాథమిక సభ్యత్వం తిరిగి కల్పిస్తున్నట్టు సోసైటీ పాలక మండలి 29. 08.2024న నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు జారీ చేశారు. గత 2023 ఏప్రిల్‌లో జనరల్ బాడీ మీటింగ్‌లో తీవ్ర ఆరోపణలు చేస్తూ మురళీముకుంద్ సభ్యత్వాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. ఆ సమావేశంలోని జరిగిన తీర్మాణాన్ని సవాలు చేస్తూ కో-ఆపరేటివ్ ట్రిబునల్‌లో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జనరల్ బాడీ తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపడుతూ కో-ఆపరేటివ్ ట్రిబ్యునల్ మురళీ ముకుంద్ పిటిషన్‌పై ఉత్తర్వులు జారీ చేశారు. ఆ తీర్పు అమలు చేసి తన సభ్యత్వం పునరుద్ధరించినందుకు సోసైటీ పాలకమండలికి మురళీముకుంద్ ధన్యవాదాలు తెలిపారు .

ఇంటి వద్దనే బుజ్జి గణపయ్య నిమజ్జనం



నవతెలంగాణ-ఓయూ

తార్నాకలోని మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి నివాసంలో ప్రతిష్ఠించిన మట్టి గణపతికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలనీ మాజీ మేయర్ ఆకాంక్షించారు. అనంతరం మూడో రోజు ఇంటి వద్దనే వాటర్ టబ్‌లో మట్టి గణపతిని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా కార్తీకరెడ్డి మాట్లాడుతూ. పర్యావరణ పరిక్షణ అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి, కుటుంభ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కల్పించండి

- పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి
- జిల్లాలో విద్యా వ్యవస్థ మెరుగు పడేలా ప్రత్యేక దృష్టి పెట్టాలి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- అధిక హాజరు శాతం ఉన్న హెచ్ఎంలతో 'కాఫీ విత్ కలెక్టర్'



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బస్తీ, స్లమ్ ఏరియాల్లో నివసించే పేద పిల్లలకు మంచి చదువులు చెప్పడంతో వారు బాగా చదివి తమ జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకుంటారని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఈ వారం పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎస్ యాప్‌లో విద్యార్థుల హాజరు శాతం పెంచిన పది పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన 'కాఫీ విత్ కలెక్టర్' కార్యక్రమంలో డీఈవో ఆర్.రోహిణితో కలసి ఆయన పాల్గొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో అత్యధికంగా హాజరు శాతం పెంపొందించినందుకు ఉపాధ్యాయులను పిలిపించి వారితో కాఫీ సేవించారు. పాఠశాలల్లో హాజరు శాతం పెంచడంతోపాటు పిల్లలకు నాణ్యమైన విద్యా బోధన జరిగేలా హెచ్ఎంలను ప్రోత్సాహించేందుకు కాఫీ విత్ కలెక్టర్ కార్యక్రమం చేపట్టమని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచాలన్నారు. ఉపాధ్యాయులు పిల్లలతో అనుబంధం పెంచుకొని వారికి మంచి భవిష్యత్తు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల, నాంపల్లి సెక్షన్ కాలనీ ఏఎస్ఆర్ పురం పాఠశాలలో 1357 మంది విద్యార్థులకు 1347 విద్యార్థులు హాజరైనరాని.. ఈ పాఠశాలను మిగతావారు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ వారం పాఠశాలల్లో హాజరు శాతం బాగా పెంచిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల అమీర్‌పేట్, ఖైరతాబాద్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ శాంతా రాథోడ్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల లంగర్ హౌస్ తెలుగు హెచ్ఎం ఉమారాణి, హుమాయున్ నగర్ హెచ్ఎం మహమ్మద్ ముజాహిద్ అలీ, నల్లకుంట హెచ్ఎం జి.సుజాత, ఎల్లారెడ్డి గూడ హెచ్ఎం పెర్సీ, నాంపల్లి సెక్షన్ కాలనీ ఎస్ఆర్ఆర్‌పురం హెచ్ఎం కే.గీత, రసూల్‌పుర పోలీసు లైన్ హెచ్ఎం జి. రంగనాథ్, తిరుమలగిరి హెచ్ఎం కె.విష్ణువర్దన్ రెడ్డి, అంబర్‌పేట్ జినాప బాగ్ హెచ్ఎం వందనా శర్మ, అమీర్‌పేట్ ధరం కారం రోడ్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎండీ అంజద్ అలీ ఖాతిబ్, 10 పాఠశాలల ప్రధానోపధ్యాయుల పని తీరు చాలా బాగుందని ప్రశంసిస్తూ, హాజరు శాతం మరింత పెరిగేలా కృషి చేయాలన్నారు.

అనంతరం ప్రధానోపాధ్యాయులతో ఇష్టగోష్టిగా మాట్లాడారు. వారి పనితీరు, అనుభవాలు తెలుసుకొని వారి సేవలకు ప్రశంసించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారిణి ఆర్. రోహిణి,హెడ్‌మాస్టర్లు పాల్గొన్నారు.



నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన డిప్యూటీ మేయర్

నవతెలంగాణ-ఓయూ

హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి సోమవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి చిలకలగూడలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నిమజ్జన పాయింట్ల వద్ద సదుపాయాలు, భద్రతా చర్యలు, ప్రజలకు అందుబాటులో ఉన్న సేవలను ఖచ్చితంగా అమలు చేయాలని అధికారులను డిప్యూటీ మేయర్ ఆదేశించారు. నిమజ్జన సందర్భంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, పర్యావరణం, భద్రతా ప్రమాణాలను పాటిస్తూ, ప్రజలకు సురక్షితమైన నిమజ్జన కార్యక్రమాలను అందించేందుకు ప్రణాళికలు సక్రమంగా అమలు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆశ లతా, డివిజనల్ ఇంజనీర్ రంజిత్, పలు విభాగ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ గణపతి ఆలయంలో ఉత్సవాలలో భాగంగా చిన్నారులకు నత్య కళాకారులు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మెన్ వోదెల సత్యనారాయణ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో





బోయిన్ చెరువులో జోరుగా నిమజ్జనం

నవతెలంగాణ-కంటోన్మెంట్

గణపతి ఉత్సవాలు మూడో రోజు కావడంతో పాత బోయిన్‌పల్లి బోయిన్ చెరువులో గణపతి నిమజ్జనం ఊపందుకుంది. పాత బోయిన్‌పల్లి నుంచే కాకుండా కంటోన్మెంట్ ప్రాంతాలలో నెలకొల్పిన పలు మండపాల నిర్వాహకులు కూడా గణపతి విగ్రహాలను ఇక్కడే తెచ్చి ఘనంగా నిమజ్జనం చేశారు. బోయిన్‌పల్లి, తిరుమలగిరి కార్ఖానా ప్రాంతాల నుంచే కాకుండా వనపర్తి నుంచి కూడా గణపతి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి నిమజ్జనం చేస్తున్నారు. నార్త్‌జోన్ పోలీసులు తిరుమలగిరి, బొల్లారం, కార్ఖానా, మారేడ్‌పల్లి ప్రాంతాలకు చెందిన నాలుగు నుంచి ఐదు అడుగులు లోపల ఉన్న గణపతుల విగ్రహాలను బోయిన్ చెరువులో నిమజ్జనం చేయాలని ముందుగానే మండప నిర్వాహకులకు ఆదేశాలు ఇచ్చారు. దాంతో బోయిన్ చెరువులో నిమజన ప్రక్రియ అందుకుంది. మున్సిపల్, పోలీస్ అధికారులు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. నిమజ్జనం కోసం చెరువుకు వచ్చే ప్రతి విగ్రహాన్ని దగ్గరుండి నిమజ్జనం చేయిస్తున్నారు.



పీసీసీ చీఫ్‌కు అభినందనలు తెలిపిన లింగంగౌడ్

నవతెలంగాణ-ఓయూ

టీపీసీసీ నూతన అధ్యక్షులుగా నియమితులైన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను బీసీ సంఘాల నేతలు కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ మొదటి నుంచి రాష్ట్రంలో 60 శాతం జనాభా ఉన్న బీసీలకే పీసీసీ పీఠం ఇవ్వాలని, తాము చేసిన పోరాటం ఫలించిందన్నారు. అనివార్యంగా బీసీలకు పీసీసీ పీఠం కట్టబెట్టడాన్ని తమ స్వాగతిస్తున్నామని తెలిపారు.కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ బీసీల ఆకాంక్షలను గౌరవించి సామాజిక సమీకరణలు దష్టిలో పెట్టుకొని బీసీలను గౌరవించినట్టుగా భావిస్తున్నామని, రాహుల్ గాంధీకి, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున గార్గేకు ధన్యవాదాలు తెలిపారు. అతి సామాన్యమైన బీసీ కుటుంబంలో పుట్టి అచంచలుగా పీసీసీ స్థాయికి ఎదిగిన మహేష్ కుమార్ గౌడ్‌కు రాష్ట్రంలోని బీసీల తరుపున అభినందనలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బూర శ్రీనివాసు, రవికిరణ్, గోద రవీంద్ర పాల్గొన్నారు.



ఓయూలో బీఆర్ఎస్‌వీ హెల్ప్ డెస్క్

నవతెలంగాణ-ఓయూ

నూతన పీజీ ప్రవేశాలు జరుగుతున్న విద్యార్థులకు బీఆర్ఎస్‌వీ ఓయూ ఆధ్వర్యంలో "హెల్ప్ డెస్క్" ఏర్పాటు చేశారు. ఈ మేరకు నూతన విద్యార్థులకు సహాయపడి అడ్మిషన్ ప్రక్రియ విధివిధానాలు వివరించారు. బీఆర్ఎస్‌వీ ఓయూ నేతలు మల్లేష్, సురేష్ ,చందు, అర్జున్ పాల్గొన్నారు.

సీఈవో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు వర్క్ షాప్‌లో లారీ డ్రైవర్ అసోసియేషన్ వారు ఏర్పాటుచేసిన గణపతి మండపంలో కంటోన్మెంట్ బోర్డ్ సీఈవో మధుకర్ నాయక్ సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. సిబ్బంది ఏర్పాటుచేసిన అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డ్‌కు చెందిన పలు విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



పాత బోయిన్‌పలి హరిజన బస్తీలో సోమవారం అన్న ప్రసాద కార్యక్రమాలను నిర్వహించారు.కార్యక్రమానికి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో బురి యాదగిరి నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ- కంటోన్మెంట్



టీపీసీసీ చీఫ్‌ను కలిసిన ప్రతాప్

నవతెలంగాణ-కంటోన్మెంట్

టీపీసీసీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన మహేష్ కుమార్ గౌడ్‌ను సోమవారం కాంగ్రెస్ కంటోన్మెంట్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ కలిసి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. మహేష్ కుమార్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని, ప్రజా జీవితంలో కొనసాగాలని, పార్టీకి, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ తన సేవలు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు దండుగుల యాదగిరి, సిరాజ్, షకీబ్ తదితరులు పాల్గొన్నారు..

రైస్ బ్రాన్ ఆయిల్‌తో స్మార్ట్‌గా వండండి

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ఆరోగ్యకరమైన జీవనం దిశగా మన ప్రయాణంలో, వంటగదిలో అతి చిన్న ఎంపికలు కూడా మన శ్రేయస్సుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. అటువంటి ఎంపికలలో ఒకటి మనం ఉపయోగించే వంట నూనె, ఇది మన ఆరోగ్యాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుంది. అందుబాటులో ఉన్న అనేక ఎంపికలలో, రైస్ బ్రాన్ ఆయిల్ పోషక ప్రయోజనాలు, కలినరీ వైవిధ్యత రెండింటినీ కోరుకునే వారికి ప్రత్యేకంగా నిలుస్తుంది.

వరి గింజ బయటి పొరలో 10,000 పీపీఎం కంటే ఎక్కువ గాఢతలో ఒరైజనాల్ అనే యాంటీఆక్సిడెంట్‌తో సహా అవసరమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఒరైజనాల్ మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్)ని కొనసాగిస్తూ చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)ని తగ్గించే సామర్థ్యానికి ప్రసిద్ధి చెందింది. ఇది కూరగాయలు లేదా పొద్దుతిరుగుడు నూనె వంటి సాధారణ వంట నూనెలకు గుండె-ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా రైస్ బ్రాన్ ఆయిల్ చేస్తుంది. దాని సమతుల్య కొవ్వు ఆమ్ల ప్రొఫైల్, పాలీ అన్‌శాచురేటెడ్ (పీయూఎఫ్ఏ), మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వుల సమాన నిష్పత్తితో, హృదయ ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది మరియు కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించడంలో సహాయపడుతుంది.

రైస్ బ్రాన్ ఆయిల్ గురించి నిపుణులు ఏమంటున్నారు:

అంతర్జాతీయ రైస్ బ్రాన్ ఆయిల్ కాన్ఫరెన్స్ 2023 వద్ద పీహెచ్‌డీ డాక్టర్ రోహిణి శర్మ, ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్, కన్సల్టెంట్ ఫుడ్ టెక్నాలజిస్ట్, కన్సల్టెంట్ న్యూట్రిషనిస్ట్ అండ్ లైఫ్ కోచ్ - మాట్లాడుతూ "రైస్ బ్రాన్ ఆయిల్ రోజువారీ వంటకాలకు చాలా మంచిది. ఇది చాలా ఆరోగ్యకరమైన నూనె. రైస్ బ్రాన్ ఆయిల్ ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలను ఎక్కువ మంది ప్రజలు తెలుసుకోవాలి. రైస్ బ్రాన్ ఆయిల్ 1:1 నిష్పత్తిలో పీయూఎఫ్ఏ, ఎంయూఎఫ్ఏతో కూడిన సమతుల్య కొవ్వు ప్రొఫైల్‌ను కలిగి ఉంది. చాలా తక్కువ సంతృప్త కొవ్వు ఆమ్లాలను కలిగి ఉంటుంది. ఇందులో న్యూట్రాస్యూటికల్స్ - ఒరైజనాల్, టోకోఫెరోల్, టోకోట్రినాల్స్ - పుష్కలంగా ఉన్నాయి. ఇవి సహజ యాంటీఆక్సిడెంట్లు. రైస్ బ్రాన్ ఆయిల్‌లో ఉండే ఒరైజనాల్ చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డిఎల్)ని తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్)ని నిర్వహిస్తుంది. మనమందరం రైస్ బ్రాన్ ఆయిల్‌కి మారడం ద్వారా మన వంటగదిలో ఆరోగ్యకరమైన ఎంపిక చేసుకునే దిశగా మారాలి" అని అన్నారు.



ఐసీఆర్‌బీఓ-2023 వద్ద డాక్టర్ షెరిల్ సాలిస్, రిజిస్టర్డ్ డైటీషియన్‌లో సర్టిఫైడ్ దయాబెటిస్ ఎడ్యుకేటర్, ఇన్సులిన్ పంప్ స్పెషలిస్ట్, నర్చర్ హెల్త్ సొల్యూషన్స్ వ్యవస్థాపకులు మాట్లాడుతూ "ప్రజలను రైస్ బ్రాన్ ఆయిల్ ఉపయోగించాలని మేము సిఫార్సు చేస్తున్నాము, ఇది భారతదేశంలో తయారు చేశారు. మన భారతీయ రుచులకు ఆదర్శంగా సరిపోతుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ న్యూట్రిషన్ , ఐసీఎంఆర్,డబ్ల్యూహెచ్ఓ, అనేక సంస్థలు క్రమం తప్పకుండా రైస్ బ్రాన్ ఆయిల్ వినియోగాన్ని ప్రోత్సహించాయి. క్లినికల్ ప్రాక్టీస్‌లో, మధుమేహం, గుండె జబ్బులతో బాధపడుతున్న చాలా మంది యువకులను మనం చూస్తున్నాము. మనము పాశ్చాత్య దేశాలను నిరంతరం కాపీ చేస్తున్నాము. రైస్ బ్రాన్ ఆయిల్ వంటి మన ఉత్పత్తులపై దృష్టి సారించలేకపోతున్నాము" అని అన్నారు.

ఆరోగ్య ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు, 'ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్ కొలెస్ట్రాల్‌కు సఫాయ్ కా స్పెషలిస్ట్' పేరుతో కొత్త ప్రచారాన్ని నిర్వహిస్తోంది. ఈ ప్రచారం 'రైస్ బ్రాన్ ఆయిల్ కరే అందర్ సే సఫాయ్', అనే సందేశాన్ని బలంగా వినిపించటంతో పాటుగా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో నూనె పాత్రపై దృష్టి పెడుతుంది. రైస్ బ్రాన్ ఆయిల్ శరీరంలో పేరుకు పోతున్న కొలెస్ట్రాల్‌ను ఎలా క్లియర్ చేస్తుందో వెల్లడించటం ద్వారా, ఈ ప్రచారం రోజువారీ వంటలో రైస్ బ్రాన్ ఆయిల్ చేర్చడం ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించగల సామర్థ్యంతో పాటుగా నూనెలోని అధిక ఒరైజనాల్ కంటెంట్‌ను నొక్కి చెబుతూ, దాని ఆరోగ్య ప్రయోజనాలపై వినియోగదారులకు అవగాహన కల్పించడం ఈ ప్రచారం లక్ష్యం.

ఇటీవలే రైస్ బ్రాన్ ఆయిల్‌కి మారిన గృహిణి సరస్వతి మాట్లాడుతూ "రైస్ బ్రాన్ ఆయిల్‌ని ఉపయోగించడం వల్ల నేను వంట చేసే విధానం మారిపోయింది. ఇది నా కుటుంబం ఇష్టపడే వంటకాలకు తేలికగా ఉంటుంది. ఇది వారి మొత్తం ఆరోగ్యానికి తోడ్పడుతుందని తెలుసుకుని నేను నమ్మకంగా ఉన్నాను. వేయించిన ఆహారాలలో స్ఫుటమైన, తేలికైన ఆకృతిని సృష్టించగల నూనె సామర్థ్యం పోషకాహారంలో రాజీపడకుండా ఆరోగ్యవంతమైన భోజనాన్ని సిద్ధం చేయడానికి నన్ను అనుమతిస్తుంది" అని అన్నారు.

ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి . చంద్ర శేఖర రెడ్డి మాట్లాడుతూ "ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్ కేవలం వంటకు అవసరమైన నూనెగా మాత్రమే కాకుండా, ఆరోగ్య స్పృహ కలిగిన వినియోగదారులకు విశ్వసనీయ మిత్రుడిగా మారింది. 10,000 పీపీఎం ఒరైజనాల్‌తో, మేము రుచి, మెరుగైన ఆరోగ్యం అందించేందుకు కట్టుబడి ఉన్నాము. నాణ్యత, పోషకాహారంపై మా దృష్టిని కేంద్రీకరించే ఉత్పత్తిని అందించడానికి అంకితం చేస్తున్నాము, ఇది ఆరోగ్యకరమైన, మరింత శక్తివంతమైన జీవనశైలికి దోహదపడుతుంది" అని అన్నారు.

గర్భంలో మెదడు అభివృద్ధి పిల్లల భవిష్యత్తుకు పునాది

- అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్



డాక్టర్ నాగ శ్రావణి

నవ తెలంగాణ- జూబ్లీహిల్స్

గర్భంలో మెదడు అభివృద్ధి పిల్లల భవిష్యత్తుకు కీలక పునాది అని అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ (కొండా పూర్) కన్సల్టెంట్ డెవలప్‌మెంటల్, బిహేవియరల్ పీడియా ట్రిషియన్ డాక్టర్ నాగ శ్రావణి తెలిపారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ శిశువు తల్లి గర్భంలో సూక్ష్మ ప్రపంచంలో జీవిస్తుందన్నారు. అన్ని జీవులకు తల్లి భూమి వలే.. కడుపులోని శిశువు శారీరక ఎదుగుదల మాత్రమే కాకుండా మానసిక, భావోద్వేగ అభివృద్ధికి కూడా తల్లి సృష్టించిన ఈ ఆధ్యాత్మిక వాతావరణంపై ఆధారపడు తుందని చెప్పారు. అందువల్ల తల్లుల పోషకాహారం, ఆహార అవసరాలు ఎక్కువ ప్రాముఖ్యతను సంతరించుకుంటాయని తెలిపారు. శిశువు శారీరక ఎదుగుదల, బరువు పెరుగుట, అవయవ అభివృద్ధి, నిర్మాణ అసాధారణతలపై మాట్లాడతారని, కానీ పిండం తాలూకా ముఖ్యమైన ఇంద్రియ అభివద్ధిపై అరుదుగా మాట్లాడతారన్నారు. గర్భాశయంలో ఈ ప్రారంభ దశ నుంచి రెండు సంవత్సరాల ప్రసవానంతర వయస్సు వరకు, బిడ్డ మంచి వాతావరణంలో నేర్చుకోవడం చాలా ముఖ్యమన్నారు. ఇది ఆదర్శవంతమైన అభివృద్ధిని సాధించడంలో సహాయపడుతుందని తెలిపారు. గర్భం లోపల పెరుగుదల వివిధ దశలలో శిశువు అనుభూతి చెందడం ఉంటుందన్నారు.

గర్భం దాల్చిన 11 వారాల నుంచి శిశువు స్పర్శను అనుభవించడం ప్రారంభమవుతుందని తెలిపారు. నోరు, చేతులు, కాళ్ళతో ఉమ్మ నీరు ద్వారా స్పర్శ అనుభూతి చెందుతారన్నారు. చేతులు, కాళ్లతో గర్భాశయ గోడను తాకడం ద్వారా ఇవి తల్లి కదలిక, శారీరక శ్రమకు అనుగుణంగా ఉంటాయన్నారు. ఇది శిశువుకు పరిచయమయ్యే గర్భాశయ గోడ లోపల కదలికను కలిగిస్తుందని పేర్కొన్నారు. పాట్స్, స్ట్రోక్స్, సున్నితమైన ఒత్తిడికి ప్రతిస్పందించగలరన్నారు. ఓదార్పుగా మాట్లాడుతున్నప్పుడు పొట్టపై చేయి వేయడం వల్ల స్పర్శ పెరుగుతుందన్నారు. 18 వారాల గర్భధారణ సమయంలో వినికిడి ప్రారంభమవుతుందన్నారు. శిశువు వినికిడి దాదాపు 26 నుంచి 28 వారాలకు పూర్తిగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రారంభంలో తక్కువ శబ్దాలను వినగలరన్నారు. ఇది పుట్టుకతో మెల్లగా పరిపక్వం చెందు తుందన్నారు. మొదట్లో తల్లి గుండె చప్పుడు, కడుపు చప్పుడు వినగలరన్నారు. నెమ్మదిగా మాట్లాడటం వినడం ప్రారంభిస్తారన్నారు. క్రమంగా వివిధ శబ్దాల మధ్య తేడాను గుర్తించడం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. శిశువు వివిధ శబ్దాలు, స్పర్శలతో తల్లి ఆనందం, విచారం, ఆందోళనను గ్రహించగలరన్నారు. గర్భం దాల్చిన 30 వారాల తర్వాత ఓదార్పు పొందుతున్నారని భావించడం ప్రారంభిం చవచ్చున్నారు.

తల్లిదండ్రులు శిశువుతో వేర్వేరుగా మాట్లాడటం ప్రారంభించాలన్నారు. పాటలు, రైమ్స్, శ్లోకాలు పాడాలి, వాయిస్ హెచ్చుతగ్గులతో చిన్న కథలను చదవడానికి ప్రయత్నించాలని తెలిపారు. రోజులో వేర్వేరు సమయాల్లో స్పర్శ వంటి విభిన్న అనుభూతిని జోడించ డానికి ప్రయత్నించాలన్నారు. ఇది పిల్లవాడిని మంచిగా సష్టించడానికి సహాయపడుతుందని తెలిపారు. తల్లి, తండ్రితో బంధం అదే శ్రవణ ఇన్‌పుట్‌ను పుట్టిన తర్వాత శిశువును ప్రశాంతంగా లేదా శాంతపరచడానికి ఉపయో గించ వచ్చున్నారు. ఇది బిడ్డకు సులభంగా సర్దుబాటు అవుతుందన్నారు. దష్టి అభివద్ధి పుట్టిన తర్వాత అభివద్ధి చెందుతూ ఉంటుందన్నారు. సుమారు 28 వారాలకు కళ్ళు తెరవగలరన్నారు. కానీ గర్భంలో కాంతిని గ్రహించే సామర్థ్యాన్ని కలిగి ఉంటారన్నారు. కాబట్టి, సూర్యరశ్మిలో ఆరుబయట నడక వంటి శారీరక శ్రమను పొందడం చాలా ముఖ్యమన్నారు. గర్భం మూడో నెల నాటికి రుచి ,అభివృద్ధి చెందుతుందన్నారు. అభివద్ధి చెందిన రుచి అమ్నియోటిక్ ద్రవం ద్వారా పరోక్షంగా రుచిని అర్థం చేసుకోవడం ప్రారంభిస్తాయన్నారు. తల్లి తినే అమ్నియోటిక్ ద్రవం ద్వారా వారు ఆహారాన్ని రుచి చూస్తారన్నారు. ఇది పుట్టిన తర్వాత వారి ప్రాధాన్యతలను కొంతవరకు నిర్ణయిస్తుందని పరిశోధ కులు పేర్కొన్నారన్నారు. గర్భం దాల్చిన 28 వారాలకు వాసన మొదలవుతుందని తెలిపారు. పిల్లలు పుట్టిన వెంటనే తెలిసిన వాసనలకు ప్రతిస్పందిస్తారన్నారు. గర్భం దాల్చిన 10 వారాల తర్వాత తల, మెడను కదిలించడం ప్రారంభిస్తారన్నారు.

కోహినూర్ ప్రాజెక్ట్స్ వద్ద వేడుకగా సంగీత కచేరి



నవతెలంగాణ - హైదరాబాద్

హైటెక్ సిటీలోని ఖానామెట్‌లోని ఆరో రియాలిటీకి చెందిన కోహినూర్ ప్రాజెక్ట్ ప్రాంగణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల రెండవ రోజున సంగీత కచేరిని వేడుకగా నిర్వహించారు. ప్రతిమ శశిధర్ బృందం తన భక్తి సంగీత కచేరీతో వీక్షకులను అలరించారు. ఆమె కొన్ని ప్రసిద్ధ అన్నమయ్య కీర్తనలు, భక్తి జానపద పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో కళాకారులను హోప్ అడ్వర్టైజింగ్ డైరెక్టర్లు కెఎస్ రావు, సునీత కాసుకుర్తి, కోహినూర్ ఫెస్టివల్ కమిటీ సభ్యులు సాయి, దేవి వరప్రసాద్ నాయుడు, మనోజ్, చైతన్య, ఎ సురేష్ సన్మానించారు.

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం



- తల్లిదండ్రులకు అప్పగించిన బాచుపల్లి పోలీసులు

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ రాజీవ్ గృహ కల్పలో ఆదివారం ఉదయం బాచుపల్లికి చెందిన 13 ఏండ్ల కిరణ్ సాయి ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పకుండా బయటికి వెళ్ళి... తిరిగి రాలేదు. దాంతో బాలుడి తల్లి కృష్ణవేణి బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. బాచుపల్లి పీఎస్, ఇన్‌స్పెక్టర్ రెండు టీమ్‌లు ఏర్పాటు చేసి అదృశ్యం అయిన బాలుడిని ట్రేస్ ఔట్ చేశారు. 10 గంటల వ్యవధిలో చాకచక్యంగా వ్యవహరించి బాలుడిని ఖైరతాబాద్ వినాయకుడి దగ్గర ఉన్నట్లు గుర్తించారు. ఆదివారం రాత్రి తల్లిదండ్రులకు అప్పగించారు. బాచుపల్లి పోలీసులను కూకట్‌పల్లి డివిజన్ ఏసీపీ ప్రశంసించారు.

ప్రజావాణిలో 126 దరఖాస్తులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులకు ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి నగరం నలుమూలల నుండి ప్రజలు తరలి వచ్చారు. కమిషనర్ ఆమ్రపాలి కాట ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఆయా విభాగాల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఏలాంటి జాప్యం లేకుండా సమస్యను పరిష్కరించి సంబంధిత అర్జీదారులకు తెలియజేయాలని, పరిష్కారం కానట్లయితే అందుకు గల కారణాలు తెలియజేయాలని సూచించారు. ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 7 విన్నపాలు రాగా సంబంధిత అధికారులకు పరిష్కారానికి పంపారు. జీహెచ్ఎంజీ ప్రధాన కార్యాలయం లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 49 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ 31, ట్యాక్స్ 4, ఎల్.డబ్ల్యు.ఎస్ 4, ఎలక్ట్రికల్ 2, వెటర్నరీ 2, ఎంటమాలజీ, ఎస్టేట్స్, స్పోర్ట్స్, సి.ఎం.ఓ.హెచ్, ఇంజనీరింగ్, అడ్మిన్ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున విన్నపాలు వచ్చాయి. ఆరు జోన్లలో మొత్తం 70 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి 28, శేరిలింగంపల్లి 16, సికింద్రాబాద్ 11, ఎల్బీనగర్ జోన్ లో 9, చార్మినార్ జోన్ లో 4, ఖైరతాబాద్ జోన్ లో రెండు అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమీషనర్లు నళిని పద్మావతి, వేణుగోపాల్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, రఘు ప్రసాద్, సత్యనారాయణ, అడిషనల్ సీసీపీలు గంగాధర్, జాయింట్ కమిషనర్ మహేష్ కులకర్ణి, ఎస్.సీ పనస రెడ్డి, ఇరిగేషన్ ఎస్.ఈ నారాయణ, ఎస్టేట్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో ఇద్దరికి కారుణ్య నియామకం



- టీఎన్జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్‌కు సన్మానం

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లా విద్యాశాఖలో ఇద్దరికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం(ఆఫీస్ సబార్డినేట్) కల్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విధి నిర్వహణలో, ఇతర అనారోగ్య కారణాల వల్ల మరణించిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద నియమించేందుకుగాను డీఈవో ఆర్.రోహిణి, ఏడీ శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెండెంట్ జి.రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఖాజా సోహెల్ అహ్మద్‌కు సంబంధించిన కారుణ్య నియామక ప్రతిపాదనను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి పంపగా ఆయన ఆమోదం తెలిపారు. ఈ మేరకు సోమవారం జిల్లా సహాధ్యక్షులు, స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ యూనిట్ అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్, అసోసియేట్ ప్రెసిడెంట్ వి.డేవిడ్, కోశాధికారి ప్రేమ్, ఉపాధ్యక్షులు ఎం.రవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఫెరోజ్ అహ్మద్, ఈసీ ప్రియాదేవ్ ఠాకూర్, ముజాహిద్, వారి కార్యవర్గం ఆధ్వర్యంలో డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనిని(ముజీబ్) కలిసి శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ ఖాలేద్, పీఆర్వో జాహంగీర్, ఏపీఆర్వో వహీద్, శ్యామ్, సుదర్శన్, కలీమ్, మీర్జా, లక్ష్మిపతి, జంబయ్య రమేష్, పరమేష్, దామోదర్, ఐజాజ్, మధు, రతన్ తదితరులు పాల్గొన్నారు.

షెడ్రక్ ఆధ్వర్యంలో 150 మంది టీచర్లు ఎస్టీయూలో చేరిక



- ఆహ్వానించిన ఆ సంఘం జిల్లా, రాష్ట్ర నాయకులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్టీఎఫ్) జిల్లా అధ్యక్ష పదవికి గూడూరి షడ్రక్ రాజీనామా చేసి తనతో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి మమ్మద్ నజీరుద్దీన్, రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ శైలేంద్ర కుమార్, మండల అధ్యక్షులు హరినాథ్, కార్యదర్శి మమ్మద్ ఖదిరుద్దీన్‌తో సహా 150 మంది ఉపాధ్యాయులు కలిసి సోమవారం ఎస్టీయూ టీఎస్ సంఘంలో చేరారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ ఇఫ్తాకారుద్దీన్, ప్రధాన కార్యదర్శి రామ సుబ్బారావు, ఆర్థిక కార్యదర్శి హబీబ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానంద్ గౌడ్ , సహాధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, మహమ్మద్ అలీ, చార్మినార్ మండల్ ఎస్టీ నాయకులు షాహిద్ అలీ వారికి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానంద గౌడ్ మాట్లాడుతూ చుక్కా రామయ్య, రాఘవచార్యులు, శ్యామ్ సుందర్ వంటి గొప్ప వ్యక్తులు ఎస్టీయూలో పనిచేశారని గుర్తుచేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రామ సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా సంఘం, ఉపాధ్యాయుల శ్రేయస్సు కోసం నీతి నిజాయితీతో పని చేసే ఎటువంటి నాయకులను ఎస్టీయూ అక్కున చేర్చుకుంటుందని తెలిపారు. జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఇఫ్తాకారుద్దీన్ మాట్లాడుతూ కష్టపడే వారికి సంఘంలో సముచితమైన న్యాయం జరుగుతుందని, గూడూరి షెడ్రక్ మంచి నాయకుడని కొనియాడారు. గూడూరి షడ్రక్ మాట్లాడుతూ ఎస్టీయూ సంఘంలో తిరిగి సభ్యత్వం తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

కౌన్సిలింగ్ సెంటర్‌లో భర్త ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-బేగంపేట్

భార్యాభర్తల మధ్య జరుగుతున్న గొడవల నేపథ్యంలో పోలీసు స్టేషన్‌కు కౌన్సిలింగ్ వచ్చిన భర్త పోలీసుల ఎదుటే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన బేగంపేట మహిళా పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి అడ్డగుట్టకు చెందిన అఖిల్, సరిత భార్యాభర్తలు. వీరికి రెండేండ్ల క్రితం పెద్దల కుదిర్చిన సంబంధంతో వివాహం జరిగింది. అయితే గత కొంత కాలంగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండటంతో సరిత బేగంపేట మహిళా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు గత కొన్ని రోజులుగా ఇద్దరి మధ్య సయోధ్య కుదుర్చేందుకు బేగంపేట మహిళా పోలీసుస్టేషన్‌లో వీరికి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. ఇదే క్రమంలో సోమవారం కూడా ఇద్దరు కౌన్సిలింగ్‌కు రాగా ఇన్‌స్పెక్టర్ వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నాడు. ఇదే సమయంలో ఒక్కసారిగా అఖిల్ తనను మాటి మాటికి కౌన్సిలింగ్ పేరుతో స్టేషన్‌కు పిలిపిస్తున్నారంటూ తన కోటు జేబులో నుంచి పెట్రోల్ బాటిల్ తీసుకుని పోలీసుల సమక్షంలోనే ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు మంటలను ఆర్పివేసి స్వల్పంగా గాయపడిన అతన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు బేగంపేట పోలీసులు తెలిపారు.

'నిమ్స్' మహా గణపతికి పూజలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

పంజాగుట్ట నిమ్స్ ఉద్యోగులు ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా హాస్పిటల్ ఆవరణలో నిమ్స్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా గణపతికి హాస్పిటల్ డైరెక్టర్ నగరి భీరప్ప సోమవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ 33 ఏండ్ల నుంచి నిమ్స్ ఉద్యోగుల ఆధ్వర్యంలో గణపతిని ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నట్టు తెలిఆపరు. ఈ సందర్భంగా నిమ్స్ గణేష్ ఉత్సవ కమిటీ చైర్మెన్ పి.రాజ్‌కుమార్, ఎం.రాజ్‌కుమార్, శ్రీనివాస్, తదితరులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శాంతివీర్, లైజన్ ఆఫీసర్ మార్తా రమేష్, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యగౌడ్, శ్రీనివాసులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నూతన రోడ్డు పనుల పరిశీలన



నవతెలంగాణ-వనస్థలిపురం

బి.ఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేస్-1లో నూతన రోడ్డు పనులను ప్రారంభించే నేపథ్యంలో కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి సోమవారం డీఈ దామోదర్ రావుతో కలిసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ నరేందర్ తేజ, సభ్యులు కొండల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

గణేష్ నిమజ్జనం ఏర్పాట్ల పనితీరును అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ (పారిశుధ్యం) మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ జీ. రాజు, సర్కిల్ ఉప వైద్యాధికారి మంజుల, మల్కాజిగిరి బండ చెరువు, సఫిల్ గూడ చెరువుల నిమజ్జన కేంద్రాలను సోమవారం పరిశీలించారు. ప్రతీ ఇంటికి స్వచ్ఛ ఆటో టిప్పర్ వెళ్లుటకు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య పనుల్లో భాగంగా బహిరంగంగా చెత్త వేసే ప్రాంతాలు అధికంగా ఉన్నాయని, ప్రణాళిక బద్ధంగా తగ్గించాలన్నారు. అనంతరం మౌలాలి గాయత్రీ నగర్‌లోని జీవీపీ బహిరంగ చెత్త వేసే ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రధాన రహదారి పై ఉన్న చెత్త పాయింట్ తొలగించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైతే జరిమానా విధించాలన్నారు. ఈ కార్యక్రమంలో గాయత్రీ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు మహేష్, సభ్యులు, శ్రీనివాస్, శానిటరీ సూపర్వైజర్ అజయ్, అంజయ్య, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం



- అందెల శ్రీరాములు

నవతెలంగాణ-బడంగ్ పేట్

పేద విద్యార్థుల విద్యాభివద్ధికి అండగా ఉంటామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. సోమవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాదర్‌గుల్ గ్రామంలోని 27వ డివిజన్‌లో నూతనంగా నిర్మించిన మన తెలుగు ఫౌండేషన్ వారి భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తోట శ్రీధర్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొని ప్రారంభించారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ ముందుగా మన తెలుగు ఫౌండేషన్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో పేద విద్యార్థులకు సహాయం చేసి వారికి ఒక బంగారు భవిష్యత్తు చూపాలని... ఇలాంటి సేవ కార్యక్రమాలు మరెన్నో చేయాలని కోరారు. భవిష్యత్తులో మీ అందరికీ ఎల్లప్పుడూ తాను అందుబాటులో ఉంటానని,తన వంతుగా సహాయం అందజేస్తానన్నారు. యువత కూడా మంచి మార్గంలో నడిచి సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొలన్ శంకర్ రెడ్డి,మాజీ నాదర్ గుల్ సహకార సంఘం బ్యాంకు చైర్మెన్ పి.పుల్లారెడ్డి, కార్పొరేటర్ జీ.ఇంద్రసేన, బడంగ్ పేట్ బిజెపి మాజీ అధ్యక్షులు నిమ్మల శ్రీకాంత్ గౌడ్,జిల్లా యువ నాయకులు నిమ్మల రవికాంత్ గౌడ్, యువ మోర్చా కార్పొరేషన్ అధ్యక్షులు రాళ్ల గూడెం రామకష్టారెడ్డి, మీర్పేట్ మున్సిపల్ కార్పొరేటర్ శ్రవణ్ కుమార్, గాజుల మధు తదితరులు పాల్గొన్నారు.

వాసవి కాలనీలో గణేష్ ఉత్సవాలు



నవతెలంగాణ-ఎల్బీనగర్

ఆర్‌కే పురం డివిజన్ పరిధిలోని వాసవీ కాలనీలో కాలనీ వాసుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహా గణపతి 37వ నవరాత్రి మహోత్సవాలలో భాగంగా నిర్వహించిన పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎల్బీనగర్ ఏసీపీ కష్ణయ్య దంపతులు, చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం జరిగిన సాంస్కతిక కార్యక్రమాలను తిలకించి వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి కాలనీ అధ్యక్షుడు గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్త, ప్రధాన కార్యదర్శి అంజయ్య, కోశాధికారి కష్ణయ్య, అష్టలక్ష్మి దేవాలయ అక్షయ ట్రస్ట్ సెక్రటరీ సుధాకర్ గుప్తా, గౌరిశెట్టి అరుణ్, కమిటీ సభ్యులు గౌరీ శంకర్, వనమా సుదర్శన్, తమ్మన్న శ్రీధర్, మాలే అనిల్, ఒరుగంటి వెంకటేశ్వర్లు, గ్రంథి రమేష్, గందే శ్రీకాంత్, డాక్టర్ రాంకిషన్, కష్ణమూర్తి, హనుమంత్ రెడ్డి, మేఘమాల, సుజాత, లక్ష్మీ, భ్రమరాంబా, లావణ్య, అరుణ, వనజ తదితరులు పాల్గొన్నారు.



రోడ్లను సైతం ఆక్రమిస్తున్న బీఆర్ఎస్ నేతలు



- బీజేవైఎం అధ్యక్షులు రాళ్లగూడెం రామకష్టారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

రోడ్లను సైతం బీఆర్ఎస్ నాయకులు ఆక్రమిస్తున్నారని బీజేవైఎం అధ్యక్షులు రాళ్లగూడెం రామకష్టారెడ్డి అన్నారు. సోమవారం రామకష్టారెడ్డి మాట్లాడుతూ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని సర్వే నెంబర్ 138, 139,144, 145 లను 1981 సంవత్సరంలో ఎం.సి.ఆర్. కాలనీ ఏర్పడిన నాటి నుండి కాలనీకి ప్రవేశించే ప్రధాన రహదారి కూడలి వద్ద ప్లాట్ నంబర్లు 73, 74 తూర్పు దిశలో ఉన్న ప్రధాన రహదారిని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అండదండలతో బీఆర్ఎస్ నాయకులు యథేచ్ఛగా కబ్జా చేసి షట్టర్లను నిర్మించారని ఆరోపించారు. సోమవారం ఈ విషయంపై ఆధారాలతో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్‌కు వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు విచ్చలవిడిగా పార్కు స్థలాలను, ప్రభుత్వ భూములను కబ్జా చేయడమే కాకుండా ప్రధాన రహదారులను సైతం కబ్జాలు చేసి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే దీనిపై కమిషనర్ తగిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు, సీడీఎంఏ కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

వానాకాలం..జ్వరాల సమయం

- వాతావరణం మారింది.. రోగాలు మారుతున్నాయి..
- డెంగ్యూతో డేంజర్..

నవతెలంగాణ-హయత్ నగర్



వైరల్ ఫ్లూ కేసులు పెరుగుతున్నాయి. మారిన వాతావరణ పరిస్థితులు మన ఆరోగ్యం పై ప్రభావం చూపుతున్నాయి. వర్షాల వల్ల గత నెల రోజులుగా వైరల్ ఫ్లూ కేసులు క్రమంగా విస్తరిస్తున్నాయి. ఎక్కువ మంది జ్వరం,జలుబు,దగ్గు ఒంటి నొప్పుల సమస్యలతో బాధపడుతున్నారని,ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రులకు వచ్చే వారిలో ఇలాంటి లక్షణాలు ఎక్కువ మందికి ఉంటున్నాయని, అలాంటి వారు వైద్యం చేయించుకోవడం లో నిర్లక్ష్యం చేయవద్దని వైద్యులు సూచిస్తున్నారు. ఒక్కోసారి ఈ వైరల్ ఇన్ఫెక్షన్‌కు చికిత్స తీసుకోకుంటే న్యుమోనియా ఇతర శ్వాస కోశ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

గతంలో కంటే ఈసారి సీజనల్ వ్యాధులు కొంత వింతగా ప్రబలుతున్నాయి. అందుకు ప్రధాన కారణం ముఖ్యంగా జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగం అని విమర్శలు వస్తున్నాయి. అయితే ప్రజలకు హక్కులతో పాటుగా బాధ్యత కూడా అంతే ముఖ్యం అని గమనించాలి. ప్రజల నిర్లక్ష్యం కారణంగా సీజనల్ వ్యాధులు ప్రభలుతున్నాయని చెప్పవచ్చు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైద్యుల వద్దకు అంతు చిక్కని రీతిలో కీళ్ల నొప్పులు, సుమారు వారం పాటు 100డిగ్రీల పై చిలుకు జ్వరం, నీరసం లాంటితో బాధపడుతున్న రోగులు వస్తున్నారు. వస్తున్నాయి. అయితే దానిలో డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా లాంటివి వ్యాపించడం లేదని వైద్యులు చెబుతున్నారు. ఆస్పత్రులకు వచ్చే రోగులలో ఎక్కువ మంది కలుషిత ఆహారం,నీరు,అపరిశుభ్ర వాతావరణ వలన ఈ వ్యాధులు ప్రభలుతున్నాయని వైద్యులు చెబుతున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

బయటికి వెళ్లి వచ్చిన తర్వాత ఇంట్లో ఆహారం తినే ముందు తప్పనిసరిగా చేతులు, కాళ్ళు కడుక్కోవాలి. జ్వరం, జలుబు, దగ్గు,గొంతు నొప్పి, ఒళ్ళు నొప్పులు, కండ్ల కలక,నీరసం,శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు మూడు రోజుల కంటే ఎక్కువగా ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. తుమ్మేటప్పుడు లేదా దగ్గేటప్పుడు మోచేతిని అడ్డుపెట్టుకోవాలి. జలుబు ఇతర ఆరోగ్య సమస్యలు ఉంటే గోరువెచ్చని నీళ్లను తాగాలి. వైరల్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న వ్యక్తులు తిన్న ఆహారం, నీరు తీసుకోవద్దు. చిన్న పిల్లలు, వద్ధులు,గర్భిణులు,గుండె మూత్ర పిండాల సమస్యతో బాధపడుతున్న వారు ఈ సీజల్‌లో చాలా జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇంట్లో వేడి ఆహార పదార్థాలు మాత్రమే తీసుకోవాలి. గోరు వెచ్చని నీటిని మాత్రమే తాగాలి.వీలైనంతగా బయటి పదార్థాలు మానేయాలి.

అన్ని జ్వరాలు డెంగ్యూ, టైఫాయిడ్ కాదు



ప్రస్తుతం సీజనల్ వ్యాధులు సహజం కానీ అన్ని జ్వరాలు టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ కాదని, అన్ని జ్వరాల్లో రక్త కణాలు తగ్గడం సహజం అని దానికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డా వెంకటేశ్వర రావు అన్నారు. ప్రభుత్వ దవాఖానలో అన్ని రకాల టెస్టులు చేస్తారని,ఒక్క శాతం మందికి మాత్రమే రక్త హీనత తగ్గుతుందని,జ్వరం వస్తే పారాసిటమల్, సిరప్‌లు వాడాలని సూచించారు. కొన్ని ప్రభుత్వ దావాఖాన లో సిబ్బంది కొరత ఉండే దానిని పూర్తి స్థాయిలో అధిగమించామని, అయితే కొన్ని చోట్ల వైద్యులు లేని మాట వాస్తవమేన్నారు. త్వరలో వారిని నియమిస్తామని తెలిపారు.

- జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర రావు

సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యం





- ట్రాఫిక్ సిబ్బందికి నూతన టోపీలు అందజేసిన సీపీ సుధీర్ బాబు

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా రాచకొండ ట్రాఫిక్ విభాగం సిబ్బందికి (500) తెల్లటి టోపీలను రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు పంపిణీ చేశారు. ట్రాఫిక్ సిబ్బంది క్షేత్ర స్థాయి విధి నిర్వహణలో ఇబ్బందులకు గురవుతుండడంతో సీపీ స్పందించారు. ఎండలు, వర్షం నుంచి సిబ్బందికి మరింత సౌకర్యంతోపాటు రక్షణను అందించే ఉద్దేశంతో కొత్తగా రూపొందించిన టోపీలను అందరికి అందిస్తు న్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయి సిబ్బంది శ్రేయస్సుకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామన్నారు. రాచకొండ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ కోసం అహర్నిశలు కషి చేస్తున్న సిబ్బందికి టోపీలు ఒక చిరు ప్రశంస అన్నారు. ఈ టోపీలతో ట్రాఫిక్ సిబ్బంది విధి నిర్వహణ మరింత సులభతరం అవుతుంది అని పేర్కొన్నారు. గతంలో ట్రాఫిక్ సిబ్బందికి అందించిన వైట్ హెల్మెట్‌ల బరువు సుమారు 365 గ్రాములు కాగా టోపీల బరువు 165 గ్రాములు మాత్ర ఉంన్నారు. కేవలం 200 గ్రాములు తేలికగా ఉంటుందని, సిబ్బంది రోజువారీ విధుల నిర్వహణలో ఈ టోపీలు ఎంతో ఉపయోగపడ్తాయన్నారు. వీటిని సులభంగా ఉపయోగించుకోవచ్చని, మరింత సౌకర్యవంతంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ శ్రీనివాసులు ఇతర ట్రాఫిక్ అధికారులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం

నవతెలంగాణ-బడంగ్ పేట్



ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనిమాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జల్ పల్లి మున్సిపాలిటీలో ఇటీవల మంజూరైన 128 కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్దిదారులకు సోమ వారం అందజేశారు. లబ్దిదారులు సబితా ఇంద్రారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే తన లక్ష్యమని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు తులం బంగారం ఇప్పటివరకు ఇవ్వలేదని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో ప్రజలందరి సహకారంతో కోట్లాది రూపాయల ప్రత్యేక నిధులతో అనేక అభివద్ధి సంక్షేమ పథకాలను అమలు చేసినట్టు గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం కొందరు స్వార్థపూరితంగా అభివద్ధిని అడ్డుకుం టున్నారని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గంలో గతంలో మంజూరైన రూ. 250 కోట్ల నిధులు ఆపేశారని, ఆపేసిన స్పెషల్ ఫండ్ హెచ్ఎండీఏ నిధులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులను, తామే చేసామని చెప్పుకోవటం, వెళ్లి ఫోటోలు దిగి షో చేయడం మంచి పద్దతి కాదని హితువు పలికారు. మీకు ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే క్యాన్సిల్ చేసిన నిధులను విడుదల చేసి అభివద్ధి చేయాలని, కానీ నిధులు ఆపేసి అభివద్ధిని అడ్డుకోవద్దన్నారు. అదేవిధంగా అడిషనల్ ఫండ్‌ను మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ మండల తహశీల్దార్ ఇందిరదేవి, జల్ పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా బిన్ సాది, వైస్ చైర్మెన్ సయ్యద్ యూసఫ్ పటేల్, కౌన్సిలర్లు షేక్ పమిదఅఫ్జల్, పల్లపుశంకర్, యాహీయా, శంషోద్దీన్, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బడంగ్ పేట్‌లో కోట్లాది రూపాయల భూ కబ్జాలు



- అంతా షాడో మేయర్ దే పెత్తనం
- చెరుకుపల్లి వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములు, పార్కులు, నాలాలను అక్రమంగా ఆక్రమించుకొని షాడో మేయర్ కోట్లాది రూపాయల గడిస్తున్నారని బీజేపీ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి ఆరోపించారు. సోమవారం నాదర్ గుల్ గ్రామంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ప్రజా ప్రతినిధులు, అధికారులు అక్రమ కబ్జా చేశారని ఆరోపించారు. మేయర్ ప్రాతినిథ్యం వహిస్తున్న 31వ డివిజన్‌లోని మున్సిపల్ కాలనీలో సర్వే నెంబర్ 743, 746, 748, 749, 750లలో ఉన్న ప్రభుత్వ భూమిలోని 4 ఓపెన్ స్థలాలను 23 నకిలీ డాక్యుమెంట్లను తయారు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవటం ఏమిటని ప్రశ్నించారు. ఖాతా నెంబరు 94 తండ్రి వెంకట్ రెడ్డి, కుమారులు చుక్క ప్రకాష్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి పేరుతో మున్సిపల్ కమిషనర్,టౌన్ ప్లానింగ్ అధికారులు టీ ఎస్ బీపాస్‌తో అనుమతి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఈ విషయంపై సమాధానం చెప్పాలని కమిషనర్, మేయర్‌కు వినతి పత్రాన్ని అందచేసినా సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారని ఆరోపించారు. అక్రమార్కులపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని ప్లాట్లు తయారు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో రానున్న కాలంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బడంగ్ పేట్ మాజీ సర్పంచ్ నడికుడి యాదగిరి,నాయకులు నిమ్మల రవికాంత్ గౌడ్,బిజేవైఎం అధ్యక్షులు రామకష్టా రెడ్డి,జీ.శివారెడ్డి,తోట ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

కళాశాల సదుపాయాలను సద్వినియోగించుకోవాలి



- ఎంవీఎస్ఆర్ కళాశాల చైర్మెన్ కశ్యప్

నవతెలంగాణ-బడంగ్ పేట్

ఇంజినీరింగ్ విద్యార్థులు కళాశాల సదుపాయాలను సద్వినియోగం చేసుకోవటం వల్ల ఉత్తమ ప్రతిభ గల ఇంజినీర్లవుతారని ఎంవీఎస్ఆర్ కళాశాల చైర్మెన్ కశ్యప్ అన్నారు.సోమవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్‌లోని ఎంవీఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఓరియెంటేష న్ డేను ఘనంగా నిర్వహించారు. మాత్రశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మెన్ పీవీఆర్ కశ్యప్, కోశాధికారి జూపూడి సుధాకర్, మెంబర్, ఎంవీఎస్సార్ కళాశాల సాంస్కతిక కార్యక్రమాల అధ్యక్షురాలు హిరణ్మయి, కళాశాల ప్రిన్సిపాల్ డా. విజయ గుంటూరులతో కలిసి విద్యార్థినుల సాంస్కతిక కార్యక్రమాలతో, కార్యక్రమ ప్రారంభోత్సవాన్ని జ్యోతిప్రజ్వల నతో ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ ఎంవీఎస్సార్ కళాశాలలో గత 43 సంవత్సరా లుగా చక్కని సాంకేతిక విద్యనందించి ఎంతోమంది గొప్ప ఇంజినీర్లను అందించామని, చాలామంది అధ్యాపకులు దశాబ్దాలుగా కళాశాల అభివద్ధిలో భాగస్వామ్యుల య్యారన్నారు. మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులను ద్దేశించి కళాశాలలో చక్కటి సాంకేతిక సదుపాయాలు, చాలా అనుభవజ్ఞులైన ప్రొఫెసర్ల సలహాలతో నైపుణ్యాలను అభివద్ధి చేసుకొని ప్రాంగణ నియామకాలు పొందాలని,దేశ, విదేశాలలో విద్యావకాశాలు పొందాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. విజయ గుంటూరు.. మాట్లాడుతూ ఈ నాలుగు సంవత్సరాలు సరైన మార్గంలో పయనిస్తూ సాంకేతిక విద్యనభ్యసించాలని , ఇందుకు అధ్యాపకులతో పాటు తల్లిదండ్రుల భాగస్వామ్యం కావాలని అన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రుల ప్రశ్నలకు ప్రొ.విజయా గుంటూరు, ప్రొ. ప్రసన్నకుమార్ వారి అనుభవంతో చక్కటి సమాధానాలనందించారు. ఈ కార్యక్రమంలో డీన్ అకడమిక్స్ ఐటీ హెచ్ఓడి, ప్రొ. వేణుగోపాలరావు కోర్సు కరిక్యులంను , పరీక్షల విభాగం సీనియర్ డీన్ ప్రొ.వర్ధని చుండూరు, పరీక్షల విధానాన్ని, డీన్ అడ్మిషన్లు, ప్లేస్మెంట్స్ ప్రొ. ప్రసన్నకుమార్ ప్రాంగణ నియామకాలకు కావలసిన నైపుణ్యాల గురించి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడీలు డా.ఏఆర్ సుబ్రహ్మణ్యం, డా. కామేశ్వరరావు, డా. సీవీ గోపాలకష్ణ రావు, డా. వెంకట సుబ్బయ్య, డా. సరళ, డా. సయ్యద్ తబస్సుమ్, అధ్యాపకులు అధ్యపకేతరులు,పి ఆర్ ఓ.జానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం



మేడ్చల్‌లో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-హయత్ నగర్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్‌నగర్‌లో కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి. శ్రీనివాసరెడ్డి కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు జీవితం అంతా అన్యాయాల్ని ఎదిరించ డంలోనే కొనసాగిందని పేర్కొన్నారు. తెలుగుశాఖ అధ్యక్షులు డాక్టర్ బి. నరసింహ బడి పలుకుల భాష కాకుండా పలుకు బడుల భాష మనభాష కావాలని కాళోజీ ఆశించిన విషయాన్ని గుర్తుచేశారు. ఎవరి భాష వారికి గొప్ప అని, అవతలోడికి అర్థం అవుతదో లేదోనని భాషను మార్చుకోకూడదు అని కాళోజీ అందించిన సందేశాన్ని పలువురు అధ్యాపకులు కొనియాడా రు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గంజి శశిధర్, డా. జి. వెంకటలక్ష్మి, ఏ. మల్లేశం, ఏ. యాదయ్య, న్యాక్ కోఆర్డినేటర్ డా. వి. ఇందిర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



హయత్ నగర్‌లో..



ఉప్పల్‌లో..



పోచారంలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పోచారంలో..

పోచారం మున్సిపాలిటీలో ప్రజాకవి కాళోజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన చైర్మెన్ కొండల్ రెడ్డి తెలంగాణ యాసకు భాషకు కాళోజి తీసుకొచ్చిన గుర్తింపును కొనియాడారు. నేటితరం యువకులు, భావితరం విద్యార్థులు కాళోజి చూపిన మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పల్‌లో..

రామంతపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో సోమవారం ప్రజాకవి కాళోజీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు అనురాధ మాట్లాడుతూ.. తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. అన్ని భాషల్లో కెల్లా తెలుగు భాష అతి ముఖ్యమైన భాషని ఆమె కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు,కళాకారుల వేషధారణలు, బుర్రకథ, పిట్టల దొర వేషాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గీతా వాణి, పద్మావతి , యాస్మిన్, రవి సుధ దీప్తి, సమత, మాధవీ లత, నాగ సాయి, సంధ్య, తదితరులున్నారు.

మేడ్చల్‌లో..

ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా సోమవారం మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపిక నర్సింహ రెడ్డి మున్సిపల్ కార్యాలయంలో వారి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రజల హక్కుల కోసం నిక్కచ్చిగా పోరాడిన మహా వ్యక్తి కాళోజీ నారాయణరావుని తెలిపారు. ప్రజల గొడవను తన గొడవగా తీసుకొని "నా గొడవ" పేరుతో కాళోజీ అద్భుతమైన రచనలు చేశారని గుర్తు చేశారు. తెలంగాణ భాష యొక్క అణిచివేతకి వ్యతిరేకంగా గళం,కలం ఎత్తినవారు కాళోజీని కొనియాడారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ప్రతిష్టించిన వినాయకుడికి మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపిక, మర్రి నర్సింహ రెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్లు దేవరాజు, గణేష్, శ్రీనివాస్ రెడ్డి, హరికృష్ణ యాదవ్, మహేష్,కో ఆప్షన్ సభ్యుడు నవీన్ రెడ్డి, నాయకులు శ్రవణ కుమార్ గుప్తా, మల్లేష్ గౌడ్,మధుకర్ యాదవ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వీరనారి అయిలమ్మ.. తెలంగాణలో భూస్వాములు, పటేల్, పట్వారీలకు ధీటుగా నిలబడింది. ఆత్మగౌరవ పోరాట రణ నినాదాన్ని వినిపించింది. దుర్భర బతుకులకు చరమగీతం పాడేందుకు నడుంబిగించింది. దొరలను గడీల నుంచి ఉరికించిన వీరవనిత. తెలంగాన పౌరుషాన్ని, త్యాగాన్ని, పోరాటాన్ని భావి తరాలకు అందించి ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన పోరాట యోధురాలు. ఈ రోజు ఆమె వర్ధంతి సందర్భంగా ఆ స్ఫూర్తిదాయక జీవిత పరిచయం నేటి మానవిలో...

అన్యాయాన్ని నిలదీసిన సివంగి



రాయపర్తి మండలం కిష్టాపురం గ్రామంలో ఓరుగంటి మల్లమ్మ సాయిలు దంపతులకు నాలుగో సంతానంగా జన్మించారు అయిలమ్మ. చిట్యాల నరసయ్యను వివాహం చేసుకుని పాలకుర్తి గ్రామానికి కోడలుగా వచ్చారు. సోమయ్య, లచ్చయ్య, ముత్తిలింగం, సోమ నర్సమ్మ, లచ్చి నర్సయ్య, ఉప్పలయ్య అనే ఆరు బిడ్డలు వీరికి. అతి పేద కుటుంబంలో కోడలిగా అడుగు పెట్టిన అయిలమ్మ తమ కులవృత్తి అయిన రజక పని చేసుకుంటూ ఉపాధి పొందేవారు. రజక వృత్తిదారులుతో కూడా ఆనాటి దొరలు వెట్టిచాకిరి చేయించుకునేవారు. ఆ వృత్తితో తగిన ఆదాయమే కాక గౌరవం కూడా లేకపోవడంతో అయిలమ్మ కల్లు వ్యాపారం మొదలు పెట్టారు.



గౌరవంగా బతకాలన్న తపనతో...

కోలుకొండ నుంచి పాలకుర్తి వరకు ఆమె 10 కిలోమీటర్లు కల్లుకుండలు కావడిగా మోసుకొని తెచ్చేవారు. నరసయ్య, సోమయ్యలు ఎడ్లబండిపై తోలు తిత్తితో కలుసరఫరా చేసేవారు. కొంత కాలానికి ఆర్థిక ఇబ్బందులు తొలిగి పోయాయి. ఆ ఆదాయంతో సుమారు 200 గొర్రెలు, మేకలు, నాలుగు నాగండ్ల ఎడ్లు, పాలిచ్చే బర్రెలు కొనుగోలు చేశారు. కల్లు వ్యాపారం అభివృద్ధి చెందడంతో భూస్వాములు ఆటంకాలు సృష్టించారు. గౌరవంగా బతకాలన్న తపన ఉన్న అయిలమ్మ దృష్టి అప్పుడు వ్యవసాయం వైపు మళ్ళింది. పెద్ద కొడుకు సోమయ్య, నడిపి కొడుకు లచ్చయ్య ఎదగడంతో మల్లంపెల్లికి చెందిన ఉత్తంరాజు జయప్రదాదేవి వద్ద నాలుగు ఎకరాల పొలం, 35 ఎకరాల చెలుక కౌలుకు తీసుకున్నారు. భర్త నరసయ్య, ఇద్దరు కొడుకుల సహకారంతో వ్యవసాయం ప్రారంభించారు.

ప్రజలతో మమేకమై

కుటుంబమంతా వ్యవసాయ పనుల్లో మునిగి వెట్టి పనులు, కులవృత్తి మానేశారు. వ్యవసాయం చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. మరో ఇద్దరినీ వ్యవసాయ జీతగాల్లుగా పెట్టుకున్నారు. అయిలమ్మ శ్రమనే పెట్టుబడిగా పెట్టింది. కుటుంబ వ్యవహారాల్లో అన్నీ తానై చక్కదిద్దుకునేవారు. దీంతో కొత్త జీవితం ప్రారంభమైంది. వ్యవసాయ పనులతో ఆర్థికంగా ఎదగడంతో పాటు అయిలమ్మ ప్రజలతో మమేకమై కులవృత్తిదారులకు చేదోడు వాదోడుగా నిలిచేవారు. ఇది భూస్వాములకు, పెత్తందారులకు రుచించలేదు. పాలకుర్తి పోలీస్ పటేల్ వీరమనేని శేషగిరిరావు, విస్నూరు దొరకు ప్రధాన అనుచరుల్లో ఒకడు. పాలకుర్తిని శాసిస్తూ తన ఆధిపత్యాన్ని దేశముఖ్ అండతో నిలబెట్టుకుంటున్నాడు. ప్రజలను పీడించడం, వెట్టిచాకిరి చేయించుకోవడం ఇతనికి నిత్య కృత్యం. అయిలమ్మ కుటుంబాన్ని కూడా లొంగదీసుకోవాలని ప్రయత్నించాడు. ఆ సమయంలో అయిలమ్మతో పాటు పోలీస్ పటేల్ చేత పీడించబడిన జీడి నరసయ్య, జీడి బాలయ్య, వీరమనేని రామచంద్రయ్య, మామిండ్ల కొండయ్య, శేరు సోమనరసయ్యల నాయకత్వంలో పాలకుర్తి గ్రామంలో ఆరుట్ల రాంచంద్రారెడ్డి సమక్షంలో ఆంధ్ర మహాసభ ఏర్పడింది. భువనగిరిలో జరిగిన 11వ ఆంధ్ర మహాసభకు పాలకుర్తి నుండి 15 మంది వెళ్లారు. ఆ మహాసభ నుండి స్ఫూర్తి పొందిన అయిలమ్మ దంపతులు సంఘం కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. దాంతో 15 మందితో ప్రారంభమైన సంఘం అతి తక్కువ కాలంలోనే 200 మందికి చేరింది.

సంఘం బలోపేతం కోసం

ఆనాడు అయిలమ్మ ఇల్లే కమ్యూనిస్టు పార్టీ కార్యాలయం. అగ్ర నాయకులు అయిలమ్మ ఇంటికి వచ్చి పోతుండడంతో దొర గూండాలు, పోలీసుల నుండి రక్షించేందుకు అయిలమ్మకు మరింత పకడ్బందీగా రక్షణ కల్పించింది పార్టీ. సంఘం ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు కడవెండి, దేవరుప్పుల కేంద్రాలతో పాటు పాలకుర్తిని కూడా ప్రధాన స్థావరంగా పార్టీ ఎంచుకుంది. తెలంగాణ అగ్రశ్రేని నాయకత్వం అయిలమ్మ ఇంటికి వస్తున్నారనే విషయం విస్నూరు దొరకు కంటగింపయ్యింది. పాలకుర్తికి చకిలం యాదగిరిరావు బాధ్యులుగా ఉండి నడిపించారు. యాదగిరిరావు నేతృత్వంలో జీడి సోమనరసయ్య, చిట్యాల సోమయ్య, అంకిరెడ్డి సోమయ్య, జీడి బాలయ్య, వీరమనేని రామచంద్రయ్య, అయిలమ్మతో కమ్యూనిస్టు పార్టీని నిర్మాణం చేశారు.

ప్రజల్లో విశ్వాసం

ప్రజా చైతన్యవేదికకు వచ్చే ఆరుట్ల రామచంద్రారెడ్డిని విస్నూరు దొర గూండాలు హత్య చేస్తారనే వార్త తెలియడంతో అందరూ అప్రమత్తమయ్యారు. సభలో కళాకారులు పాటలు పడుతున్నారు. కమ్మరి బ్రహ్మయ్య తబలా వాయిస్తున్నాడు. వావిలాల గ్రామం నుండి ఆరుట్ల రామచంద్రారెడ్డిని ఎడ్ల బండిలో సభా వేదిక మీదికి తీసుకువచ్చారు. అంతలోనే గూండాలు దాడులకు పూనుకోవడంతో సంఘం కార్యకర్తలు వారిని తరిమికొట్టారు. దొర మనుషులను కొట్టారనే నెపంతో కమ్మగాని చుక్క సోమయ్య, చిట్యాల నరసయ్య, చిట్యాల సోమయ్యలను పోలీసులు పట్టుకెళ్ళారు. అయిలమ్మ వారిని అడ్డుకుని ఎదిరించారు. దాంతో అయిలమ్మ కొడుకులు సోమయ్య, లచ్చయ్య భర్త నరసయ్యలను కుట్ర కేసులో ఇరికించి జైల్లో పెట్టారు. అయిలమ్మ ఎంతకీ లొంగి రావడం లేదనే కసితో ఆమె పంచ చేను కోసుకురమ్మని విస్నూరు దొర తన గూండాలను పంపుతాడు. ఈ వార్త తెలిసిన సంఘం నాయకులు గుత్పలు చేత పట్టుకొని అయిలమ్మ పంటను రక్షించేందుకు ముందుకు వచ్చారు. దాంతో సంఘ నాయకుల పట్ల ప్రజల్లో విశ్వాసం కలిగింది. పార్టీ ఆదేశాలతో సుమారు 30 మంది పాలకుర్తికి చేరుకున్నారు. ఒకరోజు రాత్రి సుమారు వందమంది గూండాలను విస్నూరు దొర అయిలమ్మ పంట చేనుకు పంపాడు. సూర్యాపేట నుండి వచ్చిన బీమ్ రెడ్డి నరసింహారెడ్డి, నల్లు ప్రతాపరెడ్డి, కాసం కృష్ణమూర్తి, పాలకుర్తి సంఘం కార్యకర్తలు 30 మంది కలిసి గూండాలను ఒక్కసారిగా అడ్డుకున్నారు. తరిమి తరిమికొట్టారు. ఈ సంఘటనతో పాలకుర్తిలో అయిలమ్మ విజేతగా నిలిచింది.

అజ్ఞాత జీవితం

సాయుధ పోరాటం ప్రారంభం కావడంతో అయిలమ్మ కుటుంబంపై కక్ష సాధింపులు పెరిగాయి. కుటుంబమంతా చెల్లాచెదురైంది. లచ్చయ్య, సోమయ్యలు సాయుధ సమరంలో దళ కమాండర్లుగా, ఏరియా కమిటీ నాయకులుగా ఉన్నారు. అయిలమ్మ బిడ్డ సోమనరసమ్మ కొరియర్‌గా సేవలందించింది. అయిలమ్మ అజ్ఞాతంలోకి వెళ్ళింది. 50 ఏండ్ల వయసులో నాయకులతో పోటీపడి పనిచేసింది. రక్షణ కోసం ఆమెకు పార్టీ తుపాకీ ఇచ్చి, ఎలా ఉపయోగించాలో నేర్పించారు. రైఫిల్ వినియోగించే అవసరం అయిలమ్మకు రాకపోవడంతో తిరిగి చకిలం యాదగిరికి అప్పగించారామె. రహస్యం జీవితం గడుపుతున్న అయిలమ్మను పట్టుకోవడానికి గాలిస్తున్న పోలీసులకు బొమ్మెర గ్రామంలో ఉన్నదని తెలియడంతో గ్రామాన్ని నైజాం పోలీసు దిగ్బంధనం చేసి, ఇళ్లిల్లు జల్లెడపట్టారు. గొల్లవారి ఇంటిలో తలదాచుకున్న అయిలమ్మ గొల్లవారి లాగా తన వేషాదరణ మార్చుకొని ధూపబుడ్డి తలకెత్తుకొని గొర్ల మంద కాడికి పోతున్న గొల్లలతో పాటు బయలుదేరి వెళ్లి పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంది. ఇలా ఆమె జీవితంలో అనేక సంఘటను జరిగాయి.

స్ఫూర్తిదాయక జీవితం

అయిలమ్మ భర్త నరసయ్య, కుమారులు సోమయ్య, లచ్చయ్యలు నల్లగొండ జైల్లో దేశముఖ్ కుట్రలతో జైలుపాలయ్యారు. వారిని కలిసేందుకు వంద కిలో మీటర్ల దూరంలో ఉన్న నల్లగొండకు అయిలమ్మ కాలినడకనే వెళ్ళింది. పాలకుర్తి నుండి ఆమెతో పాటు కమ్మగాని సత్తెమ్మ, మామిళ్ళ లక్ష్మీదేవమ్మ, జీడి ముత్యాలమ్మ, మచ్చ రాజయ్య, చిట్యాల మల్లమ్మ, జీడి లక్ష్మీనరసమ్మ, మామిళ్ల గట్టు మల్లమ్మ, అంకిరెడ్డి నర్సమ్మ, చిట్యాల లక్ష్మీనరసయ్య నల్లగొండకు కాలినడకన అన్నం సద్ది మూటలు కట్టుకొని వెళ్లేవారు. తెలంగాణ సాయుధ పోరాట విరమణ తర్వాత అయిలమ్మతో పాటు ఆమె కుటుంబం ఊపిరి పీల్చుకుంది. ఇలా చివరి వరకు స్ఫూర్తిదాయక జీవితం గడిపిన అయిలమ్మ తన 90 ఏండ్ల వయసులో 1986లో సెప్టెంబర్ 10వ తేదీన మరణించారు. అంతిమ యాత్రలో కమ్యూనిస్టు పార్టీల అగ్రనాయకత్వం, వివిధ రాజకీయ పార్టీల పాల్గొన్నారు. కామ్రేడ్ ఏ.సి.రెడ్డి నరసింహారెడ్డి అధ్యక్షతన పాలకుర్తిలో అయిలమ్మ సంస్మరణ సభ జరిగింది. అనేక గ్రామాల నుంచి వేలాదిగా పాల్గొన్న ఈ సభలో కామ్రేడ్. భీమిరెడ్డి నరసింహారెడ్డి, నీర్మాల కృష్ణమూర్తి, మోటూరు ఉదయం వంటి వానే ఐలమ్మ పోరాట పటిమను కొనియాడుతూ నివాళులర్పించారు.

- సాంబరాజు యాదగిరి



కమ్యూనిస్టులకు ఆశ్రయం

సంఘం పెట్టారనే కోపంతో కక్షగట్టిన పోలీసు పటేల్ వీరమనేని శేషగిరిరావు, ఐలమ్మ కుటుంబమంతా వచ్చి తన పొలంలో వెట్టి పనిచేయాలని ఆజ్ఞాపించాడు. అందుకామె నిరాకరించింది. దీంతో ఆగ్రహించిన శేషగిరిరావు, విస్నూరు దొరను కలిసి అయిలమ్మ కమ్యూనిస్టులకు ఆశ్రయం ఇస్తుందని, సంఘం బాగా బలపడిందని, ఇప్పటికే ప్రజలు తన మాట ఖాతార్ చేయడం లేదని అందుకు కారణమైన సంఘాన్ని నామరూపాలు లేకుండా చేయడమే మార్గమని చెప్పాడు. దాంతో విస్నూరు దొర అయిలమ్మ ఇంటి మీదికి గుండాలను పంపించాడు. ఆ గుండాలను అయిలమ్మ కుటుంబమంతా కలిసి తరిమి కొట్టింది. ఆ తర్వాత శివరాత్రి బ్రహ్మోత్సవాలను ప్రజా చైతన్యవేదికగా మార్చుకోవాలని స్థానిక నాయకులు నిర్ణయించుకున్నారు. సంఘం అభివృద్ధికి ఈ సభ దోహదపడుతుందనే లక్ష్యంతో అప్పటి నల్లగొండ జిల్లా నాయకత్వం సభ ఏర్పాటు చేసింది.

కేసు పురోగతిపై నివేదికివ్వండి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేసు దర్యాప్తు పురోగతిపై నివేదికను సెప్టెంబర్ 17లోగా సమర్పించాలని సీబీఐని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆగస్టు 9న కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ-హాస్పిటల్ ట్రైనీ వైద్యురాలిపై లైంగికదాడి, హత్య కేసుపై సీజేఐ జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఈ కేసు దర్యాప్తునకు సంబంధించిన స్టేటస్ రిపోర్టును వచ్చే వారం సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కేసు విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది. లైంగికదాడి ఘటన జరిగిన సమయం, వివరాలతో పాటు సీసీటీవీ ఫుటేజీని సీబీఐకి ఇచ్చారా లేదా అని ఈ సందర్భంగా సుప్రీం ప్రశ్నించింది. సీబీఐ ఫోరెన్సిక్ నివేదికను అందజేసిన తరువాత కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. "శాంపిల్స్ ఎవరు సేకరించారు" అనేది ఈ కేసులో ముఖ్యమైన ప్రశ్న అని, అందుకే ఎవరు సేకరించారనే విషయం నిర్ధారణైన తరువాత వచ్చే మంగళవారం తాజా రిపోర్ట్ దాఖలు చేయాలని కోరింది.

శరీరంపై గాయాలున్నాయి : సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా

ఘటన తరువాత బాధితురాలి శరీరంపై గాయాలు ఉన్నాయని సుప్రీంకోర్టుకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం పరీక్ష జరిపిన ఫోరెన్సిక్ రిపోర్ట్‌ను ఎయిమ్స్‌కి పంపి పరిశీలించాలని సీబీఐ నిర్ణయించిందని చెప్పారు. దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజీని తాము పరిశీలిస్తున్నామని సీబీఐ పేర్కొంది. మరోవైపు సీఐఎస్ఎఫ్ సిబ్బందికి బెంగాల్ ప్రభుత్వం సహకరించడం లేదని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఆర్‌జీ కర్ ఆస్పత్రి వద్ద మూడు మహిళా సీఐఎస్ఎఫ్ కంపెనీలుంటే ఒక కంపెనీకి మాత్రమే వసతులు కల్పించారని ప్రస్తావించింది. కాగా వసతులు కల్పించామని బెంగాల్ ప్రభుత్వం చెప్పింది. మూడు వారాల తరువాత సీఐఎస్ఎఫ్‌కు సదుపాయాలు కల్పించారని కేంద్రం పేర్కొంది. మరోవైపు బెంగాల్‌లో వైద్యుల భద్రతకు తీసుకున్న చర్యలపై బెంగాల్ ప్రభుత్వం స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేసింది.

ఉదయం 9.30 గంటలకే గుర్తింపు

తమ వద్ద ఫోరెన్సిక్ నిర్ధారణ రిపోర్ట్ ఉందని, దీని ప్రకారం 9:30 గంటలకు వైద్యురాలి మృతదేహం ఉన్నట్టు వెలుగులోకి వచ్చిందని కోర్టుకు తుషార్ మెహతా వెల్లడించారు. వైద్యురాలి జీన్స్, లో దుస్తులు తొలగించి ఉన్నాయని, అవి సమీపంలో ఉన్నాయని పేర్కొన్నారు. ఇక శరీరంపై గాయం గుర్తులు కూడా ఉన్నాయని తుషార్ మెహతా పేర్కొన్నారు.

దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన కోల్‌కతా ట్రైనీ డాక్టర్ శవపరీక్షకు సంబంధించిన కీలక పత్రం మిస్సైంది. ఈ విషయం తెలుసుకున్న సుప్రీంకోర్టు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై మండిపడింది. దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. శవపరీక్ష కోసం బాధితురాలి మృతదేహంతో పాటు ఆమె దుస్తులు కూడా పంపారా? అని న్యాయవాది ప్రశ్నించారు. దీంతో పోస్టుమార్టం కోసం అవసరమైన కీలక పత్రం గురించి సీజేఐ డివై చంద్రచూడ్ ఆరా తీశారు. పోస్టుమార్టం కోసం మృతదేహంతో పాటు ఏమి పంపారో అన్నది సంబంధిత చలాన్‌లోని కాలమ్‌లో కానిస్టేబుల్ పూరించాల్సి ఉంటుందని తెలిపారు. ఆ పత్రం లేకుండా శవపరీక్ష నిర్వహించలేరని బెంగాల్ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌ను ఉద్దేశించి అన్నారు.

కాగా, ప్రభుత్వం దాఖలు చేసిన నివేదికలో ఈ చలాన్ గురించి ఎలాంటి ప్రస్తావన లేదని జస్టిస్ జెబి పార్దివాలా అన్నారు. ఒకవేళ అది మిస్ అయితే అలా ఎందుకు జరిగిందో అన్నది రేపటి కల్లా వివరణ ఇవ్వాలని కపిల్ సిబల్‌కు సూచించారు. ఆ చలాన్‌ను కోర్టుకు సమర్పిస్తామని, అయితే కొంత సమయం కావాలని కోర్టును ఆయన అభ్యర్థించారు. మరోవైపు బాధితురాలి మరణం, ఎఫ్ఐఆర్ నమోదు మధ్య 14 గంటలు ఆలస్యం జరిగినట్లు కేసు విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ గుర్తు చేశారు. ఈ కేసు దర్యాప్తు పురోగతిపై నివేదికను సెప్టెంబర్ 17లోగా సమర్పించాలని సీబీఐకి ధర్మాసనం సూచించింది. అలాగే బాధితురాలి ఫొటోలను సోషల్ మీడియా నుంచి తొలగించాలని ఆదేశించింది.

వైద్యుల నిరసనతో రాష్ట్ర వ్యాప్తంగా 23 మంది మృతి : పశ్చిమబెంగాల్ సర్కార్

కోల్‌కతా ఘటనపై డాక్టర్ల నిరసన వల్ల రాష్ట్రవ్యాప్తంగా 23 మంది రోగులు మృతి చెందినట్టు పశ్చిమ బెంగాల్ సర్కార్ సుప్రీంకోర్టుకు వెల్లడించింది. దీంతో నిరసన చేస్తున్న బెంగాల్ వైద్యులు మంగళవారం సాయంత్రం 5 గంటలలోపు తిరిగి విధుల్లోకి చేరాలని ఆదేశించింది. లేనిపక్షంలో ప్రతికూల చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అల్టిమేటం జారీ చేసింది. మంగళవారం సాయంత్రం 5 గంటలలోపు వైద్యులు విధులకు హాజరైనట్లయితే ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ప్రభుత్వానికి తాము తెలియజేస్తామని తెలిపింది. డాక్టర్లకు భద్రతా సౌకర్యాలు కల్పించినప్పటికీ విధులకు దూరంగా ఉంటే భవిష్యత్తులో చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని హెచ్చరించింది. 'వైద్యులు తిరిగి విధుల్లోకి రావాలని మేం కోరుకుంటున్నాం. వారు సేవలందించే వ్యవస్థలో ఉన్నారు. మేం సౌకర్యాలు అందిస్తాం. కానీ వారు ప్రతిస్పందించాల్సి ఉంది. వైద్యులు తిరిగి విధుల్లోకి రాకపోతే ప్రభుత్వం క్రమశిక్షణా చర్యలు తీసుకోకుండా మేం ఆపలేం' అని తెలిపింది.



స్వరం తగ్గించండి
న్యాయవాదికి సీజేఐ మందలింపు

విచారణపై ఓ న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ బిగ్గరగా అరిచాడు. అప్పుడు చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ జోక్యం చేసుకున్నారు. స్వరాన్ని తగ్గించుకోవాలంటూ ఆ న్యాయవాదికి వార్నింగ్ ఇచ్చారు. దీంతో ఆ న్యాయవాది క్షమాపణలు చెప్పారు. వాదనలు జరుగుతున్న సమయంలో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ.. నిరసన ప్రదర్శనలో ఓ లాయర్ రాళ్లు రువ్వినట్లు తన వద్ద ఫొటోలు, వీడియోలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆ సమయంలో అడ్వకేట్ కౌస్తవ్ భాగ్చి మాట్లాడుతూ.. ఓ సీనియర్ న్యాయవాది కోర్టులో ఎలాంటి వ్యాఖ్యలు చేస్తారని ప్రశ్నించారు. అదే సమయంలో చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ మాట్లాడుతూ.. కోర్టు బయట జనాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్నారా, గడిచిన రెండు గంటల నుంచి మిమ్మల్ని గమనిస్తున్నానని, గొంతు తగ్గించి మాట్లాడాలంటూ పేర్కొన్నారు. ముగ్గురు జడ్జీల ముందు మీరు మాట్లాడుతున్నారని, మీరేమి జనాలను ఉద్దేశించి మాట్లాడటం లేదని సీజేఐ తెలిపారు. ఈవార్నింగ్‌తో లాయర్ క్షమాపణలు చెప్పారు.

రాజకీయాల్లో గౌరవం, మానవత్వం ఏది?

(మొదటిపేజి తరువాయి)

మంది ప్రజలు నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆయన చెప్పారు. గురువు కోరిక మేరకు బొటనవేలిని త్యాగం చేసిన ఏకలవ్యుడిని ఆయన గుర్తు చేశారు. దేశంలో నైపుణ్యానికి కొరత లేదని, కానీ దానికి గౌరవమే కొరవడిందని చెప్పారు. భారతదేశంలో ప్రతి రోజూ లక్షలాది మంది ఏకలవ్యుల కథలు విన్పిస్తాయని తెలిపారు. భారత్ పశ్చిమాన అమెరికా, ఇతర దేశాలు నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నాయని, చైనాలో అది లేదని, అంతర్జాతీయ ఉత్పత్తిలో దాని ఆధిపత్యం కొనసాగుతోందని వివరించారు. భారత్‌లో తయారీ రంగంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ఉత్పత్తిని పెంచితే ఉపాధి అవకాశాలు అవే పెరుగుతాయని రాహుల్ తెలిపారు.

వరద సహాయం తక్షణమే విడుదల చేయాలి

(మొదటిపేజి తరువాయి)

ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ చేస్తున్న వక్రీకరణలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులు, ప్రజలకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గం పిలుపునిచ్చింది. రాష్ట్రంలోని పోరాట కేంద్రాలను కలుపుతూ కళాకారుల బృందం శౌర్యయాత్రను నిర్వహిస్తున్నదని తెలిపింది. ఇండియన్ యూనియన్‌లో తెలంగాణ విలీన దినోత్సవాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఇందుకు సంబంధించి పక్షోత్సవాలు జరుగుతున్నాయనీ, అన్ని జిల్లాల్లో సభలు, సమావేశాలను జరపాలని కోరింది. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి సంబంధించి వాస్తవ చరిత్రను కొత్తతరం ముందుకు తేవాలని నిర్ణయించిందని తెలిపింది.

జీఎస్టీ సెస్ పరిహారమివ్వాలి : రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క

రాష్ట్రాలకు జీఎస్టీ సెస్ పరిహారం వాటా ఇవ్వాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన 54వ జీఎస్టీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో వివిధ అంశాలపై లేవనెత్తారు. ఆరోగ్య బీమా ప్రీమియంలపై ప్రస్తుతం ఉన్న 18 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని డిమాండ్ చేశారు. సీనియర్ సిటిజన్ల విషయంలో ఆరోగ్య బీమా ప్రీమియంలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఆరోగ్యబీమా అందరికీ అందుబాటులోకి తీసుకు రావడం ప్రజా ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రభుత్వం, ప్రయివేట్ ఏజెన్సీల నుంచి స్వీకరించే పరిశోధన గ్రాంట్లపై జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలని తెలిపారు. అదనపు తాత్కాలిక ఐజీఎస్‌టీ విభజన పునరుద్ధరణపై లేవనెత్తారు. మొత్తం కేటాయింపులో 4.02 శాతం తెలంగాణ రాష్ట్రానికి తాత్కాలిక విభజన జరిగిందని (ఆర్థిక సంవత్సరం 2015-16 కోసం ఆదాయాలు), కానీ మరొక ఫార్ములా ఆధారంగా ఇప్పుడు 5.07 శాతం రికవరీ చేయాలని తెలిపారు. ఈ విషయాన్ని పరిశీలించడానికి అధికారుల కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు.

నేతన్నలకు రూ.30 కోట్ల రుణమాఫీ

(మొదటిపేజి తరువాయి)

ఏటా 60 మంది విద్యార్థులకు శిక్షణ అందిస్తామని చెప్పారు. ఈ ఏడాదికి గానూ తెలుగు యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తున్నామనీ,, వచ్చే ఏడాది నుంచి ఫోర్త్ సిటీలో ఏర్పాటు చేసే స్కిల్ యూనివర్సిటీలో ఐఐహెచ్‌టీకి సొంత భవనం ఉండేలా చర్యలు తీసుకుంటామని రేవంత్ తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి చిత్తశుద్ధితో పని చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును ఈ ఇనిస్టిట్యూట్‌కు పెడుతున్నట్టు ప్రకటించారు. చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ నేతన్నలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యల్ని పరిష్కరించి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. చేనేత ఉత్పత్తులకు మార్కెట్లో వస్తున్న అనుకరణల బెడద నుంచి కాపాడేందుకు ట్రేడ్ మార్క్ కోసం ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ మినరల్ కార్పొరేషన్ చైర్మెన్ ఎరావత్ అనిల్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేనేత వర్గానికి చేసిందేమి లేదని విమర్శించారు. వారి హయాంలో రైతులు, చేనేతలు ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. అధికారం కోల్పోగానే శవరాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. చేనేత పొదుపు లబ్దిదారులకు, కుటుంబ పెద్దను కోల్పోయిన నామినీలకు ఈ సందర్భంగా సీఎం చెక్కులను అందించారు. అంతకు ముందు చేనేత అభయహస్తం లోగో వర్చువల్‌గా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ విజయలక్ష్మి, నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, చేనేత, జౌళి శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్‌ది త్యాగమయితే..కొందరిది భోగం

"1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్రం వచ్చే వరకూ పదవులను చేపట్టనని ఎమ్మెల్యేగా, మంత్రిగా రాజీనామా చేశారు. చివరి వరకు ఆ మాటకు కట్టుబడి ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో నీలువ నీడ లేని కేసీఆర్‌కు జలదృశ్యం ఇచ్చి అండగా ఉంటే, అదే కేసీఆర్ ఆయనకు నిలువ నీడ లేకుండా చేశారు. తెలంగాణ కోసం పదవిని తృణప్రాయంగా వదిలేసిన బాపూజీది అసలు సిసలైన త్యాగం" అని రేవంత్ అన్నారు. అలాంటిది నేడేమో కొందరు రాజీనామాలు చేయటం, ఎలక్షన్లు తేవటం, కలెక్షన్లు చేసుకోవడం త్యాగమని చెప్పుకుంటున్నారని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఉద్యమం ముసుగులో ఫాం హౌజ్‌లు, బంగ్లాలు సంపాదించుకున్నారని విమర్శలు గుప్పించారు. తెలంగాణ సమాజం ఇదంతా గమనిస్తున్నదని హెచ్చరించారు.

మహిళా శక్తికి ప్రతీక చాకలి ఐలమ్మ : సీఎం రేవంత్‌రెడ్డి

తెలంగాణ తొలి భూపోరాటానికి నాంది పలికిన వీరమాట చాకలి ఐలమ్మ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆమె వర్ధంతి సందర్భంగా ఆయన నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ఆమె కనబరిచిన ధైర్య సాహసాలను సీఎం ఈ సందర్భంగా స్మరించుకున్నారు. భూమి కోసం ఆధిపత్య వర్గాల భూఆక్రమణకు వ్యతిరేకంగా పోరాడి అణగారిన వర్గాలకు మద్దతుగా ఐలమ్మ నిలిచారని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాలుపంచుకుని మహిళలను ఐక్యం చేసిన స్ఫూర్తి ప్రదాత అని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధురాలు చాకలి ఐలమ్మ ప్రేరణతో అనేక మంది మహిళలు ఆనాటి భూపోరాటానికి స్వచ్ఛంధంగా ముందుకొచ్చారని పేర్కొన్నారు. ఆమె బహుజన చైతన్యానికి, మహిళా శక్తికి ప్రతీక అని రేవంత్‌రెడ్డి ఆమె సేవలను కొనియాడారు.

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మెన్‌గా గాంధీ

(మొదటిపేజి తరువాయి)

సాంబశివరావు,

ఎమ్మెల్సీలు: టి.జీవన్‌రెడ్డి, టి.భానుప్రసాదరావు, ఎల్.రమణ, సత్యవతి రాథోడ్

ఎస్టిమేట్స్ కమిటీ చైర్మెన్‌గా నల్లమద పద్మావతిరెడ్డి

ఎమెల్యేలు: వాకిటి సునితా లక్ష్మారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాగంటి గోపినాథ్, సిహెచ్ విజయరామారావు, కోరం కనకయ్య, రాందాస్ మాలోతు, మామిడాల యశస్విని, పి.రాకేష్‌రెడ్డి.

ఎమ్మెల్సీలు: ఎం.ఎస్ ప్రభాకర్‌రావు, సుంకరి రాజు, టి.రవీందర్‌రావు, వి.యాదవరెడ్డి

ప్రజాపద్దుల సంఘం చైర్మెన్ : కె. శంకరయ్య

సభ్యులుగా ఎమ్మెల్యేలు: పట్నోళ్ల సబితా ఇంద్రారెడ్డి

కేపీ వివేకానంద్, వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, పట్నోళ్ల సంజీవరెడ్డి, తోట లక్ష్మీకాంతారావు, కౌసర్ మోహియుద్దీన్


ఎమ్మెల్సీలు: పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శేరిసుభాష్‌రెడ్డి, తాట మధుసూదన్, మిర్జా రియాజుల్ హసన్ ఎఫెన్డి

ఫిరాయింపు ఎమ్మెల్యేకు పీఏసీ చైర్మెన్ పదవి సిగ్గుచేటు
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేకు పీఏసీ చైర్మెన్ పదవిని కట్టబెట్టడం సిగ్గుచేటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు విమర్శించారు. పార్టీ మారని ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టు తీర్పు వచ్చిన రోజే ఇదేం దుర్మార్గమని సోమవారం ఆయన ట్వీట్ చేశారు. ప్రధాన ప్రతిపక్షానికి ఇవ్వాల్సిన పీఏసీ చైర్మెన్ హోదాను, పార్టీ మారిన ఎమ్మెల్యేకు కట్టబెట్టడం ఎక్కడి సంస్కృతి అని ప్రశ్నించారు. గీత దాటిన కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగాన్ని పూర్తి కాలరాస్తోందని తెలిపారు.

రాజ్యాంగస్ఫూర్తిని నిలబెట్టేలా తీర్పు : హరీశ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టేలా ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తెలిపారు. ఎమ్మెల్యేల అనర్హత పిటీషన్లపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్టు తెలిపారు. ఈ తీర్పు కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక విధానాలకు చెంపపెట్టు అని విమర్శించారు. ఈ తీర్పుతో పార్టీ మారిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురికావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఆ తీర్పుకు అనుగుణంగా నాలుగు వారాల్లో స్పీకర్ నిర్ణయం తీసుకుని ప్రజాస్వామ్యాని కాపాడుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

నవచిత్రం



భావోద్వేగాలను ఆవిష్కరించే కాంత

రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా, దుల్కర్ సల్మాన్ వేఫేరర్ ఫిల్మ్స్ కలయికలో రూపొందనున్న బహు భాషా చిత్రం 'కాంత'. ఈ సినిమా రామానాయుడు స్టూడియోస్‌లో పూజాకార్యక్రమాలతో గ్రాండ్‌గా ప్రారంభమైంది. హీరో వెంకటేష్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్‌కు జోడిగా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నారు. సముద్రఖని కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ కూడా ప్రారంభం కావడం విశేషం. 1950 మద్రాస్ బ్యాక్‌డ్రాప్‌లో హ్యూమన్ రిలేషన్స్, సోషల్ ఛేంజెస్‌ని ఎక్స్‌ప్లోర్ చేసే గ్రేట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌గా ఈ సినిమా ఉండనుంది.

రానా దగ్గుబాటి మాట్లాడుతూ, 'వేఫేరర్ ఫిల్మ్స్‌తో భాగస్వామ్యం కావడం ఈ ప్రాజెక్ట్‌కి కొత్త డైమెన్షన్‌ని యాడ్ చేసింది. సురేశ్ ప్రొడక్షన్స్ 60వ యానివర్సరీని పురస్కరించుకుని, స్పిరిట్ మీడియాతో కొత్త శకానికి నాంది పలికేందుకు పర్ఫెక్ట్ మూవీ 'కాంత" అని అన్నారు. 'స్పిరిట్ మీడియాతో జర్నీ ప్రారంభించడం పట్ల ఉత్సాహంగా ఉన్నాను. ఇది మానవ భావోద్వేగాల లోతులను ఆవిష్కరించే అందమైన లేయర్డ్ కథ. ఒక నటుడికి పెర్ఫార్మెన్స్ చేయడానికి చాలా స్కోప్ ఇస్తుంది' అని హీరో దుల్కర్ సల్మాన్ చెప్పారు. డైరెక్టర్ సెల్వమణి సెల్వరాజ్ మాట్లాడుతూ,'ఈ సినిమాతో మేం ప్రేక్షకులను గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలని లక్ష్యంగా పని చేస్తున్నాం' అని తెలిపారు. ఈ చిత్రం తెలుగు, మలయాళం, తమిళం, కన్నడ భాషలలో విడుదల కానుంది.

2వ పాట రిలీజ్‌కి రెడీ



రామ్‌చరణ్

రామ్ చరణ్, డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ ఛేంజర్'. అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమాలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా సినిమాను తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నారు. ఇప్పటికే రిలీజైన పోస్టర్స్, 'జరగండి..' సాంగ్, వస్తోన్న అప్డేట్లతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో వినాయక చవితి సందర్భంగా ఈ మూవీ నుంచి మరో క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఈ నెలలో సినిమా నుంచి మరో సాంగ్‌కి సంబంధించిన అప్డేట్ ఇవ్వబోతున్నట్లు మేకర్స్ తెలియజేశారు.

సారంగపాణి జాతకం షూటింగ్ పూర్తి



'జెంటిల్‌మన్', 'సమ్మోహనం' వంటి విజయవంతమైన సినిమాల తర్వాత మోహనకృష్ణ ఇంద్రగంటి, శివలెంక కృష్ణప్రసాద్ కలయికలో రూపొందుతున్న చిత్రం 'సారంగ పాణి జాతకం'. ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా నటించారు. సోమవారంతో ఈ సినిమా చిత్రీకరణ పూర్తి అయ్యింది.

నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, 'మనిషి భవిష్యత్తు అతని చేతి రేఖల్లో ఉంటుందా? లేదా అతను చేసే చేతల్లో ఉంటుందా? అనే ప్రశ్నకు జవాబు ఇచ్చే ఓ పరిపూర్ణ హాస్యరస చిత్రమిది. హైదరాబాద్, రామోజీ ఫిల్మ్ సిటీ, విశాఖ పరిసర ప్రాంతాల్లో 5 షెడ్యూళ్లలో సినిమాని పూర్తి చేశాం. ఈ నెల 12 నుంచి డబ్బింగ్ ప్రారంభిస్తాం. మా సంస్థలో జంధ్యాలతో పూర్తి స్థాయి హాస్య చిత్రం తీయాలనుకున్నాను. అది సాధ్యపడలేదు. అయితే ఆయన మా సంస్థలో తెరకెక్కిన 'చిన్నోడు పెద్దోడు', 'ఆదిత్య 369' చిత్రాలకు మాటలు రాశారు. ఆయనతో సినిమా చేయలేని లోటును ఇంద్రగంటి మోహనకృష్ణ తీర్చారు.

మా సంస్థలో రెండు విజయవంతమైన సినిమాలు తీసిన మోహనకృష్ణ ఇంద్రగంటితో పూర్తిస్థాయి వినోదాత్మక సినిమా చేయడం ఆనందంగా ఉంది. మా సంస్థలో గుర్తుండిపోయే సినిమా అవుతుంది' అని అన్నారు.

అందరం గర్వపడే ఉత్సవం



దిలీప్ ప్రకాష్

దిలీప్ ప్రకాష్, రెజీనా కసాండ్రా లీడ్ రోల్స్‌లో అర్జున్ సాయి రచన, దర్శకత్వం వహించిన చిత్రం 'ఉత్సవం'. హార్న్‌బిల్ పిక్చర్స్‌పై సురేష్ పాటిల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రకాష్‌రాజ్, నాజర్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ సినిమా ఏపీ, తెలంగాణలో గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది.

ఈనెల 13న సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో హీరో దిలీప్ ప్రకాష్ మీడియాతో మాట్లాడుతూ, 'ఇందులో కథే హీరో. రంగస్థల కళాకారుల మీద తీసిన సినిమా ఇది. సురభి నాటక సమాజం స్ఫూర్తి ఉంది. సినిమా వచ్చిందే నాటకాల నుంచి. మన రూట్స్‌ని గుర్తు చేసేలా ఉంటుంది. ఇందులో హీరోది నాటకాలను మళ్ళీ తీసుకొచ్చే క్యారెక్టర్. అయితే ఇదంతా సందేశం చెప్పేలా కాకుండా ఒక ఎంటర్టైన్మెంట్ విధానంలోనే చూపించాం. ఇందులో తెలుగు కల్చర్, ట్రెడిషన్ చాలా అద్భుతంగా చూపించాం. అనూప్ రూబెన్స్ అద్భుతమైన ఆల్బమ్ ఇచ్చారు. ప్రకాష్‌రాజ్, నాజర్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం ఇలా చాలా మంది అద్భుతమైన యాక్టర్స్ ఉన్నారు. వారందరి నుంచి చాలా నేర్చుకున్నాను. నాకు ఇదొక వండర్‌ఫుల్ జర్నీ' అని అన్నారు.


మా నాన్న సూపర్ హీరో



సుధీర్‌బాబు

సుధీర్ బాబు ఎమోషనల్ రోలర్‌కోస్టర్ రైడ్ 'మా నాన్న సూపర్‌హీరో'తో అలరించడానికి సిద్ధమౌతున్నారు. 'లూజర్' సిరీస్ ఫేమ్ అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వి సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై, సిఏఎం ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం దసరాకి ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేసి మేకర్స్ ప్రమోషన్స్‌ను ప్రారంభించారు. ఈ ఫస్ట్-లుక్ పోస్టర్‌లో సుధీర్ బాబు మధ్యతరగతి కుర్రాడిగా స్కూటర్ నడుపుతూ, స్కూల్ పిల్లలను పలకరిస్తూ కనిపించడం డిలైట్ ఫుల్‌గా ఉంది. తన చిరునవ్వు పోస్టర్‌కి పర్ఫెక్ట్ టచ్ యాడ్ చేసింది. ఈ సినిమా టీజర్‌ను ఈనెల 12న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. 'మా నాన్న సూపర్‌హీరో' మూవీ ప్రేమ, అనుబంధాలకు నిజమైన అర్థాన్ని తెలుసుకుంటూ సోల్‌ని కదిలించే జర్నీని ప్రారంభించిన ఫాదర్ అండ్ సన్ డ్రామా. సుధీర్ బాబు సరసన ఆర్ణ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో సాయిచంద్, సాయాజీ షిండే, రాజు సుందరం, శశాంక్, ఆమని కీలక పాత్రలు పోషిస్తున్నారు.

డబుల్ థ్రిల్ ఇచ్చే సినిమా



శ్రీ సింహ కోడూరి

బ్లాక్ బస్టర్ 'మత్తు వదలరా'కు సీక్వెల్ 'మత్తువదలరా2'. శ్రీ సింహ కోడూరి లీడ్ రోల్‌లో నటించిన ఈ చిత్రానికి రితేష్ రానా దర్శకత్వం వహించారు. ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటించింది. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా ఈనెల 13న విడుదల కానుంది. ఈ క్రమంలో హీరో శ్రీ సింహ మీడియాతో మాట్లాడుతూ, 'ఫస్ట్ పార్ట్ కన్నా యాక్షన్ సీన్స్ ఎక్కువగా ఉంటాయి. ఫస్ట్ పార్ట్‌లో ఉన్న క్యారెక్టర్స్ ట్రావెల్ అవుతాయి. డెలివరీ బాయ్స్ నుంచి ఏజెంట్స్ ఎలా అయ్యారనే లింక్ చూపిస్తాం. ప్రభాస్ ట్రైలర్ లాంచ్ చేసి, చాలా ఎంజాయ్ చేశారు. టీజర్, ట్రైలర్, సాంగ్ చూసి చాలా ఎగ్జైట్ అయ్యారు.ఇందులో ఫరియాది ఫన్నీ క్యారెక్టర్. తన పాత్రకి యాక్షన్ కూడా ఉంది. ఈ సినిమాలో తను సాంగ్ రాయడంతో పాటు కొరియోగ్రఫీ కూడా చేసింది. ఫస్ట్ పార్ట్‌లో మర్డర్ ఎవరు చేశారు అనే ట్రాక్‌తో పాటు డ్రగ్స్ ట్రాక్ ఉంటుంది కదా.. ఇందులో కూడా ఆ రెండింతో పాటు ఇంకొన్ని లేయర్స్ యాడ్ అవుతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రేక్షకులకు డబుల్ థ్రిల్ ఇచ్చే సినిమా ఇది' అని అన్నారు.

మూడు భిన్న ప్రేమ కథలు..




టోవినో థామస్

హీరో టోవినో థామస్ నటించిన పాంటసీ ప్రాజెక్ట్ 'ఏఆర్ఎం'. ఈ చిత్రంలో కృతిశెట్టి, ఐశ్వర్య రాజేష్, సురభి లక్ష్మి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. జితిన్ లాల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగులో మైత్రీ మూవీ మేకర్స్ డిస్ట్రిబ్యూటర్స్ గ్రాండ్‌గా ఈనెల 12న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా హీరో టోవినో థామస్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

'ఇది నా 50వ సినిమా కావడం ఆనందంగా ఉంది. ఇది చాలా ఎగ్జైటింగ్ స్క్రిప్ట్. మూడు డిఫరెంట్ క్యారెక్టర్స్ చేయడం హ్యూజ్ ఛాలెంజ్. డైరెక్టర్ నాపై నమ్మకం ఉంచారు. ఈ మూడు పాత్రలు దేనికవే ప్రత్యేకంగా ఉంటాయి. ఈ మూడు పాత్రలలో దొంగగా కనిపించే మణి పాత్ర కొంచెం ఎక్కువ ఇష్టం. తను చాలా కాన్ఫిడెన్స్ ఉన్న దొంగ. ఆడియన్స్ అ క్యారెక్టర్‌ని చాలా ఎంజాయ్ చేస్తారు. ఇందులో చాలా ఫైట్స్ సీక్వెన్స్‌లు ఉన్నాయి. అందుకే కళరి నేర్చుకున్నాను. ట్రైలర్‌లో మూడు డిఫరెంట్ లవ్ స్టోరీస్ కనిపించాయి. ఈ ప్రేమకథల్లో కృతి శెట్టి, ఐశ్వర్య రాజేష్, సురభి లక్ష్మి అద్భుతంగా నటించారు. ఈ సినిమాని త్రీడీలో రిలీజ్ చేస్తున్నాం. ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో కూడా విడుదల చేస్తున్నాం. దాదాపు ముప్పై భాషల్లో సబ్ టైటిల్స్ వేస్తున్నాం. యూనివర్సల్‌గా కనెక్ట్ అయ్యే సినిమా. 'ఏఆర్ఎం' అంటే 'అజాయంతే రండం మోషణం'. అజయన్ రెండో దొంగతనం అని దీని అర్థం'.

క.. మలయాళం హక్కులు దుల్కర్ సల్మాన్ సొంతం



కిరణ్ అబ్బవరం

హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న భారీ పీరియాడిక్ థ్రిల్లర్ 'క'. ఈ సినిమా గురించి వస్తున్న పాజిటివ్ టాక్ ఇతర చిత్ర పరిశ్రమల దృష్టినీ ఆకర్షిస్తోంది. తాజాగా ఈ సినిమా మలయాళ థియేట్రికల్ రైట్స్‌ను హీరో దుల్కర్ సల్మాన్ ప్రొడక్షన్ కంపెనీ వేఫరర్ ఫిలింస్ సొంతం చేసుకుంది. మలయాళంలో ఈ సినిమాను వరల్డ్‌వైడ్‌గా ఈ సంస్థ థియేట్రికల్ రిలీజ్ చేయనుంది.

ఈ సినిమా ఫస్ట్ లుక్, టీజర్ చూసిన దుల్కర్ సల్మాన్ ఇంప్రెస్ అయి మలయాళ వెర్షన్ తమ వేఫరర్ ఫిలింస్ సంస్థలో విడుదల చేసేందుకు ముందుకొచ్చారు. స్ట్రాంగ్ కంటెంట్‌తో ఈ సినిమా హ్యూజ్ బజ్‌ని క్రియేట్ చేస్తోంది. ఇప్పటికే ఈ సినిమా తెలుగు రైట్స్‌ను నిర్మాత వంశీ నందిపాటి తీసుకున్నారు. ఇదే క్రమంలో త్వరలోనే తమిళ, కన్నడతో పాటు ఇతర భాషల బిజినెస్ కూడా క్లోజ్ కానుంది.

నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్స్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో నిర్మిస్తున్నారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ విలేజ్ బ్యాక్ డ్రాప్ యాక్షన్ థ్రిల్లర్ కథతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు.

వెల్ఫేర్ బోర్డు ద్వారానే కార్మికులను ఆదుకోవాలి

23న కార్మిక సంక్షేమ కార్యాలయం ఎదుట ధర్నా

- ప్రభుత్వ పథకాల నిర్వహణను ఇన్సూరెన్స్ కంపెనీలకివ్వొద్దు : భవన నిర్మాణ కార్మిక సంఘాల సంయుక్త సమావేశంలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు ద్వారానే కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల నిర్వహణను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 23న హైదరాబాద్‌లోని కార్మిక సంక్షేమ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించారు. పదో తేదీ నుంచి 22వ తేదీ వరకు దశలవారీగా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర గౌరవాధ్యక్షులు వంగూరు రాములు అధ్యక్షతన జరిగింది. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకరం కోటంరాజు తీర్మానం ప్రవేశపెట్టారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో వారితోపాటు ఎ.రాజు, ఇ.జగన్, ఆర్.వెంకటేష్(సీఐటీయూ), జి. అనురాధ(ఐఎఫ్‌టీయూ), జి.నాగయ్య (ఐఎఫ్‌టీయూ), సాంబశివుడు (ఐఎఫ్‌టీయూ), కామల ఐలయ్య (బీఎస్ఆర్‌కేఎస్), ఎస్. కుమార్, చంద్రమౌళి (ఎస్‌బీఎస్‌కేఎస్), పాలడుగుల రమేష్, పోతరాజు కుమారస్వామి (బీఆర్‌టీయూ), ఇ. చిన్నారావు, జె. అనిల్ కుమార్ (టీబీఎస్‌కేటీయూ) ఆమోదం తెలుపుతూ మాట్లాడారు. తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద, సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం లాంటి సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించి ప్రభుత్వం తన బాధ్యతల నుండి తప్పుకోవడాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైజర్ కమిటీని నియమించి నిధులను దారి మళ్లించకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని కోరారు. సంక్షేమ పథకాల అమలు కోసం ఇన్సూరెన్స్ కంపెనీలను టెండర్లకు ఆహ్వానించడం దారుణమన్నారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైయిజరీ కమిటీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో 25 లక్షల మంది భవన, ఇతర నిర్మాణ కార్మికులుంటే 15.9 లక్షల మంది బోర్డులో రెన్యూవల్ చేసుకున్న వర్కర్లుగా మాత్రమే ఉన్నట్టు చూపడం దారుణమన్నారు. గిగ్ వర్కర్లకు ప్రీమియం ఎక్కడ నుంచి చెల్లిస్తారని నిలదీశారు. భవన నిర్మాణ కార్మికుల కడుపు కొట్టి పెద్ద పెద్ద ఇన్సూరెన్స్ కంపెనీలకు దోచిపెట్టటం కోసమే ప్రభుత్వం టెండర్లకు పిలిచిందని విమర్శించారు. ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వటం వలన నేడు కార్మికులకు వస్తున్న స్కీములు అందకుండా పోతాయన్నారు. చిన్న చిన్న కారణాలు చూపి తప్పులు వెతికి కార్మికులకు నష్టపరిహారాలు అందకుండా చేస్తాయని వాపోయారు. సెస్సు నిధులను ఎవరు వసూలు చేస్తారు ? ఉన్న నిధులకు రక్షణ ఎవరు? అని ప్రశ్నించారు.



సెస్ పరిహారం భవిష్యత్తుపై చర్చించాం

- వైద్య బీమా జీఎస్టీని ప్రజలకు మేలు చేసేలా పునర్వ్యవస్థీకరించాలి : కేరళ ఆర్థికమంత్రి కెఎన్ బాలగోపాల్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సెస్ పరిహారం భవిష్యత్తుపై కూడా వివరంగా చర్చించినట్టు కేరళ ఆర్థిక మంత్రి కెఎన్ బాలగోపాల్ వెల్లడించారు. సోమవారం నాడిక్కడ జరిగిన 54వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత జీఎస్టీ రేట్లు ఆదాయ తటస్థ రేటు కంటే చాలా తక్కువగా ఉన్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యను పరిష్కరించేందుకు ఈ అంశాన్ని లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని కేరళ అభిప్రాయపడిందని తెలిపారు. జీఎస్టీ సామరస్యానికి సంబంధించి రాష్ట్ర ఆందోళనలపై కూడా సమావేశంలో చర్చించినట్టు పేర్కొన్నారు. ఐజీఎస్టీ ఎందుకు నెగిటివ్ అవుతుందో పరిశీలించిన తర్వాతే రాష్ట్రాల నుంచి రికవరీ వంటి చర్యలు చేపట్టాలని కేరళ స్పష్టం చేసిందని అన్నారు. దీనిపై అధ్యయనం చేసేందుకు అధికారుల స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్టు బాలగోపాల్ తెలిపారు. జీఎస్టీ తొలిదశలో ఆలస్యమైన రుణాలను మాఫీ చేయడం, పన్ను వివాదాలను మాఫీ చేయడంతోపాటు గత జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వీలైనంత త్వరగా అమలు చేయాలని సమావేశం నిర్ణయించింది. వైద్య బీమా జీఎస్టీని సామాన్యులు, మధ్యతరగతి ప్రజలకు మేలు చేసేలా పునర్వ్యవస్థీకరణ చేయాలని డిమాండ్ చేశారు. చక్కెర రహిత స్నాక్స్‌పై పన్ను రేటును సమగ్రంగా సవరించాలన్న కేరళ డిమాండ్‌పై జీఎస్టీ కౌన్సిల్ కూలంకషంగా చర్చించినట్టు తెలిపారు. కేరళ డిమాండ్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించాలనే కేరళ డిమాండ్‌తో ఇతర రాష్ట్రాలు కూడా ఏకీభవించాయి. దీని కోసం పన్ను రేట్లను నిర్ణయించే మంత్రివర్గ కమిటీ ఈ విషయాన్ని వివరంగా చర్చించాలని అన్నారు.

అబూదాబి యువరాజుతో ప్రధాని మోడీ చర్చలు

- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై దృష్టి



న్యూఢిల్లీ : అబూదాబి యువరాజు షేక్ ఖలీద్ బిన్ మహ్మద్ బిన్ జవేద్ అల్ నహయాన్‌తో ఇక్కడ హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోడీ భేటీ అయ్యారు. భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంపై ఇరువురు చర్చించారు. సహకారానికి అవకాశం వున్న రంగాలపై కూడా వారు చర్చించారు. ఈ మేరకు విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్‌లో తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangana Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.



గిరిజనులకు పోలీసుల చేయూత..

- 3 వాగులు దాటి 8కిలోమీటర్లు అభయారణ్యంలోకి వెళ్లి నిత్యావసరాలు పంపిణీ

నవతెలంగాణ-గూడూరు

మహబూబాబాద్ జిల్లా గూడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అత్యంత మారుమూల ఏజెన్సీ గ్రామానికి పోలీసులు వెళ్లి వరదల్లో చిక్కుకున్న గిరిజనులకు తమ చేయూతను అందించారు. సరిగ్గా రోడ్డు సౌకర్యం కూడా లేని దొరవారి తిమ్మాపురం గ్రామానికి వెళ్లేందుకు.. 3 వాగులు దాటి.. 8 కిలోమీటర్ల అభయ అరణ్యంలో ప్రయాణించారు. జిల్లాలో 10రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో దొరవారి తిమ్మాపురం గ్రామానికి బాహ్య ప్రపంచంతో రాకపోకలు తెగిపోయాయి. దాంతో అక్కడి ప్రజలు నిత్యావసరాలు లభించక విలవిల్లాడుతున్నారు. విషయం తెలుసుకున్న గూడూరు సీఐ బాబురావు గూడూరు, కొత్తగూడ, గంగారం ఎస్ఐలు గిరిధర్‌రెడ్డి, కుష కుమార్, రవికుమార్, పోలీస్ సిబ్బందితో కలిసి ఆ గ్రామాన్ని సందర్శించారు. రెండు ట్రాక్టర్ల సహాయంతో అడవిలో 8 కిలోమీటర్లు వెళ్తుండగా 3సార్లు బురదలో ట్రాక్టర్ దిగబడింది. అయినా వెనుదిరగకుండా మరో ట్రాక్టర్ సహాయంతో బయటకు తీసి ప్రమాదకరంగా ప్రవహిస్తున్న మూడు వాగులను దాటి అతి కష్టంమీద గ్రామానికి చేరుకున్నారు. సహాయం కోసం ఎదురుచూస్తున్న ఆ గ్రామంలోని23 కుటుంబాలకు 15 రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేసి భరోసా నిచ్చారు. గిరిజనులకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వర్షం సైతం లెక్కచేయకుండా వాగులు వంకలు దాటుతూ ఏజెన్సీ గ్రామానికి వచ్చి నిత్యావసర వస్తువులు పంపిణీ చేసిన పోలీసులకు గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దొరవారి తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెనుక ప్రభాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జీపీ కార్మికుని ఆత్మహత్యాయత్నం

- ఏడు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు

నవతెలంగాణ -బిజినేపల్లి



ఏడు నెలలుగా జీతం రాకపోవడంతో గ్రామ పంచాయతీ కార్మికుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని అల్లీపూర్‌లో సోమవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లీపూర్‌కు చెందిన సూరంపల్లి బాలపీరు(57) గ్రామ పంచాయతీలో అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికుడిగా కొంతకాలంగా విధులు నిర్వహిస్తున్నాడు. ఏడు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. జీతం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని కోరాడు. జీతం ఇవ్వడం లేదని రెండు నెలల నుంచి విధులకు హాజరు కావడం లేదు. ఈ క్రమంలో తోటి కార్మికులందరికీ జీతాలు చేసి తనకు జీతం ఇవ్వక పోవడంతో బాలపీరు మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి ముందే పురుగుల మందు తాగాడు. ఇతర కార్మికులు వెంటనే నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్టు బంధువులు తెలిపారు. బాలపీరుకు భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు.

కాలువలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-పెద్ద అడిశర్లపల్లి

సరదాగా కోసం వెళ్లి చేపలు పడుతూ ప్రమాదవశాత్తు కాల్వలో జారిపడి గల్లంతైన వ్యక్తి మృతదేహం నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని ఏఎమ్మార్పీ కాల్వలో సోమవారం లభ్యమైంది. గుడిపల్లి ఎస్ఐ డి.నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ పట్టణానికి చెందిన మహ్మద్ జుబేర్(47) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం సాయంత్రం స్నేహితుడు ఆరిఫ్‌తో కలిసి మండలంలోని అక్కంపల్లి జలాశయం ప్రధాన గేట్ల దిగువన ఏఎమ్మార్పీ కాలువ వద్దకెళ్లారు. అక్కడ చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు కాలువలో పడి గల్లంతయ్యాడు. ఆరిఫ్ వెంటనే పోలీసులకు సమాచారం అందజేశాడు. దాంతో ఎస్ఐ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి గేట్ల ద్వారా నీటి విడుదల ఆపేశారు. జాలరులతో గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ రాత్రి సమయం కావడంతో జుబేర్ ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం మళ్లీ గాలింపు చర్యలు చేపట్టగా కాలువలో మృతదేహం లభ్యమైంది. సంఘటనా స్థలాన్ని కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్ గౌడ్ పరిశీలించి ప్రమాద విషయాలు ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

గణేష్ మండపం వద్ద అపశృతి

- పారిశుధ్య పనులు చేస్తూ విద్యుత్ షాక్‌తో సఫాయి కార్మికుని మృతి

నవతెలంగాణ-హవేలి ఘనపూర్


ఫైల్

గణేష్ మండపం సమీపంలో అపశృతి నెలకొంది. మండపం వద్ద శుభ్రం చేసేందుకు వెళ్లిన గ్రామ పంచాయతీ కార్మికుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా హవేలి ఘనపూర్ మండలంలోని రాజపేట్ గ్రామంలో సోమవారం జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజపేట్ గ్రామ పంచాయతీకి చెందిన పారిశుద్ధ కార్మికుడు.. దాసరి పోచయ్య (60) రోజు మాదిరిగానే సఫాయి కార్మికునిగా విధులు నిర్వహించేందుకు ఇంటి నుంచి వెళ్ళాడు. గణేష్ మండపం వద్దకు వెళ్లి అక్కడ శుభ్రం చేస్తున్నాడు. అక్కడ ఏర్పాటు చేసిన జే వైరును పక్కన పెట్టేందుకు పట్టుకోగా పోచయ్యకు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న గణేష్ మండప నిర్వాహకులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా కార్మికుడు పోచయ్య అప్పటికే మృతిచెంది ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హవేలి ఘనపూర్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. సఫాయి కార్మికుడు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

నీటి గుంటలో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మద్యం మత్తులో నీటి గుంటలో పడి వ్యక్తి ప్రాణం కోల్పోయాడు. ఈ ఘటన కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ మండలంలో జరిగింది. ఎస్ఐ కమలాకర్, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. సిర్పూర్ గ్రామపంచాయతీ రైస్‌మిల్ కాలనీకి చెందిన షేక్ హుస్సేన్‌కు భార్యతో మనస్పర్థల కారణంగా పదేండ్ల కిందట విడాకులయ్యాయి. అప్పటి నుంచి హుస్సేన్ తన అక్క సబేరా బేగం ఇంటి వద్ద ఉంటున్నాడు. ఆదివారం రాత్రి మద్యం తాగాడు. ఆ తర్వాత బీడీలు తెచ్చుకుంటానని ఇంటి నుంచి వెళ్లాడు. బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. ఉదయం ఏడు గంటలకు ఇంటి పక్కన ఉన్న నీటి గుంటలో పడి ఉండగా చూశారు. అప్పటికే మృతిచెందాడు. అతని అక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల..

భవితవ్యం ఎటువైపో..?

- గత అనుభవం పునరావృతమయ్యేనా..
- 'సుప్రీం'కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది : ఎమ్మెల్యే కడియం



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల భవితవ్యం ఎటువైపు దారి తీస్తుందనేది చర్చనీయాంశంగా మారింది. సోమవారం హైకోర్టు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై 4వారాల్లో చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు ఆదేశించిన నేపథ్యంలో రాజకీయాలు వేడెక్కాయి. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన కడియం శ్రీహరి (స్టేషన్‌ఘన్‌పూర్), తెల్లం వెంకట్రావు (భద్రాచలం), దానం నాగేందర్ (ఖైరతాబాద్) భవితవ్యంపై వాడివేడి చర్చ జరుగుతున్నది. 'కడియం' స్పందిస్తూ డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేసుకునే అవకాశముందని, సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునే అవకాశం కూడా ఉన్నందున చాలా సమయముందని వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే 2004లో టీఆర్ఎస్ నుంచి నాడు ఉమ్మడి వరంగల్ జిల్లాలో గెలిచిన ఎమ్మెల్యేలు దుగ్యాల శ్రీనివాసరావు (చెన్నూరు), మందాడి సత్యనారాయణరెడ్డి (హన్మకొండ), కమ్మంపాటి లక్ష్మారెడ్డి (నర్సంపేట), బండారి శారారాణి (పరకాల) కాంగ్రెస్‌లో చేరారు. నాడు టీఆర్ఎస్ శాసనసభాపక్షం స్పీకర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలో తీవ్ర జాప్యం జరగడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంలో 'కమ్మంపాటి'ని టీఆర్ఎస్ మినహాయించింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని నాడు హైకోర్టు ఆదేశించడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు డాక్టర్ దుగ్యాల శ్రీనివాసరావు, బండారి శారారాణి పదవులకు రాజీనామా చేశారు. వీరి రాజీనామాలను స్పీకర్ సురేష్‌రెడ్డి ఆమోదించారు. హన్మకొండ ఎమ్మెల్యే మందాడి సత్యనారాయణరెడ్డిపై స్పీకర్ అనర్హత వేటు వేశారు. మళ్లీ 18 ఏండ్లకు అదే పరిస్థితి మళ్లీ పునరావృతమవుతుందా.. అన్న చర్చ నడుస్తోంది.

డివిజన్ బెంచ్ లేదా 'సుప్రీం'కూ అప్పీల్‌కు వెళ్లొచ్చు : ఎమ్మెల్యే కడియం శ్రీహరి

పార్టీ ఫిరాయింపులపై విస్తృత చర్చ జరగాలని, సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం దీనిపై తీర్పునిస్తే రాజకీయ వ్యవస్థను, ప్రజాస్వామ్య వ్యవస్థకు బాగుంటుందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అభిప్రాయపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై 4 వారాల్లో చర్యలు తీసుకోవాలని సోమవారం హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో 'కడియం' తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. హైకోర్టు తీర్పు పూర్తిపాఠం తెలియదని, మీడియా ద్వారానే తెలుసుకున్నానని, తీర్పు పూర్తి పాఠాన్ని అధ్యయనం చేశాక న్యాయవాదులు, పార్టీ పెద్దలతో మాట్లాడి కార్యచరణ ప్రకటిస్తానన్నారు. ఇది తుది తీర్పు కాదని, సింగిల్ జడ్జి తీర్పు మాత్రమేనని, తాము హైకోర్టు డివిజన్ బెంచ్‌కు లేదా సుప్రీంకోర్టుకు కూడా అప్పీల్ చేసుకునే అవకాశముందన్నారు. చాలా అంచెలున్నందున ఇప్పుడే తొందరపడి ఉప ఎన్నికలు వస్తాయని ఎవరన్నా అనుకుంటే వారిని చూసి జాలిపడాల్సిందేనన్నారు. పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీకి లేదన్నారు.

2014 నుంచి 2023 వరకు.. కాంగ్రెస్, టీడీపీ, వైఎస్సార్ సీపీ, సీపీఐ శాసనసభాపక్షాలను విలీనం చేసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఉప ఎన్నికలు వస్తున్నాయని బీఆర్ఎస్ నేతలు సంతోషపడుతున్నారని, తన కూతురు కావ్యను ఎంపీగా గెలవకుండా ఓడించాలని వారు చాలా ప్రయత్నాలు చేసినా ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. ఎప్పటికైనా బీఆర్ఎస్ నేతలు మారుతారని ఆశించానని, కానీ మారడం లేదన్నారు.

ఉప ఎన్నికలు జరిగేనా..?

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేలుగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన వారిపై అనర్హత వేటు పడితే ఉప ఎన్నికలు జరిగే అవకాశముంది. హైకోర్టు తీర్పును పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు హైకోర్టు డివిజన్ బెంచ్‌లో సవాల్ చేసే అవకాశం ఉంది. ఒకవేళ డివిజన్‌బెంచ్ సైతం సింగిల్ జడ్జీ ఇచ్చిన ఆదేశాలనే బలపరిస్తే.. ఎమ్మెల్యేలు 'సుప్రీం' తలుపు తట్టనున్నారు. ఒకవేళ ఇదే జరిగితే ఇప్పట్లో తేలే అవకాశం లేదు. ముందుగా ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారనేది రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. సభ్యులతో మాట్లాడిన తర్వాత తన నిర్ణయాన్ని స్పీకర్ హైకోర్టుకు తెలియజేసే అవకాశముంది. ఇదిలావుంటే బీఆర్ఎస్ నేతలు మాత్రం ఉప ఎన్నికలు తప్పవని హల్‌చల్ సృష్టిస్తుండటం గమనార్హం. ఈ విషయంపై మీడియా అడిగిన ప్రశ్నలకు 'కడియం' సూటిగా సమాధానమిచ్చారు. ఇది తుది తీర్పు కాదని తెలిపారు. పార్టీ ఫిరాయింపులపై ఇప్పటికే హైకోర్టు రెండు భిన్నమైన తీర్పులనిచ్చిందన్నారు.

మొక్క కుళ్లిపోతోంది.. పూత రాలుతోంది

- వరుస వర్షాలతో పత్తి పంట ఆగం
- వరితో పాటు మిగతా పంటలకూ నష్టం
- రాష్ట్ర వ్యాప్తంగా 8 లక్షల ఎకరాల్లో ఎఫెక్ట్
- రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి : రైతు సంఘాల నాయకులు

అధిక వర్షాలు, వరదలు పంటలను ముంచేశాయి.. పత్తి మొక్క కుళ్లిపోతోంది. పూత రాలిపోతోంది. వర్షాలకు తెగుళ్లు తోడై పత్తి పైరును దెబ్బతీస్తున్నాయి. ఈ వర్షాలకు వరి, మిగతా పంటలకు నష్టం జరిగింది. అత్యధికంగా పత్తి, వరి బాగా దెబ్బతిన్నాయని సమాచారం. పంటలను కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. డ్రోన్ కెమెరాలతో పత్తికి పురుగుల మందు పిచికారీ చేస్తున్నారు. అయినా పంటలు బయట పడే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలు అన్నదాతలకు అపార నష్టాన్ని మిగిల్చాయి. ప్రభుత్వ ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు. రైతులను ఆదుకోవాలని రైతు సంఘాలు కోరుతుండగా.. పంట చేలో నిలిచిన నీళ్లను వెంటనే తొలగించాలని వ్యవసాయ అధికారులు సలహాలు ఇస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 లక్షల ఎకరాల్లో పత్తి, 5 లక్షల ఎకరాల్లో వరి పంట మునిగినట్టు సమాచారం. మహబూబాబాద్, ములుగు, ఖమ్మం, నల్లగొండ, నాగర్‌కర్నూల్, నారాయణపేట, మహబూబ్‌నగర్, హన్మకొండ, భద్రాద్రి, కొత్తగూడెం, సూర్యాపేట, తదితర జిల్లాల్లో నష్టం ఎక్కువగా జరిగిందని అధికారుల అంచనా.



నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

మహబూబ్‌నగర్ జిల్లాలో సాధారణ సాగు 3,35,863 ఎకరాలు. వరదల వల్ల లక్ష ఎకరాలకు పైగా నష్టం వాటిల్లిందని అధికారుల అంచనా, నారాయణపేటలో సాధారణ సాగు 4,29,082 ఎకరాలకు 75 వేల ఎకరాలలో పత్తి, కంది పంటలకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. నాగర్‌కర్నూల్‌లో 5,28,279 ఎకరాలు సాగు కాగా, అందులో పత్తి లక్ష ఎకరాలు, వనపర్తిలో 2,41,726 ఎకరాలు కాగా 25 వేల ఎకరాలలో పత్తి పంట నష్టం జరిగిందని జిల్లాలోని రైతు సంఘాలు అంటున్నాయి. ఖమ్మంలో 70 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగితే పత్తి 30 వేల ఎకరాల్లో, ఆ తర్వాత వరి సాగు నష్టపోయింది. మహబూబాబాద్‌లో పత్తి 5,764 ఎకరాలు, వరి 16,810 ఎకరాలు నీటి పాలైందని రైతులు వాపోయారు. సూర్యపేట జిల్లా హుజూర్‌నగర్‌లో పత్తి, మిర్చి బాగా దెబ్బతిన్నాయని చింతలపాలెం రైతులు ఆవేదన చెందుతున్నారు. సిరిసిల్ల జిల్లాలో 700 ఎకరాల్లో పత్తి, వరి బాగా దెబ్బతిన్నాయని అధికార వర్గాల సమాచారం.

నాగర్‌కర్నూల్ జిల్లా బిజనపల్లి మండలం మంగనూర్ గ్రామంలో 2500 ఎకరాల సాగు భూమి ఉంది. ఇక్కడ అత్యధికంగా నల్లభూములే ఉన్నాయి. వెయ్యి ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. నల్ల భూములు కావడం చేత పంట చేలు ఏపుగా పెరిగాయి. భారీ వర్షాలకు పత్తి పైరు నేలకొరిగింది. కుర్వ మల్లయ్య, వెంకటయ్యకు చెందిన 10 ఎకరాల పత్తి పంట పూర్తిగా దెబ్బతిన్నది. ఐదు లక్షలు ఖర్చు పెట్టి సాగు చేస్తే.. కనీసం పెట్టుబడి కూడా వచ్చేట్టు కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా పంట పొలాలు నీటి నుంచి బయట పడలేదు. దుందుబీ నది, కృష్ణ పరివాహక ప్రాంతం, కోయిల్‌సాగర్, బీమా, నెట్టెంపాడు ప్రాజెక్టుల పరిధిలో పత్తి పైర్లు నీటిలో మునిగిపోయాయి. నాగర్‌కర్నూల్ మండలం మల్యాపూర్, పుల్జాల, తాళ్లపల్లి గ్రామాల పరిధిలో పత్తి, మిర్చి పంటలకు భారీ నష్టం వాటిల్లింది. జూరాల కింది ఆయకట్టు సైతం వరదలకు అతలాకుతలం అయింది. ఇలా ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని ఐదు జిల్లాల్లో రూ.100 కోట్లకు పైగా పంట నష్టం వాటిల్లిందని రైతు సంఘాలు తెలియజేస్తున్నాయి. రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశాయి.

అప్పు చేసి పత్తి పంటను సాగు చేశాం..

జానయ్య, మొల్గర, భూత్పూర్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లా

నేను ఐదెకరాల్లో పత్తి పంట సాగు చేశాను. లక్ష రూపాయల దాకా పెట్టుబడి అయింది. వారం రోజులపాటు కురిసిన బారీ వర్షాలకు పత్తి పంట పూర్తిగా నేలకొరిగింది. కాయలు మురిగిపోతున్నాయి. పూత రాలిపోతోంది. పంట చేతికొచ్చే అవకాశాలు లేవు. ప్రభుత్వం ఆదుకోవాలి.

పంట పొలాల్లో నీటి నిల్వ లేకుండా చేయాలి..

వెంకటేష్, డీఏఓ- మహబూబ్‌నగర్ జిల్లా

అధిక వర్షాలు రావడంతో పంట పొలాల్లో నీరు నిలిచింది. పత్తి, మిర్చి వంటి పొలాల్లో నీటిని సాధ్యమైనంత త్వరగా తొలగించాలి. ఆ తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా, 15కిలోల పొటాష్ చల్లాలి. ఆక్సీకోరైడ్ కాఫర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, గ్రాము కార్బండిజమ్‌ను మూడు సార్లు పిచికారీ చేయాలి. పడిపోయిన మొక్కలను నిల బెట్టేలా ప్రయ త్నించాలి. లేనిచో ఇంకా అధిక నష్టం వచ్చే అవకాశాలు ఉన్నాయి.



ప్రభుత్వంపై ప్రతిపక్షాల రాద్ధాంతం

- వరదలతో నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటాం : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

నవతెలంగాణ-మల్హర్‌రావు/కాటారం

తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు కావాలనే రాద్ధాంతం చేస్తున్నాయని, రైతులు అధైర్యపడొద్దని, అర్హత కలిగిన ప్రతి రైతుకూ రుణమాఫీ అవుతుందని ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అర్హత ఉన్న రైతులందరికీ రుణమాఫీ అవుతుందని తెలిపారు. కొంతమంది ప్రతిపక్ష నాయకులు సాంకేతికపరంగా బ్యాంకుల్లో ఏర్పడిన సమస్యలను అనువుగా చేసుకొని రాజకీయం చేసే ప్రయత్నం చేసున్నారని ఆరోపించారు. ఒక వైపు ప్రకృతి వైపరీత్యంతో ఏర్పడిన అధిక వర్షాలతో వరదలు వచ్చి రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నష్టం జరిగి ప్రజలు అల్లాడిపోతుంటే.. ప్రతిపక్షాలు సహాయక చర్యల్లో పాల్గొనకుండా ఇలా రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు చేరువలో ఉంటూ సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగకుండా వరద సహాయ చర్యలు చేపట్టేలా అధికార యంత్రాంగం ప్రయత్నం చేస్తుందని అన్నారు. వర్షాలు, వరదలతో నష్టపోయిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో వరదలు వచ్చి పంటనష్టం జరిగినా, ఇండ్లు కూలిపోయినా నష్ట పరిహారం అందించలేదని విమర్శించారు. తమ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా పంట నష్టంపై పూర్తి స్థాయిలో సర్వే చేపట్టి పంట నష్ట పరిహారం చెల్లిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీని రద్దు చేయాలి

- సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద రైతుల ధర్నా
- మద్దతు తెలిపి ధర్నాలో కూర్చున్న ఎమ్మెల్యే, సీపీఐ(ఎం) నాయకులు



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలోని డప్పూరు, మల్గీ, వడ్డీ గ్రామాల్లో ఏర్పాటు చేసే ప్రమాదకరమైన ఫార్మాసిటీని వెంటనే రద్దు చేయాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆయా గ్రామాల రైతులు సోమవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. రైతుల ధర్నాకు జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు మద్దతు తెలిపి.. రైతులతో కలిసి ధర్నాలో కూర్చున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మూడు పంటలు పండే పచ్చని ప్రాంతంలో వ్యవసాయాన్ని నాశనం చేసేలా ఫార్మాసిటీని పెట్టొద్దని డిమాండ్ చేశారు. వ్యవసాయంపైనే ఈ గ్రామాల ప్రజల జీవనాధారం ఉన్నదని, ఫార్మాసిటీ వల్ల ఇక్కడ వ్యవసాయం పూర్తిగా దెబ్బతింటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న మంజీరా నది కలుషితమై సంగారెడ్డి జిల్లాతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా కూడా పూర్తిగా కలుషితమవుతుందని తెలిపారు. తాగు నీళ్ల లేక ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి వస్తుందన్నారు. 2013 భూసేకరణ చట్టంలో పంటలు పండే చోట పరిశ్రమలు పెట్టొద్దని ఉన్నప్పటికీ అధికారులు గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ప్రజలకు నష్టం చేసే ఫార్మాసిటీని తక్షణమే రద్దు చేయాలని, లేని పక్షంలో ఫార్మాసిటీ రద్దు చేసే వరకు రైతుల పక్షాన ఆందోళన చేస్తామని చెప్పారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ.మాణిక్యం, గ్రామ రైతు నాయకులు రవీందర్, శివరాజ్, శ్రీకాంత్ మూడు గ్రామాల రైతులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

యూపీఐతో మోసాలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

- రూ.4 కోట్ల మేర మోసం
- నెల వ్యవధిలోనే 1120 మోసాలు
- నిందితులు రాజస్థాన్‌కి చెందిన వారుగా గుర్తింపు : సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ నరసింహ



నవతెలంగాణ-మియాపూర్

యూపీఐ మోసాలతో డబ్బులు కాజేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.4కోట్ల మోసాలకు పాల్పడ్డ 13 మందిని రిమాండ్‌కు తరలించారు. వీరు రూ. 4 కోట్ల వరకు మోసాలకు పాల్పడినట్టు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ కమిషరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ నరసింహ వెల్లడించారు. సుమారు 20 నుంచి 25 మధ్య వయస్సు గల రాజస్థాన్‌కు చెందిన కొందరు యువకులు ఓ ముఠాగా ఏర్పడి.. హైదరాబాద్‌లోని బజాజ్ షోరూమ్‌లే టార్గెట్‌గా తనిఖీ చేసేవారు. విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులను కొనుగోలు చేసి షోరూమ్ క్యూఆర్ స్కాన్‌ను రాజస్థాన్‌కు చెందిన వారి ముఠాకు పంపేవారు. వారు అక్కడ నుంచి డబ్బును పంపించి రెండు రోజుల తర్వాత రాంగ్ పేమెంట్ అని బ్యాంక్ వారికి చెప్పడంతో వారి డబ్బులు తిరిగి అకౌంట్‌లోకి రిటర్న్ చేసుకునేవారు. ఈ విషయమై సైబరాబాద్, హైదరాబాద్, రాచకొండ, తెలంగాణలోని పలు ప్రాంతాల్లో కూడా కేసులు నమోదయ్యాయి. బజాజ్ ఎలక్ట్రానిక్స్ సంస్థ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీసీఎస్ శంషాబాద్, సీసీఎస్ బాలనగర్, మాదాపూర్, కేపీహెచ్‌బీ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు. సోమరాజు, సునిల్, లాక్రామ్, శర్వాణ్, సోమరాజ్, శివలాల్, రమేష్, శ్రావణ్, పప్పురామ్, శ్రవణ్, రాకేష్, రమేష్, అశోక్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.1.72 లక్షల నగదు, రూ.50 లక్షల విలువ గల ఎలక్ట్రానిక్ వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితునితో పాటు ముఠాలోని సభ్యులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రాజస్థాన్‌ను పంపించినట్టు డీసీపీ తెలిపారు. అరెస్ట్ చేసిన 13మంది నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వియత్నాంలో వరదలు, తుపానుకు 46మంది మృతి



- 22మంది గల్లంతు

హనోయ్ : వియత్నాంలో యాగి తుపాను కారణంగా భారీ వర్షాలతో సంభవించిన వరదలు, కొండచరియలు కూలిపడిన ఘటనల్లో ఇప్పటివరకు 46మంది మరణించారని అధికారులు ధృవీకరించారు. మరో 22మంది ఆచూకీ గల్లంతైంది. శనివారం తీరాన్ని దాటిన తుపాను వల్ల 9మంది మరణించగా, తుపాను అనంతరం సంభవించిన వరదల్లో 53మంది చనిపోయారు. కొండచరియలు విరిగిపడిన ఘటనలో ఆరుగురు మరణించారని ప్రకృతి విపత్తుల నివారణ, నియంత్రణా విభాగం వెల్లడించింది. ప్రధానంగా ఐదు ప్రావిన్స్‌ల్లో మరణాలు ఎక్కువగా చోటు చేసుకున్నాయి. పలు నదుల్లో నీటి మట్టం ప్రమాదకర స్థాయిలు దాటి ప్రవహిస్తున్నాయి. యెన్ బై, హ గియాంగ్ నగరాలతో సహా ఉత్తర పర్వత ప్రాంతాలు పలు నీటిలో మునిగాయి. భద్రతా కారణాల దృష్ట్యా విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో అనేక ప్రాంతాలు అంధకారంలో మునిగాయి.

తాత్కాలికంగా ట్రిపుల్ ఐటీ విద్యార్థుల నిరసన వాయిదా

నవతెలంగాణ-ముథోల్

నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో సమస్యల పరిష్కారం కోసం ఐదు రోజులుగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు తాత్కాలికంగా విరమించారు. తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ (టీఎస్ఏఎస్) ఆధ్వర్యంలో శాంతియుత నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. సోమవారం ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ విద్యార్థులతో చర్చలు జరిపారు. సమస్యలను నిర్దీత గడువులోగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో తమ నిరసన, ర్యాలీలను తాత్కాలికంగా నిలిపివేసినట్టు టీఎస్ఏఎస్ ప్రెసిడెంట్ ఆకాష్, జనరల్ సెక్రెటరీ యశ్వంత్ ప్రకటించారు. ట్రిపుల్ ఐటీ పరిపాలన విభాగం నుంచి హామీ పత్రాన్ని స్వీకరించామని వెల్లడించారు. నిర్దీత గడువులోగా సమస్యలను పరిష్కరించకుంటే మళ్లీ నిరసన ప్రారంభిస్తామన్నారు.

తెలంగాణ భవన్‌లో ఘనంగా ప్రజాకవి కాళోజీ జయంతి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజా కవి, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణ రావు 110వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం తెలంగాణ భవన్‌లో అంబేద్కర్ ఆడిటోరియంలో ఈ వేడుకలు నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కాళోజీ నారాయణ రావు చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ భావన రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ మాట్లాడుతూ కాళోజీ నారాయణ రావు దేశం కోసం, తెలంగాణ కోసం చేసిన కృషిని కొనియాడారు. కాళోజీ నారాయణ రావు ఒక గొప్ప కవి, రచయిత, సంఘసంస్కర్త , ఆయన వివిధ రంగాలలో అన్యాయాన్ని ప్రశ్నించిన గొప్ప మానవతా వాధి అని అన్నారు. రిజర్వేషన్‌ల కోసం, లింగ సమానత్వం కోసం అయన పోరాడారు అని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కాళోజీ నారాయణ రావు సేవలను గుర్తించి ఆయన పుట్టిన రోజును తెలంగాణ భాష దినోత్సవంగా జరుపుతుందని, అంతేకాక హెల్త్ యూనివర్శిటీకి ఆయన పేరు పెట్టి ఆ మహనీయుడిని గౌరవించుకుందని అన్నారు. అదే విధంగా కాళోజీ త్యాగాలు, ఆయన రచనలు అజరామరం అని, కాళోజీ ఆలోచనలను ముందుకు తీసుకు వెళ్తూ ఆయన స్ఫూర్తిని కొనసాగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ భవన్ అధికారులు,సిబ్బంది, ఢిల్లీలోని తెలంగాణ వాసులు పాల్గొన్నారు.

పారా స్పోర్ట్స్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి : ఎన్‌పీఆర్‌డీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పారా స్పోర్ట్స్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పారాలింపిక్స్‌లో పాల్గొన్న భారత జట్టుకు 29 పథకాలు సాధించిన క్రీడాకారులకు, రాష్ట్రం నుంచి పాల్గొని పథకం సాధించిన దీప్తికి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. పారా స్పోర్ట్స్‌ను దేశంలో పూర్తిగా నిర్లక్ష్యం చేసినా.. ప్రపంచ స్థాయిలో దేశంతో పాటు రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందని తెలిపారు. వికలాంగుల క్రీడల కోసం నిధులు పెరిగినా పారా క్రీడాకారుల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష పాటిస్తున్నదని పేర్కొన్నారు. క్రీడాకారుల్లో చాలా మంది అసమానతలు, అడ్డంకులకు వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వమే పారా క్రీడాకారుల కోసం ప్రత్యేక స్టేడియాలు, కోచ్‌లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం నుంచి పాల్గొని పథకం సాధించిన దీప్తి క్రీడాకారిణికి రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి ఆర్థిక సహాయాన్ని అందించటం, గ్రూప్ 2 ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వాలని నిర్ణయించడం ఆహ్వానించదగిందని తెలిపారు. ప్రభుత్వం పారా క్రీడాకారులను గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలనీ, ఇప్పటికే ఉన్న పారా క్రీడాకారులకు స్టేడియం, వసతి, కోచ్‌లను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లా కేంద్రంలో పారా క్రీడాకారుల కోసం హాస్టల్ ఏర్పాటు చేసి ఉచితంగా కోచింగ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్రీయ విశ్వవిద్యాలయంలో తెలంగాణ భాషా దినోత్సవం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని తెలుగుశాఖ ఆధ్వర్యంలో "తెలంగాణ భాషా దినోత్సవం" ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ... కాళోజీ జీవితం, వ్యక్తిత్వం, సాహిత్యంలో గల గొప్పతనం గురించి విశ్లేషించారు. తెలంగాణ భాష, యాస కోసం "నా గొడవ" ద్వారా తన జీవితాంతం పరితపించారనీ, నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా సురవరం, దాశరథి, వట్టికోట ఆళ్వార్ స్వామి లాంటి వారితో కలిసి నిజాం వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారని కొనియాడారు. పత్రికల, పాలకుల భాష మాత్రమే ప్రజా భాష కాదని ప్రజా వ్యవహారంలోని భాషను సగౌరవంగా ఆదరించాలని తెలిపిన భాషావాది కాళోజీ అని అభివర్ణించారు. కాళోజీ కవిత్వం గురించి ఆచార్య పి.వారిజారాణి మాట్లాడుతూ.. "అన్నపు రాశులు ఒకచోట, ఆకలి మంటలు ఒకచోట" అంటూ ఆయన కవిత్వంలో పీడీత వర్గ నిర్మూలన కోసం పాటుపడిన విధానాన్ని తెలిపారు. లార్డ్ బైరన్ చెప్పిన "ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక" అన్న నినాదం ద్వారా సాహిత్య శక్తిని లోకానికి అందించారని కొనియాడారు. ఆచార్య వి.త్రివేణి మాట్లాడుతూ.. కాళోజీ తన కథల్లో సమకాలీన ప్రజా జీవితాన్ని ఆధారం చేసుకుని తెలంగాణ సమాజం లోని సమస్యలకు కథారూపం ఇచ్చారని ప్రశంసించారు. డాక్టర్ పి.విజయ్ కుమార్ "కాళోజీ భాషా వైవిధ్యం' అన్న అంశంపై ప్రసంగిస్తూ తెలంగాణ సజీవ భాషలోని ఔన్నత్యాన్ని తన జీవితాంతం నిలుపుకున్న భాషా వాది కాళోజీ అని అభివర్ణించారు. కార్యక్రమంలో డాక్టర్ బాశెట్టి లత, తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు, ఆచార్య డి. విజయలక్ష్మి, డాక్టర్ భుక్యా తిరుపతి, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత రమేష్ నాయక్, పరిశోధకులు, విద్యార్థులు అధికంగా పాల్గొన్నారు.

సమాజం కోసం నిరంతరం తపించారు

- అసెంబ్లీ లాంజ్‌లో కాళోజీకి నివాళి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పద్మవిభూషణ్, ప్రజాకవి, కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా అసెంబ్లీ లాంజ్‌లో ఏర్పాటు చేసిన చిత్రపటానికి శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమాజ బాగోగుల కోసం నిరంతరం తపించారని గుర్తు చేశారు. ఆయన చేసిన కృషి, పట్టుదల గురించి స్మరించుకున్నారు. నివాళు లర్పించిన వారిలో శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష్ ముదిరాజ్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య , కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, రాజ్యసభ సభ్యులు అనీల్ కుమార్ యాదవ్, టీఎంఆర్‌ఈఐఎస్ ప్రెసిడెంట్ ,వైస్ చైర్మెన్ ఫహీం ఖురేషీ, లెజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి నరసింహా చార్యులు తదితరులున్నారు.

సీఎంకు ధన్యవాదాలు తెలిపిన సీపీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ సీపీగా రెండో సారి బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సీపీ సీవీ ఆనంద్ సీఎంను మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.

సీఎం సహాయ నిధికి రూ.కోటి విరాళం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వరద విపత్తు కారణంగా నష్టపోయిన వారిని ఆదుకునేందుకు తమ వంతు బాధ్యతగా సైజన్ గ్రూప్ కంపెనీ రూ. కోటి విరాళాన్ని అందజేసింది. సోమవారం హైదరాబాద్‌లోఉన్న జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ఆ కంపెనీ ప్రతినిధులు సీఎంను కలిసి ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. కోటి విరాళం అందజేశారు.

ఆర్టీసీలో యూనియన్లను అనుమతించాలి

- మిగిలిన వాళ్లకూ బాండ్ పైసలివ్వండి : సీఎం, రవాణామంత్రికి ఎస్‌డబ్ల్యూయూ విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీలో కార్మిక సంఘాలను అనుమతించాలని టీజీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ (ఐఎన్‌టీయూసీ) రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రాలు సమర్పించినట్టు ఆ కమిటీ సోమవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపింది. 2013 వేతన సవరణ బాండ్ల డబ్బుల్ని డ్రైవర్, కండక్టర్లకు మాత్రమే చెల్లించారనీ, మెకానిక్‌లు, సెక్యూరిటీ, సూపర్ వైజర్స్, ఆఫీస్, మెడికల్ సిబ్బందికి ఇప్పటికి చెల్లించలేదని గుర్తుచేశారు. ఆర్టీసీలో కార్మిక సంఘాలను అనుమతిస్తామని కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నదనీ, ఆపార్టీ అధికారంలోకి వచ్చి 9 నెలలు దాటినా ఇప్పటికీ దాన్ని కార్యరూపంలోకి తేకపోవడాన్ని కార్మికులు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఆర్టీసీ కార్మకులను ప్రభుత్వంలో విలీన పక్రియను వెంటనే పూర్తిచేయాలని కోరారు. ఈ సందర్భవంగా పలు దీర్ఘకాల పెండింగ్ సమస్యల్ని ఏకరువు పెట్టారు.

చివరి బాధితుని వరకు సహాయమందిస్తాం

- వరదల్లో ఇండ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు
- యుద్ధప్రాతిపదికన రహదారుల మరమ్మతులు : రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరదల్లో నష్టపోయిన చివరి బాధితుని వరకు సహాయమందిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో భారీ వర్షాలు, వరద పరిస్థితులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. వర్షాల వల్ల ఇండ్లు కోల్పోయిన వారికి రూ.5 లక్షలతో పాటు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇందుకు సంబంధించి ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సూచించారు. బాధిత కుటుంబాలకు రూ.16,500 తక్షణ ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ. 10వేలు ఇవ్వనున్నట్టు చెప్పారు. బాధితులకు అందించే సాయంలో అవినీతి అక్రమాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలతో చెడిపోయిన రహదారులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను రెండూ మూడ్రోజుల్లో తయారు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వర్షాలతో నష్టపోయిన అంగన్వాడీ, ప్రభుత్వ ఆస్పత్రులు, విద్యాసంస్థల వివరాలను 24 గంటల్లో సచివాలయంలోని ఆయా విభాగాలకు పంపించాలని సూచించారు.

వర్షాలకు ఇండ్లల్లోకి నీరు చేరి భూమి, ఆస్తి తదితర పత్రాలను నష్టపోయిన బాధితులు సంబంధిత పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో ఫిర్యాదు చేయాలని సూచించారు. తడిసిన ప్రతి గింజనూ పౌర సరఫరాల శాఖ ద్వారా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆయా శాఖలకు సంబంధించి ఎంత నష్టం జరిగింది, ఎన్ని నిధులు అవసరమవుతాయో పకడ్బందీగా అంచనా వేయాలని సూచించారు.

కేంద్రానికి పంపే నివేదికలో పొందుపర్చాల్సిన అంశాలను తయారు చేయాలని అధికారులకు సూచించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక కార్యదర్శి అర్వింద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ తొలగింపు పనులు త్వరగా చేయండి

- టీజీఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ముషారఫ్ ఫరూఖీ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ స్తంభాలపై అడ్డదిడ్డంగా, ప్రాణాంతకంగా ప్రజలకు, సిబ్బందికి ఇబ్బంది కలిగిస్తున్న కేబుల్స్‌ను వెంటనే తొలగించాలని తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ ఆదేశించారు. ఇప్పటికే అనేకసార్లు సమావేశాలు నిర్వహించి కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ ప్రొవైడర్ల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశామన్నారు. సోమవారం మరోసారి వారితో సమావేశం నిర్వహించి, పనుల పురోగతిని కోరారు. ముఖ్య రహదారులపై దాదాపు 50 శాతం పోల్స్‌పై అడ్డదిడ్డంగా వేలాడుతున్న కేబుల్స్‌ను సరిచేశామనీ, మిగిలిన వాటిని కూడా వీలైనంత త్వరగా తొలగిస్తామనీ, దానికి కొంత గడువుకావాలని తెలంగాణ కేబుల్ ఇంటర్నెట్ అసోసియేషన్ సభ్యులు కోరారు. దీనిపై సీఎమ్‌డీ స్పందిస్తూ ఆక్ట్ ఫైబర్, జీటీపీఎల్, భారత్ ఫైబర్, ఐ నెట్ సంస్థలు తమకు కేటాయించిన పనుల్ని వందశాతం పూర్తి చేశాయని తెలిపారు. కొన్ని సంస్థలు మాత్రమే తొలగింపు పనులు చేపడుతున్నాయనీ, మిగిలిన వారు కూడా తొలగింపు పనులు చేపట్టాలన్నారు. ఇప్పటికే చాలా సమయం ఇచ్చామనీ, ఆపరేటర్ల అభ్యర్థనను సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి, వారి అభిప్రాయం ప్రకారం తదుపరి కార్యాచరణ సూచిస్తామన్నారు. సమావేశంలో డైరెక్టర్ కమర్షియల్ కే రాములు, అసోసియేషన్ ప్రతినిధులు సతీష్‌బాబు, సలాం తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఏజెన్సీలో వర్ష బీభత్సం

- ఉగ్రరూపం దాల్చిన వాగులు
- వందలాది గ్రామాలకు రాకపోకలు బంద్
- కొండచరియలు విరిగిపడి ఒకరు మృతి
- మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలోకి వరద నీరు



విజయవాడ : అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో, ఏజెన్సీ అంతటా వాగులు, వంకలు ఉగ్రరూపం దాల్చాయి. పలుచోట్ల కాజ్‌వేలు కొట్టుకుపోయాయి. వందలాది గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఒడిశా సరిహద్దు ప్రాంతాలు చివురుటాకులా వణికిపోయాయి. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలోకి వరద నీరు ప్రవేశించింది. దీంతో, విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి జికె.వీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాపల్లి గ్రామంలోని ఇళ్లపై కొండచరియలు విరిగిపడడంతో గిరిజన మహిళ కొర్ర కుమారి (35) మృతి చెందారు. ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. ఈ గ్రామంలో 30 ఇళ్లలో 120 మంది వరకూ జీవిస్తున్నారు. కొండచరియలు విరిగిపడడంతో గ్రామంలోనీ ఇళ్లన్నీ దెబ్బతిన్నట్టు సమాచారం. విద్యుత్ సరఫరా, సెల్ సిగ్నల్స్ నిల్చిపోవడంతో బాహ్య ప్రపంచానికి విషయం ఆలస్యంగా తెలిసింది. మృతురాలి కుటుంబానికి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ రూ.5 లక్షల నష్టపరిహారాన్ని ప్రకటించారు. ఈ ఘటన పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, కిల్లో సురేంద్ర తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మృతురాలి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు జలాశయాల నుంచి కిందకు నీరు విడుదల చేయడంతో చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం 38 అడుగులు నమోదైంది. ప్రమాదకర స్థితికి చేరువగా ఉంది. డొంకరాయి డ్యామ్ నుంచి ఆదివారం రాత్రి 11 గేట్లను ఎత్తి లక్షా పది వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో లోతట్టు ప్రాంతాలైన సూరన్నగొంది, మధుకూరు తదితర గ్రామాలు ముంపునకు గురయ్యాయి. భారీ వర్షాలకు చింతూరు మండలంలోని సోకిలేరు వాగు మళ్లీ ప్రమాదకర స్థాయికి పెరిగింది. కుమ్మూరు వాగు, కొయగూరు వాగు, చంద్రవంక తదితర వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మారేడుమిల్లి, సీలేరు, కాకినాడ, రాజమండ్రి, విశాఖ తదితర ప్రాంతాలకు ఆర్‌టిసి బస్సులను రద్దు చేశారు. డొంకరాయి, సీలేరు ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేయడంతో శబరి పరివాహక ప్రాంతాలైన విఆర్.పురం మండలం చింతరేగుపల్లి, కన్నాయిగూడెం, అడవి వెంకన్నగూడెం, సోపల్లి గ్రామాల చుట్టూ వరద చేరింది. అన్నవరం-ఉమ్మడివరం మధ్య లోలెవెల్ బ్రిడ్జి పైనుండి వరద నీరు ప్రవహిస్తుండడంతో సుమారు 40 గ్రామాలకు నాలుగు గంటలపాటు రాకపోకలు స్తంభించాయి. పోలవరం ముంపు మండలాల్లో గోదావరి ప్రవాహం స్వల్పంగా పెరిగింది. జికె.వీధి మండలంలో 16 పంచాయతీల్లో పంట పొలాలు నీట మునిగాయి. హుకుంపేట మండలం చీడుపుట్టు, దిగుమొదపుట్టులలో కల్వర్టుల పై నుంచి నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. డుంబ్రిగుడ మండలం గుంటసీమ, రంగిలిసింగి తదితర గ్రామాల్లో పొలాలు నీట మునిగాయి. ముంచంగిపుట్టులోని జోలాపుట్, డుడుమ జలపాతాలు ప్రమాదకరంగా మారాయి. ఉరకగెడ్డ నీరు ఎక్కువగా రావడంతో అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం మామిడిపాలెం గ్రామ గిరిజనులు జల దిగ్బంధంలో చిక్కుకుపోయారు. గొలుగొండ మండలం బొడ్డేరు, దారగెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

మాచ్‌ఖండ్‌లో నిల్చిన విద్యుదుత్పత్తి

ఎపి-ఒడిశా సంయుక్త నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలోకి వరదనీరు చేరింది. ప్రస్తుతం వినియోగంలో ఉన్న నాలుగు యూనిట్లలోనూ విద్యుదుత్పత్తిని నిలిపి వేశారు. డి-వాటరింగ్ పంపుల ద్వారా నీటిని బయ టకు పంపేందుకు ప్రయత్నిస్తున్నారు. విద్యుత్ కేంద్రం టర్బైన్‌లోకి నీరు వెళ్లడంతో యూనిట్లు పాడయ్యే అవకాశముందని, ఇదే జరిగితే కోట్లాది రూపాయల నష్టం వాటిల్లనుందని అధికారులు చెప్తున్నారు.

తాటిపూడి రిజర్వాయర్ దిగువ ప్రాంతంలో అలెర్ట్

వేగావతి నది ఉధృతికి విజయనగరం జిల్లా బొబ్బిలి మండలంలోని పారాది కాజ్‌వే కొట్టుకు పోయింది. బొబ్బిలి మున్సిపాలిటీలోని పూల్ బాగ్ రోడ్డు చెరువును తలపిస్తోంది. బలిజిపేట రోడ్డులో యుద్ధ స్తంభం వద్ద రోడ్డుపై భారీ వృక్షం కూలిపోయింది. వేపాడ మండలం సోంపురం జంక్షన్ రైల్వే అండర్ బ్రిడ్జి దిగువ నుంచి వెళ్లే మార్గం వర్షపు నీటితో ఉండడంతో మండల కేంద్రానికి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నల్లబెల్లి గ్రామంలోని అనంత చెరువుకు ఆదివారం అర్ధరాత్రి గండి పడింది. తాటిపూడి రిజర్వాయర్‌ను ఎస్‌పి వకుల్ జిందాల్ పరిశీలించారు. దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ మడ్డువలస ప్రాజెక్టును పరిశీలించారు.

తంతంతజ,శ్రీకాకుళం జిల్లాలో గత 24 గంటల్లో 10.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కవిటిలో 95.4 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మహేంద్రతనయ ఉధృతంగా ప్రవహిస్తోంది. కాజ్‌వే పైనుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో పాతపట్నం మండలంలో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.

చర్చల ద్వారానే పరిష్కారం

- పని సంస్కృతికి ఆదర్శం
- సింగరేణిలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకు ధృవీకరణ పత్రాలు అందజేత



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కార్మికుల సమస్యల్ని చర్చల ద్వారానే పరిష్కరించుకుంటూ, పని సంస్కృతికి సింగరేణి కాలరీస్ సంస్థ ఆదర్శవంతంగా నిలవాలని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ డీ శ్రీనివాసులు అన్నారు. సింగరేణి కాలరీస్‌లో ఇటీవల జరిగిన కార్మిక సంఘ ఎన్నికల్లో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలుగా ఎన్నికైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ), సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) లకు సోమవారంనాడాయన సింగరేణి భవన్‌లో గుర్తింపు పత్రాలను అందజేశారు. గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ గౌరవాధ్యక్షులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర మినిమమ్ వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మెన్ బీ జనక్‌ప్రసాద్, ఏఐటీయూసీ ప్రెసిడెంట్ వాసిరెడ్డి సీతారామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ సింగరేణి బహుముఖంగా విస్తరిస్తున్నదని చెప్పారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సింగరేణి ఎదుగుదలలో ఏఐటీయూసీ కీలక పాత్ర పోషించిందనీ, ఇకపై కూడా సంస్థ అభివృద్ధి, కార్మిక సంక్షేమానికి పునరంకితమవుతామన్నారు. ప్రాతినిధ్య సంఘం సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ మాట్లాడుతూ కంపెనీ విస్తరణ, అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ మాట్లాడుతూ కంపెనీ అభివృద్ధిలో కార్మిక సంఘాల పాత్ర ఎంతో ఉందనీ, ఇదే సహకారాన్ని భవిష్యత్‌లోనూ కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు, కార్మికసంఘాల నేతలు పాల్గొన్నారు.

మళ్లీ జరగకుండా చర్యలు తీసుకోండి

- డీజీపీకి ఎంపీ మల్లు రవి వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇద్దరు పదవ తరగతి చదువుతున్న ఎస్సీ బాలికలపై లైంగిక వేధింపులు జరిగిన ఘటన పట్ల నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన రాష్ట్ర డీజీపీకి లేఖ రాశారు. హీనమైన అలాంటి ఘటనల పట్ల మరింత కఠినంగా వ్యవహరించాలనీ, అలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

హర్యానా అసెంబ్లీ ఎన్నికలు

- ఆప్ తొలి జాబితా విడుదల
- కాంగ్రెస్‌తో పొత్తులేనేట్లే



న్యూఢిల్లీ : హర్యానా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆప్ పార్టీ సోమవారం తొలి జాబితాను ప్రకటించింది. 20 మంది అభ్యర్థుల పేర్లతో ఈ జాబితాను విడుదల చేసింది. దీంతో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో ఆప్‌కు ఎలాంటి పొత్తుకు అవకాశం లేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నామినేషన్‌కు మూడు రోజుల మాత్రమే ఉండటంతో కాంగ్రెస్, ఆప్ మధ్య ఇక చర్చలు కూడా జరగవని అనుకుంటున్నారు. రెండు పార్టీల మధ్య ఆదివారం రాత్రి వరకూ కూడా చర్చలు జరిగాయి. ఆప్ 10 స్థానాలు డిమాండ్ చేస్తుండగా, కాంగ్రెస్ ఐదు సీట్లు మాత్రమే ఆఫర్ చేసినట్లు సమాచారం. హర్యానా అసెంబ్లీకు అక్టోబర్ 5న ఒకే దశలో ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ దాఖలు చేయడానికి ఈ నెల 12 వరకూ మాత్రమే గడువు ఉంది.

కాగా, సోమవారం విడుదల చేసిన జాబితా ప్రకారం ఆప్ హర్యానా రాష్ట్ర ఉపాధ్యక్షులు అనురాగ్ ధండా కలయత్ నుంచి పోటీ చేస్తున్నారు. ఇందు శర్మను భివానీ నుంచి పోటీకి దింపింది. మెహం నుంచి వికాస్ నెహ్రా, రోహతక్ నుంచి బిజేందర్ హుడా పోటీ చేయనున్నారు.

అంగన్‌వాడీల పెండింగ్ వేతనాలను చెల్లించాలి

- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు సీఐటీయూ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఆగస్టు నెల వేతనం, మినీ నుంచి మెయిన్ అయిన నాలుగువేల మంది టీచర్లకు మూడు నెలల పెండింగ్ వేతనాలను మెయిన్ టీచర్లతో సమానంగా వెంటనే చెల్లించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సునీత, పి.జయలక్ష్మి, కోశాధికారి పి.మంగ డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు వారు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు లేఖ రాశారు. మినీ నుంచి మెయిన్ అయిన అంగ్‌వాడీ టీచర్లకు మార్చి, ఏప్రిల్, జులై నెలల వేతనాలను పాతపద్ధతిలో సగమే చెల్లించారనీ, ఇది అన్యాయమని పేర్కొన్నారు. మెయిన్ టీచర్లతో సమానంగా వారికి వేతనం ఇవ్వాలని కోరారు.

దోస్త్ రిజిస్ట్రేషన్ గడువు రేపటివరకు పొడిగింపు

- సవరణ షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీకాం ఆనర్స్, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ, బీసీఏ, బీబీఎం,కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా రిజిస్ట్రేషన్ గడువును బుధవారానికి పొడిగించారు. ఈ మేరకు దోస్త్ కన్వీనర్, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన సోమవారం సవరణ షెడ్యూల్‌ను విడుదల చేశారు. బుధవారం వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని వివరించారు. మంగళవారం ప్రత్యేక కేటగిరీ విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 12వ తేదీన ప్రత్యేక విడత సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. అదేనెల 13 నుంచి 16 వరకు ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలనీ, ఫీజు చెల్లించాలని కోరారు. ఈనెల 13 నుంచి 16 వరకు కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని తెలిపారు. విద్యార్థులు పూర్తి వివరాలకు https://dost.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

జైనూరు ఘటనపై వెంటనే స్పందించిన సర్కారు

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జైనూరు ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించిందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో లైంగికదాడులు జరిగితే పరామర్శించే నాథుడే లేడని గుర్తుచేశారు. జైనూరు బాధితురాలిని మంత్రి సీతక్క పరామర్శించారని తెలిపారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ విద్యావ్యవస్థను కేసీఆర్ నిర్వీర్యం చేశారనీ, గురుకులాలు పెట్టారే తప్ప వాటికి కావాల్సిన సౌకర్యాలు కల్పించలేదని విమర్శించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ జైనూరు బాధితురాలికి మెరుగైన వైద్యమందిస్తున్నామనీ, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

కుల గణన చేపడతాం

- పార్టీలో బీసీలకు ప్రాధాన్యం : మంత్రి ఉత్తమ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీ కమిషన్ ద్వారా కుల గణన చేపడతామనీ, కాంగ్రెస్ బీసీలకు ప్రాధాన్యం ఇస్తున్నదని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ బీసీ కమిషన్ కార్యాలయంలో బీసీ కమిషన్ చైర్మెన్‌గా నిరంజన్, సభ్యులుగా రాపోలు జయప్రకాశ్, తిమలగిరి సురేందర్, బాలలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న నిరంజన్ బీసీ కమిషన్ చైర్మెన్ పదవికి సమర్థుడనీ, నిజాయితీ గల వ్యక్తి అని కితాబిచ్చారు. ఆయన తన పదవికి హుందాతతనాన్ని తీసుకొస్తారని తెలిపారు. బీసీ కమిషన్ ద్వారా కులగణన తప్పక చేపడతామని చెప్పారు. బీసలకు అన్ని కరాలుగా అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. వారికి న్యాయం చేసే దిశగా కాంగ్రెస్ ముందుకు వెతున్నదన్నారు. బీసీలకు ప్రాధాన్యం పెరుగుతున్నదనటానికి మహేశ్‌కుమార్‌గౌడ్‌ను పీసీసీ చీఫ్‌గా నియమించటమే ప్రత్యక్ష సాక్ష్యమని చెప్పారు. రాహుల్‌గాంధీ కులగణన కోసమే పోరాడుతున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి హనుమంతరావు, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

ఎల్ఐసీ నూతన ప్రీమియంలో 35 శాతం వృద్ధి

- ఆగస్టులో రూ.19,309 కోట్లుగా నమోదు



ముంబయి : ప్రభుత్వ రంగంలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) నూతన ప్రీమియం వసూళ్లలో దూసుకుపోతుంది. ప్రస్తుత ఏడాది ఆగస్టులో 35.10 శాతం వృద్ధితో రూ.19,309.10 కోట్ల నూతన వ్యాపార ప్రీమియంను వసూలు చేసింది. 2023 ఇదే నెలలో రూ.14,292.53 కోట్ల ప్రీమియం నమోదయ్యింది. లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ వెల్లడించిన గణంకాల ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఐదు మాసాల్లో ఎల్ఐసి నూతన వ్యాపార ప్రీమియం 27.73 శాతం పెరిగి రూ.95,180.63 కోట్లకు పెరిగింది. ఇంతక్రితం ఏడాది ఇదే కాలంలో రూ.74,516.31 కోట్లుగా చోటు చేసుకుంది.

2024 ఆగస్టులో వ్యక్తిగత ప్రీమియం సెగ్మెంట్‌లో 4.60 శాతం వృద్ధితో రూ.5,047.36 కోట్ల వ్యాపారం నమోదు చేసింది. 2023 ఇదే నెలలో రూ.4,825.52 కోట్ల ప్రీమియం నమోదయ్యింది. ఈ ప్రభుత్వ రంగ బీమా సంస్థ గడిచిన ఆగస్టులో 4.45 శాతం తగ్గుదలతో 16.36 లక్షల కొత్త పాలసీలను జారీ చేసింది. 2023 ఇదే నెలలో 17.12 పాలసీలను విక్రయించింది. 2024-25 తొలి ఐదు మాసాల్లో 3.65 శాతం వృద్ధితో 68.35 పాలసీల అమ్మకాలు చేసింది. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలో 65.95 లక్షల పాలసీలను విక్రయించింది.


ఢిల్లీ ఎయిర్‌పోర్టులో జీఎంఆర్‌కు మరో 10 శాతం వాటా

- రూ.1,057 కోట్లతో కొనుగోలు
- ఫ్రాపోర్ట్ ఎజి ఫ్రాంక్‌ఫర్ట్‌తో ఒప్పందం



న్యూఢిల్లీ : ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ (డీఏఐఎల్)లోని మరో 10 శాతం వాటా కొనుగోలుకు జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఒప్పందం కుదర్చుకుంది. ఈ వాటాను ఫ్రాపోర్ట్ ఏజీ ఫ్రాంక్‌ఫర్ట్ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ వాల్డ్‌వైడ్ నుంచి దాదాపు రూ.1057 కోట్లతో కొనుగోలు చేస్తోంది. సోమవారం ఈ విషయాన్ని జీఎంఆర్ గ్రూపు ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. డీఏఐఎల్‌లో ప్రస్తుతం జీఎంఆర్ ఇన్‌ఫ్రాకు 64 శాతం పెయిడ్ అప్ క్యాపిటల్ (చెల్లింపు మూలధనం) వాటా ఉంది. ప్రతిపాదిత 10 శాతం వాటా స్వాధీనంతో మొత్తం వాటా 74 శాతానికి చేరనుంది. డీఏఐఎల్‌లో మిగితా 26 శాతం వాటా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) కలిగి ఉంది. ఈ ఒప్పందానికి ఎఎఐ ఆమోదం కూడా లభించాల్సి ఉంది. ఈ ఒప్పందం జరిగిన తర్వాత 180 రోజుల్లో అమల్లోకి రానుంది. డీఏఐఎల్‌లో అదనపు వాటాను కొనుగోలు చేయడం గ్రూప్ యొక్క ప్రధాన ఆస్తులలో మా ఉనికిని మరింత విస్తరించనుందని జీఎంఆర్ గ్రూపు కార్పొరేట్ చైర్మెన్ కిరణ్ కుమార్ గ్రంధి పేర్కొన్నారు. ఈ స్వాధీనం తమ లక్ష్యానికి అనుగుణంగా ఉందన్నారు. తమ పోర్టుపోలియోలో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు.

ఫిట్‌డేలో మహేష్ బాబు పెట్టుబడులు




హైదరాబాద్: ప్రముఖ హీరో మహేష్ బాబుకు చెందిన సంస్థ జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి వ్యూహాత్మక పెట్టుబడిని అందుకున్నట్లు న్యూట్రాస్యూటికల్ స్టార్టప్ అయిన ఫిట్‌డే వెల్లడించింది. పోషకాహారం, ఆరోగ్యకరమైన స్నాక్స్ పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే ఫిట్‌డే యొక్క మిషన్‌లో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని ఫిట్‌డే వ్యవస్థాపకుడు, సీఈఓ సురేష్ రాజు తెలిపారు. మహేష్ బాబు పెట్టుబడి ఫిట్‌డే రిటైల్ కార్యకలాపాలను విస్తరించేందుకు, కొత్త మార్కెట్‌లలోకి ప్రవేశించేందుకు తోడ్పడుతుందన్నారు.

వరద బాధిత పాలసీదారులకు బజాజ్ అలయంజ్ మద్దతు

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వరద బాధిత పాలసీదారులకు క్లెయిమ్స్ ప్రక్రియను సరళతరం చేసినట్లు బజాజ్ అలయంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ తెలిపింది. తక్కువ డాక్యుమెంటేషన్‌తోనే క్లెయిమ్స్‌ను పరిష్కరించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. ఇందులో భాగంగా వరదల బారిన పడిన కస్టమర్ల డెత్, డిజేబిలిటీ క్లెయిమ్‌ల సెటిల్మెంట్‌కు అత్యంత ప్రాధాన్యతనిచ్చేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది.


శ్రీలంక ఎయిర్‌లైన్స్‌కు పిఎటిఎ గోల్డ్ అవార్డ్

హైదరాబాద్ : పసిఫిక్ ఆసియా ట్రావెల్ అసోసియేషన్ (పిఎటిఎ) నుంచి గోల్డ్ అవార్డ్స్ 2024 దక్కినట్లు శ్రీలంక ఎయిర్‌లైన్స్ తెలిపింది. మార్కెటింగ్ క్యారియర్ విభాగంలో ఈ గుర్తింపు లభించినట్లు పేర్కొంది. బ్యాంకక్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నట్లు శ్రీలంక ఎయిర్‌లైన్స్, మార్కెటింగ్ హెడ్, సమిందా పెరెరా పేర్కొన్నారు.

ఎల్‌జి నుంచి తొమ్మిది రకాల వాటర్ ప్యూరిఫైర్స్

న్యూఢిల్లీ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ ఎల్‌జి విలక్షణమైన డిజైన్లతో తొమ్మిది రకాల కొత్త మోడల్స్ వాటర్ ప్యూరిఫైర్స్‌ను విడుదల చేసినట్లు ఆ సంస్థ తెలిపింది. ఇవి ఎయిర్ టైట్ స్టెయిన్ లెస్ స్టీల్ ట్యాంక్, మినరల్ బూస్టర్, ఇన్‌ట్యాంక్ ఎవర్ ఫ్రెష్ యువి ప్లస్, కాంటాక్ట్ లెస్ నిర్వహణ, సంరక్షణ వంటి ఆధునిక ఫీచర్లతో లభిస్తాయని ఆ సంస్థ తెలిపింది. వీటి ధరల శ్రేణిని రూ.17,099 నుంచి రూ.36,999గా నిర్ణయించినట్లు వెల్లడించింది.

ఐడీబీఐ బ్యాంక్ 111వ శాఖలకు విస్తరణ




హైదరాబాద్ : ఐడీబీఐ బ్యాంక్ హైదరాబాద్ జోన్‌లో 111 శాఖలకు విస్తరించినట్లు ప్రకటించింది. నగరంలోని ముషీరాబాద్‌లో కొత్త శాఖను ఏర్పాటు చేయడం ద్వారా ఈ స్థాయికి చేరినట్టు పేర్కొంది. ఈ కొత్త శాఖను బ్యాంకు అధికారులతో కలిసి ఐఆర్ఎస్ అధికారి, ఆదాయపన్ను శాఖ కమిషనర్ జీవన్ లాల్ లావిడియా ప్రారంభించారు. ఇది హైదరాబాద్ జోన్‌లో 111వ శాఖ కాగా, తెలంగాణలో 51వ శాఖ అని ఆ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో ఐడీబీఐ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ శరత్ కామత్, డిప్యూటీ జోనల్ హెడ్ వి వాసుదేవన్, జీఎం ఆర్‌హెచ్ సందీప్ పట్నాయక్, బ్రాంచ్ హెడ్ దీప్తి అన్నెపు పాల్గొన్నారు.

కేంద్ర చట్టం అత్యవసరం

- ఇది వైద్యుల రక్షణతో పాటు వారి గౌరవానికీ హామీనిస్తుంది
- మోడీ సర్కారు చర్యలు తీసుకోవాలి
- ఆయా రాష్ట్రాల్లోని చట్టాల అమలు తీరు పేలవం
- వాటిపై పోలీసులకూ లేని అవగాహన
- నమోదయ్యే కేసులతో పాటు నేర నిరూపణ కూడా చాలా తక్కువే
- వైద్య సిబ్బందిపై జరిగే దాడులను అరికట్టటంలో పూర్తిగా విఫలం
- దేశవ్యాప్తంగా మెడికల్ అసోసియేషన్ల డిమాండ్

దేశంలో వైద్యులు, వైద్య సిబ్బంది రక్షణ ప్రశ్నార్థకంగా మారుతున్నది. వారిపై రోజురోజుకూ దాడులు పెరిగిపోతున్నాయి. ఇది వైద్యులు, మెడికల్ సిబ్బంది మానసిక స్థైర్యాన్ని దెబ్బ తీస్తున్నదని పలు మెడికల్ అసోసియేషన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలంటూ పోరాటాలు చేస్తున్నాయి. అయితే, కేంద్రంలోని మోడీ సర్కారు అలాంటి ఆలోచనేదీ లేదంటూ తన వైఖరిని స్పష్టం చేసింది. దీంతో మోడీ సర్కారు తీరుపై వైద్య సంఘాలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) వంటి సంఘాలు మాత్రం వైద్యులు, వైద్య సిబ్బందికి ప్రత్యేక చట్టం తీసుకొచ్చే విషయంలో వెనక్కి తగ్గే ఆలోచనే లేదనీ, తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేస్తున్నాయి.



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల(యూటీ)లో వైద్యులు, సిబ్బంది రక్షణ కోసం ఇప్పటికే ప్రత్యేక చట్టం అమలవుతున్నదనీ, కాబట్టి ప్రత్యేక కేంద్ర చట్టం అవసరం లేదని మోడీ సర్కారు వాదిస్తున్నది. రాష్ట్రస్థాయిలో చట్టాల అమలులో అస్థిరత, పేలవ అమలు తీరు కనిపిస్తున్నది. కర్నాటక, పశ్చిమబెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాలు ఏఎస్ఎంలు, సహాయ కార్మికులు, హెల్త్ విజిటర్స్‌కు చట్టపరంగా రక్షణను కల్పించలేదని ఒక ఆంగ్ల వార్త పత్రిక తన విశ్లేషణలో పేర్కొన్నది. చట్టపరంగా ఎలాంటి హామీ లేకపోవటంతో వారు హింసాత్మక పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తున్నదని వివరించింది. నేర తీవ్రతను బట్టి పెనాల్టీలను విధించే నిబంధనలను గోవా మాత్రమే ఆమోదించింది.

అయితే, ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి నిబంధనలు లేకపోవటం చట్టం ప్రభావాన్ని బలహీనపరుస్తుంది. వైద్యులు, వైద్య సిబ్బందిపై తరచూ దాడులు చేసేవారి విషయంలో ఉత్తరాఖండ్ మాత్రమే ప్రత్యేక నిబంధనలు ఉన్నాయి. మిగతా రాష్ట్రాల్లో ఇలాంటి నిబంధనలేవీ లేకపోవటంతో అక్కడ ఉండే ఆరోగ్యసంరక్షకులు కఠిన పరిస్థితులను ఎదుర్కొంటు న్నారని విశ్లేషకులు చెప్తున్నారు. ఇక బీహార్‌లో ఆరోగ్యకార్మికులపై జరిగే దాడుల విషయంలో కోర్టు బయట రాజీకి పరిష్కార మార్గం ఉన్నది. ఈ తీరు దాడులకు పాల్పడే నేరస్థులను చట్టం నుంచి తప్పించుకోవటానికి వెసులుబాటు కల్పిస్తుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా అమలవుతున్న నిబంధనలు గందరగోళాన్ని సృష్టిస్తున్నాయని పలు మెడికల్ అసోసియేషన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. గోవా, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లో ఉన్న నిబంధనలు అక్కడి వైద్యులకు పటిష్ట రక్షణను కల్పిస్తుంటే.. ఇతర రాష్ట్రాల్లో ఉన్న నిబంధనలు వారి భద్రతను ప్రశ్నార్థకంగా మార్చాయని విశ్లేషకులు అంటున్నారు.

రాష్ట్రాల్లో సవాల్‌గా చట్టాల అమలు తీరు

ఆయా రాష్ట్రాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది రక్షణ కోసం ప్రత్యేక చట్టాలున్నా.. వాటిని అమలు పరిచే తీరు కూడా పెద్ద సవాలుగానే ఉన్నది. చాలా మంది పోలీసు అధికారులు ఆయా రాష్ట్రాల్లో ఉన్న చట్టాలను ఎలా అమలు చేయాలన్న విషయం కూడా తెలియదని కొందరు వైద్యులు చెప్తున్నారు. భారతీయ శిక్షాస్మృతి(ఐపీసీ)లో ఎలాంటి నిబంధనా లేకపోతే.. కేసు నమోదు చేసే కొన్ని సందర్భాల్లో ప్రత్యేక చట్టం కాపీని పోలీసుల వద్దకు తీసుకెళ్లాల్సి వస్తుందనీ, ఎందుకంటే సదరు అధికారికి చట్టం గురించి తెలిసి ఉండకపోవచ్చని చండీగఢ్‌లోని మెడికోస్ లీగల్ యాక్షన్ గ్రూప్ మేనేజింగ్ ట్రస్టీ, కన్వీనర్ డాక్టర్ నీరజ్ నాగ్‌పాల్ అన్నారు. కనీసం ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేయాలన్న విషయం కూడా పోలీసులకు తెలిసి ఉండకపోవచ్చనీ, ఈ చట్టాల అమలులో లోపాల కారణంగా ఆరోగ్యసంరక్షణ కార్మికులు దయనీయ పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, ఈ వైఫల్యాలు నిజానికి దుష్పరిణామాలను తీసుకొస్తాయని విశ్లేషకులు చెప్తున్నారు.

పదిశాతం కేసులు కూడా నమోదుకావటం లేదు

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అంచనా ప్రకారం దేశవ్యాప్తంగా 75 శాతం మంది వైద్యులు తమ కెరీర్‌లో హింసను ఎదుర్కొన్నారు. రాష్ట్రాల చట్టాల కింద కనీసం పది శాతం కేసులు కూడా నమోదు కావటంలేదని సమాచారం. పది శాతం కేసులు మాత్రమే పోలీసుల వద్దకు వెళ్తున్నాయనీ, అందులో నేరస్థులకు శిక్ష మాత్రం పడటం లేదని న్యూఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రి తన సర్వేలో కనుగొన్నది. 2018లో కర్నాటక లా కమిషన్ రూపొందించిన నివేదిక ప్రకారం.. రాష్ట్రంలో 2010 నుంచి 2017 మధ్య 173 కేసులు మాత్రమే నమోదు కాగా విచారణకు వచ్చినవి 23 మాత్రమే. మూడింటిలోనే నేర నిరూపణ కావటం గమనార్హం. ఇక ఎలాంటి కేసులోనూ బాధితులకు పరిహారం అందించిన దాఖలాలు లేవు. ఇది రాష్ట్రాలలో చట్టాల పేలవ అమలు తీరుకు నిదర్శనమనీ, వైద్య సిబ్బందిపై దాడులను అరికట్టటంలో విఫలమయ్యాయనటానికి ప్రత్యక్ష నిదర్శనమని విశ్లేషకులు చెప్తున్నారు.

అయినా.. ఏమీ పట్టని మోడీ సర్కారు

రాష్ట్రాలలో చట్టాల అమలు తీరు ఇంత దారుణంగా ఉన్నప్పటికీ.. జాతీయ స్థాయిలో వైద్యుల సంరక్షణ కోసం ఒక చట్టాన్ని రూపొందించటానికి మోడీ సర్కారు అయిష్టతను వ్యక్తం చేస్తుండటం గమనార్హం. వైద్య సిబ్బంది రక్షణ కోసం 2019లో కేంద్రం ఒక బిల్లును కూడా తీసుకొచ్చింది. అయితే, ఎపిడెమిక్ డిసీజెస్ (అమెండ్‌మెంట్) ఆర్డినెన్స్(ఈడీఏ), 2020ని ప్రత్యామ్నాయంగా చూపిస్తూ ఆ తర్వాత కేంద్రం తన ప్రయత్నాలను విరమించుకున్నది. ఇలా తమకూ ఒక ప్రత్యేక చట్టం కావాలనే డిమాండ్ ఇతర వృత్తుల నుంచి కూడా వచ్చే అవకాశాలున్నాయని ఆ సమయంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తెలిపింది.

కేంద్రం చెప్తున్నట్టు ఈడీఏపై ఆధారపడటం సమస్యతో కూడుకున్న వ్యవహారమని విశ్లేషకులు అంటున్నారు. ఇందులోని నిబంధనలు ప్రత్యేక హెల్త్ ఎమర్జెన్సీ కాలం ముగిసే వరకే అమలులో ఉంటాయనీ, కాబట్టి వైద్యులు, వైద్య సిబ్బందికి ఇది తాత్కాలిక రక్షణనే కలిగిస్తుందని వైద్య వర్గాల నుంచి వాదనలు వినిపిస్తున్నాయి. ఈ సమస్యలన్నిటికీ పరిష్కారం ఒక కేంద్ర చట్టం అని అంటున్నాయి. జులైలో అమలులోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)తో దీనిని కలిపేస్తే వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ విషయంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని చెప్తున్నాయి.

అన్ని సమస్యలకూ పరిష్కారం ఒక చట్టం

దేశవ్యాప్తంగా ఒకే చట్టం తీసుకొచ్చి అమలు చేస్తే అది ఇప్పటి వరకున్న సవాళ్లను అధిగమిస్తుందని చెప్తున్నారు. ఒకే దేశం, ఒకే చట్టం అంటూ.. యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ), వన్ నేషన్ వన్ ఎలక్షన్, ఇతర కేంద్రీకృత విధానాల కోసం మాట్లాడే బీజేపీ, ఆ లాజిక్‌ను వైద్యుల రక్షణ విషయంలో ఎందుకు అమలుపర్చటం లేదని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది రక్షణ కోంస కేంద్ర చట్టం అవసరమనీ, దీనిని తక్షణమే తీసుకురావాలని వైద్య, ఆరోగ్య వర్గాలు డిమాండ్‌న చేస్తున్నాయి. ఈ చట్టం వైద్యుల రక్షణకు హామీనివ్వటమేగాక, వారి గౌరవాన్ని కూడా కాపాడుతుందని సామాజికవేత్తలు, నిపుణులు అంటున్నారు.

సర్కారీ శాఖలపై డేగకన్ను

- అంతర్గత వ్యవహారాలపై ఆరా
- ప్రతి శాఖకూ ఒక ప్రత్యేకాధికారి
- సచివాలయంలోనూ హల్‌చల్
- సాఫీగా సాగుతున్నాయా ?
- వంకర పనులు జరుగుతున్నాయా ?
- అవినీతి, అక్రమార్కులపై
- ఇంటెలిజెన్స్‌తో కూపీలాగుతున్న సీఎం
- నెలరోజులుగా సాగుతున్న ప్రక్రియ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ శాఖలపై ఇంటెలిజెన్స్ ప్రత్యేక దృష్టి పెట్టింది. శాఖల్లో జరుగుతున్న అంతర్గత వ్యవహారాలపై నిఘా వ్యవస్థ కూపీ లాగుతున్నది. ప్రభుత్వ విధానాల అమలు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పనితీరు, అవినీతిఅక్రమాలు, అందుకు కారకులు, ఉన్నతస్థాయిలో తీసుకుంటున్న చర్యలపై ఇంటెలిజెన్స్ సమాచారం సేకరిస్తున్నది. గత నెలరోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా నిఘా వ్యవస్థ గుట్టుచప్పుడు కాకుండా తనపని చేసుకుపోతు న్నది. ప్రధాన శాఖలపై ప్రత్యేక దృష్టిపెట్టినట్టు సమాచారం. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇంటెలిజెన్స్ ఇందుకు పూనుకున్నట్టు తెలిసింది. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో శాఖకు ఒక్కో ఇంటెలిజెన్స్ అధికారిని నియమించి ప్రభుత్వ శాఖల్లో అంతర్గతంగా జరుగుతున్న వ్యవహారాలను పసిగట్టే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు సమాచారం. పరిపాలనపై పట్టుపెంచుకోవడం, తమ ప్రభుత్వం అవినీతిఅక్రమాలకు దూరంగా ఉంటుందని చెప్పడమే ఉద్దేశంత నిఘా డేగకన్ను పెట్టడం ద్వారా సంకేతాలు పంపాలని భావిస్తున్నది. సీఎం ఆదేశాల నేపథ్యంలో నిఘా అధికారులు చురుగ్గా సర్కారీ శాఖల్లో మఫ్టీల్లో తిరుగుతూ అవినీతి అధికారులను గుర్తించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ట్రాన్స్‌కో, పట్టణ,పురపాలక శాఖ,, పౌరసరఫరాల శాఖ, ఆర్‌అండ్‌బీ, నీటిపారుదల శాఖ, గనులు భూగర్భవనరులు, పోలీస్, స్టాంపులురిజిస్ట్రేషన్లు, రవాణా, రెవెన్యూ, ప్రజారోగ్యం, వైద్యఆరోగ్యశాఖ, సహకారశాఖ తదితర శాఖల్లో ఇంటెలిజెన్స్ అధికారులు విస్తృతంగా తిరిగినట్టు తెలిసింది. అవినీతి చేసే ఉద్యోగులు, అందుకు సహకరించే ఉన్నతస్థాయి హోదా ఉన్న అధికారులు, ఇందులో రాజకీయనా యకులు, ప్రజాప్రతినిధుల పాత్ర ఏమైనా ఉందా తదితర అంశాల ప్రాతిపదికగా సమాచారం సేకరిస్తున్నట్టు సమాచారం. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని సచివాలయంతోపాటు ఆయా శాఖ ప్రధాన హెచ్‌వోడీలు, జిల్లాల్లో కలెక్టరేట్లు, పోలీస్ ఎస్పీ, కమిషనర్ కార్యాలయాలపై నిఘా పెట్టారని తెలిసింది. ప్రభుత్వ పరిపాలన ప్రజల్లో నేరుగా వెళ్లేలా వాతావరణం సర్కారీ శాఖల్లో ఉందా, ఎవరైనా అడ్డుపడుతున్నారా ? ప్రభుత్వ విధానాలను అడ్డుకుంటూ చెడ్డపేరు తెచ్చేలా ఎవరైనా వ్యవహరిస్తున్నారా ? ఉంటే వారికి ఎవరు సహకరిస్తున్నారు ? హెచ్‌వోడీలకు సచివాలయం లోని లింకులేంటి ? తదితర అంశాలపై కూడా ఆరా తీస్తున్నారు. ఇప్పటికే అవినీతిమకిలం అంటిన అధికారుల జాబితాలతో పాటు ఆ దారిలో వెళుతున్న ఇతరులను గుర్తించి వారికి చెక్‌పెట్టే ఉద్దేశంతో సీఎం రేవంత్ ముందుకు సాగుతున్నారని తెలిసింది. ఇలాంటివారందరిపై ముఖ్యమంత్రి పరిధిలో ఉండే అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)ను వీలైనప్పుడల్లా ఇప్పటికే ప్రయోగిస్తున్నారు. అక్రమ నిర్మాణాల కూల్చివేత విషయంలో ప్రజలు సానుకూలంగా స్పందించారనే భావనలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. హైడ్రా ద్వారా మరిన్ని అక్రమ కట్టడాలు, చెరువుల ఆక్రమణలను తొలగించడం ద్వారా తమ ప్రభుత్వం అవినీతిఅక్రమాలకు వ్యతిరేకమనే సంకేతాలను ప్రజలకు పంపడమే లక్ష్యంగా సీఎం రేవంత్ ఇంటెలిజన్స్ వ్యవస్థను అప్రమత్తం చేస్తున్నట్టు తెలిసింది. అవినీతికి పాల్పడే ఒకరిద్దరి పెద్దచేపలను వలలో వేయడం, వారిపై కేసులు పెట్టడం చేయాలనీ, తద్వారా ప్రభుత్వ శాఖల్లో అవినీతి నిరోధించాలని సర్కారు భావిస్తున్నది. అందులోభాగంగానే రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్‌ను ఏసీబీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేసిందనే ప్రచారం ఉంది. అలాంటి వారిని మరికొందరిని పట్టుకుని శాఖలను సేవా కేంద్రాలుగా మలచాలనే భావన సర్కారులో ఉన్నట్టు సమాచారం. సచివాలయంలోని కార్యదర్శుల కార్యాలయాలపై కూడా నిఘా వ్యవస్థ కన్నేసింది.

పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కాంగ్రెస్‌కు

హైకోర్టు తీర్పు చెంపపెట్టు : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కాంగ్రెస్‌కు హైకోర్టు తీర్పు చెంపపెట్టులాంటిదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. నాలుగు వారాల తర్వాత దానం, కడియం, తెల్లం ఎమ్మెల్యే పదవులు ఊడటం ఖాయమన్నారు. పార్టీ మారిన అన్ని నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తప్పవని తాను మొదట్నుంచి చెబుతున్న విషయాన్ని గుర్తుచేశారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో రాహుల్ గాంధీ వైఖరి చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందని ఎద్దేవా చేశారు. రాజ్యాంగ పరిరక్షణ అంటూనే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. న్యాయస్థానాల్లో, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీకి శిక్ష తప్పదని కేటీఆర్ హెచ్చరించారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేల విషయంలో నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలంటూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్టు కేటీఆర్ తెలిపారు. "పార్టీ ఫిరాయింపుల విషయంలో సుప్రీంకోర్టు చాలా సీరియస్ గా ఉంది. ఒక పార్టీ గుర్తు మీద గెలిచి మరొక పార్టీలోకి వెళ్లటమంటే నమ్మి ఓట్లు వేసిన ప్రజలను మోసం చేయటమే. అదే విషయాన్ని కోర్టులు కూడా స్పష్టం చేశాయి. పార్టీ ఫిరాయింపుల విషయంలో ఫిర్యాదు అందిన మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని గతంలోనే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అయినప్పటికీ స్పీకర్ సుప్రీంకోర్టు తీర్పును కూడా లెక్కచేయకపోవటం దురదృష్టకరం" అని కేటీఆర్ అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరేందుకు వెళ్లిన సందర్భంలో స్పీకర్ దృష్టికి సుప్రీం తీర్పు అంశాన్ని తీసుకొచ్చినట్టు తెలిపారు. అయినప్పటికీ ప్రజాస్వామ్యాన్ని రక్షించే విషయంలో స్పీకర్ పట్టించుకోకపోవటంతో న్యాయస్థానాలను ఆశ్రయించామన్నారు. తాజాగా హైకోర్టు ఇచ్చిన తీర్పుతో ఇక తెలంగాణలో ఉప ఎన్నికలు ఖాయమని తేలిపోయిందని చెప్పారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ నుంచి గెలిచి సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ బీఫాంతో ఎంపీగా పోటీ చేయటమంటే ప్రజాస్వామ్యంపై కాంగ్రెస్‌ది ఎంత లెక్కలేనితనమో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. కచ్చితంగా మిగతా ఎమ్మెల్యే విషయంలోనూ వాళ్ల పదవులు పోవటం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలు నమ్మి అడ్డంగా మోసపోయిన పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలను చూస్తే జాలేస్తోందని కేటీఆర్ తెలిపారు. పార్టీ మారిన చట్ట సభ్యుల సభ్యత్వం ఆటోమేటిక్‌గా రద్దు చేసేలా చట్టం తెస్తామంటూ హామీ ఇచ్చి మరో వైపు తెలంగాణలో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తారా అంటూ రాహుల్ గాంధీని ప్రశ్నించారు. ఇదేం ద్వంద్వ నీతో చెప్పాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపుల విషయంలో కాంగ్రెస్ పార్టీ ఒక్కో రాష్ట్రంలో ఒక్క విధంగా వ్యవహరిస్తున్నదని ఎద్దేవా చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఇప్పటికైనా రేవంత్ రెడ్డి నైజం అర్థం చేసుకోవాలని సూచించారు

హైడ్రాకు చట్టబద్ధతేది?

- దానిపేరుతో గ్యారంటీలు పక్కదారి పట్టించే యత్నం : బీజేపీ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలోని అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేస్తున్న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) అధికారాలు, విధులకు సంబంధించి, దాని పరిధికి సంబంధించి చట్టబద్ధత కల్పించకపోవడం సరిగాదని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. కేవలం జీఓ 99కు అనుగుణంగా ఇష్టానుసారంగా వ్యవహరించడం దారుణమన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రసర్కారు ఆరుగ్యారంటీలను అమలు చేయలేక హైడ్రా పేరుతో కొత్త చర్చకు తెరలేపిందని విమర్శించారు. సీఎం, రాష్ట్ర మంత్రులు ఢిల్లీ నాయకులకు గులాంలుగా మారారన్నారు. రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. గురుకులాల్లో విద్యార్థులు మరణిస్తున్నా కాంగ్రెస్ నేతలకు చీమ కుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. డెంగ్యూ జ్వరాలతో ఆస్పత్రులు నిండిపోతున్నాయనీ, వారికి వైద్య చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల షిటు ఫిరాయింపులపై కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు.

సికింద్రాబాద్, చర్లపల్లి రైల్వేస్టేషన్ల రోడ్ల విస్తరణకు సహకరించండి

- సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, చర్లపల్లి రైల్వే టర్మినల్స్‌కు వెళ్లే రోడ్ల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి కోరారు. సోమవారం ఈ మేరకు ఆయన సీఎంకు లేఖ రాశారు. రాష్ట్రంలో రైల్వే రంగం అభివృద్ధి మిషన్ మోడ్‌లో పూర్తవుతున్నదనీ, కొత్త రైల్వే లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్, క్వాడ్రప్లింగ్ తో పాటుగా లైన్ల ఎలక్ట్రిఫికేషన్ పనులు, 40కి పైగా స్టేషన్ల అభివృద్ధి పనులు శర వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. కీలకమైన చర్లపల్లి రైల్వే టర్మినల్‌కు చేరుకునేందుకు ఎఫ్‌సీఐ గోడౌన్ వైపు నుంచి ప్రయాణీకుల రాకపోకల కోసం 100 అడుగుల రోడ్డు, ఉత్తరం వైపు (భరత్‌నగర్) కూడా 80 అడుగుల మార్గం, మహాలక్ష్మినగర్ వైపు మరో 80 అడుగుల రోడ్డు వేయాల్సిన అవసరముందని ప్రస్తావించారు. పారిశ్రామిక షెడ్ల ముందున్న రోడ్డును కూడా 80 ఫీట్లకు విస్తరించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. రేతిఫైల్ బస్ స్టేషన్, ఆల్ఫా హోటల్ మధ్యనున్న రోడ్డు ఇరుకుగా ఉన్న కారణంగా.. పీక్ అవర్స్‌లో రైల్వేస్టేషన్‌కు వచ్చే ప్రయాణికులకు తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయనీ, అక్కడ రోడ్లను విస్తరింపజేసి ట్రాఫిక్ సమస్యను తగ్గించాలని కోరారు. ఈ నేపథ్యంలో రైల్వేస్టేషన్లకు వెళ్లే మార్గాల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.

నీటిపారుదల శాఖలో 12 మంది ఏఈఈల ఎంపిక

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర నీటిపారుదల శాఖలో 12 మంది అసిస్టెంగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను ఎంపిక చేశారు. వీరంతా 2022-24 బ్యాచ్‌కు చెందిన సివిల్, ఎలక్ట్రికల్ అభ్యర్థులు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన తర్వాత రోష్టర్ ప్రకారం ఆయా విభాగాలకు చెందిన అభ్యర్థులను ఎంపిక చేశామని నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ జి అనిల్‌కుమార్ సర్క్యులర్ జారీచేశారు. ఎంపికైనవారిలో సివిల్ అభ్యర్థులు బర్మావత్ ధన్‌రాజ్, శ్రీకాంత్ శర్మ, కొకొండ పవన్‌కుమార్, వర్కాల సందీప్‌కుమార్ కాగా, ఎలక్ట్రికల్ అభ్యర్థులు దుబ్బాక వినయ్, వుప్పు సాయినాథ్‌రెడ్డి, గోగుల శ్రీధర్, మహ్మద్ నవీద్ అక్తర్, వైధా మనిష్, ఎం ధనుష, వేదబోయిన దివ్య ఉన్నారు. అలాగే మరోమారు ఈనెల 20న సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందనీ, ఇప్పటివరకు హాజరుకాని వారు వెరిఫికేషన్‌కు రావాలని ఈఎన్సీ సర్క్యులర్‌లో పేర్కొన్నారు.



23 ఏండ్ల ఇటలీ కుర్రాడు న్యూయార్క్‌లో సంచలన విజయం సాధించాడు. ఈ ఏడాది మార్చిలో నిషేధిత ఉత్ప్రేరకం వాడకంలో పాజిటివ్‌గా తేలి నిషేధం నీడ నుంచి తప్పించుకున్న వరల్డ్ నం.1 స్టార్ ఆటగాడు.. సీజన్‌ను ఊహించని రీతిలో అద్భుతంగా ముగించాడు. అంచనాలు లేకుండా బరిలోకి దిగి.. మెన్స్ సింగిల్స్ చాంపియన్‌గా అవతరించాడు. అతడే టాప్ సీడ్, ఇటాలియన్ జానిక్ సినర్.
వరుస సెట్లలో టైటిల్ పోరులో విజయం సాధించిన జానిక్ సినర్.. లోకల్ హీరో టేలర్ ఫ్రిట్జ్ ఆశలను ఆవిరి చేశాడు. సుమారు రెండు దశాబ్దాల అనంతరం మెన్స్ సింగిల్స్ గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో ఇద్దరు కుర్రాళ్లు పోటీపడటం టెన్నిస్ ఓపెన్ శకంలో మరో విశేషం. యు.ఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ చాంపియన్‌గా నిలిచిన జానిక్ సినర్ కెరీర్ రెండో గ్రాండ్‌స్లామ్ విజయాన్ని ఖాతాలో వేసుకున్నాడు.

సూపర్ సినర్



- మెన్స్ సింగిల్స్ టైటిల్ వశం
- ఫైనల్లో ఫ్రిట్జ్‌పై ఘన విజయం

యు.ఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

నవతెలంగాణ-న్యూయార్క్

వరల్డ్ నం.1, టాప్ సీడ్ జానిక్ సినర్ (ఇటలీ) యు.ఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ విజేతగా నిలిచాడు. ఆదివారం న్యూయార్క్‌లోని ప్రధాన స్టేడియంలో జరిగిన టైటిల్ పోరులో 12వ సీడ్ అమెరికా కుర్రాడు టేలర్ ఫ్రిట్జ్‌పై జానిక్ సినర్ విజయం సాధించాడు. 6-3, 6-4, 7-5తో వరుస సెట్లలో అదరగొట్టిన జానిక్ సినర్.. కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ విజయం నమోదు చేశాడు. టాప్ సీడ్‌గా బరిలో నిలిచినా..టైటిల్ రేసులో పెద్దగా అంచనాలు లేని జానిక్ సికర్ రెండు వారాల అత్యుత్తమ ప్రదర్శన అనంతరం న్యూయార్క్ నయా కింగ్‌గా అవతరించాడు. సుమారు రెండున్నర గంటల పాటు ఉత్కంఠగా సాగిన తుది సమరంలో లోకల్ హీరో టేలర్ ఫ్రిట్జ్ సైతం ఆకట్టుకున్నాడు. కానీ వరల్డ్ నం.1 జానిక్ సినర్ చాంపియన్ గేమ్ ముంగిట తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనలిస్ట్ టేలర్ ఫ్రిట్జ్ తలవంచక తప్పలేదు. యు.ఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ చాంపియన్‌గా అర్యాన సబలెంక (బెలారస్) నిలిచిన సంగతి తెలిసిందే.

సినర్ అదరగొట్టాడు

136 నిమిషాల మెన్స్ సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్, ఇటలీ స్టార్ జానిక్ సినర్ అదరగొట్టాడు. లోకల్ అభిమానుల మద్దతు ప్రత్యర్థి టేలర్ ఫ్రిట్జ్‌కు లభించినా.. సొగసైన ఆటతీరుతో అభిమానుల మద్దతు కూడగట్టుకున్నాడు. 6-3, 6-4, 7-5తో వరుస సెట్లలో టేలర్‌ను చిత్తు చేశాడు. టేలర్ ఫ్రిట్జ్ 10 ఏస్‌లు సంధించగా.. సినర్ ఆరు ఏస్‌లు మాత్రమే కొట్టాడు. కానీ తొలి సర్వ్‌లోనే 88 శాతం పాయింట్లను సొంతం చేసుకున్న జానిక్ సినర్ విజయం దిశగా అడుగులు వేశాడు. టేలర్ తొలి సర్వ్‌లో 66 శాతం పాయింట్లను మాత్రమే సాధించగలిగాడు. జానిక్ సినర్ ఆరు బ్రేక్ పాయింట్లు సాధించి మెప్పించాడు. టేలర్ రెండు సార్లు మాత్రమే సినర్ సర్వ్‌ను బ్రేక్ చేయగలిగాడు. విన్నర్ల పరంగా సైతం సినర్‌పై టేలర్ ఫ్రిట్జ్ పైచేయి సాధించాడు. టేలర్ 29 విన్నర్లు సాధించగా.. సినర్ 23 విన్నర్లు మాత్రమే కొట్టాడు. పాయింట్ల పరంగా 96-79తో టేలర్‌పై సినర్ ఆధిపత్యం చెలాయించాడు. నెట్ గేమ్‌లోనూ సినర్‌పై టేలర్ పైచేయి సాధించాడు. తొలి రెండు సెట్లలో అలవోక విజయాలు సాధించిన జానిక్ సినర్‌కు మూడో సెట్‌లో కాస్త ప్రతిఘటన ఎదురైంది. 5-5తో స్కోరు సమం కావటంతో వరుసగా రెండు గేమ్ పాయింట్లు గెల్చుకుని టైటిల్‌కు చేరువయ్యాడు. యు.ఎస్ ఓపెన్‌లో జానిక్ సినర్‌కు ఇదే తొలి టైటిల్ కావటం విశేషం.



యువ పోరు

టెన్నిస్ ఓపెన్ శకంలో 2024 యువ శకానికి నాంది పలికింది. 1974, 1993 తర్వాత తొలిసారి ఓ క్యాలెండర్ ఏడాది నాలుగు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో యువ ఆటగాళ్లే (23 ఏండ్లు, అంత కంటే తక్కువ వయసు) విజేతలుగా నిలిచారు. స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కారాస్ ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ విజేతగా నిలువగా.. జానిక్ సినర్ ఆస్ట్రేలియా ఓపెన్, యు.ఎస్ ఓపెన్ చాంపియన్‌గా అవతరించాడు. యు.ఎస్ ఓపెన్ చరిత్రలో తొలిసారి ఓ ఇటలీ ఆటగాడు సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఫైనల్లో తొలి రెండు సెట్లలో తొలి సర్వ్‌లో సినర్ ఒక్క పాయింట్‌ను సైతం కోల్పోలేదు. 28/28 పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు.ఇక అమెరికా అభిమానులకు మరోసారి చేదు ఫలితమే ఎదురైంది. 21 ఏండ్లుగా ఓ గ్రాండ్‌స్లామ్ విజయం కోసం ఎదురుచూస్తున్న అమెరికా.. ఆదివారం ఆ టైటల్‌కు అడుగు దూరంలో ఆగిపోయింది. టేలర్ ఫ్రిట్జ్ ఫైనల్లో ఉత్తమ ప్రదర్శన చేశాడు. జానిక్ సినర్ సూపర్‌గా రాణించినా.. అతడికి దీటుగా బదులిచ్చాడు. ఆరంభంలో టేలర్‌కు అధికంగా అభిమానులు మద్దతు పలికినా నెమ్మదిగా సినర్ స్టేడియాన్ని సొంతం చేసుకున్నాడు. యు.ఎస్ ఓపెన్ రన్నరప్‌గా నిలిచిన టేలర్ ఫ్రిట్జ్.. టైటిల్ దూరమైనా 2024 ఏడాదిని ఘనంగా ముగించాడు. ఆండ్రీ ఆగస్సీ తర్వాత ఓ ఏడాది గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్లలో 17 విజయాలు సాధించిన తొలి అమెరికన్‌గా నిలిచాడు.



సిరియాదే టైటిల్

- 0-3తో భారత్ పరాజయం
- ఇంటర్‌కాంటినెంటల్ కప్

నవతెలంగాణ-హైదరాబాద్ : 2024 ఇంటర్‌కాంటినెంటల్ కప్ సిరియా సొంతమైంది. హైదరాబాద్‌లోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరిగిన టోర్నమెంట్‌లో అజేయంగా నిలిచిన సిరియా.. టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య భారత్‌పై సిరియా 3-0తో ఏకపక్ష విజయం సాధించింది. అంతకుముందు మ్యాచ్‌లో మారిషస్‌పై 2-0తో విజయం సాధించింది. వరుస మ్యాచుల్లో ఎదురులేని విజయాలు నమోదు చేసిన సిరియా ఇంటర్ కాంటినెంటల్ ట్రోఫీని కైవసం చేసుకుంది. సోమవారం జరిగినన మ్యాచ్‌లో టీమ్ ఇండియా నిరాశపరిచింది. పూర్తి ఆటలో ఒక్క గోల్ సైతం కొట్టలేకపోయింది. ఆట మొదలైన ఏడో నిమిషంలో అశ్వద్ ఫీల్డ్ గోల్‌తో సిరియాను 1-0తో ముందంజలో నిలిపాడు. ద్వితీయార్థంలో ఇరాన్‌డస్ట్ 76వ నిమిషంలో మరో గోల్ నమోదు చేశాడు. అదనపు సమయంలో 96 నిమిషంలో సిరియా మరో గోల్ సాధించింది. భారత్‌పై హ్యాట్రిక్ గోల్స్‌తో అలవోక విజయం సాధించిన సిరియా అజేయంగా టైటిల్‌ను దక్కించుకుంది. కోచ్ మనాలో మార్కెజ్ నేతృత్వంలో బరిలోకి దిగిన టీమ్ ఇండియా ఆడిన రెండు మ్యాచుల్లోనూ విజయం సాధించకుండా నిరాశపరిచింది.భారత్, సిరియా మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విజేతకు టైటిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్జ్) చైర్మన్ శివసేనా రెడ్డి, అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) ఆఫీస్ బేరర్లు, తెలంగాణ ఫుట్‌బాల్ సంఘం అధికారులు తదితరులు బహుమతి ప్రదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

తొలి మ్యాచ్‌లో టైటాన్స్, బుల్స్ ఢీ

ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్ షెడ్యూల్ విడుదల



ముంబయి : ప్రొ కబడ్డీ లీగ్ (పీకెల్) 11వ సీజన్ ఆరంభ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్, బెంగళూర్ బుల్స్ ఢీకొట్టనున్నాయి. ఈ మేరకు పీకెఎల్ నిర్వాహకులు సీజన్ షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేశారు. ముందుగా ప్రకటించిన ప్రకారం.. ఈ సీజన్ లీగ్ దశ మ్యాచులకు మూడు నగరాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. అక్టోబర్ 18న హైదరాబాద్‌లోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో తొలి అంచె మ్యాచులు ఆరంభం కానున్నాయి. సీజన్ ఆరంభ మ్యాచ్‌లో ఆతిథ్య తెలుగు టైటాన్స్‌తో, బెంగళూర్ బుల్స్ తలపడనుంది. నవంబర్ 9 వరకు లీగ్ దశ మ్యాచులు హైదరాబాద్‌లో జరుగుతాయి. నవంబర్ 10 నుంచి డిసెంబర్ 1 వరకు లీగ్ దశ మ్యాచులకు నోయిడా ఇండోర్ స్టేడియం వేదిక కానుంది.

డిసెంబర్ 3 నుంచి 24 వరకు పుణెలోని బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనుంది. ప్రతి రోజు రెండు మ్యాచులను షెడ్యూల్ చేయగా.. తొలి రోజు రెండో మ్యాచ్‌లో యు ముంబాతో దబంగ్ ఢిల్లీ ఢీకొట్టనుంది. హైదరాబాద్‌లో ఓవరాల్‌గా 44 లీగ్ దశ మ్యాచులు జరుగుతాయి.

శ్రీలంక అదిరే విజయం

- మూడో టెస్టులో ఇంగ్లాండ్‌పై గెలుపు

లండన్ : శ్రీలంక క్రికెట్‌కు మంచి రోజులు!!. ఇటీవల స్వదేశంలో అగ్రజట్టు భారత్‌పై వన్డే సిరీస్ విజయం. తాజాగా ఇంగ్లాండ్‌పై ది ఓవల్ మైదానంలో అదిరే విజయం. అటు వైట్‌బాల్, ఇటు రెడ్‌బాల్ ఫార్మాట్‌లో శ్రీలంక వరుస విజయాలు సాధించి.. ద్వీప దేశంలో క్రికెట్ పూర్వ వైభవం సాధించనుందనే సంకేతాలు అందించింది. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ ఆశలు ఆవిరైనా.. మూడో టెస్టులో శ్రీలంక అదరగొట్టింది. నాణ్యమైన బౌలింగ్, బ్యాటింగ్ ప్రదర్శనతో ఆతిథ్య జట్టుపై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఒలీ పోప్ (154), బెన్ డకెట్ (86) మెరుపులతో తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 325 పరుగులు చేసింది. ఓపెనర్ నిశాంక (64), ధనంజయ డిసిల్వ (69), కామిందు మెండిస్ (64) రాణించటంతో శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 263 పరుగులే చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 62 పరుగుల ఆధిక్యం కోల్పోయిన శ్రీలంక.. రెండో ఇన్నింగ్స్‌లో అద్భుతం చేసింది. విశ్వ ఫెర్నాండో (3/40), లాహిరు కుమార (4/21), ఫెర్నాండో (2/49) నిప్పులు చెరగటంతో ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 156 పరుగులే చేసింది.



219 పరుగుల ఊరించే లక్ష్యాన్ని శ్రీలంక 40.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ నిశాంక (127 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగగా.. కుశాల్ మెండిస్ (39), ఎంజెలో మాథ్యూస్ (32 నాటౌట్) గెలుపు ఇన్నింగ్స్‌లు నమోదు చేశారు.శ్రీలంక ఓపెనర్ నిశాంక 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలువగా.. ఇంగ్లాండ్ స్టార్ జో రూట్ 'ప్లేయర్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు. 2-1తో టెస్టు సిరీస్ ఇంగ్లాండ్ వశమైంది. 2014 తర్వాత ఇంగ్లాండ్ పై శ్రీలంక సాధించిన తొలి టెస్టు విజయం ఇదే కావటం విశేషం.

ఇద్దరు అరెస్టు

- ప్రకాశం బ్యారేజీ గేట్లకు పడవలు ఢీకొట్టిన ఘటనపై పోలీసు విచారణ





నిందితులు రామ్మోహన్, ఉషాద్రి

విజయవాడ : ప్రకాశం బ్యారేజీని పడవలు ఢీకొట్టిన ఘటనలో పోలీసులు సోమవారం ఇద్దరిని అరెస్టు చేశారు. బ్యారేజీ గేట్లను ఐదు పడవలు ఢీకొనడం వెనుక కుట్ర కోణం ఉందనే అనుమానంతో ఇరిగేషన్ శాఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయవాడ వన్‌టౌన్ పోలీసులు 125, 326 బి సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఒక్కొక్కటి 40 నుంచి 50 టన్నుల బరువు ఉన్న ఐదు పడవలు అధిక వరద వస్తున్న సమయంలో ప్రకాశం బ్యారేజీకి చెందిన 67, 69, 70 గేట్లను దాటుకొని కౌంటర్ వెయిట్‌ను బలంగా ఢీకొట్టాయి. ఐదు పడవల్లో ఒక పడవ గేట్ల మధ్య నుంచి కిందికి వెళ్లిపోగా, మూడు పడవలను గుర్తించారు. మరో పడవ ఆచూకీ తెలియాల్సి ఉంది. ఈ ఘటనతో బ్యారేజీ ప్రధాన కట్టడానికి, గేట్లకు ఎలాంటి నష్టమూ వాటిల్లకపోయినా, బ్యారేజీ కౌంటర్ వెయిట్లు దెబ్బతిన్నాయి. ఈ మొత్తం వ్యవహారంపై పోలీసులకు ఇరిగేషన్ శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు విజయవాడ సమీపంలోని సూరాయిపా లేనికి చెందిన రామ్మోహన్, గొల్లపూడికి చెందిన వక్కలగడ్డ ఉషాద్రిలను అరెస్టు చేశారు. ఐదు పడవల్లో మూడు పడవలు వక్కలగడ్డ ఉషాద్రి పేరుతో, మరో రెండు పడవలు సుధీర్, స్వామి పేరుతో రిజిస్టర్ అయి ఉన్నాయి. ఒక్కో బోటు విలువ రూ.40 లక్షల నుండి రూ.50 లక్షల వరకు ఉంటుందని అంచనా. గుంటూరు జిల్లా ఉద్దండ రాయిపాలెంలో ఉన్న ఆ బోట్లను వరదలకు కొద్ది రోజుల ముందే గొల్లపూడికి తరలించినట్లు, మూడో బోట్లను ఒకే ప్లాస్టిక్ వైరుతో కట్టి ఉంచినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల కాల్ డేటాతో పాటు, గూగుల్ టేకవుట్ వివరాలను సేకరిస్తున్నారు. మూడు పడవలకు వైసిపి జెండాను పోలిన రంగులు ఉన్నట్లు చెబుతున్నారు. నిందితుల కు వైసిపి నేతలతో సంబంధాలున్నాయా? అని ఆరా తీస్తున్నారు. వారిని కోర్టులో హాజరుపరచనున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

విద్యార్థి మహాగర్జన 25కు వాయిదా

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు, భారీ వరదల కారణంగా విద్యారంగం, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం తలపెట్టిన విద్యార్థి మహాగర్జనను ఈనెల 25వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాలు, వరదల కారణంగా విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లోనూ వర్షాలు కురుస్తాయంటూ వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో విద్యార్థి మహాగర్జనను ఈనెల 25న నిర్వహించాలని నిర్ణయించామని పేర్కొన్నారు.

విశాఖ స్టీల్ పరిరక్షణకు చర్యలు తీసుకోండి

- కేంద్ర ఉక్కుశాఖ మంత్రికి సీపీఐ(ఎం ఎంపీ బ్రిట్టాస్ లేఖ

అమరావతి : విశాఖ స్టీలుప్లాంటు పరిరక్షణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) రాజ్యసభ సభ్యులు జాన్ బ్రిట్టాస్ కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామికి లేఖ రాశారు. ఈ లేఖను సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కమిటీ సోమవారం మీడియాకు విడుదల చేసింది. జులై 11వ తేదీన కేంద్రమంత్రి స్టీలు ప్లాంటు సందర్శించిన విషయాన్ని గుర్తుచేసిన బ్రిట్టాస్ ఆ నేపథ్యంలో ప్లాంటుకు సంబంధించి అనేక విషయాలను మంత్రి దృష్టికి తీసుకువస్తున్నట్లు తెలిపారు.



సెయిల్‌లో విలీనం చేయాలి

జాతీయ ఉక్కు విధానం 2017లో పేర్కొన్న విధంగా 2030 నాటికి ఏడాదికి 300 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయాలనే లక్ష్యాన్ని చేరుకోవాలంటే విశాఖ స్టీల్‌తో పాటు, అన్ని ఉత్పత్తి సంస్థలను సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు. దీనివల్ల ఉత్పత్తిని పెంచుకోచ్చని సూచించారు.

పూర్తి సామర్థ్యంతో నిర్వహించాలి

విశాఖ స్టీలు ప్లాంటు 120 శాతం రేటింగ్ సామర్థ్యంతో ఉత్పత్తిలో ప్రసిద్ధి చెందిందని తెలిపారు. గతంలో లాభాలు ఆర్జించిందని పేర్కొన్నారు. తన సొంత ఆర్థిక వనరులను ఉపయోగించి 3.4 మిలియన్ టన్నుల ఉత్పత్తి నుండి 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యానికి ఉత్పత్తిని పెంచుకుందని లేఖలో ప్రస్తావించారు. అయితే వర్కింగు క్యాపిటల్, ముడిసరుకు సరైంతగా సమకూర్చకపోవడంతో ప్రస్తుతం 50 శాతం సామర్థ్యంతోనే నడుస్తోందని పేర్కొన్నారు. ప్లాంటు పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా పునరుద్ధరిస్తే వీలైనంత తొందరగా లాభాల్లోకి వస్తుందని పేర్కొన్నారు. దీనికోసం వెంటనే వర్కింగు క్యాపిటల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అసరమైన బ్యాంకు రుణాలు తీసుకునేందుకు లెటర్ ఆఫ్ కంఫర్ట్ జారీ చేయాలని కోరారు. విశాఖ స్టీలు ప్లాంటు నిలదొక్కుకునే వరకూ పన్నులో రాయితీ ఇవ్వాలని, సెయిల్, ఎన్ఎండిసి నుండి ముడి పదార్థాలను సరఫరా చేయాలని, దీనివల్ల ప్లాంటు పూర్తిస్థాయిలో పనిచేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

క్యాప్టివ్ మైన్స్‌ను కేటాయించాలి

విశాఖప్లాంటుకు తప్ప దేశంలో అన్ని ఉక్కు కర్మాగారాలకు క్యాప్టివ్ మైన్స్ ఉన్నాయని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్లాంటు నిరంతరం పనిచేయడానికి, వీలైనంత ఎక్కువ బఫర్‌స్టాకును ఉంచుకోవడానికి వీలుగా వెంటనే ఇనుప ఖనిజం గనులను కేటాయించాలని కోరారు.

కొత్త వేతన విధానం అమలు చేయాలి

ప్రస్తుతం స్టీలుప్లాంటులో 2017 జనవరి ఒకటో తేదీ నుండి కొత్త వేతన విధానం అమల్లోకి వచ్చినా ఇంతవరకు అమలు చేయలేదని తెలిపారు. 1982లో ప్లాంటు ఏర్పాటు సమయంలో సెయిల్‌తో సమానంగా వేతనాలు అమలు చేస్తామని హామీనిచ్చారని, సెయిల్ కొత్త వేతన విధానాలు అమల్లోకి వచ్చినా విశాఖ స్టీలు ప్లాంటు అమలు చేయడం లేదని పేర్కొన్నారు. దీనికితోడు ఆరునెలలుగా ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు అందడం లేదని, ఉద్యోగులకూ జీతాల చెల్లింపులో జాప్యం జరుగుతోందని తెలిపారు. ఉద్యోగుల నుండి తీసుకున్న పిఎఫ్‌లు ఇపిఎఫ్‌ఓకు జమకావడం లేదని వివరించారు. లోన్ రికవరీల విషయంలోనూ ఇదే జరుగుతోందని తెలిపారు. ఇవన్నీ నిబంధనలకు విరుద్ధమని, అనైతికమని పేర్కొన్నారు. ప్రతినెలా 80 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్నా వాటిని భర్తీ చేయడం లేదని తెలిపారు. దీనివల్ల అనేక నిర్వహణా సమస్యలు వస్తాయని, సాంకేతిక వైఫల్యాల వల్ల జరిగే ప్రమాదాల సంఖ్యా పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉక్కు మంత్రిగా ఈ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయన లేఖలో విజ్ఞప్తి చేశారు.

అందరినీ ఆదుకుంటాం

ముంపు ప్రాంతాల పర్యటనలో సిఎం చంద్రబాబు హామీ

విజయవాడ : బుడమేరు విపత్తుతో చాలామంది నిరాశ్రయుల య్యారని, నష్టపోయిన వారందరినీ ఆదుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. విద్యాధరపురం, కుమ్మరిపాలెం జంక్షన్, సితార సర్కిల్, 43వ డివిజన్ ఊర్మిళానగర్లలో సోమవారం ఆయన పర్యటించారు. ఊర్మిళానగర్‌లోని బ్రహ్మం గారి గుడి వద్ద వరద బాధితులను పరామర్శించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. వరద చాలావరకూ తగ్గుముఖం పట్టిందన్నారు. ఈ విపత్తు చాలా ఘోరమైందని, బాధితులు చాలా ఇబ్బందులు పడ్డారని, అందరినీ ఆదుకునే బాధ్యతను తాను తీసుకుంటానని భరోసా ఇచ్చారు. నష్టపరిహారంపై అధికారులు ఎన్యుమరేషన్ ప్రారంభించారని, వారిచ్చిన వివరాల ఆధారంగా ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. బాధితులకు 25 కేజీల బియ్యం, కందిపప్పు, ఆయిల్ ప్యాకెట్, పాలు, ఆహార పదార్థాలు, మంచినీటి బాటిళ్లు, బిస్కెట్లు వంటివి పంపిణీ చేస్తున్నామని చెప్పారు. పూర్తిగా వరద నీరు



పోయేవరకూ తాను ఎక్కడికీ వెళ్లేది లేదన్నారు. ఇళ్లలో పాడైపోయిన గృహోపకరణాలైన ఫ్రిజ్, వాషింగ్‌మిషన్ తదితర వాటికి బీమా వర్తించే విధంగా చర్యలు చేపట్టామ న్నారు. పాడైపోయిన ఆటోల మరమ్మతులకు సహాయం అందిస్తామన్నారు. అనంతరం అక్కడి నుంచి కబేళా మీదుగా జక్కంపూడి వెళ్లి బాధితులను పరామర్శించారు.



జపాన్‌పై గోల్స్ మోత

- 5-1తో భారత్ ఘన విజయం
- హాకీ ఆసియా చాంపియన్స్ ట్రోఫీ

హులున్‌బుయర్ (చైనా) : డిఫెండింగ్ చాంపియన్ టీమ్ ఇండియా.. హాకీ ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో అదరగొడుతుంది. వరుసగా రెండో విజయంతో అజేయంగా నిలిచింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో జపాన్‌పై 5-1తో ఘన విజయం సాధించింది. పారిస్ ఒలింపిక్స్ పతక విజేత భారత్‌కు జపాన్ ఆశించిన పోటీ ఇవ్వలేదు. మ్యాచ్ ఆరంభమైన నిమిషాల్లోనే సుఖ్‌జీత్ సింగ్ గోల్ కొట్టాడు. అభిషేక్ సైతం నిమిషం వ్యవధిలో భారత్ స్కోరును 2-0కు మెరుగుపర్చాడు. పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచిన సంజయ్ భారత్ ఆధిక్యాన్ని 3-0కు పెంచాడు. ఆట తొలి రెండు క్వార్టర్లలో భారత్ ఎదురులేని జోరు చూపించింది. గోల్స్ వేటలో అవకాశాలు సృష్టించుకుంది. ఇదే సమయంలో జపాన్ ఆటగాళ్లు తేలిపోయారు. కానీ విరామం తర్వాత జపాన్ కాస్త గట్టిగా పుంజుకుంది. కజుమస గోల్‌తో జపాన్ గోల్ ఖాతా తెరిచింది. 3-1తో ఆఖరు క్వార్టర్ ఆటకు వచ్చిన భారత్‌పై జపాన్ ఒత్తిడి పెంచింది. కానీ బలమైన డిఫెన్స్ జపాన్ గోల్ వేటను సమర్థవంతంగా నిలువరించింది. 54వ నిమిషంలో ఉత్తమ్ సింగ్ గోల్ కొట్టగా.. ఆఖరు క్షణాల్లో సుఖ్‌జీత్ సింగ్ మ్యాచ్‌లో రెండో గోల్ నమోదు చేశాడు. దీంతో 5-1తో జపాన్‌పై భారత్ ఏకపక్ష విజయం సాధించింది. వరుస మ్యాచుల్లో విజయాలతో పాయింట్ల పట్టికలో భారత్ అగ్రస్థానానికి చేరుకుంది.

దేశంలో మరో మంకీపాక్స్ నిర్ధారణ

- క్లాడ్-2 వైరస్‌గా గుర్తింపు

న్యూఢిల్లీ : దేశంలో మరో మంకీపాక్స్ కేసు నిర్ధారణ అయింది. అనుమానిత రోగిలో మంకీపాక్స్‌ను ధ్రువీకరించినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. దీనిని పశ్చిమ ఆఫ్రికా క్లాడ్-2 వైరస్‌గా గుర్తించినట్లు తెలిపింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ విధించిన ప్రజారోగ్య అత్యవసర పరిస్థితికి కారణమైన క్లాడ్-1 కాదని, ప్రస్తుతానికి ఎటువంటి ఆందోళన చెందాల్సిన పరిస్థితి లేదని తెలిపింది. ఇటీవల విదేశాల నుంచి వచ్చిన ఒక యువకుడిలో మంకీపాక్స్ లక్షణాలను గుర్తించారు. దీంతో అతన్ని ఐసొలేషన్‌లో ఉంచి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ప్రయోగశాలలో నిర్వహించిన పరీక్షలో మంకీ పాక్స్ నిర్ధారణ అయింది. జులై 2022 నుంచి ఇప్పటి వరకూ దేశంలో నమోదైన 30 మంకీ పాక్స్ కేసుల మాదిరిగానే ఈ కేసు ఉందని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది.మంకీపాక్స్ కేసు వెలుగు చూసిన నేపథ్యంలో రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని కేంద్రం కోరింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర రాష్ట్రాలకు కొన్ని సూచనలను జారీ చేశారు.